# శ్రీమదాంధ్రభాగవతము

బమ్మెర పోతనామాత్య ప్రణీతము

టీక

UNIVERSITY OF HYDERABAD
LIBRARY

పీఠికాకర్తలు:

**శేషాద్రి వేంకటరమణకవులు,**

హనుమకొండ.

లఘుటీక ప్రథమ, ద్వితీయ స్కంధములకు

**బ్ర. శ్రీ. శే. మల్లాది వేంకటసోమయాజులుగారిచే**

వ్రాయఁబడినది.

**వాణీనికేతనము,**

గాంధీనగరం, బెజవాడ.

కాపీరైటు]

[స్కంధం 1కి 0-8-0

University of Hyderabad
LIBRARY
Acc No 29300
ed 11 SEP 87
Hyderabad - 500 134

కుందా లక్ష్మీనరసయ్యగారిచే
ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
ముద్రితము - 1938.

# విషయసూచిక.

## ప్రథమస్కంధము


శేషాద్రి వేంకటరమణకవుల పీఠిక. ... i

పీఠిక (ఇష్టదేవతా ప్రార్థనాదికములు) ... 1

కథాప్రారంభము. ... 8

సూతుండు నారాయణకథాప్రశంస చేయుట. ... 13

భగవంతుని యనేకవింశత్యవతారములు. ... 18

శ్రీమహాభాగవత రచనాది వృత్తాంతము. ... 22

వ్యాసుండు వ్యాకులచిత్తుండై చింతించుట. ... 24

వ్యాసునికడకు నారదుండు వచ్చుట. ... 26

నారదుని పూర్వజన్మ వృత్తాంతము. ... 29

అర్జునుండు పుత్రఘాతియగు నశ్వత్థామ నవమానించుట. ... 37

ద్రౌపది యశ్వత్థామనుజూచి సంభాషించుట. ... 40

కృష్ణుం డుత్తరాగర్భస్థుండగు నర్భకుని రక్షించుట. ... 43

కుంతీదేవి శ్రీకృష్ణుని నుతించుట. ... 44

ధర్మజుండు శ్రీకృష్ణసహితుండై శరతల్పగతుండయిన
భీష్మునికడ కేగుట. ... 48

భీష్ముండు శ్రీకృష్ణుని స్తుతించుట. ... 52

శ్రీకృష్ణుండు ద్వారకానగరంబున కరుగుట. ... 55

శ్రీకృష్ణుండు ద్వారకానగరంబు ప్రవేశించుట. ... 58

శ్రీకృష్ణుం డంతఃపురకాంతలం జూడఁబోవుట. ... 62

ఉత్తరకు పరీక్షిత్తు జనించుట. ... 65

గాంధారీ ధృతరాష్ట్రులు దేహత్యాగముచేయుట. ... 72

ధర్మరాజు దుర్నిమిత్తంబులంగని చింతించుట. ... 77

అర్జునుండు ద్వారకనుండి వచ్చి శ్రీకృష్ణనిర్యాణంబుఁ జెప్పుట. 79

ధర్మరాజు పరీక్షిన్మహారాజునకుఁ బట్టముగట్టి
మహాప్రస్థానంబున కరుగుట. ... 86

పరీక్షిన్మహారాజు దిగ్విజయంబుఁ భూధర్మదేవతల సంవాదం బాలించుట. ... 89
కలిపురుషుఁడు ధర్మదేవతను దన్నుట. ... 93
పరీక్షిన్మహారాజు కలిని నిగ్రహించి ధర్మపరిపాలనము చేయుట. 96
పరీక్షిన్మహారాజు వేఁటాడి శమీక మహామునిపై మృతసర్పము నెత్తివైచుట. ... 101
శమీక మహాముని పుత్రుండగు శృంగిముని పరీక్షిత్తుని శపించుట. 102
పరీక్షితుఁడు విప్రశాపం బెఱింగి ప్రాయోపవిష్టుం డగుట. ... 106
శుకమహర్షి పరీక్షిన్మహారాజు నొద్ద కేతెంచుట. ... 110

## ద్వితీయస్కంధము

సూతుండు పరీక్షిత్తునకు విరాట్స్వరూపంబు దెలుపుట. ... 5
శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు భక్తిమార్గంబే ముఖ్యంబని తెలుపుట. ... 14
నారదుండు బ్రహ్మను బ్రపంచప్రకారముఁ దెలుపుమని యడుగుట. 22
వెలగందుల నారయకవిత్వ ప్రారంభము. ... 29
శ్రీమన్నారాయణుని లీలావతారంబుల యభివర్ణనము. ... 34
పరీక్షిన్మహారాజు శుకయోగిం బ్రపంచోద్భవాదికంబు నడుగుట. 54
శ్రీమన్నారాయణుండు బ్రహ్మతపంబునకు మెచ్చి వరంబులిచ్చుట. ... 59



బమ్మెర పోతనామాత్యుఁడు

క. పలికెడిది భాగవతమఁట, పలికించెడివాఁడు రామభద్రుండఁట, నేఁ
బలికిన భవహరమగునఁట, పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా!

# పీఠిక

"వేదకల్పవృక్ష విగళితమై శుక
ముఖ సుధాద్రవమున మొనసియున్న
భాగవతపురాణఫలరసాస్వాదన
పదవి గనుఁడు రసికభావవిదులు"

శ్రీమన్నారాయణుఁడు జలశాయిగ నున్నతఱి నాతని నాభిపంకజమున నలువ జనించెను. నలువకు నారాయణుఁడు భాగవతమును సంగ్రహముగ నుపదేశించెను. నలువ కొంత విస్తృతమొనరించి తన మానసపుత్త్రుఁడగు నారదునకు నుపదేశముఁ గావించెను.

సరస్వతీతరంగిణీ తటంబున వ్యాసమహర్షి కూర్చుండి గతమును గూర్చి వగచుచుండెను. ఆ విచారసార మిది. "వేదములు బ్రాహ్మణేతరాదులకు విన నర్హంబులు గావు గానఁ బ్రపంచోపయోగమునకై భారతంబు రచించితిని. వేదార్థభావమంతయు నందు సంగ్రహించితిని గాని యాకృషిచేత నాయాత్మ సంతసింపకున్నది. ఈశ్వరుఁడు సైతము సంతసింపనట్లు తోఁచుచున్నది. హరికి యోగులకు నభిలషితార్థముగల భాగనతము రచింపనైతినిగదా!" ఇట్లు వ్యాసమహర్షి వగచుతఱి యటకు నారదమహర్షి యేతెంచి జ్ఞానదృష్టిచే సర్వము గ్రహించి వ్యాసమహర్షికి ఇటు లాజ్ఞ యొసంగెను. "బాదరాయణా! నీవు భారతమునందు సమస్తధర్మములు వివరించితివి. భగవద్గుణ విశేషములఁ బేర్కొనవైతివి. హరిస్తుతి లేని గ్రంథము సర్వగుణసంపన్నమయ్యు నిష్ఫలము. కామ్యకర్మంబుల శాసించుచున్నచోఁ బ్రజలు తత్త్వజ్ఞానము మఱతురు. కాన భాగవతము రచించి మనశ్శాంతి నొందుము." ఇట్లు నారదమహర్షి బాదరాయణున కుపదేశించి తాను బ్రహ్మవలన విన్న భాగవతకథాదికము నివేదించెను. అనంతరము వ్యాసమహర్షి సరస్వతీతరంగిణీ పశ్చిమతీరంబునఁ గల శమ్యాప్రాసంబను నాశ్రమంబునఁ జేరి భక్తి

యుక్తచిత్తంబున నీశ్వరుని దర్శించెను. మానవుని యనర్థము నారాయణ భక్తియోగమునఁగాని యుపశమింపదని నిశ్చయించి,

"అవనీచక్రములోన నే పురుషుఁ డే యామ్నాయమున్ విన్నమా
ధవుపై లోకశరణ్యు పై భవములం దప్పింపఁగాజాలు భ
క్తివిశేషంబు జనించు నట్టి భువనక్షేమంకరంబైన భా
గవతామ్నాయము బాదరాయణుఁడు దాఁగల్పించె నేర్పొప్పఁగన్."

వ్యాసమహర్షి కడఁ దత్పుత్రుఁడగు శ్రీశుకమహర్షి భాగవతము పఠించెను. ప్రాయోపవిష్టుఁడగు పరీక్షిన్మహారాజునకుఁ బేరోలగంబున శుకమహర్షి భాగవతము వినిపించెను. తొలుత వ్యాసులవారికడఁ జదివిన పిదప శుకయోగికడ సమగ్రముగా భాగవతము విని సత్రయాగమున సూతుఁడు శౌనకాదిమహామునులకు నివేదించెను. భాగవత మీవిధమున శిష్టపరంపరగా లోకమున వ్యాప్తినొంది ప్రజలకుఁ జిరకాలమునుండి ఆధ్యాత్మిక విద్యారహస్యబోధకమై పవిత్రగ్రంథముగ భావింపఁబడు చున్నది.

భాగవతము భక్తిజ్ఞానవైరాగ్యములను వెల్లడించు నుత్తమ గ్రంథములలో నొకటి. పద్మమాత్స్యపురాణములందు భాగవత ముత్తమగ్రంథముగఁ బ్రశంసింపఁబడినది. "ఇతిహాసపురాణం పంచమం" అను శ్రుతివాక్యము పురాణముగూడఁ బంచమవేదమని చెప్పుటచే భాగవతపురాణము పంచమవేదము. అంతియగాదు, భాగవతము మహా పురాణములలో నొకటి. భాగవతమునకుఁ బ్రసిద్ధములగు వ్యాఖ్యలు పదునాలుగువఱకుఁగలవు. త్రిమతాచార్యులు బోపదేవ శ్రీకృష్ణచైతన్య శిష్యాదులుగూడ భాగవతముపయి వివరణములఁ గావించిరి.

సంస్కృతభాగవతము ప్రౌఢభాషాబంధురము. అన్వయకాఠిన్య వంతము, తత్త్వరహస్యగర్భితము, అర్థగాంభీర్యధుర్యము నగుటచే సామాన్యవిద్వాంసులకు సుగమముగాదు. వ్యాఖ్య ఆంధ్రీకరణము వివ రణము చెంతనున్నను బాండిత్యమున్నను నందలి తత్త్వార్థములు సమ గ్రముగ నవగతములు గావుగనుకనే "భక్త్యా భాగవతం జ్ఞేయం, నవ్యు త్పత్త్యా,నటీకాయా" అను నార్యోక్తి యేర్పడినది.లోకోత్తరమగు నీశ్రీమ

ద్భాగవతమును సహజపాండిత్యమండనుఁడు మృదుమధురకవితావిరాజి రామభక్తాగ్రేసరుఁడు నగు బమ్మెరపోతరాజు సులలితముగఁ దెలిఁగించి యాంధ్రమహాజనుల కృతజ్ఞతకుఁ బాత్రుఁడయ్యెను. మహాత్యాగియు విచిత్రకవితాధురీణుఁడును మృతజీవియునగు పోతనామాత్యుని జీవిత స్మరణము మనకుఁ బ్రకృతము కాకపోదు.

పోతరాజు ఇంటిపేరు బమ్మెరవారు. ఈయన నియోగిబ్రాహ్మణుఁడు. సహజ పాండిత్యుఁడు. కౌండిన్యసగోత్రుఁడు. తండ్రి శైవశాస్త్రవిదుఁడగు కేసనమంత్రి. తల్లి లక్కమాంబ. ఇతని కూటస్థులలోఁ జరిత్రమునకు వాఙ్మయమునకు సంబంధించినవారు కానరారు. పోతరాజు నివాసస్థలము ఓరుగల్లునకు మూఁడామడలదూరమునందు వెల్పుకొండ చెంతగల "బమ్మెర". భాగవతరచనమునకు ముందు పోతరాజు చంద్రగ్రహణసందర్భమున గంగకేగెను. అచట రామభద్రుఁడు ప్రత్యక్షమై భాగవతమును దెలిఁగింప నాజ్ఞయొసంగినాఁడు. పోతరాజీ వార్త ఏకశిలానగరమునఁ గల గురువృద్ధ బుధ బంధుజనులకుఁ దెలుప వారలు భాగవతమును రచింప నాజ్ఞ యొసంగిరి. దీనివలనఁ బోతన నివాసాదికము స్పష్టపడుచున్నది. పోతన సోమోపరాగంబున నేగినది దక్షిణ గంగయగు గోదావరికి. అనుజ్ఞనొందినది ఏకశిలాపురమనఁబడు ఓరుగల్లు నగరమునందు. కాన పోతరాజు ఓరుగల్లు నివాసియనుటకు నివియాధారములుగాఁ గలవు. పృథుర చిత్రమునందు పట్టమట్ట సరస్వతీ సోమయాక్ష బమ్మెరపుర పోతరాజనుటచే నితని జన్మభూమి బమ్మెర యని విశ్వసింపవచ్చును. పోతరాజు వంశజులు నేటికిని బమ్మెరలో నుంటయు నచటఁ గొన్ని పోతనజ్ఞాపకాంకములు నిలిచియుంటయు నీ వాదమునకు సహకారులు. పలువురు చరిత్రకారు లంగీకరించిన యీ విషయమున నింక సందియమున కెడములేదని చర్చనీయాంశములు విడిచితిమి.

బమ్మెర పోతరాజు రచించిన గ్రంథములు మూఁడు.

1. వీరభద్రవిజయము. 2 భోగినీదండకము 3 ఆంధ్రభాగవతము.

నారాయణశతకము పోతనకృతమని యందురుగాని యది యింకను

సందేహాస్పదము. ఉపలభ్యములగు వ్రాతప్రతులలోఁ బోతన రచించినటులలేదు. వీరభద్రవిజయము పోతరాజు బాల్యావస్థలో రచించినట్లు అందే సూచనలుగలవు. భాగవతము రచించి దక్షయాగమున శివుని దూషించి గడించిన పాపపరిహారమునకు వీరభద్రవిజయము రచింపఁబడినటు లీ క్రిందిపద్యమువలనఁ దెలియును.

"భాగవతప్రబంధ మతి భాసురతన్ రచియించి దక్షకృ
ద్యాగకథావిధానమున నల్పవచస్కుఁడనై తిఁ దన్నిమి
త్తాగమ వక్త్రదోష పరిహారతకై యజనైకశైవశా
స్త్రాగమ వీరభద్రవిజయంబు రచించెదఁ బ్రజ్ఞ పెంపునన్"

స్థూలదృష్టి కీ పద్యమువలన భాగవతరచనానంతరము వీరభద్రవిజయము రచింపఁబడినదనితోఁచునుగాని యీపద్యము ప్రక్షిప్తము. వ్రాతప్రతులలో నీ పద్యముకానరాదు. అదిగాక శైశవావస్థలో గురుని ప్రోత్సాహమున వీరభద్రవిజయము రచించితినని పోతరాజు చెప్పుకొనినాఁడు. అప్రౌఢముగ నుంటచే భాగవతమున కావల రచింపఁబడిన దనవీలులేదు. ఇఁక భోగినీదండకముసంగతి. పరమ భక్తాగ్రేసరుఁడగు పోతనామాత్యుం డిది రచింపలేదని కొందఱందురు. శైలిజూచిన పోతరాజకృతముకాదన నెవరును సాహసింపరు. పోతనామాత్యుని అజరామరకీర్తికాలవాలమగు భాగవతము ఆంధ్రమహాజనుల కత్యంతాదరణీయమై భక్తిరసోద్బోధకమై వాఙ్మయమున నత్యంత యోగ్యపదవి నొందియున్నది.

పోతనామాత్యుని కాలమునుగూర్చి కొన్ని భేదభావములుకలవు. ఇంతవఱకుఁగల చరిత్రములసారము పోతరాజు జీవితకాలము క్రీ.శ 1375 మొదలుకొని 1475 వఱకు నన్నఁజాలును చరిత్రకారుల భిన్నభావముల సమన్వయించినచో నిక్కవిరాజు క్రీ.శ 1375 లో జనించి తుదిగ్రంథమగు నాంధ్రభాగవతమును 1440 కి లోఁగ ముగించెనని తోఁచును. పోతరాజు సమకాలికులుభోగినీదండకమువలనసర్వజ్ఞసింగభూపాలుఁడును, వాడుకలోని కథలవలన శ్రీనాథకవిసార్వభౌముఁడు మాత్రమే. కవితలోఁ బోతరాజు ఒక్కనాచన సోమునిరచనమును దశమస్కంధమున ఉత్తర

భాగమునందు సత్యభామసంగరమున ననుకరించినాఁడు. అనుకరించుటె కాదు మూలములో లేని కథాంశమును సోమనాథుని రచనమునకు మెఱుఁగుబెట్టినట్లు వ్రాసినాఁడు. దీనిచేఁ బోతరాజకవి నాచనసోముని తుదికాలముగఁ బరిగణింపఁబడు క్రీ.శ 1370 లకుఁ జేరువలోనివాఁడు పోతరాజును బూర్తిగ ననుకరణము చేసినది మఱికి సింగన. ఈయన ఓరుగల్లుచెంతఁగల రామగిరినివాసి. దశమస్కంధమును సింగన ద్విపదగ వ్రాయుట పోతన దశమస్కంధభాగము ఖిలమగుటకతననే యను నూహ సరియగుచో భాగవతరచనము క్రీ.శ 1440 కి ముందేముగిసియుండును. ఈనిర్ణయముచే శ్రీనాథకవికిఁ బోతరాజు సమకాలికుఁడగుట సరిపోవును. సర్వజ్ఞసింగభూపాలురసంబంధముగూడ స్థిరపడును. పోతరాజుచే భోగినీ దండకము వ్రాయించుకొన్న సర్వజ్ఞసింగభూపాలుఁడు రాచకొండదుర్గపరి పాలకుఁడు. ఆతనికిఁ బిత్రుసాధితములగు భువనగిరి, ఓరుగల్లు, సింగవరము దుర్గములు స్వాధీనమున నుండెను. రాచకొండ గోలకొండకు ముప్పదిమైళ్ళ దూరముననుంటచేతను ఓరుగల్లు సింగభూపాలునిపాలనమున నుంటవలనను బోతరాజునకు సర్వజ్ఞసింగభూపాలునకుఁ బరిచయావకాశము కలిగెను. సర్వజ్ఞసింగభూపాలు రిరువురు రాచకొండ రాజధానిగఁ బాలించిరి. ఈ యిరువురు తాతమనుమలు. ఇరువురి తండ్రియు ననపోతనాయ కుఁడే. మొదటి సర్వజ్ఞసింగభూపాలుఁడు క్రీ. శ 1380 మొదలు 1405 వఱకు నున్నవాఁడు. ఇది శ్రీనాథమహాకవి పెదకోమటి వేమభూపా లునికడ విద్యాధికారిగ నున్నకాలమున. పోతరాజు ఈ సింగభూపతి కాలమున భోగినీదండకము రచించియుండును దానితోఁ గొంత ఆర్థిక సంపద గడించి తుదకు నరకృతియు రాజావలంబనము రోసి మనుజేశ్వ రాధముల కంకితమిచ్చి పురంబులు వాహనములు సొమ్ములుఁ గైకొని మదమున సొక్కి సోలు జీవితమును గర్హించి భాగవతరచనమునాఁటికిఁ బరమార్థ ప్రదాతయగు రామచంద్రు నాశ్రయించెను. మొదటి సర్వజ్ఞసింగభూపతి అన్నమాంబాపుత్త్రుఁడు. భోగినీదండకములోఁ బోచమాంబా పుత్త్రుఁడనియుంట బాధకము. పోచమకె అన్నమయను నామాంతరమున్నదనుకొన్న పయినిర్ణయము నిలుచును. శ్రీనాథ

మహాకవి పైఁజెప్పిన సింగభూపాలుని కాలమున క్రీ. శ 1405 న పెద కోమటి వేమభూపతి కాస్థానకవి. అంతేయగాదు, విద్యాధికారి ఈ యంశము పోన్నుపల్లి తామ్రశాసనము స్థాపించుచున్నది. చరిత్రకారు లందఱిమతమునను శ్రీనాథుఁడు కనకాభిషేకానంతరమున దర్శించినది రెండవ సర్వజ్ఞసింగభూపాలుని ననుట వాస్తవము.

శ్రీనాథుఁడు కనకాభిషేకమునొందినది ప్రౌఢరాయల సంస్థానమునందు. అది క్రీ. శ. 1435 న కావలఁ గావున నా కాలమున నున్నది రెండవ సర్వజ్ఞసింగభూపాలుఁడే. రెండవ సింగభూపాలుని కాలము క్రీ. శ 1325 - 1348 వఱకు నని చరిత్రములవలనఁ దెలియుటచే శ్రీనాథమహాకవి తాతమనుమలగు సింగభూపాలుర కాలమున నుంట స్పష్టము. అట్లె పోతరాజుగూడ మొదటి సింగభూపాలునకు భోగినీ దండకము నంకితము నొసంగి సంపదలు బడసెననియుఁ దరువాత నైశ్వర్యజీవితము నరకృతి రోసి భాగవతము రచించుటచే రెండవ సింగభూపాలుఁడు అంకితము నిమ్మనినను బ్రార్థించినను నిరాకరించెననియుఁ దోఁచుచున్నది. ఈ యిరువురు సర్వజ్ఞసింగభూపాలురతోఁ బోతరాజునకుఁగల సంబంధము ఎంతవఱకు సమాదరణీయముగ నుండునో సుధీలోకము నిర్ణయింపఁగలదు. మొదటి సింగభూపాలునకు సర్వజ్ఞ బిరుదము లేదని యొకరనిరి. ఇరువురకు సర్వజ్ఞబిరుదము లేదనియు శ్రీనాథమహాకవి సింగభూపాలుని దర్శించినదియు "సీ॥ దీనార టంకాలఁ దీర్థమాడించితి" నన్న పద్యమురచించినదియుఁ గల్లయని యింకొకరనిరి మొదటి సింగభూపాలుని అమరవ్యాఖ్యయందు సమకాలికుఁడును మహావిద్వాంసుఁడును నగు బొమ్మకంటి అప్పలాచార్యు లిట్లు ప్రశంసించి నాఁడు.

శ్లో॥ కుమారసింగభూపేన లక్ష్యలక్షణవేదినా
శోధిత శ్చేదయం గ్రంథః కం శోధ్యశ్శోధనాంతరైః
కుమారసింగభూపేన యః కదాపి నశోధితః
నగ్రంథశ్శోధితో స్యన్యైః కిం బుధైర్వ్యర్థవహ్నీయతే.

మొదటి సింగభూపాలుఁడు పై శ్లోకములవలన సంస్కృతమున నఖండవిద్వాంసుఁడని తెలియుచున్నది. మల్లినాథసూరియను వ్యాఖ్యాతృ శిరోమణి ఈ సింగభూపతికాలమువాఁడు గావచ్చునను నిర్ణయమున కవకాశములున్నవి. ఈ సింగభూపాలుఁడు రసార్ణవసుధాకరము రచించినాఁడు. అమరవ్యాఖ్య చమత్కారచంద్రికలకుఁ బ్రోత్సాహకుఁడు నారాయణపండితుఁడు. చంపూరామాయణవ్యాఖ్యయందుమల్లినాథుఁడు 'సర్వజ్ఞేనాభివర్ణితః' అను విశేషముతో సూచింపఁబడుటచూడ మొదటి సింగభూపాలుఁడు సర్వజ్ఞుడని ప్రశంసింపఁబడెననియు నీబిరుదములనె గ్రంథకర్త కాకున్నను గవిపోషకుఁడనిపించుకొని రెండవ సింగభూపాలుఁడు వహించెననియు మావిశ్వాసము. ఇరువురు సింగభూపాలుర గుర్తించుటకై రసార్ణవసుధాకరానుసారముగఁ గొంచెముగా వంశవృక్షము నొసంగి ప్రకరణాంతరమున కేగుదము.

(1) దాచభూపతి [యాచభూపతి] 2 సింగమనాయఁడు 3 అనపోతనాయఁడు. 4 సింగమనాయఁడు 5 అనపోతనాయఁడు 6 సింగమనాయఁడు.

రసార్ణవసుధాకరమునుఁ బరువాతిశాసనములనుఁబట్టి రాచకొండ రేచర్ల గోత్రులగు వెలమవంశ మీావిధముగఁ బరంపరగ ఆఱుగురు పురుషుల గైకొంటిమి. ఇందు నాల్గవ పురుషుండగు సింగభూపాలుండు సర్వజ్ఞుఁడనుటకు నితనికోడలు రాచకొండశాసనమున 'విదితసకలశాస్త్రః' అనుట యాధారముకావచ్చును. ఆఱవ పురుషుండగు సింగభూపతి తాతనుండి సర్వజ్ఞబిరుదముఁగొన్నవాడు. శ్రీనాథుఁ డీతని దర్శించుటయుఁ బోతరాజుభాగవతము నీతఁడంకితము గోర నిరాకరించుటచే బాధింతి వేయించుటయు జరిగియుండును.

భాగవతమునుగూర్చి కొంత యిటఁజెప్పవలసియున్నది. పోతరాజు భాగవతమునుఁ బండ్రెండు స్కంధములుగఁ దెలిగించెను. మనోహరములగు కల్పనములతో హృదయానందకరములగు శబ్దాలంకారములతో సముచితసమాసబంధురమగు ప్రౌఢశైలితో మూలమును బెంచి యాతఁడు భాగవతమును దెలిఁగించినాఁడు. సహజపాండిత్యుఁ

డగు నీతనిశైలి యాంధ్రవాఙ్మయమున క్రొకనూతనవికాసము ప్రసాదించుచున్నది. సర్వజ్ఞసింగభూపాలుఁడు భాగవతము నంకితము గావింపుమని కోర పోతరాజు నిరాకరించెను. ఒక క్లిష్టపరిస్థితిలో భాగవతము నేకర్ణాటప్రభుని కేని నంకితముగావించి జీవయాత్ర సౌఖ్యముగ గడుపుకొనఁ బోతరాజుదలంప సరస్వతి బాష్పాకులనేత్రయై నన్నుఁ బరుల పాలుగావింపకుమని విలపించెనట. అపుడు పోతరాజు సరస్వతిని అమృత రసస్యందమగు నీపద్యముతో నోదార్చెనని యొకయైతిహ్యముగలదు.

"కాటుకకంటినీరు చనుకట్టుపయింబడ నేలయేడ్చెదే
కైటభదైత్యమర్దనునిగాదిలికోడల యోమదంబ యో
హాటకగర్భురాణి నిను నాకటికిం గొనిపోయి యల్ల క
ర్ణాటకిరాటకీచకుల కమ్మ త్రిశుద్ధిగనమ్ము భారతీ!"

పోతనకవిత మృదుమధురము, కొన్ని యెడల దీర్ఘసమాసకలితములగు నంత్యనియమములతోడను నింకఁ గొన్ని యెడలఁ దేట తెలుంగుఁ బలుకుబడులతోడను గొండొకయెడ హృదయంగమమిశ్రభాషారచనములతోడనుఁ దులతూఁగుచుఁ బాఠకలోకమునకు భక్తిరసోద్బోధకమై యానందపారవశ్యముగూర్చుచుండును. ఈతని ప్రతిజ్ఞయు నిందుల కనుకూలముగనున్నది. భాగవతరచనారంభమునఁ జెప్పిన యీ క్రింది పద్యమునందలి నియమమునీయన సక్రమముగా నిర్వహించి యాంధ్రలోకముచేఁ దలఁయూఁపించెనని చెప్పవచ్చును.

క. "కొందఱకుఁ దెలుఁగు గుణమగుఁ
గొందఱకును సంస్కృతంబు గుణమగు రెండున్
గొందఱకు గుణములగు నే
నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్."

పోతరాజు పండ్రెండుస్కంధములు తెలిఁగించి యాంధ్రలోకమునకు మహోపకారము గావించినాఁడు. ఆంధ్రవాఙ్మయమున పోతన భాగవతమునకున్న వ్యాప్తి మఱి యేగ్రంథమునకు లేదు. అప్పకవి పోతన నధిక్షేపించి శకటరేఫములకు, రేఫములకు మైత్రి వాటించె

నని యు నందుచే లాక్షణికు లుదాహరింప మానిరని వ్రాసెను. పోతన కాలమున రేఫశకటరేఫములకుఁ గవులు మైత్రి పాటించునాచారము లేదు. పోతనయు నటులే మైత్రి పాటించియుండఁడు తరువాతికాలమున నుత్పన్నములయి పూర్తిచేయుటలో రేఫసాంకర్యము కొన్ని యెడల జరిగియుండవచ్చును.

*భాగవతము పూర్తియైన పిదప రాచకొండపాలకుఁడగు సర్వజ్ఞ సింగభూపాలుఁడు తన కంకితమిమ్మని పోతరాజును గోరెననియు, అతఁడు నిరాకరించుటచే బలవంతముగా భాగవతమును దెప్పించి ప్రాతివేయించుటచేఁ గొంతభాగము నశించెననియు, నష్టావశిష్టమగు గ్రంథము సర్వజ్ఞ సింగభూపాలునినుండి పరిగ్రహించి పూర్తిచేయుటచేఁ గొన్నియెడల దోషములు పాటిల్లెనేగాని సహజపాండిత్యుఁడగు పోతరాజు తప్పులతోఁ గవిత వ్రాయఁడనియు కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసార సంగ్రహములోఁ జేర్కొనినాఁడు. ఏకారణముననైన నేమి భాగవతమున ఐదవస్కంధము గంగయ పేరను ఆఱవస్కంధము ఏర్చూరి సింగన పేరను పదునొకండు పండ్రెండు స్కంధములు పోతనామాత్యుని ప్రియ శిష్యుఁడగు వెలిగందలనారయ పేరఁ గర్తృత్వము గలవిగాఁ గనిపించుచున్నవి ద్వితీయ స్కంధములోను, తృతీయ స్కంధములోను, చతుర్థస్కంధములోను, దశమస్కంధోత్తరభాగమునందును నారయ కవిత విశేషించి కలసినది. మిగిలిన స్కంధములు చాలాభాగము పోతరాజు రచనములతో సలరారియుంటచే హృదయంగమములగు కైశిక వృత్తిలో ద్రాక్షాపాకముతో శబ్దాలంకార భూయిష్ఠముగనుంట తటస్థించినది.

---

* సీ. ఘనుఁడు పోతనమంత్రి మును భాగవతము రచించి చక్రికి సమర్పించునెడల
సర్వజ్ఞ సింగయజ్మావరుం డది తన, కిమ్మని వేఁడఁగా నియకున్న
నలిగి యా పుస్తకం బరనిఁ బాతించినఁ, జదికి యందందుఁ గొంత శిథిలమయ్యెఁ
గ్రమ్మఱ నది వెలిగందల నారప, రాజును మఱి బొప్పరాజు గంగ
గీ. రాజు మొదలగు కవివరుల్ తేజ మెసఁగఁ, జెప్పిరా గ్రంథములయందె తప్పులొదవెఁ
గాని పోతనకవిచంద్రు కవితయందు, లక్షణం బెందుఁ దప్పునా లక్షణమున.”

క్రీ॥ శకం 1770 లో సర్వలక్షణసారసంగ్రహము రచించుచు కూచిమంచి తిమ్మకవి భాగవతము శిథిలమైన విధము నీ విధముగాఁ జేర్కొనినాఁడు.

పోతరాజు భాగవతమును తెనింగించుటలో శ్రీధరవ్యాఖ్య ననుసరించుచు నద్వైతపరముగ రచనగావించెను. అందందుఁగల విశిష్టాద్వైతపరములగు నాంధ్రీకరణ భాగములు నారయాదుల పూరణము లనుకొనవచ్చును. పోతనకవిత యందలి మాధుర్యము అనిర్వాచ్యము. రచనము మృదుమధురము. భావములు హృదయంగమములు, పోకడలుత్సాహదాయకములు. శైలిలో నన్వయకాఠిన్యములేదు. కథాకల్పనమునఁగుదింపులేదు. భక్తిరసప్రకటనమునను, సగుణ భగవత్స్వరూపవర్ణనమునను శృంగారాది రసప్రకటనమునను పోతనరచన ఆంధ్రమున నితరు లెఱుఁగని క్రొత్త తెన్నులతో అచ్చెరువు గూర్చుచుండును. ఈ శక్తిసామర్థ్యములుభాగవత భాగములఁ బూర్తిచేసిన యితరుల కవితలోఁగానరావు. ఒకయెడఁగానవచ్చినచో నవియుత్సన్న శేషములగు పోతనరచనములుగనే వానిని భావించుటకే భాషాపరిజ్ఞాత యు వెనుదీయఁడు.

పోతరాజుకవితలో ననన్యసామాన్యమగు నొక విశిష్టత్వమున్నది. షష్ఠ్యంతములలో వృత్తములఁగూర్చి యంత్యనియమ రచనముతోఁ గ్రొత్తదోవలఁ దీసినాఁడు. రాజాశ్రయము, అంకిత రచనము తుచ్ఛమని కంఠోక్తిగ శాసించినాఁడు. అంతియగాదు, పొట్టకూటికి హాలికవృత్తి నవలంబించి యదియె పవిత్రవృత్తిగా భావించినాఁడు 'బావ! హాలికులా మీర' లన్నందులకు వాఙ్మయ మున్నంతవఱకు నుండు స్వాతంత్ర్యోత్కృష్టి శాశ్వతస్థాయి యగునట్లుగ నీ క్రిందివిధముగా శ్రీనాథునకుఁ బ్రత్యుత్తర మొసంగినాఁడు.

"బాలరసాలసాలనవపల్లవకోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి గహనాంతరసీమలఁ గందమూల గౌ
ద్దాలికులైననేమి నిజదారసుతోదరపోషణార్థమై"

ప్రథమస్కంధమునందలి అశ్వత్థామ పరాభవము, భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించుట, శ్రీకృష్ణనిర్యాణము, పరీక్షిచ్ఛాపములోనగు కథాభాగములు హృదయానందకరములుగ నుండి పాఠకుల రసమగ్నుల గావించును. ఆ రసోజ్జృంభణము దాదాపుగ ఆఱవస్కంధము ముగియు

వఱకుఁగానరాదు. సప్తమస్కంధము, అష్టమస్కంధము, నవమస్కంధము, దశమస్కంధములలోఁ బోతనకవితాసరస్వతి ప్రౌఢయై మనోహరనర్తనమొనరించినది. ప్రథమస్కంధమునందలి నైమిశారణ్యవర్ణనము నవమస్కంధమునందలి గంగావర్ణనము బాణుని కాదంబరిలోని శ్లేషానుప్రాణితాభేదాధ్యవసాయంబుల మించియున్నది. రామరాజభూషణాది శబ్దచిత్రకవితాశిల్పులకెల్ల పోతరాజే ఆచార్యుఁడు. భాగవతమే వారి కాదర్శగ్రంథము. ఆంధ్రభాషాయోషాభూషణమగు పోతనభాగవతమును గూర్చి యెంతయేని వ్రాయఁదగియున్నదిగాని ఆ యాస్కంధములఁ బీఠికలలోఁ జర్చింపఁనవకాశము మిగుల్పుకొననెంచి యిట సంగ్రహించితిమి. ఇంతకు విశేషాంశములు వావిళ్లవారి ప్రతిలోని మాపీఠికనుండి పాఠకలోకము గ్రహింపఁగలదని చర్వితచర్వణముగాకుండఁ గొన్ని క్రొత్తయంశములనిందుఁ బేర్కొంటిమి.

పోతరాజునుగూర్చి కొన్ని కథలు వాడుకలో నున్నవి. అవి యన్నియుఁ బోతన భగవత్సాక్షాత్కారము గల ధన్యుఁడనుటకు నిదర్శనములు. అందుఁగొన్నింటి నిటనుదాహరించుట ప్రకృతముగాకపోదు.

(అ) పోతరాజు నాగలి దున్నుకొనుతఱి శ్రీనాథకవి పల్లకినెక్కి వచ్చుచు బావమఱఁదికిఁ దన ప్రభావము జూపఁ బల్లకి మోయువారిలో వెనుకవానిని దొలఁగింప నప్పటివలెఁ బల్లకి నడఁచెనట. పోతన యిది జూచి నాగలి లాగు నెద్దులలో నొకదానిని విడువఁగా నాగలియు సాగెనఁట. శ్రీనాథుఁడు పల్లకి మోయు ముందువారిని దొలఁగింపఁ బల్లకి మనుష్యసహాయము లేక పోవుచుండెను, పోతరాజు నాగలికిఁ గట్టిన రెండవ యెద్దును దొలఁగింపఁ దనంతనే నాగలి దున్నుకొనుచువచ్చెనఁట.

(ఆ) శ్రీనాథుఁడు భాగవతము విని గజమోక్షణ ఘట్టమున 'బావా! గజేంద్రుని గాపాడ విష్ణువు సంభ్రమముతోఁ బరుగెత్తెనంటివి. శంఖచక్రములు పరివారము లేక మకరిని గిల్లి చంపఁదలంచెనా' యని వెక్కిరించెనఁట. పోతన దానికిఁ బరిహారముగా శ్రీనాథునకు అభ్యంగస్నానము జేయించుచు నూతిలో నొక ఱాయివైచి శ్రీనాథునితో నీ కుమారుఁడు బావిలోఁ బడెనని చెప్పెనఁట. విచారముతో మేన నూనె గారుచుండ నుపవస్త్రమేని దాల్పక కొడుకా! కొడుకా!

యని బావిచుట్టు తిరుగుటఁ బోతన జూచి' బావా! త్రాళ్ళు లేక గాలములు లేక బావిలో దిగువారిని బిలుచుకొనిరాక కుమారునిఁ వ్రేలితోఁ దీయనెంచితివా' యని యుల్లసముల నాడెనఁట. దానితో శ్రీనాథుఁడు భగవానునికి భక్తులపయిఁగల వాత్సల్యము పోతనవలె నితరులు గ్రహింపఁజాలరని తలంచెనఁట.

(ఇ) గజేంద్రుఁడు విలపించుతఱి భగవానుఁ డేమిచేయుచున్నాఁడో వ్రాయనెంచి "అల వైకుంఠపురంబులో నగరిలో" అని వ్రాసి యావల వ్రాయుటకుఁ దోఁచక "పలికించెడివాఁడు రామభద్రుండఁట" అను పూర్వోక్తి కనుగుణముగ ముందుఁ బద్యము సాగింపఁజాలక యప్పటికి రచనము ముగించి యెందేని యేగెనఁట. పిమ్మట భగవానుఁడు పోతనరూపముతో వచ్చి మిగిలిన పద్యము బూర్తిచేసి పోయెనఁట. తరువాతఁ బోతరాజు పద్యభాగము యోచించుకొని భాగవతమున వ్రాయఁబోవ నంతకుమున్నె మఱియొక విధముగఁ బద్యము పూర్తి గావింపఁబడి యుండెనఁట. ఇది యెవరు వ్రాసిరని కుమార్తె నడుగ నింతదనుక మీరే వ్రాయుచుంటిరిగదా యన నిది తనచేదోడు వాదోడగు భగవానుని చర్యగ నెంచి భగవద్దర్శన భాగ్యముఁగలిగిన పుత్త్రికనుఁగొనియాడి తన కట్టిభాగ్యము కలుగమికి వగచెనఁట.

(ఈ) రుక్మిణీకల్యాణము వ్రాయుతఱి పోతరాజు 'కేశబంధ మధికమగుచు బాలకమరె' యని వ్రాయఁగానే నేలపయిఁ బారాడు నాతని పుత్రి కుంపటిబడి కమరి మరణించెనఁట. అదివిని పద్మనయను వలనఁ బ్రిమదంబు నిండారెనన జీవించెనఁట.

(ఉ) పోతరాజు పశువులఁగాయుతఱి నాతఁడు గావించిన పరిచర్యల కానందించి సమీపశైలమునందున్న సదానందయోగినాలుకపైఁ గొన్ని బీజాక్షరములు వ్రాసి మంత్రోపదేశము గావించుటచే సహజపాండిత్యుఁడు మహాకవియు నయ్యెనఁట.

ఇటులె పోతరాజునుగూర్చిన యాశ్చర్యకరములగు కథలు పెక్కులు వాడుకలో నున్నవి. ఇందలి సత్యాసత్యములతో మనకుఁ బనిలేదు. ఇవి యన్నియుఁ బోతరాజు భగవత్సందర్శన భాగ్యముగల

వానినిగ నాంధ్రులు విశ్వసించిరనుటకు మాత్రము ఉదాహరణములు కాఁగలవు.

తాళపత్రి భాగవతములలో ఏకాదశ ద్వాదశస్కంధములు వెలిగందల నారయకవి రచించినట్లులే కానరాదు. కొన్ని ప్రతులలో హరిభట్టారకుని యేకాదశ ద్వాదశ స్కంధములు చేర్చఁబడి యున్నవి. షష్ఠస్కంధము శృంగారషష్ఠమను పేర లక్షణగ్రంథములలో నుదాహరింపఁబడినది. హరిభట్టారకుని షష్ఠస్కంధముగూడ నీమధ్యలభించినది. వ్రాత ప్రతులలో వెలిగందల నారయస్కంధ మధ్యభాగములు పూర్తిచేసినట్లు లేదు. కీ. శే. శం. తేవప్పెరుమాళ్లయ్యగారి భాగవతపీఠికవలన పూర్వము పురాణము హయగ్రీవశాస్త్రిగారు ముద్రింపఁజేసిన ప్రతికిని వ్రాతప్రతులకుఁ జాలవ్యత్యాసములున్నట్లు తెలియుచున్నది. హరిభట్టారకుఁడు కంభముమెట్టు వాసియగు కొలిపాక యెఱ్ఱనామాత్యునకు వరాహపురాణము కృతినిచ్చినవాఁడు. బహుగ్రంథకర్త పోతనామాత్యుని నివాసముగు బమ్మెర ఒరంగల్లులకుఁ జేరువలోనున్న వాఁడుగాన నష్టభాగములుగ భాగవతముపోతనకృతము వెలిగందల నారయకు లభించినటు లీతనివి లభించియుంటచే ఏకాదశ ద్వాదశ స్కంధములలో నీయిరువురి రచనములు కలియుట తటస్థించియుండును.

పోతరాజకృతభాగవతమునకు సంగ్రహరూపముగా కోనేటి దోనేటికవి బాలభాగవతము, తరిగొండ వెంగమ ద్విపదభాగవతము రచించెను. వీనికి వ్యాప్తి చాలతక్కువ.

హరిభట్టు నిధనకాలము ౧౫౫౦ క్రీ.శ. కానోపునని నిర్ణయింపఁబడినది. వెలిగందల నారయ పోతనకుఁ బ్రియశిష్యుఁడు. అందుచేనారయకవి కనంతరము హరిభట్టారకుఁడు ముప్పదినలువది సంవత్సరముల తరువాత షష్ఠైకాదశద్వాదశస్కంధములఁ బూర్తిచేసియుండును. ఆంధ్రసాహిత్యపరిషత్తునందుఁ బోతనకృతికి భిన్నముగ ఏర్చూరి సింగనకృతి కంటె విపులముగ హరిభట్టుకృతముగానిదియు శృంగారషష్ఠముకంటె నితరమునగు ఆఱవస్కంధముగలదఁట. భిన్నదేశప్రతులతో నితరకర్తృత్వముగల భాగములతో భాగవతము పూర్తిగ సంస్కరించి ముద్రిం

చుట బహువ్యయప్రయాసములతోఁ గూడినపని. అది నెరవేరినచోఁ బోతన పద్యరత్నము లింకను నెక్కుడుగ లభింపవచ్చును.

## ప్రథమస్కంధవిశేషము

భాగవతరూపమున వైరాగ్యమును సూతుఁడు శౌనకాదులకును నారదుఁడు వ్యాసమహర్షికిని, శుకుండు పరీక్షితునకును నుపదేశించిరి. భాగవతము గూడఁ గ్రమముగా లోకములోనికి వీరివలననే వ్యాప్తిలోనికివచ్చెను. ప్రథమస్కంధమునందు భీష్మనిర్యాణము, అశ్వత్థామ పరాభవము, శ్రీకృష్ణనిర్యాణము, పాండవ మహాప్రస్థానము, వైరాగ్య దాయకములు. వైరాగ్యసంపన్నుఁడే భాగవతము నెఱుంగుటకుఁదగిన యధికారి యని నిరూపించుటకే ప్రథమస్కంధమున వైరాగ్యనిరూపణ మొనర్పఁబడెను. సందర్భానుసారముగ నందందు శ్రీకృష్ణునిమహత్త్వము, కుంతీ భీష్మాదుల పవిత్రాచరణము, వ్యాసుఁడు, శుకుఁడు, నారదుఁడు, సూతుఁడు మున్నగువారల లోకహితచర్య, గురూపపత్తియావశ్యకత గూడఁ జెప్పఁబడెను.

ప్రథమస్కంధమునుఁ దెలుఁగుచేయుటలోఁ బోతరాజు తన కవితాశక్తి కూలంకషముగా వెల్లడించినాఁడు. అశ్వత్థామపరాభవము, భీష్మస్తుతి, శ్రీకృష్ణనిర్యాణము ఆంధ్రుల హృదయములఁ జూరగొను మనోహరపద్యములకు నెలవులు. ఈ స్కంధమున శుకయోగీంద్రుఁడు తనంతఁ దా వెదకికొనుచు శ్రవణాధికారియగు పరీక్షిన్మహారాజుకడకు వచ్చువఱకుఁ గథాంశము గలదు.

## ద్వితీయస్కంధవిశేషము

ద్వితీయస్కంధమున 94 పద్యములవఱకే పోతనకృతము. ఆవలి భాగము వెలిగందల నారయకృతము. వెలిగందలనారయ ప్రౌఢ కవిగాఁడు. ధార సరళమును గంభీరమును గాదు. లాక్షణికదోషములు గూడ విశేషించి దొరలుచుండును. ఆంధ్రసాహిత్య పరిషత్తునందుఁ గల పది ద్వితీయస్కంధ వ్రాఁతప్రతులలో 95 పద్యమగు 'అట్టి అనంతశక్తి' యనుదానికిఁ బయిన నిటనుండి వెలిగందల నారయ కవిత్వమను మాట లేదని యొకానొకవ్యాసమునఁ గలదు. తక్కిన వ్రాతప్రతులలో

నెటులున్నదో ముద్రాపకులే యాధారముతో నట్లు చేర్చిరో యారయ వలసి యున్నది.

పోతనకృత భాగవతమును ఆనందముద్రణాలయమువారు మనోహరముగ రాయలు ¼ లో ముద్రించి ఆంధ్రలోకమున మంచి వ్యాప్తిలోనికిఁ దెచ్చిరి. వావిళ్ళవారును రాయలుసైజులో విస్తృత పీఠికలతో నూతనపాఠములతో ముద్రించిరి. మొత్తము భాగవతము ఒక సంపుటముగ రెండుసంపుటములుగ మూఁడు సంపుటములుగ నున్న దేగాని చిన్నియాకృతిలో టిప్పణముతో ఏ స్కంధమున కాస్కంధ మొక్కొక ప్రతిగా లేదను కొఱత యుండెడిది. ఆ కొఱత నివారించి భాగవతముఁ బండ్రెండు సంపుటములలో సటిప్పణముగ సుందరముగ నుండు ముద్రణముతో మంచి కాగితముల పయిన ముద్రించి స్వల్పక్రయమునకు విక్రయింపఁదలంచిన శ్రీయుత దావులూరి కోటసూర్యప్రకాశరావుగారి ప్రయత్నము ప్రశంసనీయము. సహజముగ వీరు భాషాభిమానులు. పోతనయెడ పరమభక్తి విశ్వాసములుగలవారు. గాన సచిత్రముగ రు6 లు మించని వెలతో భాగవతము 12 సంపుటములుఁ బ్రచురింపఁ దలఁచిరి. ఆంధ్రమహాజనులు వీరిప్రయత్నము నాదరించినచో నింకఁ గొన్ని యుత్తమ గ్రంథములను బ్రకటింప సంకల్పించి యున్నారు. వీర లింతకుమున్ను కవిత్రయము వారి భారతమును భాగవతమును క్రౌను 1/16 సైజులోఁ బూర్ణముగాఁ బ్రకటించి వ్యాప్తిగావించి యున్నారు. ఆంధ్రసోదరులు*వీరి ప్రచురణముల యెడ నాదరము జూపి ప్రోత్సాహించుచున్నచో నుద్గ్రంథములను గూడ నిటులె చిన్నియాకృతిలో సటిప్పణముగఁ బ్రకటింపఁగలరు.

హనుమకొండ,
(నైజాము)
బహుధాన్య. చైత్ర శు ౧౨

ఇట్లు భాషాసేవకులు,
శేషాద్రి రమణ కవులు,
శతావధానులు.

* వీరుముందు కట్టా వరదరాజా క్రీ.శ 1550 లో రచించిన వరదరాజా రామాయణము (ద్విపద) ను గూడ సటిప్పణముగ ఒక్కొక్కకాండ మొక సంపుటముగాఁ బ్రచురింప యత్నించుచున్నారు.

## శ్రీ సరస్వతీ ప్రార్థన

ఉ. క్షోణితలంబు నెన్నుదురు ♦ సోఁకగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ జంచరీకచయ ♦ సుందరవేణికి రక్షితామర
శ్రేణికిఁ దోయజాతభవ ♦ చిత్తవశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామశుక ♦ వారిజపుస్తక రమ్యపాణికిన్.

శా. తల్లీ నిన్నుఁ దలంచి పుస్తకము చే♦తం బూనితిన్ నీవు నా
యుల్లం బందున నిల్చి జృంభణముగా ♦ నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదువాక్కునను సం♦ప్రీతిన్ జగన్మోహినీ
ఫుల్లాబ్జాక్షి సరస్వతీ భగవతీ ♦ పూర్ణేందుబింబాననా.

## శ్రీమద్భాగవత గ్రంథప్రణేత యగు వ్యాసమహర్షి ప్రార్థన.

ఉ. ప్రాంశుపయోదనీలతను ♦ భాసితు నుజ్జ్వలదండధారుఁ బిం
గాంశు జటాచ్ఛటాభరణు ♦ నాగమపుంజపదార్థతత్త్వని
స్సంశయకారుఁ గృష్ణమృగ ♦ చర్మకృతాంబరకృత్యు భారతీ
వంశవివర్ధనుం ద్రిదశ ♦ వందితు సాత్యవతేయుఁ గొల్చెదన్.

## శ్రీమద్భాగవతారోపదేష్ట యగు శుక మహర్షి ప్రార్థన.

మ. సముఁడై యెవ్వఁడు ముక్తకర్మచయుఁడై ♦ సన్న్యాసియై యొంటిఁ బో
వ మహాభీతి నొహో కుమార యనుచున్ ♦ వ్యాసుండు చీరంగ వృ
క్షములుం దన్మయతన్ బ్రతిధ్వనులు చ♦క్కం జేసె మున్నట్టి భూ
తమయున్ మ్రొక్కెద బాదరాయణిఁ దపో♦ధన్యాగ్రణిన్ ధీమణిన్

## శ్రీ మ ద్భా గ వ త ప్రా ర్థ న.

ఆ. వేదకల్పవృక్ష ♦ విగళిత మయి శుక
ముఖసుధాద్రవమున ♦ మొనసియున్న
భాగవతపురాణ ♦ ఫలరసాస్వాదన
పదవిఁ గనుఁడు రసిక ♦ భావవిదులు.

మ. లలితస్కంధము కృష్ణమూలము శుకా ♦ లాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణసుమన ♦ స్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమల ♦ వ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్యకల్పతరువు ♦ ర్విన్ సద్ద్విజశ్రేయమై.

## గ్రంథనాయకుఁ డగు శ్రీరామమూర్తి ప్రార్థన.

క. శ్రీకంఠచాపఖండన । పాకారిప్రముఖవినుత ♦ భండన విలస
త్కాకుత్స్థవంశమండన । రాకేందుయశోవిశాల ♦ రామనృపాలా.



వాణి

శ్రీరస్తు

శ్రీకృష్ణాయ నమః

# శ్రీమదాంధ్ర

# భాగవతము

## పీఠిక

శ్రీ కైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళాసంరంభకున్ దానవో
ద్రేకస్తంభకుఁ గేళిలోలవిలసద్దృగ్జాలసంభూతనా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్

### —◆ ఇష్టదేవతాది ప్రార్థనము ◆—

ఉ. వాలినభక్తి మ్రొక్కెద నవారితతాండవకేళికిన్ దయా
శాలికి శూలికిన్ శిఖరిజాముఖపద్మమయూఖమాలికిన్
బాలశశాంకమౌళికిఁ గపాలికి మన్మథగర్వపర్వతో
న్మూలికి నారదాదిమునిముఖ్యమనస్సరసీరుహాలికిన్. ౨

ఉ. ఆతతసేవఁ జేసెద సమస్తచరాచరభూతసృష్టివి
జ్ఞాతకు భారతీహృదయసౌఖ్యవిధాతకు వేదరాశిని
ర్ణేతకు దేవతానికరనేతకుఁ గల్మషజేతకున్ నత
త్రాతకు ధాతకున్ నిఖిలతాపసలోకశుభప్రదాతకున్. ౩

వ. అని నిఖిలభువనప్రధానదేవతావందనంబుఁ జేసి. ౪

ఉ. ఆదర మొప్ప మ్రొక్కిడుదు నద్రిసుతాహృదయానురాగ సం
పాదికి దోషభేదికిఁ బ్రపన్నవినోదికి విఘ్నవల్లికా
చ్ఛేదికి మంజువాదికి నశేషజగజ్జననందవేదికిన్
మోదకఖాదికిన్ సమదమూషకసాదికి సుప్రసాదికిన్. ౫

ఉ. క్షోణితలంబునన్ నుదురు సోఁకఁగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ జంచరీకచయసుందరవేణికి రక్షితామర
శ్రేణికిఁ దోయజాతభవచిత్తవశీకరణైకవాణికిన్
వాణికి నక్షదామశుకవారిజపుస్తకరమ్యపాణికిన్. ౬

శా. పుట్టం బుట్ట శరంబునన్ మొలవ నంభోయానపాత్రంబునన్
మెట్టం గల్గను గాలిఁ గ్రోల్వను బురాణింపన్ దొరఁగొంటి మీఁ
దెట్టే వెంటఁ జరింతుఁ దత్సరణి నా కీవమ్మ యో యమ్మ మేల్
పట్టున్ నాకగుమమ్మ నమ్మితిఁ జుమీ, బ్రాహ్మీ! దయాంభోనిధీ. ౭

ఉ. శారదనీరదేందుఘనసారపటీరమరాళమల్లికా
హారతుషారఫేనరజతాచలకాశఫణీశకుందమం
దారసుధాపయోధిసితతామరసామరవాహినీశుభా
కారత నొప్పు నిన్ను మదిఁ గానఁగ నెన్నఁడు గల్గు భారతీ. ౮

ఉ. అంబ నవాంబుజోజ్జ్వలకరాంబుజ శారదచంద్రచంద్రికా
డంబరచారుమూర్తి ప్రకటస్ఫుటభూషణరత్నదీపికా
చుంబితదిగ్విభాగ శ్రుతిసూక్తివివిక్తనిజప్రభావ భా
వాంబరవీథివిశ్రుతవిహారిణి నన్ గృపఁ జూడు భారతీ. ౯

ఉ. అమ్మలఁగన్నయమ్మ ముగురమ్మలమూలపుటమ్మ చాలఁ బె
ద్దమ్మ సురారులమ్మకడుపాఱడిపుచ్చినయమ్మ దన్ను లో
నమ్మినవేల్పుటమ్మలమనమ్ములనుండెడియమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వపటుత్వసంపదల్. ౧౦

మ. హరికిం బట్టపుదేవి పున్నెములప్రోవర్థంపుఁబెన్నిక్క చం
దురుతోఁబుట్టువు భారతీగిరిసుతల్ దోనాడుపూఁబోఁడి దా

మరలందుం డెడిముద్దరాలు జగముల్ మన్నించునిల్లాలు భా
సురతన్ లేములువాపు తల్లి సిరి యిచ్చున్ నిత్యకల్యాణముల్. ౧౧

వ. అని యిష్టదేవతలం జింతించి దినకరకుమారప్రముఖులం దలంచి ప్రథమకవితావిరచనవిద్యావిలాసాతిరేకి వాల్మీకి నుతియించి హయగ్రీవదనుజకరపరిమిళిత నిగమనివహవిభాగనిర్ణయనిపుణతాసముల్లాసునకు వ్యాసునకు మ్రొక్కి శ్రీమహాభాగవతకథాసుధారసప్రయోగికి శుకయోగికి నమస్కరించి మృదుమధురవచనవర్గపల్లవితస్థాణునకు బాణునకుఁ బ్రణమిల్లి కతిపయశ్లోకసమ్మోదితసూరు మయూరు నభినందించి మహాకావ్యకరణకళావిలాసుం గాళిదాసుం గొనియాడి కవివదనకమలరవిం భారవిం బొగడి విదళితాఘు మాఘు వినుతించి యాంధ్రకవితాగౌరవజనమనోహారి నన్నయసూరిం గైవారంబు చేసి హరిహరచరణారవిందవందనాభిలాషిం దిక్కమనీషిం భూషించి మఱియు నితరపూర్వకవిజనసంభావనంబు గావించి వర్తమానకవులకుం బ్రియంబు వలికి భావికవుల బహూకరించి యుభయకావ్యకరణదక్షుండనై ౧౨

## కృతిపతినిర్ణయము.

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెటవ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్. ౧౩

తే. చేతులారంగ శివునిఁ బూజింపఁడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁడేని
కలుగ నేటికి తల్లుల కడుపుచేటు! ౧౪

వ. అని మఱియు మదీయపూర్వజన్మసహస్రసంచితతపఃఫలంబున శ్రీమన్నారాయణకథాప్రపంచవిరచనాకుతూహలుండనై యొక్క రాకానిశాకాలంబున సోమోపరాగంబు *రాకం గని సజ్జనానుమతం

* చంద్రగ్రహణము.

బున నభ్రంకష శుభ్రసముత్తుంగభంగ యగు గంగకుం జని క్రుంకు
లిడి వెడలి మహనీయమంజుల పులినతలంబు*న మహేశ్వర ధ్యానంబు
సేయుచుఁ గించిదున్మీలితలోచనుండ నై యున్నయెడ ౧౫

సీ. మెఱుఁగుచెంగటనున్న మేఘంబుకైవడి
నువిద చెంగటనుండ నొప్పువాఁడు
చంద్రమండలసుధాసారంబుపోలిక
ముఖమునఁ జిఱునవ్వు మొలచువాఁడు
వల్లీయుతతమాలవసుమతీజము+ భంగి
బలువిల్లు మూఁపునఁ బరఁగువాఁడు
నీలనగాగ్రసన్నిహితభానునిభంగి
ఘనకిరీటము దలఁ గలుగువాఁడు

ఆ. పుండరీకయుగముఁ బోలుకన్నులవాఁడు
వెడఁదయురమువాఁడు విపులభద్ర
మూర్తివాఁడు రాజముఖ్యుఁ డొక్కరుఁడు నా
కన్నుఁగవకు నెదురఁ గానఁబడియె. ౧౬

వ. ఏను నా రాజశేఖరుం దేఱిచూచి భాషింప యత్నంబు సేయునెడ
నతండు దా రామభద్రుండ మన్నామాంకితంబుగా శ్రీమహాభాగ
వతంబుఁ దెనుంగు సేయుము నీకు భవబంధంబులు దెగు నని
యానతిచ్చి తిరోహితుం♦డయిన సమున్మీలితనయనుండ§నై వెఱఁగు
చిత్తంబున ౧౭

క. పలికెడిది భాగవత మఁట,
పలికించెడువాఁడు రామభద్రుం డఁట, నేఁ
బలికిన భవహర † మగు నఁట,
పలికెద వేఱొండుగాథ వలుకఁగ నేలా. ౧౮

ఆ. భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు
శూలికైనఁ దమ్మిచూలి ‡ కైన

* ఇసుకనేల. + తీఁగతోఁగూడిన చీఁకటిమ్రాను. ♦ అదృశ్యుఁడు. § బాగుగా మూసుకొనఁబడిన కన్నులు గలవాఁడు. † జన్మరాహిత్యము. ‡ బ్రహ్మ.

విబుధజనులవలన విన్నంతఁ గన్నంతఁ
దెలియవచ్చినంతఁ దేటపఱుతు. ౧౯

క. కొందఱకుఁ దెనుఁగు గుణమగుఁ
గొందఱకును సంస్కృతంబు గుణమగు రెండుం
గొందఱకు గుణములగు నే
నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్. ౨౦

మ. ఒనరన్ నన్నయ తిక్కనాదికవు లీయుర్విం బురాణావళుల్
తెనుఁగుం జేయుచు మత్పురాకృతశుభాధిక్యంబు దా నెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నా
జననంబున్ సఫలంబు జేసెదఁ బునర్జన్మంబు లే కుండఁగన్. ౨౧

*మ. లలితస్కంధము కృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణసుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమలవ్యాసాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయ మై. ౨౨

వ. ఇట్లు భాసిల్లెడు శ్రీమహాభాగవతపురాణపారిజాతపాదప సమాశ్రయంబునను హరికరుణావిశేషంబునను గృతార్థత్వంబు సిద్ధించెనని బుద్ధి నెఱింగి లేచి మఱలి కొన్ని దినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి యందుఁ గురువృద్ధబుధబంధుజనానుజ్ఞాతుండనై ౨౩

## —◆ గ్రంథకర్తృవంశవర్ణనము. ◆—

సీ. కౌండిన్యగోత్రసంకలితుఁ డాపస్తంబ
సూత్రుండు పుణ్యుండు సుభగుఁ డైన
భీమనమంత్రికిఁ బ్రియపుత్రుఁ డన్నయ
కలకంఠి తద్భార్య గౌరమాంబ
కమలాప్తు వరమునఁ గనియె సోమనమంత్రి
వల్లభ మల్లమ వారితనయుఁ

---

* ఇందు భాగవతము కల్పవృక్షముగా వర్ణింపఁబడినది. దానికి శ్రీకృష్ణుఁడు; దానిఁ గూర్చి పలికినవాఁడు శుకుఁడు: దానిపాదు వ్యాసుఁడు.

డిల్లన యతనికి నిల్లాలు మాచమ
వారిపుత్రుఁడు వంశవర్ధనుండు

ఆ. లలితమూర్తి బహుకలానిధి కేసన
దానమాననీతిధనుఁడు ఘనుఁడు
దనకు లక్కమాంబ ధర్మగేహిని * గాఁగ
మనియె శైవశాస్త్రమతముఁ గనియె. ౧౪

క. నడవదు నిలయము ♦ వెలువడి
తడవదు పరపురుషునామముఁ దనపతినుడువుం
గడవదు వితరణకరుణలు
విడువదు లక్కాంబ విబుధవిసరము వొగడఁగ. ౧౫

ఉ. మానిను లీడుగారు బహుమాన నివారితదీనమానస
గ్లాని‡ కి దానధర్మమతిగౌరవమంజులతాగభీరతా
స్థానకి ముద్దుసానికి సదాశివపాదయుగార్చనానుకం
పానయవాగ్భవానికిని బమ్మెర కేసయ లక్కసానికిన్. ౧౬

క. ఆమానినికిం బుట్టితి
మే మిరువుర మగ్రజాతుఁ డీశ్వరసేవా
కాముఁడు తిప్పన పోతన
నామవ్యక్తుండ సాధునయయుక్తుండన్. ౧౭

వ. అయిన నేను నా చిత్తంబున శ్రీరామచంద్రుని సన్నిధానంబు గల్పించుకొని. ౧౮

---

* భార్య. ♦ ఇల్లు. ‡ దీనుల మనోబాధలను బోఁగొట్టునది.

## షష్ఠ్యంతములు

ఉ. హారికి నందగోకులవిహారికిఁ జక్రిసమీరదైత్యసం
హారికి భక్తదుఃఖపరిహారికి గోపనితంబినీమనో
హారికి దుష్టసంపదపహారికి ఘోషకుటీపయోఘృతా
హారికి బాలకగ్రహమహాసురదుర్వనితాప్రహారికిన్. ౨౯

ఉ. శీలికి నీతిశాలికి వశీకృతశూలికి బాణహస్తని
ర్మూలికి ఘోరనీరదవిముక్తశిలాహతగోపగోపికా
పాలికి వర్ణధర్మపరిపాలికి నర్జునభూజయుగ్మసం
చాలికి మాలికిన్ విఫలచక్రినిరుద్ధమరీచిమాలికిన్. ౩౦

ఉ. క్షంతకుఁ గాళియోరగవిశాలఫణావళినర్తనక్రియా
రంతకు నుల్లసన్మగధరాజచతుర్విధఘోరవాహినీ
హంతకు నింద్రనందననియంతకు సర్వచరాచరావళీ
మంతకు నిర్జితేంద్రియసమంచితభక్తజనానుగంతకున్. ౩౧

ఉ. న్యాయికి భూసురేంద్రమృతనందనదాయికి రుక్మిణీమన
స్స్థాయికి భూతసమ్మదవిధాయికి సాధుజనానురాగసం
ధాయికిఁ బీతవస్త్రపరిధాయికిఁ బద్మభవాండభాండని
ర్మాయికి గోపికానివహమందిరయాయికి శేషశాయికిన్. ౩౨

వ. సమర్పితంబుగా నే నాంధ్రంబున రచియింపంబూనిన శ్రీ మహా
భాగవతపురాణంబునకుం గథాప్రారంభం బెట్టి దనిన. 33

## కథాప్రారంభము

సీ. విశ్వ జన్మ స్థితి విలయంబు లెవ్వని
వలన నేర్పడు ననువర్తనమున
వ్యావర్తనమునఁ గార్యములం దభిజ్ఞుఁడై
తాన రాజగుచుఁ జిత్తమునఁ జేసి
వేదంబు లజునకు * విదితముల్ గావించె
నెవ్వఁడు బుధులు మోహింతు రెవ్వ
నికి నెండమావులనీటఁ గాచాదుల ♦
నన్యోన్యబుద్ధిదా నడరు నట్లు
ఆ. త్రిగుణసృష్టి యెందు దీపించి సత్యము
భంగిఁ దోఁచు స్వప్రభానిరస్త
కుహకుఁ డెవ్వఁ డతనిఁ గోరి చింతించెద
ననఘు సత్యుఁ బరుని ననుదినంబు. ౩౮

వ. ఇట్లు "సత్యం పరం ధీమహి" యను గాయత్రీప్రారంభంబున గాయత్రీనామ బ్రహ్మస్వరూపంబై మత్స్యపురాణంబులోన గాయత్రి నధికరించి‡ ధర్మవిస్తరంబును, వృత్రాసురవధంబును, నెందుఁ జెప్పంబడు నదియ భాగవతం బని పలుకుటం జేసి యీపురాణంబు శ్రీమహాభాగవతం బన నొప్పుచుండు ౩౯

సీ. శ్రీమంతమై మునిశ్రేష్ఠకృతం బైన
భాగవతంబు సద్భక్తితోడ
వినఁ గోరువారల విమలచిత్తంబులఁ
జెచ్చెర నీశుండు సిక్కుఁ గాక
యితరశాస్త్రంబుల నీశుండు సిక్కునే
మంచివారలకు నిర్మత్సరులకుఁ
గపటనిర్ముక్తులై కాంక్ష సేయక యును
దగిలియుండుట మహాతత్త్వబుద్ధిఁ

---

* బ్రహ్మకు. ♦ గాజులు మొదలగువానియందు. ‡ అధిష్ఠించి.

తే. బరగ నాధ్యాత్మికాదితాపత్రయంబు
నడఁచి పరమార్థభూతమై యధికసుఖద
మై సమస్తంబుఁ గాకయు నయ్యు నుండు
వస్తువెఱుఁగంగఁ దగు భాగవతమునందు. ౩౬

ఆ. * వేదకల్పవృక్షవిగళితమై శుక
ముఖసుధాద్రవమున మొనసి యున్న
భాగవతపురాణఫలరసాస్వాదన
పదవిఁ గనుఁడు రసికభావవిదులు. ౩౭

క. ♦పుణ్యంబై మునివల్లభ
గణ్యంబై కుసుమఫలనికాయోత్థితసా
ద్గుణ్యమయి నైమిశాఖ్యా
రణ్యంబు నుతింపఁ దగు నరణ్యంబులలోన్. ౩౮

వ. మఱియును మధువైరిమందిరంబునుం బోలె మాధవీమన్మథమహితంబై బ్రహ్మగేహంబునుంబోలె శారదాన్వితంబై నీలగళసభానికేతనంబునుంబోలె వహ్నివరుణసమీరణచంద్రరుద్రహైమవతీకుబేరవృషభగాలవశాండిల్యపాశుపతజటిపటలమండితంబై బలభేదిభవనంబునుంబోలె నైరావతామృతరంభాగణికాభిరామంబై మురాసురనిలయంబునుం బోలె నున్మత్తరాక్షసవంశసంకులంబై ధనదాగారంబునుం బోలె శంఖపద్మకుంద ముకుంద సుందరంబై రఘురామయుద్ధంబునుం బోలె నిరంతర శరానలశిఖాబహుళంబై పరశురామభండనంబునుంబోలె నర్జునోద్భేదంబై దానవసంగ్రామంబునుం బోలె నరిష్టజంభనికుంభశక్తియుక్తంబై కౌరవసంగరంబునుం బోలె ద్రోణార్జునకాంచనస్యందనకదంబసమేతంబై కర్ణుకలహంబునుం బోలె మహోన్నతశల్య సహకారంబై సముద్రసేతుబంధనంబునుం బోలె నల

* ఈ పద్యమునందు వేదము కల్పవృక్షముగా వర్ణింపఁబడినది. 'శుక' శబ్దమునందు శ్లేషగలదు. శుకముఖమునన్ = శుకుని ద్వారమున; చిలుక ముక్కున.

♦ ఈ వచనమునందు నైమిశారణ్య వర్ణనము కలదు.

నీలపవనసాద్యద్రిప్రదీపితంబై భర్గుభజనంబునుం బోలె; నానాశోకలేఖా
ఫలితంబై మరునికోదండంబునుం బోలెఁ బున్నాగశిలీముఖభూషి
తంబై నరసింహరూపంబునుం బోలెఁ గేసరకరజాకాంతంబై నాట్య
రంగంబునుం బోలె నటనటీసుషిరాన్వితంబై శైలజానిటలంబునుం
బోలెఁ జందనకర్పూరతిలకాలంకృతంబై వర్షాగమంబునుంబోలె నింద్ర
బాణాసనమేఘకరకకమనీయంబై నిగమంబునుంబోలె గాయత్రీ
విరాజితంబై మహాకావ్యంబునుంబోలెసరలమృదులతాకలితంబై విన
తానిలయంబునుంబోలె సువర్ణరుచిరంబై యమరావతీపురంబునుం
బోలె సుమనోలలితంబై కైటభోద్యోగంబునుం బోలె మధుమాని
తంబై పురుషోత్తమ సేవనంబునుం బోలె నమృతఫలదంబై ధనం
జయసమీరకంబునుం బోలె నభ్రంకషపరాగంబై వైకుంఠపురంబునుం
బోలె ఖడ్గపుండరీకవిలసితంబై నందఘోషంబునుం బోలెఁ గృష్ణసార
సుందరంబై లంకానగరంబునుం బోలె రామమహిషీవంచక సమంచి
తంబై సుగ్రీవసైన్యంబునుం బోలె గజ గవయ శరభ శోభితంబై
నారాయణస్థానంబునుంబోలె నీలకంఠహంసకౌశికశుకభరద్వాజతిత్తిరి
భాసురంబై మహాభారతంబునుం బోలె నేకచక్రబకకంకధార్త
రాష్ట్రశకునినకులసంచారసమ్మిళితంబై సూర్యరథంబునుం బోలె నురు
తరప్రవాహంబై జలదకాలసంధ్యాముహూర్తంబునుం బోలె బహు
వితతజాతిసామనస్యంబై యొప్పునైమిశారణ్యంబను శ్రీవిష్ణుక్షేత్రం
బునందు శౌనకాది మహామునులు స్వర్లోకగీయమానుండగు హరిం
జేరుకొరకు సహస్ర వర్షంబు లనుష్ఠానకాలంబుగాఁగల సత్త్రసంజ్ఞకం
బైన యాగంబు సేయుచుండి రం దొక్కనాఁడు వారలు రేపకడ
నిత్యనైమిత్తికహోమంబు లాచరించి సత్కృతుండై సుఖాసీనుండై
యున్న సూతుం జూచి. ౩౮

క. ఆతాపసు లిట్లనిరి వి
నీతున్ విజ్ఞానఘనితనిఖిలపురాణ
వ్రాతున్ నుతహరిగుణసం
ఘాతున్ సూతున్ నితాంతకరుణోపేతున్ ౪౦

మ. సమతం దొల్లి పురాణపంక్తు లితిహాసశ్రేణులున్ ధర్మశా
స్త్రములున్ నీవ యుపన్యసింపుదువు వేదవ్యాసముఖ్యుల్ మునుల్
సుమతుల్ సూచిన వెన్ని యన్నియును దోఁచున్ నీమదిం దత్ప్రసా
దమునం జేసి యెఱుంగ నేర్తువు సమస్తంబున్ బుధేంద్రోత్తమా. ౪౧

క. గురువులు ప్రియశిష్యులకుం
బరమరహస్యములు దెలియఁబలుకుదు రచల
స్థిరకల్యాణం బెయ్యది
పురుషులకును నిశ్చయించి బోధింపు తగన్. ౪౨

క. మన్నాఁడవు చిరకాలము
గన్నాఁడవు పెక్కులైన గ్రంథార్థంబుల్
విన్నాఁడవు వినఁదగినవి
యున్నాఁడవు పెద్దలొద్ద నుత్తమగోష్ఠిన్. ౪౩

చ. అలసులు మందబుద్ధిబలు లల్పతరాయువు లుగ్రరోగసం
కలితులు మందభాగ్యులు సుకర్మము లెవ్వియుఁ జేయఁజాల రీ
కలియుగమందు మానవులు గావున నెయ్యది సర్వసౌఖ్యమై
యలవడు నేమిటం బొడము నాత్మకు శాంతి మునీంద్ర చెప్పవే. ౪౪

సీ. ఎవ్వనియవతార మెల్లభూతములకు
సుఖమును వృద్ధియు సొరిదిఁ జేయు
నెవ్వనిశుభనామ మేప్రొద్దు నుడువంగ
సంసారబంధంబు సమసి పోవు
నెవ్వనిచరితంబు హృదయంబుఁ జేర్పంగ
భయ మంది మృత్యువు పరువు వెట్టు
నెవ్వనిపదనది నేపారుజలముల
సేవింప నైర్మల్యసిద్ధి గలుగుఁ

తే. దపసు లెవ్వనిపాదంబె దగిలి శాంతి
తెరువుఁ గాంచిరి వసుదేవదేవకులకు
నెవ్వఁ డుదయించెఁ దత్కథ లెల్ల వినఁగ
నిచ్చ పుట్టెడు నెఱిఁగింపు మిద్ధచరిత. ౪౫

క. భూషణములు వాణికి *నఘ
పేషణములు మృత్యుచిత్తభీషణములు హృ
త్తోషణములు గల్యాణవి
శేషణములు హరిగుణోపచిత భాషణముల్. ౪౬

క. కలిదోషనివారణమై
యలఘుయశుల్ వొగడునట్టి హరికథనము ని
ర్మలగతిఁ గోరెడు పురుషుఁడు
వెలయఁగ నెవ్వాఁడు దగిలి వినఁడు మహాత్మా. ౪౭

ఆ. అనఘ విను రసజ్ఞులై వినువారికి
మాటమాట కధికమధుర మైన
యట్టికృష్ణుకథన మాకర్ణనము సేయఁ
దలఁపు గలదు మాకుఁ దనివి లేదు. ౪౮

మ. వరగోవిందకథాసుధారసమహావర్షోరుధారాపరం
పరలం గాక బుధేంద్రచంద్ర యితరోపాయానురక్తిం బ్రవి
స్తరదుర్దాంతదురంతదుస్సహజనుస్సంభావితానేకదు
స్తరగంభీరకఠోరకల్మషకన♦ద్దావానలం ఆఱునే. ౪౯

సీ. హరినామకథనదావానలజ్వాలచేఁ
గాలవే ఘోరాఘకాననములు
వైకుంఠదర్శనవాయుసంఘంబుచే
దొలఁగవే భవదుఃఖతోయదములు

---

* అఘపేషణములు = పాపముల నణఁచివేయునవి.

♦ దావానలంబు = కార్చిచ్చు.

గమలనాభధ్యానకంఠీరవంబుచేఁ
గూలవే సంతాపకుంజరములు
నారాయణస్మరణప్రభాకరదీప్తిఁ
దీఱవే *షడ్వర్గతిమిరతతులు

ఆ. నలిననయనభక్తినావచేఁ గాక సం
సారజలధి దాఁటి చనఁగ రాదు
వేయు నేల మాకు విష్ణుప్రభావంబు
దెలుపవయ్య సూత ధీసమేత ౫౦

వ. మఱియుఁ గపటమానవుండును గూఢుండు నైన మాధవుండు రామ సహితుండై యతిమానుషంబులైన పరాక్రమంబులు సేసెనఁట వాని వివరింపుము కలియుగంబు రాఁ గల దని వైష్ణవక్షేత్రంబున దీర్ఘసత్త్రనిమిత్తంబున హరికథలు విన నెడగలిగి నిలిచితిమి దైవ యోగంబున. ౫౧

క. జలరాశి దాఁటఁ గోరెడి
కలముఁజనుల్ గర్ణధారుఁ గాంచినభంగిం
గలిదోషహరణవాంఛా
కలితుల మగు మేము నిన్నుఁ గంటిమి సూతా. ౫౨

క. చారుతరధర్మరాశికి
భారకుఁ డగు కృష్ణుఁ డాత్మపదమున కేగఁ
భారకుఁడు లేక యెవ్వనిఁ
జేరెను ధర్మంబు బలువు సెడి మునినాథా. ౫౩

—• సూతుండు నారాయణకథాప్రశంస సేయుట •—

వ. అని యిట్లు మహనీయగుణగరిష్ఠులయిన శౌనకాదిమునిశ్రేష్ఠులడిగిన రోమహర్షణపుత్రుండయి యుగ్రశ్రవసుం డను పేర నొప్పి నిఖిల పురాణవ్యాఖ్యాన వైఖరీసమేతుండైన సూతుండు. ౫౪

* షడ్వర్గతిమిరతతులు = (కామక్రోధాదులైన) ఆఱింటి సముదాయమను చీఁకట్ల సమూహములు.

మ. సముఁడై యెవ్వఁడు ముక్తకర్మచయుఁడై సన్న్యాసియై యొంటిఁబో
వ మహాభీతి నొహోహో కుమార యనుచున్ వ్యాసుండు చీరంగ వృ
క్షములుం దన్మయతం బ్రతిధ్వనులు చక్కం జేసె మున్నట్టిభూ
తమయున్ మ్రొక్కెద ●బాదరాయణిఁ దపోధన్యాగ్రణిన్ ధీమణిన్.

సీ. కార్యవర్గంబును గారణసంఘంబు
నధికరించి చరించు నాత్మతత్త్వ
మధ్యాత్మ మనఁబడు నట్టియధ్యాత్మమ్ముఁ
దెలియఁజేయఁగఁజాలు దీప మగుచు
సకలవేదములకు సారాంశమై యేక
మై యసాధారణ మగుప్రభావ
రాజకంబైన పురాణమర్మంబును
గాఢసంసారాంధకారపటలి

తే. దాఁటఁ గోరెడివారికి దయ దలిర్ప
నేతపోనిధి వివరించె నేర్పడంగ
నట్టిశుకనామధేయు మహాత్మగేయు
విమలవిజ్ఞానరమణీయు వేడ్కఁ గొలుతు. ౪౬

క. నారాయణునకు నరునకు
భారతికిని మ్రొక్కి వ్యాసుపదములకు నమ
స్కారము సేసి వచింతు ను
దారగ్రంథంబు దళితతనుబంధంబున్. ౪౭

వ. అని యిట్లు దేవతాగురునమస్కారంబు సేసి యిట్లనియె మునీం
ద్రులారా నన్ను మీరలు నిఖిలలోకమంగళం బయినప్రయోజనం
బడిగితి రేమిటం గృష్ణసంప్రశ్నంబు సేయంబడు నెవ్విధంబున
నాత్మ ప్రసన్నం బగు నిర్విఘ్నయు నిర్హేతుకయు నైనహరిభక్తి
యేరూపంబునం గలుగునది పురుషులకుఁ బరమధర్మం బగు
వాసుదేవునియందుఁ బ్రయోగింపఁబడిన భక్తియోగంబు వైరాగ్య

---

● బాదరాయణిన్ = వ్యాసుని

విజ్ఞానంబులఁ బుట్టించు నారాయణకథ నెయ్యేధర్మంబులు దగులు ౧
వడ వవి నిరర్థకంబు లపవర్గపర్యంతం బయిన యీపరధర్మంబు
నకు *దృష్టశ్రుతప్రపంచార్థంబు ఫలంబు గాదు ధర్మంబునం
దవ్యభిచారి యైనయర్థంబునకుఁ గామంబు ఫలంబు గాదు
విషయభోగం బైనకామంబున కింద్రియప్రీతి ఫలంబు గా దెంత
తడవు జీవించు నంతియ కామంబునకు ఫలంబు తత్త్వజిజ్ఞాసగల
జీవునకుఁ గర్మంబులచేత నెయ్యది సుప్రసిద్ధం బది నిరర్థకంబు తత్త్వ
జిజ్ఞాస యనునది ♦ధర్మజిజ్ఞాస యగుటఁ గొందఱు ధర్మంబే తత్త్వం
బని పలుకుదురు. తత్త్వవిదులు జ్ఞానం బను పేర నద్వయం బైనయది
తత్త్వం బని యెఱుంగుదు రాతత్త్వంబు నౌపనిషదులచేత బ్రహ్మ
మనియు హైరణ్యగర్భులచేతం బరమాత్మ యనియు ర సాత్వతులచేత
భగవంతుం డనియును బలుకంబడు వేదాంతశ్రవణంబున గ్రహింపం
బడి జ్ఞానవైరాగ్యంబులతోడం గూడినభక్తిచేతఁ దత్పరులైన పెద్దలు
క్షేత్రజ్ఞుం డైన యాత్మయందుఁ బరమాత్మం బొడగందురు. ధర్మంబు
నకు భక్తి ఫలంబు పురుషులు వర్ణాశ్రమధర్మభేదంబులం జేయుధర్మం
బునకు మాధవుండు సంతోషించుటయె సిద్ధి. యేకచిత్తంబున నిత్యం
బును గోవిందు నాకర్ణింపను వర్ణింపనుం దగుఁ జక్రాయుధధ్యానం
బనుఖడ్గంబున వివేకవంతు లహంకారనిబద్ధం బైనకర్మంబుఁ ద్రుంచి
వైతురు భగవంతునియందలి శ్రద్ధయు నపవర్గదం బగు తత్కథా
శ్రవణాదులయం దత్యంతాసక్తియుఁ బుణ్యతీర్థావగాహనమహత్సే
వాదులచే సిద్ధించుకర్మనిర్మూలనహేతువు లైనకమలలోచను కథలం
దెవ్వండు రతి సేయు విననిచ్ఛగించు వాని కితరంబు లెవ్వియు రుచిఁ
బుట్టింప నేరవు. పుణ్యశ్రవణకీర్తనుం డైన కృష్ణుండు దనకథలు విను
వారిహృదయంబులందు నిలిచి శుభంబు లాచరించు నశుభంబులుఁ
బరిహరించు నశుభంబులు నష్టంబులయిన భాగవతసేవావిశేషంబున

---

* దృష్టశ్రుతప్రపంచార్థంబు = కనఁబడునట్టియు వినబడునట్టియు లోక విషయము.

♦ ధర్మజిజ్ఞాస — ధర్మమును దెలిసికొనవలె ననునిచ్ఛ.

నిశ్చలభక్తి యుదయించు భక్తిగలుగ రజస్తమోగుణప్రభూతంబు
లైన కామలోభాదులకు వశంబుగాక చిత్తంబు సత్త్వగుణంబునఁ
బ్రసన్నం బగుఁ బ్రసన్నమనస్కుండైన ముక్తసంగుండగు ముక్తసం
గుండైన నీశ్వరతత్త్వజ్ఞానంబు సిద్ధించు నీశ్వరుండు గానంబడినఁ జిజ్జ
డగ్రథనరూపంబైన యహంకారంబు భిన్నంబగు నహంకారంబు
భిన్నంబైన నసంభావనాది రూపంబు లగుసంశయంబులు విచ్ఛిన్నంబు
లగు సంశయవిచ్ఛేదంబైన ననారబ్ధఫలంబులైన కర్మంబులు నిశ్శే
షంబులై నశించుంగావున. ౭౮

క. గురుమతులు తపసు లంతః
కరణంబుల శుద్ధి సేయ ఘనతరభక్తిన్
హరియందు సమర్పింతురు
పరమానందమున *భిన్నభవబంధనులై. ౭౯

తరలము. పరమపూరుషుఁ డొక్కఁ డాఢ్యుఁడు పాలనోద్భవనాశముల్
సొరిదిఁ జేయ ముకుందపద్మజశూలిసంజ్ఞలఁ బ్రాకృత
స్ఫురితసత్త్వరజస్తమంబులఁ బొందు నందు శుభస్థితుల్
హరి చరాచరకోటి కిచ్చు ♦ననంతసత్త్వనిరూఢుఁడై ౮౦

వ. మఱియు నొక్కవిశేషంబు గలదు కాష్ఠంబుకంటె ధూమంబు
ధూమంబుకంటెఁ ద్రయీమయం బయినవహ్ని యెట్లు విశేషం
బగు నట్లు తమోగుణంబుకంటె రజోగుణంబు రజోగుణంబుకంటె
బ్రహ్మప్రకాశంబగు సత్త్వగుణంబు విశిష్టంబగుఁ దొల్లి మునులు
సత్త్వమయుం డని భగవంతు హరి నధోక్షజుం గొలిచిరి కొందఱు
సంసారమందలి మేలుకొఱకు నన్యుల సేవింతురు. మోక్షార్థులయిన
వారలు ఘోరరూపులయిన భూతపతుల విడిచి దేవతాంతరనింద
సేయక శాంతులయి నారాయణకథలయందుఁ బ్రవర్తింతురు
కొందఱు రాజసతామసులయి సిరియు నైశ్వర్యంబును బ్రజల

---

* భిన్నభవబంధనులు = జన్మబంధము నశించినవారు.

♦ అనంతసత్త్వ నిరూఢుఁడు = అపరిమితమైన సత్త్వగుణ ప్రసిద్ధికలవాఁడు.

నుం గోరి పితృభూత ౧ప్రజేశాదుల నారాధింతురు మోక్ష మిచ్చుటం జేసి నారాయణుండు సేవ్యుండు వేద యాగ యోగక్రియా జ్ఞాన తపోగతి ధర్మంబులు వాసుదేవపరంబులు నిర్గుణుం డయిన పరమేశ్వరుండుగలుగుచు లేకుండుచుఁ ద్రిగుణంబులతోడంగూడిన తనమాయచేత నింతయు సృజియించి గుణవంతుని చందంబున నిజమాయావిలసితంబు లయినగుణంబులలోఁ బ్రవేశించి విజ్ఞానవిజృంభితుండై వెలుంగు నగ్ని యొక్కరుండయ్యుఁ బెక్కు మ్రాఁకులందుఁ దేజరిల్లుచుఁ బెక్కండై తోఁచు తెఱంగున విశ్వాత్మకుండై నపురుషుం డొక్కండ తనవలనంగలిగిన నిఖిలభూతంబులందు నంతర్యామిరూపంబున దీపించు నతండు మనోభూతసూక్ష్మేంద్రియంబులతోడం గూడి గుణమయంబు లయిన భావంబులం దనచేత నిర్మితంబులైనభూతంబులందుఁ దగులువడక తద్గుణంబు లనుభవంబు సేయు లోకకర్త యైన యతండు దేవ*తిర్యఙ్మనుష్యాది జాతులందు లీల నవతరించి లోకంబుల రక్షించు నని మఱియు సూతుం డిట్లనియె. ౬౧

సీ. మహదహంకార తన్మాత్రసంయుక్తుఁడై
 చారుషోడశకళాసహితుఁ డగుచుఁ
బంచమహాభూత భాసితుండై శుద్ధ
 సత్త్వుఁడై సర్వాతిశాయి యగుచుఁ
జర ణోరు భుజ ముఖ శ్రవ ణాక్షి నాసా శి
 రములు నానాసహస్రములు వెలుఁగ
నంబర ♦కేయూర హార కుండల కిరీ
 టాదులు పెక్కువే లమరు చుండఁ

తే. ౨బుపురుషరూపంబు ధరియించి పరుఁ డనంతుఁ
డఖిలభువనైకవర్తనయత్న మమర

౧ "ప్రేతపిశాచాదుల" అను పాఠము కలదు. "పితృభూతప్రజేశాదీన్" అని
౨ "బరమపురుషాకృతిధరించి" యను పాఠము గలదు. "జగృహే పౌరుషం రూపం" అని.

* తిర్యక్కులు = పశుపక్ష్యాదులు, ♦ కేయూరములు = భుజకీర్తులు.

మానితోదారజలరాశి మధ్యమునను
యోగనిద్రావిలాసియై యొప్పుచుండు.

— భగవంతుని యేకవింశత్యవతారములు —

వ. అది సకలావతారంబులకు మొదలిగని యైన శ్రీమన్నారాయణ దేవుని విరాజమానం బయిన దివ్యరూపంబు దానిం బరమయోగీంద్రులు దర్శింతు రప్పరమేశ్వరు నాభికమలంబువలన సృష్టికర్తల లోన శ్రేష్ఠుండైన బ్రహ్మ యుదయించె నతని యవయవస్థానంబుల యందు లోకవిస్తారంబులు గల్పింపంబడియె మొదల నద్దేవుండు *కౌమారాఖ్యసర్గంబు నాశ్రయించి బ్రాహ్మణ్యుండై దుశ్చరంబైన బ్రహ్మచర్యంబు చరియించె రెండవమాఱు జగజ్జననంబుకొఱకు రసాతలగతయయినభూమి నెత్తుచు యజ్ఞేశుండయి వరాహదేహంబు దాల్చె మూఁడవ తోయంబున నారదుండను దేవర్షియై కర్మనిర్మోచకంబైన వైష్ణవతంత్రంబు సెప్పె నాలవపరి ధర్మభార్యా సర్గంబునందు నరనారాయణాభిధానుండై దుశ్చరంబైన తపంబు సేసెఁ బంచమావతారంబునం గపిలుం డనుసిద్ధేశుండయి యాసురి యను బ్రాహ్మణునకుఁ •దత్త్వగ్రామనిర్ణయంబు గల సాంఖ్యంబు నుపదేశించె నాఱవశరీరంబున ననసూయాదేవియందు నత్రిమహా మునికిఁ గుమారుండై యలర్కునికిఁ బ్రహ్లాదముఖ్యులకు నాత్మవిద్యఁ దెలిపె నేడవ విగ్రహంబున నాకూతియందు రుచికి జన్మించి యజ్ఞుండనఁ బ్రకాశమానుండై యామాది దేవతల తోడంగూడ స్వాయంభువమన్వంతరంబు రక్షించె నష్టమమూర్తిని మేరుదేవియందు నాభికి జన్మించి యురుక్రముం డనం బ్రసిద్ధుండై విద్వజ్జనులకుఁ బరమహంసమార్గంబుం బ్రకటించె ఋషుల చేతఁ గోరంబడి తొమ్మిదవ జన్మంబునఁ బృథుచక్రవర్తియై

---

* కౌమారాఖ్యసర్గంబు = కౌమారమను పేరుగల సృష్టి.

• తత్త్వగ్రామ నిర్ణయంబు = తత్త్వసముదాయనిర్దేశము.

భూమిని ధేనువుం జేసి సమస్తవస్తువులం బిదికెఁ జాక్షుషమన్వంతరసంప్లవంబున దశమంబయిన మీనావతారంబు నొంది మహీరూపం బగునావ నెక్కించి వైవస్వతమనువు నుద్ధరించె సముద్రమథనకాలంబునం బదునొకండవమాఱు *కమఠాకృతిని మందరాచలంబుఁ దన♦పృష్ఠకర్పరంబున నేర్పరియై నిలిపె ధన్వంతరి యనఁ బండ్రెండవతనువున సురాసురమథ్యమానక్షీరపాథోధిమధ్యభాగంబున నమృతకలశహస్తుండై వెడలెఁ బదుమూఁడవది యయిన మోహినీ వేషంబున సురాసురుల మోహితులం జేసి సురల నమృతాహారులం గావించెఁ బదునాలుగవది యైన నరసింహారూపంబునం గనకకశిపుని సంహరించెఁ బదునేనవది యైన కపట వామనావతారంబున బలిని బదత్రయంబు యాచించి మూఁడు లోకంబుల నాక్రమించెఁ బదునాఱవది యైన భార్గవరామాకృతిని గుపితభావంబుఁ దాల్చి బ్రాహ్మణద్రోహు లయిన రాజుల నిరువదియొక్కమాఱు వధియించి భూమి నిఃక్షత్త్రంబు గావించెఁ బదునేడవది యైన వ్యాస‡గాత్రంబున నల్పమతు లయిన పురుషులం గరుణించి వేదవృక్షంబునకు శాఖ లేర్పఱిచెఁ బదునెనిమిదవ దైన రామాభిధానంబున దేవకార్యార్థంబు రాజత్వంబునొంది సముద్రనిగ్రహాదిపరాక్రమంబు లాచరించె నేకోనవింశతి వింశతితమంబులైన రామకృష్ణరూపంబులచే యదువంశంబునందు సంభవించి విశ్వంభరాభారంబు నివారించె నేకవింశతితమం బైన బుద్ధనామధేయంబునం గలియుగాద్యవసరంబున రాక్షససమ్మోహనంబుకొఱకు మధ్యగయాప్రదేశంబున జినసుతుండయి తేజరిల్లు యుగసంధియందు వసుంధరాధీశులు చోరప్రాయులై సంచరింప విష్ణుయశుం డను విప్రునికిఁ గల్కి యనుపేర నుద్భవింపం గలం డని యిట్లనియె. ౬౩

మ. సరసిం బాసినఁ బాఱుకాలువలయోజన్ విష్ణువం దైన శ్రీ
కరనానాప్రకటావతారము లసంఖ్యాతంబు లుర్వీశులున్

---

* క్రమఠాకృతిన్ = తాఁబేటిరూపమున

♦ పృష్ఠకర్పరంబున = వెన్ను చిప్పయందు ‡ గాత్రము = శరీరము

సురలన్ బ్రాహ్మణసంయమీంద్రులు మహర్షుల్ విష్ణునంశాంశజుల్
హరి కృష్ణుండు బలానుజన్ముఁ డెడ లే దావిష్ణుఁడౌ నేర్పడన్ ౬౮

క. భగవంతుం డగు విష్ణుఁడు
జగముల కెవ్వేళ రాక్షసవ్యథ గలుగుం
దగ నవ్వేళలఁ దడయక
యుగయుగమునఁ బుట్టి కాచు నుద్యల్లీలన్. ౬౯

ఆ. అతిరహస్యమైన హరిజన్మకథనంబు । మనుజుఁ డెవ్వఁ డేని మాపు రేపుఁ
జాల భక్తితోడఁ జదివిన సంసార । దుఃఖరాశిఁ బాసి తొలఁగి పోవు.

వ. వినుం డరూపుం డయి చిదాత్మకుం డయి పరగు జీవునికిఁ బరమేశ్వరు మాయాగుణంబులైన మహదాదిరూపంబులచేత నాత్మస్థానంబుగా విరచితంబైన స్థూలశరీరంబు గగనంబునందుఁ బవనాశ్రిత మేఘసమూహంబును గాలియందుఁ బార్థివధూళిధూసరత్వంబును నేరీతి నారీతి ద్రష్ట యగు నాత్మయందు దృశ్యత్వంబై బుద్ధిమంతులు గానివారిచేత నారోపింపంబడు నీస్థూలరూపంబుకంటె నదృష్టగుణంబయి యశ్రుతంబైనవస్తు వగుటం జేసి వ్యక్తంబుగాక సూక్ష్మంబై కరచరణాదులు లేక జీవునికి నొండొకరూపంబు విరచితంబై యుండు సూక్ష్ముండయిన జీవునివలన నుత్క్రాంతిగమనాగమనంబులం బునర్జన్మంబు దోఁచు నెప్పు డీస్థూలసూక్ష్మరూపంబులు రెండు స్వరూపసమ్యగ్జ్ఞానంబునం *బ్రతిషేధింపంబడుననియును నవిద్యం జేసి యాత్మను గల్పింపంబడు ననియుం దెలియునప్పుడు జీవుండు బ్రహ్మదర్శనంబున కధికారియగు దర్శనంబన జ్ఞానైకస్వరూపంబు విశారదుండైన యీశ్వరునిదై క్రీడించుచు నవిద్య యనంబడుచున్న మాయ ♦యుపరతయై యెప్పుడు దా నవిద్యారూపంబునం బరిణత యగు నప్పుడు జీవోపాధి యయిన స్థూలసూక్ష్మరూపంబు దహించి జీవుండు గాష్ఠంబు లేక

---

* ప్రతిషేధింపఁబడు — అడ్డగింపఁబడు

♦ ఉపరత — ఉడిగినది

తేజరిల్లు వహ్నిచందంబునం దాన యుపరతుండయి బ్రహ్మ
స్వరూపంబునం బొంది పరమానందంబున విరాజమానుం డగు నిట్లు
తత్త్వజ్ఞులు సెప్పుదురని సూతుం డిట్లనియె. ౬౭

చ. జననము లేక కర్మములజాడలఁ బోక సమస్తచిత్తవ
ర్తనుఁ డగుచక్రికిం గవు లుదారపదంబుల జన్మకర్మముల్
వినుతులు సేయు చుందురు వేదరహస్యములందు నెందుఁ జూ
చిన మఱి లేవు జీవునికిఁ జెప్పినకైవడి జన్మకర్మముల్. ౬౮

మ. భువనశ్రేణి నమోఘలీలుఁ డగుచుం బుట్టించు రక్షించు నం
తవిధిం జేయు మునుంగఁ డందు బహుభూతవ్రాతమం*దాత్మతం
త్రవిహారస్థితుఁడై షడింద్రియసమస్తప్రీతియున్ దవ్వులన్
దివిభంగిం గొనుఁ జిక్కఁ డింద్రియములం ద్రిప్పున్ నిబంధించుచున్.

చ. జగదధినాథుఁడైన హరి సంతతలీలల నామరూపముల్
దగిలి మనోవచోగతులఁ దార్కికచాతురి యెంత గల్గినన్
మిగిలి కుతర్కవాది దగ మేరలు చేసి యెఱుంగ నేర్చునే
యగణితనర్తన♦క్రమము నజ్ఞుఁ డెఱింగి నుతింప నోపునే. ౭౦

ఉ. ఇంచుక మాయ లేక మది నెప్పుడుఁ బాయనిభక్తితోడ వ
ర్తించుచు నెవ్వఁడేని హరిదివ్యపదాంబుజగంధరాశి సే
వించు నతం డెఱుంగు నరవిందభవాదుల కైన దుర్లభో
దంచితమైనయాహరియుదారమహాద్భుతకర్మమార్గముల్. ౭౧

మ. హరిపాదద్వయభక్తి మీవలన నిట్లారూఢ మై యుండునే
తిరుగం బాఱదు చిత్తవృత్తి హరిపై దీపించి మీలోపలన్
ధరణీదేవతలార మీరలు మహాధన్యుల్ సమస్తజ్ఞులున్
హరిచింతన్ మిముఁ జెంద వెన్నఁడును ‡జన్మాంతవ్యథాయోగముల్.

---

* ఆత్మతంత్రము = ఆత్మవశము

♦ నర్తనము = నాట్యము

† జన్మాంతవ్యథాయోగముల్ = జీవితాంతమందలి కష్టములతోడి కూడికలు; మరణకాలవేదనల కూడికలు

— ♦ శ్రీమహాభాగవతరచనాది వృత్తాంతము ♦ —

సీ. పుణ్యకీర్తనుఁ డైనభువనేశుచరితంబు
బ్రహ్మతుల్యం బైన భాగవతము
సకలపురాణరాజము దొల్లి లోకభ
ద్రముగ ధన్యముగ మోదముగఁ బ్రీతి
భగవంతుఁ డగువ్యాసభట్టారకుఁ డొనర్చి
శుకుఁ డనియెడు తనసుతునిచేతఁ
జదివించె నింతయు సకలవేదేతిహా
సములలోపలనెల్ల సార మైన
ఆ. యీపురాణ మెల్ల నెలమి నాశుకయోగి
గంగనడుమ వచ్చి ఘనవిరక్తి
యొదవి మునులతోడ *నుపవిష్టుఁ డగుపరీ
క్షిన్నరేంద్రుఁ డడుగఁ జెప్పె వినుఁడు. ౨౩

వ. కృష్ణుండు ధర్మజ్ఞానాదులతోడం దనలోకంబునకుం జనినపిమ్మటం గలికాలదోషాంధకారంబున నష్టదర్శను లయిన జనులకు నిప్పుడీపురాణంబు కమలబంధునిభంగి నున్నది నాఁ డందు భూరితేజుం డయి కీర్తించుచున్నవిప్రర్షి వలన నేఁ బఠించిన క్రమంబున నా మదికి గోచరించినంతయు వినిపించెద ననిన సూతునకు మునివరుం డైన శౌనకుం డిట్లనియె. ౨౪

శా. సూతా యేయుగవేళ నేమిటికి నెచ్చోటన్ మునిశ్రేష్ఠు నే
శ్రోతల్ గోరిరి యేమిహేతువునకై శోధించి లోకైకవి
ఖ్యాతిన్ వ్యాసుఁడు మున్ను భాగవతముం గల్పించెఁ దత్పుత్రుఁ డే
ప్రీతిన్ రాజున కీపురాణకథఁ జెప్పెం జెప్పవే యంతయున్. ౨౫

వ. బుధేంద్రా వ్యాసపుత్త్రుం డైనశుకుం డనుమహాయోగి సమదర్శనుం డేకాంతమతి మాయాశయనంబువలనం దెలిసినవాఁడు గూఢుండును మూఢునిక్రియనుండు ♦నిరస్తభేదుం డదియునుం గాక. ౨౬

---

* ఉపవిష్టుఁడు = కూర్చున్నవాఁడు.
♦ నిరస్తభేదుండు = దుఃఖములు నశించినవాఁడు.

తరలము. శుకుఁడు గోఁచియు లేక పైఁ జనఁ జూచి తోయములందు ల
జ్జకుఁ జలించక చీర లొల్లక చల్లులాడెడి దేవక
న్యకలు హా శుక యంచు వెన్కఁ జనంగ వ్యాసునిఁ జూచి *యం
శుకములన్ ధరియించి సిగ్గున స్రుక్కి రందఱు ధీనిధీ. ౨౨

వ. మఱియు నగ్నుండుఁ దరుణుండు నైన చను తనకొడుకుం గని వస్త్ర పరిధానం బొనరింపక వస్త్రధారియు వృద్ధుండును నైన తనుం జూచి చేలంబులు ధరియించు దేవరమణులం గని వ్యాసుండు గారణం బడిగిన వారలు నీపుత్రుండు స్త్రీపురుషుల నెడు భేదదృష్టి లేక యుండు మఱియు నతండు నిర్వికల్పుండు గాన నీకు నతనికి మహాంతరంబు గలదని రట్టిశుకుండు కురుజాంగలదేశంబులు సొచ్చి హస్తినాపురంబునఁ బౌరజనంబులచే నెట్లు జ్ఞాతుండయ్యె మఱియు నున్మత్తునిక్రియ మూఁగతెఱంగున జడునిభంగి నుండు నమ్మహాయోగికి రాజర్షియైన పరీక్షిన్మహారాజుతోడ సంవాదం బెట్లు సిద్ధించె బహుకాలకథనీయం బయిన శ్రీభాగవతనిగమవ్యాఖ్యానం బేరీతిసాగె నయ్యోగిముఖ్యుండు గృహస్థుల గృహంబుల గోవును బిదికినయంతతడవు గాని నిలువంబడం డతండు♦గోదోహనమాత్రకాలంబు సంచరించిన స్థలంబులు తీర్థంబు లగునందురు పెద్దకాలం బేకప్రదేశంబున నెట్లుండె భాగవతోత్తముం డైన జనపాలుని జన్మకర్మంబు లేప్రకారంబు వివరింపుము. ౨౩

సీ. పాండవవంశంబు బలము మానంబును
వర్ధిల్లఁగడిమి నెవ్వాఁడు మనిచెఁ
బరిపంథిరాజులు భర్మాదిధనముల
నర్పించి రెవ్వనియంఘ్రియుగముఁ
గుంభజకర్ణాదికురుభటవ్యూహంబు
సొచ్చి చెండాడె నేశూరుతండ్రి
గాంగేయసైనికాక్రాంతగోవర్గంబు
విడిపించి తెచ్చె నేవీరుతాత

* అంశుకము = పైవస్త్రము.
♦ గోదోహనమాత్రకాలము = గోవుపాలు పితుకునంత సేపు.

ఆ. యట్టిగాఢకీర్తియగు పరీక్షిన్మహా
రాజు విడువరాని రాజ్యలక్ష్మిఁ
బరిహరించి గంగఁ *బ్రాయోపవిష్టుఁడై
యసువు లుండ నేల యడఁగి యుండె. ౭౯

ఉ. ఉత్తమకీర్తు లైనమనుజోత్తము లాత్మహితంబు లెన్నఁడుం
జిత్తములందుఁ గోరరు హాసించియు లోకుల కెల్ల నర్థసం
పత్తియు భూతియున్ సుఖము భద్రముఁ గోరుదు రన్యరక్షణా
త్యుత్తమ మైనమేను విభుఁ డూరక యేల విరక్తిఁ బాసెనో. ౮౦

క. సారముల నెల్ల నెఱుఁగుదు
పారగుఁడవు భాషలందు బహువిధకథనో
దారుఁడవు మాకు సర్వముఁ
బారము ముట్టంగఁ దెలియఁ బలుకు మహాత్మా. ౮౧

—♦ వ్యాసుండు వ్యాకులచిత్తుండై చింతించుట. ♦—

వ. అని యడిగిన శౌనకాదిమునిశ్రేష్ఠులకు సూతుం డిట్లనియెఁ దృతీయం బైన ద్వాపరయుగంబు దీఱుసమయంబున నుపరిచరవసువు వీర్యంబున జన్మించి వాసవినాఁ దగుసత్యవతియందుఁ బరాశరునికి హరికళంజేసి విజ్ఞాని యయిన వేదవ్యాసుండు జన్మించి యొక్కనాఁడు బదరికాశ్రమంబున సరస్వతీజలంబుల స్నానాదికర్మంబులం దీర్చి శుచియై పరులు లేనిచోట నొంటిఁ గూర్చుండి సూర్యోదయవేళ నతీతానాగతవర్తమానజ్ఞుండయిన యాఋషి వ్యక్తంబు గాని వేగంబు గల కాలంబునం జేసి యుగధర్మంబులకు భువి సాంకర్యంబు వొందు యుగయుగంబుల భౌతికశరీరంబులకు శక్తి సన్నం బగుఁ బురుషులు నిస్సత్త్వులు ధైర్యశూన్యులు మందప్రజ్ఞు లల్పాయువులు దుర్బలులు నయ్యెద రని తనదివ్యదృష్టిం జూచి సర్వవర్ణాశ్రమంబులకు హితంబు సేయం దలంచి నలువురు హోతలచేత ననుష్ఠింపఁదగి ప్రజలకు శుద్ధి

* ప్రాయోపవిష్టుండు = ప్రాయోపవేశదీక్ష నొందినవాడు — ఆహారాదులను మాని భగవద్ధ్యానరతుఁడై మరణమునకు సిద్ధపడినవాఁడు.

కరంబులయిన వైదికకర్మంబులగు యజ్ఞంబు లెడతెగకుండుకొఱకు నేకంబైన వేదంబు ఋగ్యజుస్సామాథర్వణంబులను నాలుగు నామంబుల విభాగించి యితిహాస పురాణంబులన్నియుఁ బంచమవేదం బని పల్కెనందు-

సీ. పైలుండు ఋగ్వేదపఠనంబు దొరఁకొనె
సామంబు జైమిని చదువుచుండె
యజువు వైశంపాయనాఖ్యుండు గైకొనెఁ
దుది నథర్వము సుమంతుఁడు పఠించె
సకలపురాణేతిహాసముల్ మాతండ్రి
రోమహర్షణుఁడు నిరూఢిఁ దాల్చెఁ
దమతమవేద మార్తపసులు భాగించి
శిష్యసంఘములకుఁ జెప్పి రంత

తే. శిష్యు లెల్లను నాత్మీయశిష్యజనుల
కంత బహుమార్గములఁదుర్చిచి యనుమతింపఁ
బెక్కు శాఖలుఁగలిగి యీపృథివిలోన
నిగమ మొప్పారె భూసురనివహమందు. ౮౬

వ. ఇట్లు * మేధావిహీను లయినపురుషులచేత నట్టివేదంబులు ధరియింపఁబడుచున్నవి. మఱియు దీనవత్సలుం డయినవ్యాసుండు స్త్రీశూద్రులకుఁ ద్విజబంధువులకు వేదంబులు వినఁదగినవిగాఁవు, గావున మూఢులకెల్ల మే లగునని భారతాఖ్యానంబు సేసియు నమ్ముని భూతహితంబునందుఁ దనహృదయంబు సంతసింపకున్న సరస్వతీతటంబున నొంటి యుండి హేతువు వితర్కించుచుఁ దనలో నిట్లనియె. ౮౭

సీ. వ్రతధారినై వేదవహ్నిగురుశ్రేణి
మన్నించితి విహితకర్మములఁ గొఱఁత

---

* మేధావిహీనులు = ధారణాశక్తియుక్తమైన బుద్ధిలేనివారు.

వడకుండ నడపుదు భారతమిషమునఁ
బలికితి వేదార్థభావమెల్ల
మునుకొని స్త్రీశూద్రముఖ్య ధర్మములందుఁ
దెలిపితి నే*జెల్ల దీనఁజేసి
యాత్మసంతస మంద దాత్మలో నీశుండు
సంతసింపక యున్న జాడదోఁచె
ఆ. హరికి యోగివరుల కభిలషితంబైన
భాగవతవిధంబుఁ బలుకనైతి
మోసమయ్యెఁ దెలివి*మొనయదు మఱచితి
ననుచు వగచుచున్న యవసరమున ౮౫

—• వ్యాసునికడకు నారదుండు వచ్చుట. •—

సీ. తనచేతివల్లకీ తంత్రీచయంబున
సతతనారాయణశబ్ద మొప్ప
నాననసంభూత హరిగీతరవసుధా
ధారల యోగీంద్రతతులు సొక్కఁ
గపిలజటాభార కాంతిపుంజంబుల
దిశలు ప్రభాతదీధితి వహింపఁ
దమలగ్న తులసికాదామగంధంబులు
గగనాంతరాళంబు గప్పికొనఁగ
ఆ. వచ్చె మింటనుండి వాసవీనందను
కడకు మాటలాడఁ గడఁకతోడ
భద్రవిమలకీర్తి పారగుఁ డారూఢ
నయవిశారదుఁడు నారదుండు. ౮౬

క. కనియెన్ నారదుఁడంతన్, వినయైకవిలాసు నిగమవిభజనవిద్యా
జనితోల్లాసున్ భవదుఃఖ నిరాసున్ గురుమనోవికాసున్ వ్యాసున్.

---

జెల్ల = అయ్యో. * మొనయదు = పూనిక గానుండదు.

వ. ఇట్లు నిజాశ్రమంబునకు వచ్చిననారదు నెఱింగి లేచి వ్యాసుండు వివిధ క్రియంబులం బూజించిన నతండు లేనగవు నెగడెడి మొగంబుతోడ *విపంచికాతంత్రి వ్రేల మీటుచు నిట్లనియె. ౮౮

ఉ. †ధాతవు ♦భారతశ్రుతివిధాతవు వేదపదార్థజాలవి
జ్ఞాతవు కామముఖ్యరిపుషట్కవిజేతవు బ్రహ్మతత్త్వని
ర్ణేతవు యోగినేతవు వినీతుఁడ వీవు చలించి చెల్లరే
కాతరుకైవడిన్ వగవఁ గారణ మేమి పరాశరాత్మజా. ౮౯

వ. అనినఁ బారాశర్యుం డిట్లనియె. ౯౦

క. పుట్టితి వజుతనువునఁ జే, పట్టితివి పురాణపురుషుభజనము పదముల్
మెట్టితివి దిక్కులం దుది, ముట్టితివి మహాప్రబోధమున మునినాథా.

వ. అదియునుంగాక నీవు సూర్యునిభంగి మూఁడులోకంబులం జరింతు. వాయువు పగిది నఖిలజనులలోనన్ మెలంగుదువు. సర్వజ్ఞుండ వగుటం జేసి. ౯౨

క. నీ కెఱుఁగ రానిధర్మము, లోకములను లేదు బహువిలోకివి నీ వీ
నాకొఱఁత యెట్టిదంతయు, నాకున్ వివరింపవయ్య నారద కరుణన్. ౯౩

వ. అనిన నారదుం డిట్లనియె. ౯౪

ఉ. అంచితమైనధర్మచయ మంతయుఁ జెప్పితి వందులోన నిం
చించుక గాని విష్ణుకథ లేర్పడఁ జెప్పవు ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁ గాక నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరిఁ గోరి నుతింపమి నార్యపూజితా. ౯౫

మ. హరినామస్తుతి సేయుకావ్యము సువర్ణాంభోజహంసావళీ
సురుచిభ్రాజితమైనమానససరస్స్ఫూర్తిన్ వెలుంగొందు శ్రీ
హరినామస్తుతి లేనికావ్యము విచిత్రార్థాన్వితం బయ్యు శ్రీ
కరమై యుండ దయోగ్యదుర్మలినవత్‡ర్త్రాకోల గర్తాకృతిన్. ౯౬

* విపంచికాతంత్రి=వీణయొక్కతీఁగ. † ధాతవు = బ్రహ్మస్వరూపుఁడవు.
♦ భారతశ్రుతి విధాతవు = భారతమనెడి (పంచమ) వేదమును నిర్మించినాఁడవు.
‡ కాకోలగర్తము = పాముబిలము.

మ. అపశబ్దంబులఁ గూడియుం హరిచరిత్రాలాపముల్ సర్వపా
పపరిత్యాగము సేయుఁ గావున హరి న్భావించుచుం బాడుచుం
జపముల్ సేయుచు వీనులం వినుచు నశ్రాంతంబుఁ గీర్తించుచుం
దపసుల్ సాధులు ధన్యు లౌదురు గదా తత్త్వజ్ఞ చింతింపుమా. ౯౭

వ. మునీంద్రా నిర్గతకర్మంబై నిరుపాధికంబైన జ్ఞానంబు హరిభక్తి లేకున్న విశేషంబుగ శోభితంబు గాదు. ఫలంబు గోరక కర్మం బీశ్వరునకు సమర్పణంబు సేయకున్న నది ప్రశస్తంబై యుండదు. భక్తిహీనంబు లయిన జ్ఞానవాచాకర్మకౌశలంబులు నిరర్థకంబులు గావున మహానుభావుండవు, యథార్థదర్శనుండవు, సకల దిగంతధవళకీర్తివి, సత్యరతుండవు ధృతవ్రతుండవు నగు నీవు నిఖిలబంధమోచనంబుకొఱకు వాసుదేవుని లీలా విశేషంబులు భక్తితోడ వర్ణింపుము హరివర్ణనంబు సేయక ప్రకారాంతరంబున నర్థాంతరంబులు వివక్షించి తద్వివక్షాకృతరూపనామంబులం జేసి ‡ పృథగ్దర్శనుండైనవాని మతి పెనుగాలిచేతం ద్రిప్పంబడి తప్పంజను నావచందంబున నెలవు సేర నేరదు, కామ్యకర్మంబులందు రాగంబుగల ప్రాకృతజనులకు నియమించిన ధర్మంబులు సెప్పి శాసకుండవగు నీ నడవడి దగ దది యెట్టులనిన వార లదియె ధర్మంబని జుగుప్సితంబు లగు కామ్యకర్మంబులు సేయుచుఁ దత్త్వజ్ఞానంబు మఱతురు గావున బుద్ధిమోహంబు జనియింపక తత్త్వప్రదుండవై వ్యథావియోగంబు సేయుమని మఱియు నిట్లనియె. ౯౮

చ. ఎఱిఁగెడువాఁడు కర్మచయ మెల్లను మాని హరిస్వరూపముం
దెఱియ నెఱుంగుఁ దాను మదినేరుపుఁ జూపు గుణానురక్తుఁడై
* తెఱకువ లేక కుమ్మరుచు దేహధనాద్యభిమానయుక్తుఁడై
యెఱుఁగనివానికిం దెలియ నీశ్వరలీల మునీంద్ర చెప్పవా. ౯౯

చ. తనకులధర్మముం విడిచి దానవవైరి పదారవిందముల్
పనివడి సేవసేసి † పరిపాకము వొందక యెవ్వఁడేనిఁ జ

‡ పృథగ్దర్శనుండు=(భగవంతునికంటె) ఇతరమైన వస్తువునందు దృష్టిగలవాఁడు.
♦ జుగుప్సితంబులు=రోఁతగలవి * తెఱకువ=వివేకము. † పరిపాకము=సిద్ధినొందుదశ.

చ్చిన మఱుమేన నైన నది సిద్ధి వహించుఁ దదీయసేవఁ బా
సినఁ గులధర్మగౌరవము సిద్ధి వహించున యెన్ని మేనులన్. ౧౦౦

వ. అది గావున నెఱుకఁగలవాఁడు బ్రహ్మ‡స్థావర పర్యంతంబు దిరుగుచున్న జీవులకు నెయ్యది పొందరా దట్టిమేలు సిద్ధించుకొఱకు హరిసేవకుఁ బ్రయత్నంబు సేయందగు కాలక్రమంబున దుఃఖంబులట్ల సుఖంబులు ప్రాకృతకర్మాధీనంబులై సిద్ధించు దానంజేసి హరిసేవ విడువందగదు. హరిసేవకుండగువాఁడు నీచజన్మంబు నొందియు నన్యునిక్రియ సంసారంబునం జిక్కఁడు, క్రమ్మఱ హరిచరణస్మరణంబుఁ జేయుచు భక్తిరసవశీకృతుండయి విడువ నిచ్చగింపండు మఱియును.

సీ. విష్ణుండు విశ్వంబు విష్ణునికంటెను
వేఱేమియును లేదు విశ్వమునకు
భవవృద్ధిలయము లా పరమేశుచే నగు
నీవెఱుంగుదు గాదె నీముఖమున
నెఱిఁగింపఁబడ్డది యేకదేశమున నీ
భువనభద్రమునకై పుట్టినట్టి
హరికళాజాతుండ వని విచారింపుమా
క్రమముగా హరిపరాక్రమము లెల్ల
వినుతిసేయు మీవు ♦ వినికియుఁ జదువును
దాన మతులనయముఁ దపము ధృతియుఁ
గలిమి కెల్ల ఫలముగాదె పుణ్యశ్లోకుఁ
గమలనాభుఁ బొగడఁ గలిగెనేని. ౧౦౨

—♦ నారదుని పూర్వజన్మ వృత్తాంతము ♦—

వ. మహాత్మా నేను బూర్వకల్పంబునం దొల్లింటిజన్మంబున వేదవాదుల యింటి దాసికిఁబుట్టి పిన్ననాఁడు వారలచేఁ బలపంబడి యొక్క వాన

‡స్థావరము=కదలనిది (అచరము). ♦వినికి=శ్రుతము=ధర్మవిశేషము లను వినుట.

కాలంబునఁ జాతుర్మాస్యంబున నేకస్థలనివాసంబు సేయ నిశ్చయించిన యోగిజనులకుం బరిచర్య సేయుచు. ౧౦౩

క. *ఓటమితో నెల్లప్పుడు
బాటవమునఁ బనులు సేసి బాలురతో నే
యాటలకుఁ బోక యొక♦జం
జాటంబును లేక భక్తి సలుపుదు ననఘా. ౧౦౪

క. మంగళ మనుచును వారల
యెంగిలి భక్షింతు వాన కెండకు నోర్తున్
ముంగల నిలుతును నియతిని
వెంగలిక్రియఁ జనుదు నురువివేకముతోడన్. ౧౦౫

వ. ఇట్లేను వర్షాకాల శరత్కాలంబులు సేవించితి, వారును నాయందుఁ గృపచేసి రంత. ౧౦౬

శా. వారల్ కృష్ణుచరిత్రముల్ సదువఁగా వర్ణింపఁగాఁ బాడఁగా
నారావంబు సుధారసప్రతిమమై యశ్రాంతమున్ వీనులం
దోరంబై పరిపూర్ణమైన మదిసంతోషించి నే సంతతన్
బ్రారంభించితి విష్ణుసేవ కితరప్రారంభదూరుండనై. ౧౦౭

వ. ఇట్లు హరిసేవారతిం జేసి ప్రపంచాతీతుండును బ్రహ్మరూపకుండు నయిన నాయందు స్థూలసూక్ష్మంబైన యీశరీరంబు నిజమాయాకల్పితం బని యెఱింగితి నమ్మహాత్ములగు యోగిజనుల మూలంబున రజస్తమోగుణపరిహరణీయమయిన భక్తి సంభవించె. అంతం జాతుర్మాస్యంబు నిండిన నయ్యోగిజనులు యాత్రసేయువారలై రివ్విధంబున. ౧౦౮

మ॥ అపచారంబులు లేక నిత్యపరిచర్యాభక్తియుక్తుండనై
చపలత్వంబును మాని నేఁ గొలువఁగా సంప్రీతులై వారు ని
ష్కపటత్వంబున దీనవత్సలతతోఁ గారుణ్యసంయుక్తులై
యుపదేశించిరి నాకు నీశ్వరరహస్యోదారవిజ్ఞానమున్. ౧౦౯

---

* ఓటమి=భయము. ♦ జంజాటంబు=తగులము.

వ. ఏనును వారియుపదేశంబున వాసుదేవుని మాయానుభావంబుఁ దెలిసితి. ఈశ్వరునియందు సమర్పితం బయినకర్మంబు తాపత్రయంబు మాన్ప నౌషధంబగు, నేద్రవ్యంబువలన నేరోగంబు జనియించె నాద్రవ్యం బారోగంబు మానుప నేరదు, ద్రవ్యాంతరంబులచేతనైన చికిత్సితంబు మానుప నోపు. ఇవ్విధంబునఁ గర్మంబులు సంసార హేతుకంబు లయ్యు నీశ్వరార్పితంబులై తామతమ్ముఁ జెఱుపుకొన నోపియుండు. ఈశ్వరునియందుఁ జేయంబడు కర్మంబు విజ్ఞాన హేతుకంబై యీశ్వర సంతోషణంబును భక్తియోగంబునుం బుట్టించు. ఈశ్వరశిక్షంజేసి కర్మంబులు సేయువారలు కృష్ణగుణనామవర్ణన స్మరణంబులు సేయుదురు. ప్రణవపూర్వకంబులుగా వాసుదేవ ప్రద్యుమ్న సంకర్షణానిరుద్ధ మూర్తి నామంబులు నాలుగు భక్తిం బలికి నమస్కారంబు సేసి మంత్రమూర్తియు మూర్తిశూన్యుండు నయిన యజ్ఞపురుషుం బూజించుపురుషుండు సమ్యగ్దర్శనుం డగు.

క ఏనివ్విధమునఁ జేయఁగ, దానవకులవైరి నాకుఁ దనయందలి వి
జ్ఞానమునిచ్చెనుమదను, స్థానమునత డెఱుఁగు నీవు సలుపుము దీనిన్.

క. మునికులములోన మిక్కిలి, *వినుకులుగలవాఁడ వీవు విభుకీర్తులు నీ
వనుదినముఁబొగడవినియెడి,జనములకుఁ దుఃఖమెల్ల శాంతింబొందున్.

వ. ఇట్లు నారదుజన్మకర్మంబులు విని క్రమ్మఱ వ్యాసుం డిట్లనియె.

మ. విను మాభిక్షులు నీకు నిట్లు కరుణ విజ్ఞానముం దెల్పి పో
యిన బాల్యంబున వృద్ధభావమున నీ కేరీతిసంచారముల్
సనె నీ కిప్పుడు పూర్వకల్పమతి యే జాడం బ్రదీపించెఁ ద
త్తనువుం బాసినచంద మెట్లు చెపుమా దాసీసుతత్వంబుతోన్.

వ. అని యిట్లు వ్యాసుం డడిగిన నారదుం డిట్లనియె దాసీపుత్త్రుండ నయిన యేను భిక్షులవలన హరివిజ్ఞానంబు గలిగి యున్నంత నొక్క

సీ. మమ్మునేలినవారి మందిరంబునఁగల
పనులెల్లఁ గ్రమమున భక్తిఁజేసి

---

* ధర్మములు విన్నవాఁడవు.

తనపరాధీనతఁ దలఁపదు సొలసితి
నలసితి నాఁకొంటి నంచు వచ్చి
మాపును రేపును మాతల్లి మోహంబు
సొంపార ముద్దాడు *జుంచుదువ్వు
దేహంబు నివురు మోదించు కౌఁగిటఁ జేర్చు
†నర్మిలి నన్నిట్టు లరసి మనుప

ఆ. నేను విడిచి పోక యింటనుండితి నయ్య,
మోహిఁగాక యెఱుక మోసపోక
మాఱుచింత లేక మానినై యేనేండ్ల
వాఁడ నగుచుఁ గొన్ని వాసరములు. ౧౧౬

క. సదనము వెలువడి తెరువునఁ,
బెదరక మాతల్లి రాత్రిఁ జీఁకటివేళన్
†మొదవుం బిదుకఁగ నొక♦ఫణి,
పదభాగముఁ గఱచెఁ ద్రొక్కఁబడి మునినాథా. ౧౧౭

క. నీలాయతభోగఫణ,‡ వ్యాళానలవిష మహోగ్ర వహ్నిజ్వాలా
మాలా † వినిపాతితయై, వ్రాలెన్ నను గన్నతల్లి వసుమతిమీఁదన్

ఉ. తల్లిధరిత్రిపైనొఱగి తల్లడపాటును జెంది చిత్తముం
బల్లటిలంగఁ బ్రాణములు వాసినఁ జూచి కలంగ కేను నా
యుల్లములోన మోహరుచి నొందక సంగము వాసె మేలు రా
జిల్లె నటంచు విష్ణుపదచింత యొనర్చుచు బుద్ధి దేర్చుచున్. ౧౧౯

వ. ఉత్తరాభిముఖుండనై యేరు వెడలి జనపదంబులుఁ బురంబులుఁ బట్టణంబులు గ్రామంబులుఁ బల్లెలు మందలుఁ గిరాతపుళిందనివాసంబులు వనంబులు నుపవనంబులుఁ జిత్రధాతు విచిత్రంబులైన పర్వతంబులు సమదకరికరవిదళితశాఖలుగల శాఖలు నివారిత పథిక

* చుంచు = జుట్టు. అర్మిలిన్ = ప్రేమతో.
† మొదవు = పాఁడియావు. ♦ ఫణి = పాము ‡ వ్యాళము = పాము
† వినిపాతము = పడఁద్రోయఁబడినది.

జనశ్రమాతిరేకంబులయిన తటాకంబులు బహువిధ విహంగనినద
మనోహరంబులై వికచారవింద మధుపానపరవశ పరిభ్రమద్భ్రమర
సుందరంబులయిన సరోవరంబులు దాఁటి చనుచు క్షుత్పిపాసాసమే
తుండనై యొక్క *నదీహ్రదంబునఁ గ్రుంకులిడి శుచినై నీరుద్రావి
విగతశ్రముండనై. ౧౨౦

క. సాలావృకకపిభల్లుక, కోలేభలులాయశల్య ఘూకశరభ శా
ర్దూలశశగవయఖడ్గ, వ్యాళాజగరాదిభయద వనమధ్యమునన్.

వ. దుస్తరంబులయిన నవ•వేణుకీచక†గుల్మలతాగహ్వరంబులప్రాంతనొక్క
రావిమ్రానుదగ్గఱఁ గూర్చుండి యే విన్నచందంబున నా హృదయ
గతుం బరమాత్మస్వరూపు హరిం జింతించితి. ౧౨౨

శా. ఆనందాశ్రులు గన్నులన్ వెడల ‡రోమాంచంబుతోఁ దత్పద
ధ్యానారూఢుఁడనై ననాతలఁపులో నద్దేవుఁడుం దోఁచె నే
నానందాబ్ధిగతుండనై యెఱుఁగ లేనైతిన్ నన్నున్ నీశ్వరున్
నానాశోకహమైన యత్తనువుఁ గానన్ లేక యట్లంతటన్. ౧౨౩

వ. లేచి నిలుచుండి క్రమ్మఱ నద్దేవుని దివ్యాకారంబుఁ జూడనిచ్ఛించి
హృదయంబున నిలుపుకొని §యాతురుండునుబోలెం జూచియుం
గానక నిర్మనుష్యంబైన వనంబునం జరియించుచున్న నన్ను నుద్దే
శించి వాగగోచరుండైన హరి గంభీర మధురంబులయిన వచనంబుల
శోకం బుపశమింపం జేయు చందంబున నిట్లనియె. ౧౨౪

ఉ. ఏల కుమార శోషిలఁగ నీజననంబున నన్నుఁ గానఁగాఁ
జాలవు నీవు గామముఖ షట్కము నిర్దళితంబు సేసి ని
ర్మూలితకర్ముఁడైనమునిముఖ్యుఁడుగాని కుయోగి గానఁగాఁ
జాలఁడు నీదుకోర్కి గొనసాగుటకై నిజమూర్తిఁ జూపితిన్. ౧౨౫

---

* నదీహ్రదంబు=ఏటియందలి లోఁతునీటి ప్రదేశము.

• వేణువు=వెదురు = గాలి తాఁకినమ్రోఁగెడి వెదురు.

† గుల్మము=బోదెలేని చెట్టు. ‡ రోమాంచము=గగుర్పాటు.

§ ఆతురుండు=వ్యాధిగ్రస్తుఁడు.

క. నావలనఁ గోర్కి యూరక, పోవదు విడిపించు దోషపుంజములను మ
త్సేవం బుట్టును వైశమ, భావింపఁగ నాదుభక్తి బాలక వింటే.

క. నాయందుఁ గలుగు నీమది, పాయదు జన్మాంతరమున బాలక నీ వీ
కాయంబు విడిచి మీఁదట, మాయనుమతిఁ బుట్టఁగలవు మద్భక్తుఁడవై.

మ. విను మీసృష్టి లయంబు నొంది యుగముల్ వేయైనకాలంబు యా
మినియై పోయెడిఁ బోవఁగాఁ గలుగుఁ జుమ్మీ మీఁద నాసృష్టియం
దు నియామకస్మృతితోడఁ బుట్టెదవు నిర్దోషుండవై నాకృపన్
ఘనతం జెందెదు శుద్ధసాత్వికులలోఁ గణ్యుండవై యర్భకా. ౧౨౮

వ. అని యిట్లాకాశంబున నోంకారమూర్తియై ఋగ్వేదాదికంబు నిశ్వాసంబుగా నొప్పి సర్వనియామకంబైన మహాభూతంబు పలికి యూరకున్న నేను మస్తకంబు వంచి మ్రొక్కి తత్కరుణకు సంతసించి మదంబు దిగనాడి మత్సరంబు విడిచి కామంబు జయించి క్రోధంబు వర్జించి లోభమోహంబుల వెడలనడిచి సిగ్గువిడిచి యనంతనామంబులు పఠించుచుఁ బరమభద్రంబులయిన తచ్చరిత్రంబులఁ జింతించుచు నిరంతరసంతుష్టుండనై కృష్ణుని బుద్ధినిలిపి నిర్మలాంతఃకరణంబుతోడ విషయవిరక్తుండనై కాలంబున కెదురుసూచుచు భూమిం దిరుగుచు నుండునంతం గొంతకాలంబునకు మెఱుపు మెఱసిన తెఱంగున మృత్యువు దోఁచినం బంచభూతమయంబును గర్మస్వరూపంబయిన పూర్వదేహంబు విడిచి హరికృపావశంబున శుద్ధసత్త్వమయంబైన భాగవతదేహంబు సొచ్చితి. అంతం ద్రైలోక్యంబు సంహరించి ప్రళయకాల పయోరాశి మధ్యంబున శయనించి నిదురవోవ నిచ్ఛగించు నారాయణమూర్తియైన బ్రహ్మనిశ్వాసంబు వెంట నతనిలోపలం బ్రవేశించితి. అంత సహస్రయుగ పరిమితంబైన కాలంబుసనిన లేచి లోకంబులు సృజియింప నుద్యోగించు బ్రహ్మప్రాణంబులవలన మరీచిముఖ్యులగు మునులును నేనును జన్మించితిమి. అందు నఖండిత బ్రహ్మచర్యుండనై యేను మూఁడులోకంబుల బహిరంతరంబులందు మహావిష్ణుని యనుగ్రహంబున నడ్డంబులేక యీశ్వరదత్తయై *బ్రహ్మభి

* బ్రహ్మభివ్యంజకంబులు = పరమాత్మసూచకములు.

వ్యంజకంబులయిన సప్తస్వరంబులు దమయంతన మ్రోయుచున్న
యీ వీణాలాపన ♦ రతిం జేసి నారాయణ కథాగానంబు సేయుచుఁ
జరియించుచుండుదు. ౧౨౯

ఆ. తీర్థపాదుఁ డయిన దేవుండు విష్ణుండు, తనచరిత్ర మేనుదవిలిపాడఁ
జీరఁబడ్డవాని చెలువున నేతెంచి, ఘనుఁడు నామనమునఁ గానవచ్చు.

క. వినుమీసంసారం బను, వననిధిలో మునిఁగి కర్మ వాంఛలచే వే
దనఁ బొందెడువానికి విష్ణునిగుణవర్ణనము* తేప సుమ్ము మునీంద్రా.

చ. యమనియమాదియోగముల నాత్మనియంత్రితమయ్యుఁ గామరో
షములఁ బ్రచోదితంబ యగు శాంతి వహింపదు విష్ణుసేవచేఁ
గ్రమమున శాంతి గైకొనిన కైవడి నాదుశరీరజన్మక
ర్మములరహస్య మెల్ల మునిమండన చెప్పితి నీవు గోరినన్. ౧౩౨

వ. అని యిట్లు భగవంతుండగునారదుండు వ్యాసమునీంద్రుని వీడ్కొని
వీణవాయించుచు యదృచ్ఛామార్గంబునం జనియె నని సూతుం
డిట్లనియె ౧౩౩

క. వాయించు వీణ నెప్పుడు,
మ్రోయించు ముకుందగీతములు జగములకుం
జేయించుఁ జెవులపండువు
మాయించు§నఘాళి నిట్టి మతి మఱి గలఁడే. ౧౩౪

వ. అని నారదుం గొనియాడిన సూతునిం జూచి నారదుమాటలువిన్న
వెనుక భగవంతుండైన బాదరాయణుం డేమిచేసె నని శౌనకుం
డడిగిన సూతుం డిట్లనియె. బ్రహ్మనదియైన సరస్వతీపశ్చిమ తీరం
బున ఋషులకు సత్రవర్ధనంబయి బదరీతరుషండ మండితంబయి
శమ్యాప్రాసంబనం బ్రసిద్ధం బగు నాశ్రమంబుగలదు. అందు జలం
బులు వార్చి కూర్చుండి వ్యాసుండు దనమదిం దిరంబు సేసికొని భక్తి
యుక్తంబయిన చిత్తంబునం బరిపూర్ణుఁడయిన యీశ్వరుని గాంచి

---

♦ రతి = ఆసక్తి.    * తేప = తెప్ప.

§ అఘాళి = పాపసమూహము.

యీశ్వరాధీనమాయాకృతంబయిన జీవుని సంసారంబుఁగని జీవుండు మాయచేత మోహితుండయి గుణవ్యతిరిక్తుండయ్యు మాయాసంగతిం దన్నుఁ ద్రిగుణాత్మకుండని యభిమానించుచుఁ ద్రిగుణత్వాభిమానంబునం గర్తయు భోక్తయు నను ననర్థంబు నొందుననియు నయ్యనర్థంబునకు నారాయణ భక్తియోగంబుగాని యుపశమనంబు వేఱొకటి లేదనియు నిశ్చయించి. ౧౩౫

మ. అవనీచక్రములోన నేపురుషుఁ డే ♦ యామ్నాయము౯ విన్న మా
ధవుపై లోకశరణ్యుపై భవములం దప్పింపఁగాఁ జాలు భ
క్తివిశేషంబు జనించు నట్టిభువనక్షేమంకరంబైన భా
గవతామ్నాయము బాదరాయణుఁడు దాఁగల్పించె నేర్పొప్పఁగ౯.

వ. ఇట్లు భాగవతంబు నిర్మించి మోక్షార్థియయిన శుకునిచేఁ జదివించె నని చెప్పిన విని శౌనకుండు * నిర్వాణతత్పరుండును సర్వోపేక్షకుండునయిన శుకయోగి యేమిటికి భాగవతం బభ్యసించె ననవుడు సూతుం డిట్లనియె. ౧౩౭

క. ధీరులు నిరపేక్షులు నా
త్మారాములు నైన మునులు, హరిభజనము ని
ష్కారణము చేయుచుందురు
నారాయణుఁ డట్టివాఁడ, నవ్యచరిత్రా. ౧౩౮

క. హరిగుణవర్ణనరతుఁడై
హరితత్పరుఁడైన బాదరాయణి శుభత
త్పరతం బఠించెఁ ద్రిజగ
ద్వరమంగళ మైనభాగవతనిగమంబున్. ౧౩౯

క. *నిగమములు వేయుఁ జదివిన
సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్

♦ ఆమ్నాయము=వేదధర్మము. * నిర్వాణము=మోక్షము.

* నిగమములు=వేదములు.

సుగమంబు భాగవత మను
నిగమంబుఁ బఠింప ముక్తి నివసనము బుధా. ౧౪౦

—♦ అర్జునుండు ప్రతిఘాతి యగు నశ్వత్థామ నవమానించుట. ♦—

వ. అని పలికి రాజర్షియైన పరీక్షిన్మహారాజు జన్మకర్మముక్తులును బాండవుల * మహాప్రస్థానంబునుఁ గృష్ణకథోదయంబును జెప్పెదఁ గౌరవ దృష్టద్యుమ్నాదుల యుద్ధంబున వీరులయిన వారలు స్వర్గంబునకుం జనిన వెనుక భీముగదాఘాతంబున దుర్యోధనుండు తొడలు విఱిగి కూలిన నశ్వత్థామ దుర్యోధనునకుం బ్రియంబు సేయువాఁడై నిదుర వోవు ద్రౌపదీ పుత్త్రుల శిరంబులు ఖండించి తెచ్చి సమర్పించె, నది క్రూరకర్మం బని లోకులు నిందింతురు.

ఉ. బాలురచావు కర్ణములఁ బడ్డఁ గలంగి యలంగి యేడువం
జాలక బాష్పతోయకణజాలము చెక్కుల రాల నేడ్చి పాం
చాలతనూజ నేలఁ బడి జాలిఁ బడం గని యెత్తి మంజువా
చాలతఁ జూపుచుం జికురజాలము దువ్వుచుఁ గ్రీడి యిట్లనున్.

శా. ధరణీశాత్మజ విట్లు నీకు వగవన్ ధర్మంబె? యా ద్రోణి ని
ష్కరుణుండై విదళించె బాలకుల మ ద్గాండీవనిర్ముక్త భీ
కరబాణంబుల నేఁడు వానిశిరమున్ ఖండించి నేఁ దెత్తుఁ ద
చ్ఛిరముం ద్రొక్కి జలంబు లాడు మిచటన్ శీతాంశుబింబాననా.

వ. అని యిట్లొడంబఱచి తనకు మిత్త్రుండును సారథియు నైన హరి మేలనుచుండం గవచంబు దొడగి గాండీవంబు ధరియించి కపిధ్వజుండయి గురుసుతుని వెంట రథంబు దోలించిన. ౧౪౪

శా. తన్నుం జంపెద నంచు వచ్చువిజయున్ దర్శించి తద్ద్రోణి ♦యా
పన్నుండయి శిశుహంత గావున నిజప్రాణేచ్ఛఁ బాఱెన్ వడిన్
మున్నా బ్రహ్మ మృగాకృతిం దనయకున్ మోహించి క్రీడింప నా
సన్నుం డౌ హరుఁ జూచి పాఱుపగిదిన్ సర్వేంద్రియ భ్రాంతితోన్.

---

* మహాప్రస్థానము=గొప్పప్రయాణము.

♦ ఆపన్నుండు=ఆపద నొందినవాఁడు.

వ. ఇట్లోపినంతదూరంబుం బరువిడి వెనుకఁజూచి రథతురంగంబు లలయుట దెలిసి నిలిచి ప్రాణరక్షణంబునకు నొండుపాయంబులేమి నిశ్చయించి జలంబులువార్చి ద్రోణనందనుండు సమాహిత చిత్తుం డయి ప్రయోగంబ కాని యుపసంహారంబు నేరకయుఁ బ్రాణ సంరక్షణార్థంబు పార్థునిమీఁద బ్రహ్మశిరోనామ కాస్త్రంబుం బ్రయోగించిన నది ప్రచండ తేజంబున దిఙ్మండలంబు నిండి ప్రాణి భయంకరంబై తోఁచిన హరికి నర్జునుం డిట్లనియె. ౧౭౬

సీ॥ పద్మలోచన కృష్ణ భక్తాభయప్రద
వినుము సంసారాగ్ని వేల్చుచున్న
జనులసంసారంబు సంహరింపఁగ నీవు
దక్క నన్యులు లేరు దలఁచి చూడ
సాక్షాత్కరించిన సర్వేశ్వరుండవు
ప్రకృతిపరుండవు ప్రభుఁడ వాద్య
పురుషుండవగు నీప్రబోధంబుచే మాయ
నడఁతువు నిశ్శ్రేయ సాత్మయందు

ఆ. మాయచేత మునిఁగి మనువారలకుఁ గృప
నేసి ధర్మముఖ్య చిహ్నమయిన
శుభము సేయుచుందు సుజనుల నవనిలోఁ
గావఁబుట్టుదువె జగన్నివాస. ౧౭౭

క. ఇది యొక తేజము భూమియుఁ
జగలును దిక్కులును నిండి సర్వంకషమై
యెదురై వచ్చుచు నున్నది
విదితముగా నెఱుఁగఁ జెప్పవే దేవేశా. ౧౭౮

వ. అనిన హరి యిట్లనియె. ౧౭౯

శా. ♦జిహ్మాత్వంబునఁ బాఱె ద్రోణజుఁడు దుశ్శీలుండు ప్రాణేచ్ఛమై బ్రహ్మాస్త్రంబట నేయవచ్చె నిటఁ దద్బాణాగ్ని భీభత్స నీ

♦ జిహ్మాత్వంబు=వక్రబుద్ధి.

బ్రహ్మాస్త్రంబునఁ గాని దీని మరలింపన్ రాదు సంహార మీ
♦బ్రహ్మాపత్య మెఱుంగఁ జేయుము వడిన్ బ్రహ్మాస్త్రమున్ దీనిపై.

వ. అనిన నర్జునుండు జలంబులు వార్చి హరికిం బ్రదక్షిణంబు వచ్చి ద్రోణనందనుం డేసిన యస్త్రంబుమీఁదఁ దన బ్రహ్మాస్త్రంబుం బ్రయోగించిన. ౧౫౧

మ. అవనివ్యోమములందు నిండి తమలో నా రెండు బ్రహ్మాస్త్రముల్
రవివహ్నిద్యుతిఁ బోరుచుం ద్రిభువనత్రాసంబు గావింపఁగా
వివశభ్రాంతి యుగాంతమో యని ప్రజల్ వీక్షింప నావేళ మా
ధవునాజ్ఞన్ విజయుండు సేసె విశిఖద్వంద్వోపసంహారమున్. ౧౫౨

వ. ఇట్లస్త్రద్వయంబు నుపసంహరించి ధనంజయుండు ద్రోణనందనుం గూడ నరిగి తఱిమి పట్టుకొని రోషారుణితలోచనుండై యాజ్ఞికుండు రజ్జువునం బశువుఁ గట్టిన చందంబున బంధించి శిబిరంబు కడకుం గొని చని హింసింతు నని తిగిచినం జూచి హరి యిట్లనియె. ౧౫౩

ఉ. మాఱుపడంగలేని యసమర్థుల సుప్తుల నస్త్రవిద్యలం
దేఱనిపిన్నపాపల వధించె నిశీథమునందుఁ గ్రూరుఁడై
*పాఱుఁడె వీఁడు పాతకుఁడు ప్రాణభయంబున వెచ్చనూర్పుచుం
బాఱెడి వీనిఁ గావుము కృపామతి నర్జున పాపవర్జనా. ౧౫౪

చ. వెఱచినవాని దైన్యమున ‡వేఁదుఱు నొందినవాని నిద్రమై
మఱచినవాని సౌఖ్యముగ మద్యము ద్రావినవాని భగ్నుఁడై
పఱచినవాని సాధుజడభావము వానినిఁ గావుమంచు వా
చఱచినవానిఁ గామినులఁ జంపుట ధర్మముగాదు ఫల్గునా. ౧౫౫

శా. స్వప్రాణంబుల నెవ్వఁడేనిఁ గరుణాసంగంబు సాలించి య
న్యప్రాణంబులచేత రక్షణము సేయం గోరువాఁ డంత్యలో
కప్రాప్తుండయి రాజదండమున సత్కల్యాణుఁ డౌ నైన నీ
విప్రుం దండితుఁ జేయ నేటికి మహావిభ్రాంతిచే నుండఁగన్. ౧౫౬

---

♦ బ్రహ్మాపత్యము=బ్రాహ్మణపుత్త్రుఁడు. * పాఱుఁడు=బ్రాహ్మణుఁడు.
‡ వేఁదుఱు=ఉన్మాదము.

వ. అని యివ్విధంబునఁ గృష్ణుం డానతిచ్చిన బ్రాహ్మణుండు కృతాపరాధుం డయినను వధ్యుండు గాఁడను ధర్మంబుదలంచి చంపక ద్రుపదరాజపుత్త్రికిం దనచేసిన ప్రతిజ్ఞం దలంచి బద్ధుండయిన గురునందనుం దోడ్కొని కృష్ణుండు సారథ్యంబు సేయ శిబిరంబు కడకువచ్చి.

క. సురరాజసుతుఁడు సూపెను
దురవధిసుతశోకయుతకు ద్రుపదుని సుతకుం
బరిచలితాంగశ్రేణికిఁ
బరుషమహాపాశబద్ధపాణిన్ *ద్రౌణిన్. ౧౫౯

—◆ ద్రౌపది యశ్వత్థామను జూచి సంభాషించుట ◆—

వ. ఇట్లర్జునుండు దెచ్చి చూపిన బాలవధజనితలజ్జాముఖుండైన కృపి కొడుకుంజూచి మ్రొక్కి సుస్వభావయగు ద్రౌపది యిట్లనియె.

మ. పరగన్ మామగవారలందఱును మున్ బాణప్రయోగోపసం
హరణాద్యాయుధవిద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం
చిరి పుత్త్రాకృతి నున్న ద్రోణుఁడవు నీ చిత్తంబులో లేశమున్
గరుణాసంగములేక శిష్యసుతులం ఖండింపఁగాఁ బాడియే. ౧౬౦

క. భూసురుఁడవు బుద్ధిదయా, భాసురుఁడవు శుద్ధవీర భటసందోహా
గ్రేసరుఁడవు శిశుమారణ, మాసురకృత్యంబు ధర్మమగునే తండ్రీ.

శా. ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం
చిద్ద్రోహంబును నీకుఁ జేయరు బలోత్సేకంబుతోఁ జీఁకటిన్
భద్రాకారులఁ బిన్నపాపల రణప్రౌఢక్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా నీచేతు లెట్లాడెనో. ౧౬౧

ఉ. అక్కట పుత్త్రశోకజనితాకులభారవిషణ్ణచిత్తనై
*పొక్కుచు నున్నభంగి నినుఁ బోరఁ గిరీటి నిబద్ధుఁ జేసి నేఁ
డిక్కడ కీడ్చి తెచ్చుట సహింపనిదై భవదీయమాత నేఁ
డెక్కడ నిట్టిశోకమున నేక్రియ నేడ్చుచుఁ బొక్కుచున్నదో.

* ద్రౌణి=ద్రోణపుత్త్రుఁడు=అశ్వత్థామ. ◆ పాడి=న్యాయము.
‡ పొక్కుచున్=దుఃఖించుచు.

వ. అని కృష్ణార్జునులఁ జూచి యిట్లనియె. ౧౬౪

ఉ. ద్రోణునితో ♦ శిఖింబడక ద్రోణకుటుంబిని యున్నదింట న
క్షీణతనూజశోకవివశీకృతనై విలపించుభంగి నీ
రాణిఁ *దెరల్చి తెచ్చుటకు దైన్యము నొందుచు నెంత పొక్కెనో
ప్రాణవియుక్తుఁ డైన నతిపాపము బ్రాహ్మణహింస మాన రే.

క. భూపాలకులకు విప్రులు, గోపింపఁగఁ జేయఁ దగదు కోపించినఁ ద
త్కోపానలంబు మొదలికి, భూపాలాటవులఁ గాల్చు భూకంపముగన్.

వ. అని యిట్లు ధర్మ్యంబును సకరుణంబును † నిర్వ్యళీకంబును సమంజ
సంబును శ్లాఘ్యంబునుంగాఁ బలుకు ద్రౌపదిపలుకులకు ధర్మనంద
నుండు సంతసిల్లె. నకులసహదేవసాత్యకిధనంజయకృష్ణులుసమ్మతించిరి.
సమ్మతింపక భీముం డిట్లనియె. ౧౬౭

చ. కొడుకులఁ బట్టి చంపె నని కోపము నొందదు బాలఘాతకున్
విడువు మటంచుఁ జెప్పెడిని వెఱ్ఱిది ద్రౌపది వీఁడు విప్రుఁడే
విడువఁగ నేల చంపుఁ డిటు వీనిని మీరలు చంపరేని నా
పిడికిటిపోటునన్ శిరము భిన్నము సేసెదఁ జూడుఁ డిందఱున్. ౧౬౮

వ. అని పలికిన నశ్వత్థామకు ద్రౌపది యడ్డంబు వచ్చె భీముని సంరం
భంబు సూచి హరి చతుర్భుజుండై రెండుచేతుల భీముని వారించి
కడమ రెంటను ద్రుపదపుత్రి (కను) దలంగించి నగుచు భీమున
కిట్లనియె. ౧౬౯

ఉ. ‡ అవ్యుఁడు గాఁడు వీఁడు శిశుహంత దురాత్మకుఁ ) డాతతాయి హం
తవ్యుఁడు బ్రహ్మబంధుఁడగుఁ దప్పదు నిక్కము బ్రాహ్మణో నహం
తవ్యయటంచు వేదము శ్రుతం బగుఁ గావున ధర్మదృష్టిఁ గ
ర్తవ్యము వీనిఁ గాచుట యథాస్థితిఁ జూడుము పాండవోత్తమా.

---

♦ శిఖిన్=అగ్నియందు. * తెరల్చి=తొలఁగించి. † నిర్వ్యళీకము= మోసము లేనిది. ‡ అవ్యుఁడు=రక్షింపఁదగినవాఁడు. ) ఆతతాయి=కత్తితో నితరుల నంటకట మొదలగు దుష్టచేష్టలుగలవాఁడు.

వ. అని సరసాలాపంబు లాడి పవననందను నొడంబఱిచి యర్జునుం జూచి ద్రౌపదికి నాకు భీమసేనునకు సమ్మతంబుగ మున్ను నీచేసిన ప్రతిజ్ఞయు సిద్ధించునట్లు నాపంపు సేయుమని నారాయణుం డానతిచ్చిన నర్జునుండును దదనుమతంబున. ౧౭౧

శా. విశ్వస్తుత్యుఁడు శక్రసూనుఁడు మహావీరుండు ఘోరాసిచే
నశ్వత్థామశిరోజముల్ దఱిఁగి † చూడాంతర్మహారత్నముఁ
శశ్వత్కీర్తి వెలుంగఁ బుచ్చుకొని పాశవ్రాతబంధంబులఁ
విశ్వాసంబున నూడ్చి త్రోచె శిబిరోర్వీభాగముం బాసి పోన్.

క. నిబ్బరపు బాలహంతయు, గొబ్బునఁ దేజంబు మఱియుఁగోల్పడినతుఁడై
ప్రబ్బినచింతఁ విప్రుఁడు, *సిబ్బితితో నొడలిగబ్బు సెడి వడిఁ జనియెన్.

ఆ. ధనముఁ గొనుట యొండెఁ దలఁగొఱుగుట యొండె
నాలయంబు వెడల నడుచుటొండెఁ,
గాని చంపఁదగిన కర్మంబుసేసినఁ
జంపఁ దగదు విప్రజాతిఁ బతికి. ౧౭౪

వ. ఇట్లశ్వత్థామం బ్రాణావశిష్టుం జేసి వెడల నడిచి పాండవులు పాంచాలీసహితులై పుత్రులకు శోకించి మృతులైన బంధువులకెల్ల దహనాదికృత్యంబులుచేసి జలప్రదానంబు సేయుకొఱకు స్త్రీలముందట నిడుకొని గోవిందుండునుందారును గంగకుం జని తిలోదకంబులు చేసి క్రమ్మఱ విలపించి హరిపాదపద్మరజోపవిత్రంబులయిన భాగిరథీ జలంబుల స్నాతు లయియున్న యెడం బుత్రశోకాతురులయిన గాంధారీ ధృతరాష్ట్రులను గుంతీ ద్రౌపదులను జూచి మాధవుండు మునీంద్రులుం దానును బంధుమరణ శోకాతురులయిన వారల నగపుమానిచి మన్నించె, నివ్విధంబున. ౧౭౫

శా. పాంచాలీ♦కబరీవికర్షణమహా పాపక్షతాయుష్కులం
జంచద్గర్వుల ధార్తరాష్ట్రుల ననిం జంపించి గోవిందుఁ డీ

---

† చూడ = జుట్టు. * సిబ్బితి = సిగ్గు ♦ కబరీవికర్షణము = కొప్పు (పట్టుకొని) లాగుట.

ప్పించెఁ రాజ్యము ధర్మపుత్రునకుఁ గల్పించెఁ మహాఖ్యాతిఁ జే
యించెఁ మూఁడుతురంగమేధములు దేవేంద్రప్రభావంబునన్.

— శ్రీకృష్ణుం డుత్తరాగర్భస్థుం డగు నర్భకుని రక్షించుట —

వ. అంత వాసుదేవుండు వ్యాసప్రముఖ భూసురపూజితుం డయి యుద్ధవసాత్యకులు గొలువ ద్వారకాగమన ప్రయత్నంబునఁ బాండవుల వీడ్కొని రథారోహణంబు సేయు సమయంబున భయంబునఁ దత్తఱపడుచు నుత్తర సనుదెంచి కల్యాణగుణాత్మకుం డైన హరి కిట్లనియె. ౧౭౭

మ. ఇదె కాలానలతుల్య మైన◆విశిఖం బేతెంచె దేవేశ నేఁ
డుదరాంతర్గతగర్భదాహమునకై యుగ్ర*ప్రభన్ వచ్చుచు
న్నది దుర్లోక్యము మానుపన్ శరణ మన్యం బేమియున్ లేదు నీ
పదపద్మంబులె కాని యొం డెఱుఁగ నీబాణాగ్ని వారింపవే. ౧౭౮

క. దుర్భరబాణానలమున, గర్భములో నున్న శిశువు ఘనసంతాపా
విర్భావంబునఁ బొరలెడి, నిర్భరకృపఁ గావవయ్య నిఖిలస్తుత్యా.

క. చెల్లెలికోడల నీమే, నల్లుఁడు శత్రువులచేత హతుఁ డయ్యెను సం
ఫుల్లారవిందలోచన, † భల్లాగ్ని నడంచి శిశువు బ్రతికింపఁ గదే.

ఆ. గర్భమందుఁ గమల గర్భాండశతములు,
నిముడుకొన నటించు నీశ్వరేశ
నీకు నొక్క మానినీగర్భరక్షణ
మెంతబరువు నిర్వహింతు గాక. ౧౮౧

వ. అనిన నాశ్రితవత్సలుం డయిన యా పరమేశ్వరుండు సుభద్రకోడలి దీనాలాపంబు లాలించి యిది ద్రోణనందనుండు లోకమంతయు నపాండవం బయ్యెడుమని యేసిన దివ్యాస్త్రం బని యెఱింగె. అంతఁ బాండవుల కభిముఖంబయి ద్రోణనందను దివ్యాస్త్రనిర్గత

◆ విశిఖంబు = బాణము. * ప్రభ = కాంతి. † భల్లము = బాణము.

* నిశితమార్గణంబులు డగ్గఱిన బెగ్గడిలక వారును బ్రత్యస్త్రంబు లందుకొని పెనంగు సమయంబున. ౧౫౨

మ. తనసేవారతి చింత గాని పరచింతాలేశముం లేని స
జ్జనులం బాండుతనూజులన్ మనుపు వాత్సల్యంబుతో ద్రోణినం
దనుబ్రహ్మాస్త్రము నడ్డపెట్టఁ బనిచెన్ దైత్యారి సర్వారిసా
ధననిర్వక్రము రక్షితాఖిలసుధాంధశ్చక్రముం జక్రమున్. ౧౫౩

మ. సకలప్రాణిహృదంతరాళముల భాస్వజ్జ్యోతియై యుండు సూ
క్ష్మకళుం డచ్యుతుఁ డవ్విరాటతనయా గర్భంబుఁ దాఁ జక్రహ
స్తకుఁడై వైష్ణవమాయఁ గప్పి కురుసంతానార్థియై యడ్డమై
ప్రకటస్ఫూర్తి నడంచెఁ ద్రోణితనయబ్రహ్మాస్త్రమున్ లీలతోన్.

వ. ఇట్లు ద్రోణతనయుండు సేసిన ప్రతిక్రియారహితంబయిన బ్రహ్మశిరం బనియెడి దివ్యాస్త్రంబు వైష్ణవతేజంబున నిరర్థకంబయ్యె. నిజ మాయచే సకలలోకసర్గస్థితి సంహారంబు లాచరించునట్టి హరికి ధర ణీసురబాణనివారణంబు విచిత్రంబుగాదు. తత్సమయంబున సంత సించి పాండవపాంచాలీసహితయై † గొంతి గమనోన్ముఖుండయిన హరిం జేర వచ్చి యిట్లనియె. ౧౫౫

— కుంతీదేవి శ్రీకృష్ణుని నుతించుట —

క. పురుషుం డాద్యుఁడు ప్రకృతికిఁ, బరుఁ డవ్యయుఁ డఖిలభూతబహిరంతర్భా
సురుఁడు నవలోకనీయుఁడుఁ, బరమేశ్వరుఁడైన నీకుఁ బ్రణవములుహరీ.

వ. మఱియు జవనికమఱువున నాట్యంబు సలుపు నటుని చందంబున మాయాయవనికాంతరాళంబున నిలువంబడి నీ మహిమచేఁ బరమహంసలు నివృత్తరాగద్వేషులు నిర్మలాత్ములునయిన మునులకు నదృశ్యమానుండవై పరిచ్ఛిన్నుండవు గాని నీవు మూఢదర్శనంబులు దర్శించు కుటుంబవంతులునగు మాకు నెట్లు దర్శనీయుండ వయ్యెదు. శ్రీకృష్ణ! వాసుదేవ! దేవకీనందన! నందగోపకుమార!

---

* నిశితమార్గణంబులు=వాఁడిగల బాణములు. † గొంతి=కుంతి.

గోవింద! పంకజనాభ! పద్మమాలికాలంకృత! పద్మలోచన! పద్మ సంకాశచరణ! హృషీకేశ! భక్తియోగంబునం జేసి నమస్కరించెద నవధరింపుము. ౧౮౭

సీ. తనయులతోడ నే దహ్యమానంబగు
*జతుగృహంబునయందుఁ జావకుండఁ
గురురాజు వెట్టించు ఘోరవిషంబున
మారుతపుత్త్రుండు మడియకుండ
ధార్తరాష్ట్రుఁడు సముద్ధతిఁ జీర నొలువంగ
ద్రౌపదిమానంబు దలఁగకుండ
గాంగేయకుంభజకర్ణాదిఘనులచే
నాబిడ్డ ♦ లనిలోన నలఁగకుండ

తే. విరటుపుత్త్రికకడుపులో వెలయుచూలు
ద్రోణనందను ‡ శరవహ్నిఁ ద్రుంగకుండ
మఱియు రక్షించితివి పెక్కు మార్గములను
నిన్ను నేమనివర్ణింతు నీరజాక్ష. ౧౮౮

మ. కో. † బల్లిదుం డగు కంసుచేతను బాధ నొందుచు నున్న మా
తల్లిఁ గాచినభంగిఁ గాచితి ధార్తరాష్ట్రులచేత నేఁ
దల్లడంబునఁ జిక్కకుండఁగ దానవాంతక నీగుణం
బెల్ల సంస్తుతి సేసి చెప్పఁగ నెంతదాన జగత్పతీ! ౧౮౯

క. జననము నైశ్వర్యంబును, ధనమును విద్యయును గలమదచ్ఛన్నులకిం
చనగోచరుఁడగు నిన్నుఁ, వినుతింపఁగ లేరు నిఖిలవిబుధస్తుత్యా.

వ. మఱియు భక్తధనుండును నివృత్తధర్మార్థకామ విషయుండును నాత్మారాముండును రాగాదిరహితుండును కైవల్యదానసమర్థుండును గాలరూపకుండును నియామకుండును నాద్యంతశూన్యుండును * విభుండును సర్వసముండును సకలభూతనిగ్రహానుగ్రహాకరుండు

* జతుగృహంబు=లక్క యిల్లు. ♦ అని= యుద్ధము. ‡ శరవహ్ని = బాణాగ్ని.
† బల్లిదుండు=బలవంతుఁడు. * విభుండు = (సర్వ) వ్యాపకుఁడు

నయిన నిన్నుఁ దలంచి నమస్కరించెద నవధరింపుము. మనుష్యుల విడంబించు భవదీయవిలసనంబు నిర్ణయింప నెవ్వండు సమర్థుండు, నీకుం బ్రియాప్రియులు లేరు జన్మకర్మశూన్యుండవైన నీవు తిర్యగాది జీవులయందు వరాహాదిరూపంబులను, మనుష్యులందు రామాది రూపంబులను, ఋషులయందు వామనాది రూపంబులను, జలచరంబులయందు మత్స్యాది రూపంబులను నవతరించుట లోకవిడంబనార్థంబుగాని జన్మకర్మ సహితుండవగుటం గాదు. ౧౯౧

ఉ. కోపముతోడ నీవు దధికుంభము భిన్నము సేయు చున్నచో
గోపిక త్రాటఁ గట్టిన వికుంచిత సాంజన బాష్పతోయధా
రాపరిపూర్ణ వక్త్రముఁ గరంబులఁ ♦ బ్రాముచు వెచ్చనూర్చుచుం
బాపఁడవై నటించుట కృపాపర నా మదిఁ జోద్య మయ్యెడిన్. ౧౯౨

క. మలయమునఁ జందనముక్రియ, వెలయఁగ ధర్మజుని కీర్తి వెలయించుటకై
యిలపై నభవుఁడు హరి యదు, కులమున నుదయించె నండ్రు కొందఱనంతా.

క. వసుదేవదేవకులు తా, పసగతి గతభవమునందుఁ బ్రార్థించిన సం
తసమునఁ బుత్రత నొందితి, వసురుల మృతికంచుఁ గొందఱండ్రు మహాత్మా.

క. జలరాశినడుమ మునిఁగెడు, ‡ కలము క్రియన్ భూరిభార కర్శితయగు నీ
యిలఁ గావ నజుఁడు గోరినఁ, గలిగితి వని కొందఱండ్రు గణనాతీతా.

తే. మఱచి యజ్ఞానకామ కర్మములఁ దిరుగు,
వేదనాతురులకుఁ దన్నివృత్తిఁ జేయ
శ్రవణచింతనవందనార్చనము లిచ్చు
కొఱకు నుదయించితండ్రు నిన్ గొంద ఱభవ. ౧౯౬

మ. నినుఁ జింతించుచుఁ బాడుచుం బొగడుచున్ నీదివ్యచారిత్రముల్
వినుచుం జూతురు గాక లోకు లితరాన్వేషంబులం జూతురే
ఘనదుర్జన్మపరంపరాహరణదక్షంబై మహాయోగివా
గ్వినుతంబైన భవత్పదాబ్జయుగమున్ విశ్వేశ విశ్వంభరా. ౧౯౭

♦ ప్రాముచున్ = పూసికొనుచు. ‡ కలము = ఓడ.

వ. దేవా నిరాశ్రయులమై భవదీయచరణారవిందంబు లాశ్రయించి నీవారలమైన మమ్ము విడిచి విచ్చేయనేల నీ సకరుణావలోకనంబున నిత్యంబును జూడవేని యాదవసహితు లయిన పాండవులు జీవునిం బాసిన యింద్రియంబుల చందంబునఁ గీర్తిసంపదలులేక తుచ్ఛత్వంబు నొందుదురు. కల్యాణలక్షణ లక్షితంబు లయిన నీయడుగుల చేత నంకితం బయిన మదీయధరణీమండలంబు నీవు వాసిన శోభితంబుగాదు. నీ కృపావీక్షణామృతంబున నిక్కడి జనపదంబులు కుసుమఫలభరితంబులయి యోషధీతరుల తాగుల్మ*నదనదీసమేతంబు లయి యుండు. ౧౯౮

ఉ. యాదవులందుఁ బాండవుల యందు నధీశ్వర నాకు మోహ వి
చ్ఛేదము సేయుమయ్య ఘన♦సింధువుఁ జేరెడిగంగభంగి నీ
పాదసరోజచింతనము పై ననిశంబు మదీయబుద్ధి న
త్యాదరవృత్తితోఁ గదియు నట్లుగఁ జేయఁగదయ్య యీశ్వరా.

శా. శ్రీకృష్ణా ! యదుభూషణా ! నరసఖా ! శృంగారరత్నాకరా !
లోకద్రోహి నరేంద్రవంశదహనా ! లోకేశ్వరా ! దేవతా
నీకబ్రాహ్మణగోగణార్తిహరణా ! నిర్వాణసంధాయకా !
నీకు న్మ్రొక్కెదఁ ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ ! ౨౦౦

వ. అని యిట్లు సకల సంభాషణంబుల నుతియించు గుంతిమాటకు నియ్యకొని గోవిందుండు మాయానిరూఢమందహాస విశేషంబున మోహంబు నొందించి రథారూఢుండై కరినగరంబునకు వచ్చి కుంతీ సుభద్రాదుల వీడ్కొని తన పురంబునకు విచ్చేయ గమకించి ధర్మరాజుచేఁ గించిత్కాలంబు నిలువుమని ప్రార్థితుండై నిలిచె. అంత బంధువధశోకాతురుండైన ధర్మజుండు నారాయణవ్యాస ధౌమ్యాదులచేతఁ దెలుపంబడియుఁ దెలియక మోహితుండయి నిర్వేదం బగు చిత్తంబున నిట్లనియె. ౨౦౧

---

* నదము = పశ్చిమముగాఁ బ్రవహించెడియేఱు. నది = తూర్పుగాఁ బాఱెడియేఱు ♦ సింధువు = సముద్రము.

మ. తన దేహంబునకై యనేక మృగసంతానంబుఁ జంపించు దు
ర్జనుభంగిన్ గురుబాలకద్విజతనూజభ్రాతృసంఘంబు ని
ట్లనిఁ జంపించిన పాపకర్మునకు రాజ్యాకాంక్షికిన్ నాకు *హా
యనలక్షావధి నైన ఘోరనరకవ్యాసంగముల్ మానునే. ౨౦౨

వ. మఱియుఁ బ్రజాపరిపాలన పరుండయిన రాజు ధర్మయుద్ధంబున శత్రువుల వధియించినఁ బాపంబు లేదని శాస్త్రవచనంబుగలదయిన నది విజ్ఞానంబు కొఱకు సమర్థంబు గాదు. చతురంగంబుల ననేకాక్షౌహిణీసంఖ్యాతంబులం జంపించితి. హతబంధులయిన సతులకేను జేసిన ద్రోహంబు దప్పించుకొన నేర్పు లేదు. గృహస్థాశ్రమధర్మంబులైన తురంగమేధాదియాగంబులచేతఁ బురుషుండు బ్రహ్మహత్యాది పాపంబులవలన విడివడి నిర్మలుం డగునని నిగమంబులు నిగమించుఁ ♦బంకంబునఁ † బంకిలస్థలంబునకు, మద్యంబున ‡ మద్యభాండమునకు శుద్ధి సంభవింపని చందంబునఁ బుద్ధిపూర్వక జీవహింసనంబులయిన యాగంబులచేతం బురుషులకుఁ బాపబాహుళ్యంబ కాని పాపనిర్ముక్తి గాదని శంకించెద. ౨౦౩

క. అని యిట్లు ధర్మసూనుఁడు మొనసి నిరాహారభావమున దేవనదీ
తనయుఁడు గూలిన చోటికిఁ, జనియెఁ బ్రజాద్రోహపాపచలితాత్ముండై.

ధర్మజుఁడు శ్రీకృష్ణసహితుఁడై శరతల్పగతుండయిన భీష్మునికడ కేఁగుట.

వ. అయ్యవసరంబునం దక్కిన పాండవులును, ఫల్గుణసహాయుండైన పద్మలోచనుండును గాంచన సమంచితంబులయిన రథంబులెక్కి ధర్మజుం గూడి చనిన నతండు గుహ్యకసహితుండయిన కుబేరునిభంగి నొప్పె. ఇట్లు పాండవులు పరిజనులు గొలువఁ బద్మనాభసహితులయి కురుక్షేత్రంబున కేఁగి దివంబుననుండి నేలంగూలిన దేవతలతెఱంగున సంగ్రామరంగపతితుండయిన గంగానందనునకు సమస్కరించి రంత బృహదశ్వ భరద్వాజ పరశురామ పర్వత నారద బాదరాయణ

---

* హాయనలక్షావధినైనన్ = లక్షసంవత్సర పర్యంతము వరకైనను. ♦ పంకంబు = బురద. † పంకిలస్థలంబు = బురదప్రదేశము. ‡ మద్యభాండము = కల్లుకుండ.

కశ్యపాంగిరస కౌశిక ధౌమ్య సుదర్శన శుక వసిష్ఠాద్యనేక రాజర్షి దేవర్షి బ్రహ్మర్షులు శిష్యసమేతులై చనుదెంచినం జూచి సంతసించి దేశకాల విభాగ వేదియైన భీష్ముండు వారలకుం బూజనంబు గావించి. ౨౦౫

క. *మాయాంగీకృతదేహుం, డై యఖిలేశ్వరుఁడు మనుజుఁడై నాఁ డనిప్రజ్ఞాయత చిత్తంబున గాం, గేయుఁడు పూజనము సేసెఁ గృష్ణుఁ ♦జిష్ణున్.

వ. మఱియు గంగానందనుండు వినయ ప్రేమసుందరులయిన పాండునందనులం గూర్చుండ నియోగించి మహానురాగజనిత బాష్పసందోహ సమ్మీళితలోచనుండై యిట్లనియె. ౨౦౭

ఆ. ధరణిసురులు హరియు ధర్మంబు దిక్కుగా,
బ్రతుకఁ దలఁచి మీరు బహువిధముల
నన్నలార పడితి రాపత్పరంపర,
లిట్టిచిత్రకర్మ మెందుఁ గలదు. ౨౦౮

ఉ. సంతస మింత లెదు మృగ శాపవశంబునఁ బాండుభూవిభుం
డంతము నొంది యుండ మిము నర్భకులం గొనివచ్చి కొంతితో
నింతలవారిఁ గాఁ బెనిచె నెన్నఁడు సౌఖ్యముపట్టు గాన దీ
గొంతి యనేకదుఃఖములఁ గుందుచు నుండును భాగ్యమెట్టిదో.

ఉ. వాయువశంబులై మొగిసి వారిధరంబులు మింటఁ గూడుచుం
బాయుచు నుండుకై వడిఁ బ్రపంచము సర్వము గాలతంత్రమై
పాయుచుఁ గూడుచుండు నొక భంగిఁ జరింపదు కాల మన్నియుం
జేయుచు నుండుఁ గాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్.

ఉ. రాజట ధర్మజుండు సురరాజసుతుండట ధన్వి † శాత్రవో
ద్వేజక మైన గాండివము విల్లట సారథి సర్వభద్రసం

---

* మాయాంగీకృతదేహుండు = మాయచేనంగము గాఁ గైకొనఁబడిన శరీరము గలవాఁడు. ♦ జిష్ణున్ = జితేంద్రియుని.

† శాత్రవోద్వేజకుఁడు = శత్రువులకు భయముఁ గలిగించువాఁడు.

యోజకుఁడై నచక్రియఁట యుగ్రగదాధరుఁ డైనభీముఁ డ
య్యాజికిఁ దోడువచ్చునఁట యాపద గల్గు టిదేమి చోద్యమో॥

ఆ. ఈశ్వరుండు విష్ణుఁ డెవ్వేళ నెవ్వని,
కేమి సేయుఁ బురుషుఁ డేమియెఱుఁగు
నతనిమాయలకు మహాత్ములు విద్వాంసు,
లడఁగిమెలఁగుచుండు రంధులగుచు. ౨౧౨

వ. కావున దైవతంత్రంబయినపనికి వగవం బనిలేదు. రక్షకులులేని ప్రజల రక్షింపఁ బుండరీకాక్షుండు సాక్షాత్కరించిన నారాయణుండు తేజోనిరూఢుండుగాక యాదవులందు గూఢుండై తన మాయచేత లోకంబుల మోహాతిరేకంబు నొందించు, నతని రహస్య ప్రకారంబుల భగవంతుండైన పరమేశ్వరుం డెఱుంగు. మఱియు దేవర్షి యగు నారదుండును భగవంతుం డగు కపిల మునియు నెఱుంగుదురు. మీరు కృష్ణుండు దేవకీ పుత్రుండగు * మాతులేయుండని తలంచి దూత, ♦ సచివ సారథి బంధు మిత్ర ప్రయోజనంబుల నియమింతు రిన్నిటం గొఱంత లేదు. రాగాది శూన్యుండు నిరహంకారుండు నద్వయుండు సమదర్శనుండు సర్వాత్మకుండునయిన యీశ్వరునకు నతోన్నత భావ మతి వైషమ్యంబు లెక్కడివి లేవైన భక్తవత్సలుండు గావున నేకాంతభక్తులకు సులభుండై యుండు. ౨౧౩

సీ. అతిభక్తి నెవ్వని యందుఁ జిత్తముఁ జేర్చి
యెవ్వనినామ మూహించిపొగడి
కాయంబు విడుచుచుఁ గామకర్మాదిని
ర్మూలనుండై యోగి ముక్తినొందు
నట్టిసర్వేశ్వరుం డఖిల † దేవోత్తముఁ
డెవ్వేళఁ బ్రాణంబు లేను విడుతు
నందాఁక నిదె మహాహర్షుఁడై వికసిత
వదనారవిందుఁడై వచ్చె నేఁడు

---

* మాతులేయుండు = మేనమఱఁది ♦ సచివుఁడు = మంత్రి.
† దేవోత్తముఁడు = దేవశ్రేష్ఠుఁడు.

తే. నాల్గుభుజములుఁ గమలాభ నయనయుగము
నొప్పఁగన్నులముందట నున్నవాఁడు
మానవేశ్వర నాభాగ్య మహిమఁజూడు
మేమిసేసితినో పుణ్య మితనిగూర్చి. ౧౧౪

వ. అని యిట్లు ధనంజయ సంప్రాపిత శరపంజరుండయిన కురుకుంజరుని వచనంబు లాకర్ణించి మును లందఱు వినుచుండ ధర్మనందనుండు మందాకినీనందనువలన నరజాతి సాధారణంబు లగు ధర్మంబులును, వర్ణాశ్రమ ధర్మంబులును, రాగవైరాగ్యోపాధులతోఁ గూడిన ప్రవృత్తి నివృత్తిధర్మంబులును, దానధర్మంబులును, రాజధర్మంబులును, స్త్రీధర్మంబులును, శమదమాదికంబులును, హరితోషణంబులగు ధర్మంబులును, ధర్మార్థకామ మోక్షంబులును, నానావిధోపాఖ్యానేతిహాసంబులును సంక్షేప విస్తారరూపంబుల నెఱింగె, నంత రథికసహస్రంబులకు ♦ గమికాఁడయిన భీష్ముండు స్వచ్ఛందమరణులైన యోగీశ్వరుల చేత వాంఛితంబగు నుత్తరాయణంబు సనుదెంచిన నది దనకు మరణోచిత కాలంబని నిశ్చయించి. ౧౧౫

శా. ఆలాపంబులు మాని చిత్తము మనీషాయత్తముం జేసి దృ
గ్జాలంబుల్ హరిమోముపైఁ బఱపి తత్కారుణ్య దృష్టిన్ విని
ర్మాలీభూతశరవ్యథానిచయుడై * మోదించి భీష్ముండు సం
శీలం బొప్పనుతించెఁ ♦ గల్మషగజ శ్రేణీహరిన్ శ్రీహరిన్. ౧౧౬

వ, ఇట్లు పీతాంబరధారియుఁ జతుర్భుజుండు నాదిపూరుషుండుఁ బరమేశ్వరుండునగు హరియందు నిష్కాముండయి విశుద్ధంబగు ధ్యాన విశేషంబుచే నిరస్తదోషుండగుచు ధారణావతి యైనబుద్ధిని సమర్పించి పరమానందంబునొంది ప్రకృతివలన నైన సృష్టిపరంపరలఁ బరిహరించు తలంపున మందాకినీ నందనుం డిట్లనియె. ౧౧౭

---

♦ గమికాఁడు = అధిపతి.

* మోదించు = సంతోషించు.

♦ కల్మషగజశ్రేణీహరి = పాపములనెడి యేనుఁగులకు సింహము.

## —♦ భీష్ముఁడు శ్రీకృష్ణుని స్తుతించుట ♦—

మ. త్రిజగన్మోహననీలకాంతి తనువుం దీపింపఁ బ్రాభాతనీ
రజబంధు ప్రభ మైనచేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజసంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా
విజయుం జేరెడువన్నెకాఁడు మది నా వేశించు నెల్లప్పుడున్.

మ. హయ§రింఖాముఖధూళిధూసరపరి న్యస్తాలకోపేతమై
రయజాతశ్రమతోయబిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో
జయముం బార్థున కిచ్చువేడ్క నని నా శస్త్రాహతిం జాల నొ
చ్చియుఁ బోరించుమహానుభావు మదిలోఁ జింతింతు నశ్రాంతమున్.

మ. నరుమాటల్ విని నవ్వుతో నుభయసేనా మధ్యమక్షోణిలోఁ
బరులీక్షింప రథంబు నిల్పి పరభూపాలావళిం జూపుచుం
బరభూపాయువు లెల్లఁ జూపులన శుంభత్కేళి వంచించు నీ
పరమేశుండు వెలుంగుచుండెడును హృత్పద్మాసనాసీనుఁడై.

క. తనవారిఁ జంపఁ జాలక, వెనుకకుఁ బో నిచ్చగించు విజయునిశంకన్
ఘనయోగవిద్యఁ బాపిన, మునివంద్యుని పాదభక్తి మొనయున్ నాకున్

సీ. కుప్పించియెగసినఁ గుండలంబుల కాంతి,
గగనభాగం బెల్ల గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులో నున్న,
జగముల * వ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచురయమునఁ,
బైనున్న పచ్చని పటముజాఱ
నమ్మితి నాలావు నగుఁబాటు సేయకు,
మన్నింపుమని క్రీడి మరలఁదిగువఁ
తే. కరికి లంఘించు సింహంబు కరణి మెఱసి,
నేఁడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁగాతు

---

§ రింఖ = గిట్ట. * వ్రేఁగు = తపనము



(పేజి 53)    సీ॥ మప్పించి యొగసిన ... ... ... ... ... ... ...
... ... ... ... ... ... దేవుండు దివ్యనామ.

విడువుమర్జున! యనుచు మ ద్విశిఖవృష్టిఁ,
♦ దెరలిచనుదెంచు దేవుండు దిక్కునాకు. ౨౨౨

మ. తనకుఁ భృత్యుఁడువీనిఁ గాచుట మహాధర్మంబు వో మ్మంచు న
ర్జునసారథ్యము పూని పగ్గములు చేఁ జోద్యంబుగాఁ బట్టుచుఁ
§ మునికోలఁ వడిఁ బూన్చి ఘోటకములఁ మోదించి తాడించుచుఁ
జనులఁ మోహమునొందఁ జేయుపర మోత్సాహుం బ్రశంసించెదన్.

క. పలుకుల నగవుల నడపుల, సలుకల నవలోకనముల † నాభీరవధూ
కులములమనములతాలిమి, గొలుకులువదలించుఘనునిఁగొలిచెదమదిలోఁ

ఆ. మునులునృపులుజూడ మునుధర్మజునిసభా,
మందిరమునయాగ మండపమునఁ
జిత్రమహిమతోడఁ జెలువొందుజగదాది,
దేవుఁడమరు నాదు దృష్టియందు. ౨౨౪

మ. ఒకసూర్యుండు సమస్తజీవులకుఁ దా నొక్కొక్కడై తోఁచుపో
లిక నేదేవుఁడు సర్వకాలము మహాలీలఁ నిజోత్పన్నజ
న్యకదంబంబుల హృత్సరోరుహములఁ నానావిధానూనరూ
పకుఁడై యొప్పుచు నుండు నట్టిహరి నేఁబొర్థింతు శుద్ధుండనై.

వ. అనియిట్లు మనోవాగ్దర్శనంబులం బరమాత్ముండగు కృష్ణుని హృదయంబున నిలిపికొని నిశ్వాసంబుమాని నిరుపాధికంబయిన వాసుదేవబ్రహ్మంబునందుం గలసిన భీష్మునిం జూని సర్వజనులు * దివసావసానంబున ♦ విహంగంబు లూరకయుండు దెరంగుననుండిరి. దేవమానవవాదితంబులై దుందుభివాద్యంబులు మొఱసె. సాధుజనకీర్తనంబులుమెఱసె! గుసుమవర్షంబులు గుఱిసె, మృతుండయిన భీష్మునికి ధర్మజుండుపరలోకక్రియలు సేయించి ముహూర్తమాత్రంబుదుఃఖితుండయ్యె నంత నచ్చటమునులు గృష్ణునిఁ దమహృదయంబుల నిలిపికొని సంతుష్టాంతరంగులగుచుం దదీయ

---

♦ తెరలిచనుదెంచు = కదలివచ్చు. § మునికోల = ములుకోల.
† ఆభీరవధువు = గొల్ల స్త్రీ.
* దివసావసానంబు=సాయంకాలము ♦ విహంగంబులు=పక్షులు

దివ్యావతారనామమంబులచే స్తుతియించి స్వాశ్రమంబులకుం జనిరి. పిదప నయ్యుధిష్ఠిరుండు గృష్ణసహితుండయి గజపురంబునకుం జని గాంధారీ సమేతుండయిన ధృతరాష్ట్రునోడంబఱిచి తత్సమ్మతంబున వాసుదేవానుమోదితుండయి పితృపైతామహంబయిన రాజ్యంబు గైకొని ధర్మమార్గంబునం బ్రజాపాలనంబు సేయుచుండెనని చెప్పిన విని సూతునకు శౌనకుం డిట్లనియె. ౨౨౭

ఆ. ధనము లపహరించి తనతోడఁ జెనకెడు,
నాతతాయిజనుల నని వధించి
బంధుమరణదుఃఖ భరమున ధర్మజుం,
డెట్లు రాజ్యలక్ష్మి నిచ్ఛగించె. ౨౨౮

వ. అనిన సూతుం డిట్లనియె. ౨౨౯

క. కురుసంతతికిఁ బరీక్షి,
న్నరవరు నంకురము జేసి నారాయణుఁ డీ
ధరణీరాజ్యమునకు నీ
శ్వరుఁగా ధర్మజుని నిలిపి సంతోషించెన్. ౨౩౦

వ. ఇట్లు ధర్మనందనుండు భీష్మునివచనంబులం గృష్ణునిసంభాషణంబులం బ్రవర్ధమానవిజ్ఞానుండును నివర్తితశంకాకలంకుండునునయి నారాయణాశ్రయుండయిన యింద్రుండునుంబోలెఁ జతుస్సాగర *వేలాలంకృత బగు వసుంధరామండలంబు సహోదర సహాయుండయి యేలుచుండె. ౨౩౧

సీ. సంపూర్ణదృష్టిఁ ♦ బర్జన్యుండు గురియించు
నిలయెల్లఁ గోర్కుల నీనుచుండు
గోవులు వర్షించు ‡ ఘోషభూముల బాలు
ఫలవంతములు లతా పాదపములు
పండు సస్యములు దప్పక ఋతువుల నెల్ల,
ధర్మమెల్లెడలను దనరియుండు

* వేల=చెలియలికట్ట. ♦ పర్జన్యుండు = మేఘుండు.
‡ ఘోషభూములు = గొల్లపల్లె ప్రదేశములు

♦దైవభూతాత్మ తంత్రములగు రోగాది,
భయములు సెందవు ప్రజలకెందుఁ

ఆ. గురుకులోత్తముండు కుంతితనూజుండు,
దానమానఘనుఁడు ధర్మజుండు
సత్యవాక్యధనుఁడు సకలమహీరాజ్య,
విభవభాజి యయిన వేళయందు ౨౩౨

శ్రీకృష్ణుండు ద్వారకానగరంబున కరుగుట.

వ. అంతఁ గృష్ణుండు చుట్టాలకు శోకంబు లేకుండంజేయుకొరకును సుభద్రకుఁ బ్రియంబు సేయుకొఱకును గజపురంబునం గొన్ని నెలలుండి ద్వారకానగరబునకుం బ్రయాణంబు సేయందలంచి ధర్మనందనునకుం గృతాభివందనుండగుచు నతనిచే నాలింగితుండయి †యామంత్రణంబు వడసి కొందఱు దనకు నమస్కరించినం గౌఁగిలించుకొని కొందఱు తనుంగౌఁగిలింప నానందించుచు రథారోహణంబు సేయు నవసరంబున సుభద్రయు ద్రౌపదియుఁ గుంతియు నుత్తరయు గాంధారియు ధృతరాష్ట్రుండును, విదురుండును, యుయుత్సుండును, కృపాచార్యుండును, ధౌమ్యుండును, యుధిష్ఠిరుండును,నకుల సహదేవులును,*వృకోదరుండును, సత్సంగంబు వలన ముక్తదుస్సంగుండగు బుధుండు సకృత్కాలసంకీర్త్యమానంబై రుచికరంబగు నెవ్వనియశంబు నాకర్ణించి విడువనోపం డట్టి హరి తోడి వియోగంబు సహింపక దర్శనస్పర్శనాలాపశయనాసన భోజనంబులవలన నిమిషమాత్రంబును హరికి నెడలేనివారలయిన పాండవులంగూడికొని హరి మరలవలయునని కోరుచు హరి చనినమార్గంబు సూచుచు హరి విన్యస్తచిత్తులయి లోచనంబుల బాష్పంబులొలుక నంతంత నిలువంబడి రయ్యవసరంబున. ౨౩౩

---

♦ దైవభూతాత్మ తంత్రములు—తాపత్రయములు

†ఆమంత్రణంబువడసి=సెలవుపుచ్చుకొని

*వృకోదరుండు = తోడేలు పొట్టవంటి పొట్టగలవాడు మిక్కిలి యాఁకలి గలవాఁడనుభీముఁడు

సీ. కనకసౌధములపైఁ గౌరవకాంతలు
కుసుమవర్షంబులు గోరి కురియ
మౌక్తికదామ సమంచిత * ధవళాత
పత్రంబు విజయుఁడు పట్టుచుండ
నుద్ధవసాత్యకు లుత్సాహవంతులై
రత్నభూషితచామరములు వీవ
గగనాంతరాళంబుఁ గప్పి కాహళభేరి
పటహశంఖాది శబ్దములు మొరయ
ఆ. సకలవిప్రజనులు సగుణనిర్గుణరూప
భద్రభాషణములు వలుకుచుండ
భువనమోహనుండు పుండరీకాక్షుండు
పుణ్యరాశి హస్తిపురము వెడలె. ౨౩౮

వ. తత్సమయంబునం బౌరసుందరులు ప్రాసాదశిఖరభాగంబుల నిలిచి గోపాలసుందరుని సందర్శించి వర్గంబులై మార్గంబు రెండుదెసలం గరారవిందంబులు సాఁచి యొండొరులకుం జూపుచుం దమలోనం దొల్లి గుణంబులం గూడక జీవులు లీనరూపంబులై యుండం బ్రపంచంబు ప్రవర్తింపని సమయంబున నొంటి దీపించు పురాణపురుషుం డితండనువారును, జీవులకు బ్రహ్మత్వము గలుగ లయంబుసిద్ధించుట యెట్లనువారును, జీవోపాధిభూతంబు లయిన సత్త్వాదిశక్తులలయంబు జీవలయంబనువారును, గ్రిమ్మఱ శాస్త్రకర్తయైన సప్పరమేశ్వరుండు నిజవీర్యప్రేరితయై నిజాంశభూతంబులైన జీవులకు మోహిని యగుచు సృష్టిచేయ నిచ్ఛించి, నామరూపంబులు లేనిజీవులందునామ రూపంబులు గల్పించుకొఱకు వేదంబులనిర్మించి, యనుసరణంబు సేయునను వారును, నిర్మల‡ భక్తిసముత్కంఠా విశేషంబుల ♦నకుంఠితులై జితేంద్రియులై నిర్జితప్రాణు లగు విద్వాంసులిమ్మహాను భావు నిజరూపంబు దర్శింతురనువారును, యోగమార్గంబులం దర్శింప రాదనువారునై మఱియును. ౨౩౯

* ధవళాతపత్రము=తెల్లగొడుగు ‡ భక్తిసముత్కంఠం=భక్తివలని వేగిరపాటు.
♦ అకుంఠితులు = మొక్కపోనివారు (సంపూర్ణులు)

మ. రమణీ దూరము వోయెఁ గృష్ణురథమున్ రాదింక వీక్షింప నీ
కమలాక్షుం బొడఁగాన లేనిదినముల్ గల్పంబులై తోఁచు గే
హములందుండఁగ నేల పోయి పరిచర్యల్ సేయుచున్ నెమ్మనం
దము రమ్మా యనె నొక్కచంద్రముఖి § కందర్పాశుగ భ్రాంతయై.

మ. తరుణీ యాదవరాజు గాఁ డితఁడు వేదవ్యక్తుఁడై యొక్కఁడై
వరుసన్ లోకభవస్థితి ప్రళయముల్ వర్తిల్లఁగాఁ జేయు దు
స్తరలీలారతుఁ డైనయీశుఁ డితనిన్ దర్శించితిం బుణ్యభా
సుర నే నంచు నటించె నొక్కతె మహా శుద్ధాంతరంగంబునన్. ౨౩౭

క. తామసగుణులగు రాజులు, భూమింబ్రభవించిప్రజలఁబొలియింపఁగ స
త్త్వామలతనుఁడై యీతఁడు, భామిని వారలవధించుఁ బ్రతికల్పమునన్.

వ. ఇదియునుంగాక. ౨౩౮

సీ. ఈయుత్తమశ్లోకు డెలమి జన్మింపఁగ
యాదవకులమెల్ల ననఘమయ్యె
నీపుణ్యవర్తనుఁ డేప్రొద్దునుండంగ
మధురాపురముదొడ్డ మహిమఁగనియె
నీపూరుషశ్రేష్ఠు నీక్షించి భక్తితో
ద్వారకావాసులు ధన్యులైరి
యీమహాబలశాలి యెఱిఁగి శిక్షింపంగ,
*నిష్కంటకం బయ్యె నిఖిలభువన

తే. మీజగన్మోహనాకృతి నిచ్చగించి,
♦పంచశరభల్లజాలవిభజ్యమాన
విమల మానసమై † వల్లవీసమూహ
మితని యధరామృతముఁగ్రోలు నెల్లప్రొద్దు. ౨౩౯

ఉ. ఈకమలాక్షు నీసుభగు నీకరుణాంబుధిఁ బ్రాణనాథుఁ గాఁ
జేకొని వేడ్కఁ గాఁపురము సేయుచు నుండెడి రుక్మిణీముఖా

---

§ కందర్పాశుగ భ్రాంత = కామమోహితురాలు.
* నిష్కంటకంబు = నిర్బాధితంబు. ♦ పంచశరభల్లము = మన్మథబాణము.
† వల్లవీసమూహము=గొల్లస్త్రీలసముదాయము.

నేకపతివ్రతల్ నియతి నిర్మలమానసులై జగన్నుతా
స్తోకవిశేషతర్థములఁ ‡ దొల్లిఁటిబాముల నేమినోఁచిరో. ౨౮౦

వ. అనియిట్లు నానావిధంబులుగాఁ బలుకుపురసుందరీవచనంబు లాకర్ణించి కటాక్షించి నగుచు నగరంబు వెడలె. ధర్మజుండును హరికి రక్షణంబులై కొలిచి నడవం జతురంగబలంబులం బంచిన దత్సేనా సమేతులై తనతోడి వియోగంబున కోర్వక దూరంబు వెనుతగిలిన కౌరవుల మరలించి కురుజాంగలపాంచాల దేశంబులుదాఁటి శూరసేన యామునభూములం గడచి బ్రహ్మావర్త కురుక్షేత్రమత్స్యసారస్వత మరుధన్వసౌవీరాభీర సైంధవవిషయంబు లతిక్రమించి తత్తద్దేశవాసు లిచ్చిన కానుకలఁ గైకొనుచు నానర్తమండలంబుసొచ్చిపద్మబంధుండు పశ్చిమసింధునిమగ్నుండైన సమయంబునఁ బరిశ్రాంతవాహుండై చనిచని. ౨౮౧

## —♦ శ్రీకృష్ణుండు ద్వారకానగరంబు ప్రవేశించుట. ♦—

మ. జలజాతాక్షుఁడు శౌరి డగ్గఱె మహాసౌధాగ్ర బృందారకం
గలహంసావృత హేమపద్మపరిఖాకాసారకం దోరణా
వళిసంఛాదిత తారకం దరులతావర్గానువేలోదయ
త్ఫలపుష్పాంకుర * కోరకన్ మణిమయప్రాకారకన్ ద్వారకన్.

వ. ఇట్లు తనప్రియపురంబు డగ్గఱి. ౨౮౩

మత్తకోకిలము. అన్యసన్నుతసాహసుండు మురారియొత్తెయదూత్తముల్
ధన్యులై వినఁ ♦ బాంచజన్యము దారితాఖిల జంతుచై
తన్యమున్ భువనైకమాన్యము దారుణస్వనభీత రా
జన్యముం బరిమూర్ఛితాఖిల శత్రుదానవసైన్యమున్. ౨౮౪

శా. శంఖారావము వీనులన్ విని జనుల్ స్వర్ణాంబర ద్రవ్యముల్
శంఖాతీతము కొంచు వచ్చిరి † దిదృక్షాదర్పితోత్కంఠన

---

‡ తొల్లిటిబాములన్ = పూర్వజన్మములయందు

* కోరకము = మొగ్గ ♦ పాంచజన్యము=విష్ణునిశంఖము. † దిదృక్ష = చూచు యిచ్ఛ.

ప్రేంఖద్భక్తులు § వంశకాహళమహాభేరీగజాశ్వావళీ
రింఖారావము లుల్లసిల్ల దనుజారిం జూడనాసక్తులై. ౨౮౭

క. బంధులు పౌరులుఁ దెచ్చిన, † గంధేభహయాదులైనకానుకలు దయా
సింధుఁడు గైకొనె నంబుజ, బంధుఁడుగొనుద త్తదీపపంక్తులభంగిన్,

వ. ఇట్లాత్మారాముండుఁ బూర్ణకాముండును నయినయప్పరమేశ్వరునికి
నుపాయనంబు లిచ్చుచు నాగరులు వికసితముఖులయిగద్గద భాషణం
బులతోడ డయ్యాకుండ నడఘునయ్యాకు నెయ్యంపుజూపుల నడ్డంబు
లేని బిడ్డలచందంబున మ్రొక్కి యిట్లనిరి. ౨౮౮

శా. నీపాదాబ్జము బ్రహ్మపూజ్యము గదా నీసేవ సంసారసం
తాపధ్వంసిని యౌఁ గదా సకలభద్రశ్రేణులం బ్రీతితో
నాపాదింతు గదా ప్రపన్నులకుఁ గాలాధీశ కాలంబు ని
ర్వ్యాపారంబు గదయ్య చాలరు నినున్ వర్ణింపబ్రహ్మాదులున్.

క. ఉన్నారము సౌఖ్యంబున, విన్నారము నీప్రతాప విక్రమకథలన్
మన్నారము ధనికులమై, కన్నారము తావకాంఘ్రికమలములు హరీ.

క. * ఆరాటము మదినెఱుఁగము, పోరాటములిండ్లకడలఁ బుట్టవుపురిలోఁ
♦ జోరాటన మెనయదు నీ,దూరాటనమోర్వలేము తోయజనేత్రా.

ఉ. తండ్రుల కెల్లఁ దండ్రి యగుధాతకుఁ దండ్రివి దేవ! నీవు మా
తండ్రివిఁదల్లివిం బతివి దైవమవున్ సఖివిన్ గురుండవుం
దండ్రులు నీక్రియం బ్రజల ధన్యులఁ జేసిరె? వేల్పులైన నో
తండ్రి! భవన్ముఖాంబుజము ధన్యతఁ గానరు మావిధంబునన్. ౨౯౧

క. చెచ్చెరఁ గరినగరికి నీ విచ్చేసిన నిమిష మైన వేయేండ్లగు మా
కెచ్చోటికి విచ్చేయక మచ్చికతో నుండవయ్య మానగరమునన్.

ఆ. అంధకారవైరి యపరాద్రి యవ్వలఁ
జనిన నంధ మయినజగము భంగి

---

§ వంశము = పిల్లనగ్రోవి † గంధేభము = మదపుటేనుగు.

* ఆరాటము = పరితాపము. ♦ చోరాటనము = దొంగలసంచారము.

నిన్నుఁ గానకున్న నీరజలోచన
‡ యంధతమసయుతుల మగుదు మయ్య. ౨౫౩

వ. అని యిట్లు ప్రజలాడెడి భక్తియుక్తమధురమంజులాలాపంబులు గర్ణకలాపంబులుగా నవధరించి కరుణావలోకనంబులు వర్షించుచు హర్షించుచుఁ దనరాకవిని మహానురాగంబున సంరంభవేగంబుల మజ్జనభోజనశయనాదికృత్యంబు లొల్లక యుగ్రసేనాక్రూర వసుదేవబలభద్రప్రద్యుమ్న సాంబచారుదేష్ణగదప్రముఖయదుకుంజరులు కుంజరతురగరథారూఢులై దిక్కుంజరసన్నిభంబయిన యొక్క కుంజరంబుముందట నిడుకొని సూతమాగధనటనర్తకవందిసందోహంబుల మంగళభాషణంబులును భూసురాశీర్వాద వేదఘోషణంబులును వీణావేణుభేరీపటహశంఖకాహళధ్వానంబులును రథారూఢవిభూషణవిభూషితవారయువతీ గానంబులును నసమానంబులై చెలంగ నెదురుకొని యథోచితప్రణామాభివాదన*పరిరంభకరస్పర్శన సంభాషణమందహాససందర్శనాది విధానంబుల బహుమానంబులు సేసి వారలుం దానును భుజగేంద్రపాలితంబైన భోగవతీనగరంబు చందంబున స్వసమానబల యదుభోజ దాశార్హ కుకురాంధకవృష్ణివీరపాలితంబును, ♦ సకలకాలసంపద్యమానాంకురపల్లవ కోరకకుట్మలకుసుమఫల మంజరీ పుంజభార వినమిత లతాపాదపరాజీ విరాజితోద్యానమహావనోపవనారామ భాసితంబును, వనాంతరాళ రసాలసాలశాఖాంకురఖాదనక్షుణ్ణకషాయకంఠ †కలకంఠ మిథునకోలాహల ఫలరసాస్వాదపరిపూర్ణ శారికాకీరకుల కలకల ‡కల్హార పుష్పమకరందపాన పరవశ భృంగభృంగీకదంబఝుంకారసరోవర కనకకమల మృదుల§కాండఖండ స్వీకారమత్త *వరటాయత్త కలహంసనివహ క్రేంకారసహితంబును, మహోన్నత

‡ అంధతమసము = గాఢాంధకారము. * పరిరంభము = ఆలింగనము.
♦ సకలకాల సంపద్యమాన + అంకుర + పల్లవ + కోరక + కుట్మల + కుసుమ + ఫలములు = ఎల్లకాలమునందునట్టి మొలకలు, చిగురుటాకులు, మొగ్గలు, అరవిచ్చిన మొగ్గలు, పూవులు, పండ్లు. † కలకంఠము = కోకిల. ‡ కల్హారము = కలువ.
§ కాండఖండము = కాడముక్క. * వరట = ఆఁడుహంస.

సౌధజాలరంధ్రనిర్గతకర్పూరధూపధూమపటలసందర్శనసంజాతజలధర భ్రాంతి విభ్రాంతసముద్ధతపింఛ నర్తనప్రవర్తమాన మత్తమయూర కేకారవమహితంబును, నానారూపతోరణ ధ్వజవైజయంతికానికాయ నిరుద్ధతారకాగ్రహప్రకాశంబును, ముక్తాఫలవిరచిత§ రంగవల్లికాలంకృత మందిరద్వార † దేహళీవేదికా ప్రదేశంబును, ఘనసారగంధసారకస్తూరికా సంవాసితవణిగ్గేహ గేహళీనికర కనకగళంతికావికీర్యమాణ సలిలధారాసంసిక్త విపణిమార్గంబును, ప్రతినివాసబహిరంగణ సమర్పితరసాలదండ ఫలకుసుమ గంధాక్షత ధూపదీప రత్నాంబరాది వివిధోపహారంబును, ప్రవాళనీల మరకత వజ్రవైడూర్యనిర్మిత గోపురాట్టాలకంబును, విభవనిర్జితమహేంద్రనగరాలకంబునునైన పురవరంబు ప్రవేశించి రాజమార్గంబున నచ్చుసమయంబున. ౨౫౪

మత్తకోకిలము. కన్నులారఁగ నిత్యముం హరిఁ గాంచుచుం మనువారల
య్యున్నవీనకుతూహలోత్సవ యుక్తినాగరకాంత ల
త్యున్నతోన్నతహర్మ్యరేఖలనుండి చూచిరి నిక్క చే
సన్నలం దమలోనఁ దద్విభు సౌకుమార్యము సూపుచున్. ౨౫౫

సీ. కలుముల నీనెడు*కలకంఠి♦యెలనాఁగ
వర్తించు నెవ్వానివక్షమందు
జనదృక్చకోరిక సంఘంబునకు సుధా
పానీయపాత్రమే భవ్యముఖము
సకలదిక్పాలక సమితికి నెవ్వాని
బాహుదండంబులు పట్టుగొమ్మ
లాశ్రితశ్రేణి కే యధిపునిపాదరా
జీవయుగ్మంబులు §చేరుగడలు
ఆ. భువన మోహనుండు పురుషభూషణు డెవ్వాఁ
డట్టికృష్ణుఁ డరిగె హర్మ్యశిఖర

§రంగవల్లి= ముగ్గు. † దేహళి = గేహళి = (ఇంటి) గడప. * కలకంఠి = అవ్యక్త మధురమైన కంఠముగలది. ♦ ఎలనాఁగ = యౌవన స్త్రీ. § చేరుగడ = శరణము.

రాజమానలగుచు రాజమార్గంబున
♦రాజముఖులు గుసుమరాజిఁ గురియ. ౨౫౭

మ. జలజాతాక్షుఁడు సూడనొప్పె ధవళచ్ఛత్త్రంబుతోఁ జామరం
బులతోఁ బుష్ప†పిశంగచేలములతో భూషామణిస్ఫీతుఁడై
నలినీబాంధవుతో శశిధ్వజముతో నక్షత్రసంఘంబుతో
బలభిచ్చాపముతోఁ దటిల్లతికతో భాసిల్లుమేఘాకృతిన్. ౨౫౮

వ. ఇట్లరిగి తల్లిదండ్రులనివాసంబు సొచ్చి దేవకీప్రముఖు లయినతల్లుల
కేడ్వురకు మ్రొక్కిన. ౨౫౯

క. బిడ్డఁడు మ్రొక్కినతల్లులు, జడ్డన నంకముల నునిచి చన్నులతుదిఁ బా
లొడ్డగిలఁ బ్రేమభరమున, జడ్డువడం దడిపి రక్షిజలముల ననఘా.

—♦ శ్రీకృష్ణుం డంతఃపుర కాంతలం జూడఁబోవుట. ♦—

వ. తదనంతరంబ యష్టోత్తరశతషోడశసహస్ర సౌవర్ణసౌధకాంతం బయిన
శుద్ధాంతభవనంబు సొచ్చి హరి దన మనంబున. ౨౬౦

మ. ఒకదేవీభవనంబు మున్ను సొర వేఱొక్కర్తు లోఁ గుందునో
సుకరాలాపము లాడదో సొలయునో సుప్రీతి నీక్షింపదో
వికలత్వంబున నుండునో యనుచు నవ్వేళన్ వధూగేహముల్
ప్రకటాశ్చర్యవిభూతిఁ జొచ్చె బహురూపవ్యక్తుఁడై భార్గవా. ౨౬౧

వ. ఆ సమయంబున. ౨౬౨

క. శిశువులఁ జంకలనిడితను,కృశతలు విరహాగ్నిఁ దెలుపగృహగేహాళులన్
*రశనలు జాఱఁగ సిగ్గున, శశిముఖు లెదురేగి రపుడు జలజాక్షునకున్.

మ. పతి నాయింటికి మున్ను నచ్చెనిదె నాప్రాణేశుఁ డస్మద్గృహా
గతుఁడయ్యెన్ మును సేరెఁబో తొలుత మత్కాంతుండు నాశాలకే

♦ రాజముఖులు = చంద్రునివంటి ముఖముగల స్త్రీలు. † పిశంగచేలము = కపిలవర్ణమైన వస్త్రము. * రశనలు = మొలనూలు.

నితరాలభ్యసుఖంబుఁ గంటిమని తారింటింట నర్పించి ర
య్యతివల్ నూఱుఁ బదారువేలు నెనమండ్రవ్వేళ నాత్మేశ్వరున్.

వ. వారలం జూచి హరి యిట్లనియె. ౧౬౪

మ. కొడుకుల్ భక్తివిధేయు లౌదురుగదా కోడండ్రు మీవాక్యముల్
గడవంజాలక యుందురా విబుధ సత్కారంబుగావింతురా
♦తొడవుల్ వస్త్రములుం బదార్థరససందోహంబులుం జాలునా
§కడమల్ గావుగదా భవన్నిలయముల్ కళ్యాణయుక్తంబులే. ౧౬౫

సీ.*తిలక మేటికి లేదు ‡ తిలకినీతిలకమ
పువ్వులు దుఱుమవా పువ్వుఁబోడి
కస్తూరి యలఁదవా కస్తూరికాగంధి
తొడవులు దొడువవా †తొడవుతొడవ
కలహంసఁ బెంపుదే కలహంసగామిని
కీరముఁ జదివింతె కీరవాణి
లతలఁబోషింతువా లతికాలలితదేహ
సరసి నోలాడుదే సరసిజాక్షి

ఆ. మృగికి మేఁత లిడుదె మృగశాబలోచన
గురుల నాదరింతె గురువివేక
బంధుజనులఁ బ్రోతె *బంధుచింతామణి
యనుచు సతులనడిగె నచ్యుతుండు. ౧౬౬

వ. అని యడిగిన వారలు హరింబాసిన దినంబులందుశరీరసంస్కారకేళీవి
హారహాసవసమందిరగమన మహోత్సవదర్శనంబు లొల్లని యిల్లాండ్రు
గావున. ౧౬౭

మ. సిరిచాంచల్యముఁ గోడి దయ్యేఁ దనకుం జీవేశ్వరుండంచు నే
పురుషశ్రేష్ఠువరించు నట్టిపరముల్ బుద్ధిఁ విలోకంబులం

---

♦ తొడవులు = ఆభరణములు. § కడమలు = కష్టములు. * తిలకము = బొట్టు!
‡ తిలకినీతిలకమ = స్త్రీశ్రేష్ఠమా. † తొడవుతొడవ = అలంకారభూషితురాలా
* బంధుచింతామణి = చుట్టములకోరికలు తీర్చుదానా!

గరయుగ్మంబులఁ గాఁగిలించిరి సతుల్ గల్యాణబాష్పంబు లా
భరణశ్రేణులుగాఁ బ్రతిక్షణనవప్రాప్తానురాగంబులన్. ౧౬౮

మత్తకోకిలము. పంచబాణుని *నీరుచేసిన ♦భర్గునిం దనవిల్లు వ
ర్జించి మూర్ఛిలఁ జేయఁ జాలు విశేషహాసవిలోకనో
దంచితాకృతు లయ్యుఁ గాంతలు †దంభచేష్టల మాధవుం
జంచలింపఁగఁ జేయ నేమియుఁ జాలరైరి బుధోత్తమా. ౧౬౯

వ. ఇవ్విధంబున సంగవిరహితుండైన కంసారి సంసారికైవడి విహరింప నజ్ఞాన విలోకులయిన లోకులు లోకసామాన్యమనుష్యుం డని తలంతు రాత్మాశ్రయమైనబుద్ధి యాత్మయందున్న యానందాదులతోడం గూడని తెఱంగున నీశ్వరుండు ప్రకృతితోడంగూడియు నాప్రకృతిగుణంబులైన సుఖదుఃఖంబులఁ జెందక యుండు. పరస్పరసంఘర్షణంబులచే వేణువులవలన వహ్నింబుట్టించి వనంబుల దహించు మహావాయువు చందంబున భూమికిభారహేతువులై యనేకాక్షౌహిణులతోడం బ్రవృద్ధ తేజు లగు రాజుల కన్యోన్యవైరంబులు గల్పించి నిరాయుధుండై సంహారంబుసేసి శాంతుండై పిదపం గాంతామధ్యంబునఁ బ్రాకృత మనుష్యుండునుంబోలె సంచరించుచుండె నా సమయంబున. ౧౭౦

క. యతు లీశ్వరునిమహత్త్వము
మితమెఱుఁగనిభంగినప్రమేయుఁడగుహరి
స్థితి నెఱుఁగక కాముకుఁ డని
*రతములుసలుపుదురు తిగిచి రమణులు సుమతీ. ౧౭౧

క. ఎల్లప్పుడు మాయిండ్లను, వల్లభుఁడు వసించు నేమవల్లభలము శ్రీ
వల్లభున కనుచు గోపీ, వల్లభుచే సతులు మమత వలఁబడిరనఘా.

వ. అని చెప్పిన విని శౌనకుండు సూతున కిట్లనియె. ౧౭౩

---

* నీరు = భస్మము.
♦ భర్గునిన్ = శివుని.
† దంభచేష్టలన్ = కపటవ్యాపారములచే.
* రతములు = క్రీడలు,

—♦ ఉత్తరకుఁ బరీక్షిత్తు జనించుట. ♦—

సీ. గురునందనుండు సక్రోధుఁడై యేసిన
బ్రహ్మశిరోనామ బాణవహ్నిఁ
గంపించు నుత్తర ♦గర్భంబు గ్రమ్మఱఁ
బద్మలోచనుచేత బ్రదికెనండ్రు
గర్భస్థుఁ డగుబాలుఁ గంసారి యేరీతి
బ్రదికించె మృత్యువు భయము వాపి
జనియించి యతఁ డెన్ని సంవత్సరము లుండె?
నెబ్భంగి వర్తించె నేమి సేసె?

ఆ. వినుము శుకుఁడువచ్చి విజ్ఞానపద్ధతి
నతని కెట్లుసూపె నతఁడు పిదపఁ
దనశరీర మేవిధంబున వర్జించె
విప్రముఖ్య నాకు విస్తరింపు. ౧౭౪

వ. అనిన సూతుం డిట్లనియె. ధర్మనందనుండు చతుస్సముద్రముద్రితాఖిల జంబూద్వీపరాజ్యంబు నార్జించియు మిన్నుముట్టినకీర్తి నుపార్జించియు నంగనాతురంగ మాతంగ సుభటకాంచనాది దివ్యసంపదలు సంపాదించియు వీరసోదరవిప్రవిద్వజ్జన వినోదంబులఁ బ్రమోదించియు వైభవంబులలరించియుఁ గ్రతువు లాచరించియు దుష్టశిక్షణశిష్టరక్షణంబు లొనరించియు ముకుందచరణారవింద సేవారతుండై సమస్తసంగంబులందు నభిలాషంబు వర్జించి యరిషడ్వర్గంబు జయించి రాజ్యంబు సేయుచు. ౧౭౫

తే. చందనాదుల నాఁకట స్రగ్గువాఁడు
దనివి నొందనికై వడి ధర్మసుతుఁడు
సంపదలు పెక్కుగలిగియుఁ జక్రిపాద
సేవనంబులఁ బరిపూర్తి సెందకుండె. ౧౭౬

వ. అంతం గొన్ని దినంబులకు నభిమన్యు కాంతాగర్భంబునందున్న డింభ

---

♦ గర్భము = కడుపులోనిపిండము.

కుండు దశమ మాసపరిచ్ఛేద్యుండై గర్భాంతరాళంబున దురంతంబైన యశ్వత్థామ బాణానలంబున దందహ్యమానుండై తల్లడిల్లుచు. ౨౭౭

ఉ. కుయ్యిడ శక్తిలే దుదరగోళములోపల నున్నవాఁడ ది
క్కెయ్యది దా ననాథ నని యెప్పుడుఁ దల్లి గణింప విందు నేఁ
డి*య్యిషువహ్ని వాయుటకు నెయ్యది మార్గము నన్నుఁ గావ నే
యయ్య గలండు గర్భజనితాపద నెవ్వఁ డెఱుంగు దైవమా. ౨౭౮

క. ♦చిచ్చఱకోలవశంబునఁ, జచ్చి బహిర్గతుఁడ గాని సమయమునను దా
నుచ్చలితగర్భవేదనఁ, జచ్చును మాతల్లి గర్భసంతాపమునన్. ౨౭౯

క. చెచ్చెర బాణజ్వాలలు, వచ్చిన విష్ణుండు గావ వచ్చు ననుచుఁ దా
ముచ్చటలు సెప్ప సతులకు, నిచ్చలు మాయవ్వ నేఁడు నిజమయ్యెడినో.

శా. రాఁడా చూడ సమస్తభూతములలో రాజిల్లువాఁ డిచ్చటన్
లేఁడా పాఱునిచిచ్చుఱమ్ముఁ దొలఁగన్ లీలాగతిం ద్రోచి నా
కీఁడా నేఁ డభయప్రదాన మతఁ డూహింపన్ నతత్రాత మున్
గాఁడా యెందఱఁ గావఁ డీయెడల మత్కర్మంబు దానెట్టిదో. ౨౮౦

వ. అని గతాగత ప్రాణుండై ప్రాణగతుండై శిశువు చింతించు సమయంబున. ౨౮౧

సీ. మేఘంబుమీఁది క్రొమ్మెఱుఁగుకై వడి మేని
పై నున్న పచ్చని పటమువాఁడు
గండభాగంబులఁ గాంచనమణిమయ
మకరకుండలకాంతి మలయువాఁడు
శరవహ్ని నడఁగించు†సంరంభమునఁ జేసి
కన్నులనుఁ గెంపు గలుగువాఁడు
బాలార్కమండల ప్రతిమానరత్న♦హా
టకవిరాజితకిరీటంబువాఁడు

తే. కంకణాంగదవనమాలికావిరాజ
మానుఁ డసమానుఁ డంగుష్ఠమాత్రదేహుఁ

* ఇషువహ్ని = బాణాగ్ని, ♦ చిచ్చఱ కోల = అగ్ని బాణము † సంరంభము = ఆటోపము,
♦ హాటకము = బంగారు, ౪ అంగద = 'బాహుపురి' యను భూషణము.

ఘోరకగదఁ జేతఁ దాల్చి నేత్రోత్సవముగ
విష్ణుఁ డావిర్భవించె నవ్వేళయందు. ౨౮౩

వ. ఇట్లు భక్తపరాధీనుండైన పరమేశ్వరుం డావిర్భవించి మంచువిరియించు మార్తాండుచందంబున శిశువునకు దశదిశలం దనచేతి యఖండిత మహోత్తాలజ్వాలాసన్నిభంబైన గదాదండంబు మండలాకారంబుగ జిఱజిఱందిప్పి విప్రునిఁ౨ చిచ్చఱమ్ము వేఁడిమిపోడిమిఁ జెఱచిఴ డింభకుని పరితాపవిజృంభణంబు నివారించి గర్భంబు గందకుండ నర్భకునికి నానందంబుఁ గల్పించిన. ౨౮౪

మ. గదఁ జేఁబట్టి పరిభ్రమించుచు గదాఘాతంబులం గ్రూర + శు
క్ప్రదమై వచ్చు శరాగ్నిఁ దుత్తుమురుగా భంజించి రక్షించె నీ
సదయుం డెవ్వఁ డొకో యటంచు మదిలోఁ జర్చించుచుం *శాబకుం
డెదురై చూడ నదృశ్యుఁ డయ్యె హరి సర్వేశుండు విప్రోత్తమా.

వ. అంత ననుకూలశుభగ్రహోదయంబును సర్వగుణోత్తరఫలసూచకంబును నైన శుభలగ్నంబునం బాండవవంశోద్ధారకుం డయినకుమారుండు జన్మించిన ధర్మనందనుండు ధౌమ్యాదిభూసురవర్గంబు రప్పించి పుణ్యాహంబు సదివించి జాతకర్మంబులు సేయించి కుమారుజన్మమహోత్సవకాలంబున భూసురులకు విభవాభిరామంబు లయిన గోభూహిరణ్యాహయగ్రామంబులును స్వాదురుచిసంపన్నంబులయినయన్నంబు లిడిన వారలు తృప్తులై ధర్మపుత్త్రున కిట్లనిరి. ౨౮౫

చ. ప్రకటితదైవయోగమునఁ *పౌరవసంతతి యంతరింపఁగా
వికలత నొందనీక ప్రభవిష్ణుఁడు విష్ణుఁ డనుగ్రహించి శా
బకు బ్రతికించెఁ గావున నృపాలక శాబకుఁ డింక శాత్రవాం
తకుఁ డగువిష్ణురాతుఁ డనధాత్రిఁ బ్రసిద్ధికి నెక్కుఁ బూజ్యుఁడై.

---

౨ చిచ్చఱమ్ము. చిచ్చఱ + అమ్ము = అగ్నిమయమైన బాణము.

ఴ డింభకుఁడు = బాలుఁడు. × శుక్కు = శోకము. * శాబకుండు = పసిబాలుడు

* పౌరవసంతతి = 'పూరు' రాజసంబంధమైన సంతానము.

§ విష్ణురాతుఁడు = సంజ్ఞ.

వ. అనిన విని భూదేవోత్తములకు నరదేవోత్తముం డిట్లనియె. ౨౮౮

శా. ఓపుణ్యాత్ములార నాపలుకు మీ రూహింపుఁడా మ్రొక్కెదన్
మాపెద్దల్ శ్రుతికర్తలై సదయులై మన్నారు రాజర్షులై
యీపిన్నాతఁడు వారిఁ బోలెడిఁ గదా యెల్లప్పుడున్ మాధవ
శ్రీపాదాంబుజ భక్తియుక్తుఁడగుచున్ జీవించునే చూడరే. ౨౮౯

వ. అనిన విని నరేంద్రా భవదీయపౌత్త్రుండు మనుపుత్త్రుండయిన యిక్ష్వాకునిచందంబునం బ్రజలరక్షించు. శ్రీరామచంద్రునిభంగి బ్రహ్మణ్యుండు సత్యప్రతిజ్ఞుండు నగు. డేగ వెంటనంటిన బిట్టు భీతం బయి వెనుకకువచ్చిన ♦కపోతంబుగాచిన శిబిచక్రవర్తిరీతి శరణ్యుండు వితరణఖనియునగు. దుష్యంతసూనుండయిన భరతుపగిది జ్ఞాతివర్గంబులకునగు. యజ్వలకు ననర్గళకీర్తి విస్తరించు. ధనంజయ కార్తవీర్యుల కరణి ధనుర్ధరాగ్రేసరుండగుఁ. ‡గీలిపోలికి †దుర్ధర్షుండగు. సముద్రుని తెఱంగున దుస్తరుండగు. మృగేంద్రంబుకైవడి విక్రమశాలియగు. వసుమతివోలె నక్షయ క్షాంతియుక్తుం డగు. భానునిలాగునఁ బ్రతాపవంతుం డగు. వాసుదేవువడువున సర్వభూతహితుం డగు. తల్లిదండ్రులమాడ్కి సహిష్ణుం డగు. మఱియును. ౨౯౦

సీ. సమదర్శనంబున జలజాతభవుఁ డనఁ
బరమప్రసన్నత భర్గుఁ డనఁగ
నెల్లగుణంబుల *నిందిరావిభుఁ డన
నధికధర్మమున యయాతి యనఁగ
ధైర్యసంపద బలి దైత్యవల్లభుఁ డన
నచ్యుతభక్తిఁ బ్రహ్లాదుఁ డనఁగ
రాజితోదారత ♦రంతిదేవుం డన
నాశ్రితమహిమ హిమాద్రి యనఁగ

♦ కపోతంబు = పావురము. ‡ కీలి = అగ్ని.

† దుర్ధర్షుండు = తిరస్కరింపఁదగనివాఁడు.

* ఇందిరావిభుఁడు = లక్ష్మీపతి = విష్ణువు. ♦ రంతిదేవుఁడు = ఒకరాజు.

తే. యశము వర్ధించుఁ బెద్దల నాదరించు
నశ్వమేధంబులొనరించు నాత్మసుతుల
ఘనులఁ బుట్టించు దండించు ‡ ఖలులఁ బట్టి
మానధనుఁడు నీమనుమఁడు మానవేంద్ర. ౨౯౧

భుజంగప్రయాతము. హరించుం గలిప్రేరితాఘంబు లెల్లన్
భరించుం ధరన్ రామభద్రుండు వోలెన్
జరించున్ సదా వేదశాస్త్రానువృత్తిన్
వరించున్ విశేషించి వైకుంఠభక్తిన్. ౨౯.౨

వ. ఇట్లు పెక్కేండ్లు జీవించి భూసురకుమారక ప్రేరితంబయిన తక్షక సర్పవిషానలంబునం దనకు మరణం బని యెఱింగి సంగవర్జితుండయి ముకుంద పదారవిందభజనంబు సేయుచు శుకయోగీంద్రునివలన నాత్మవిజ్ఞానసంపన్నుండై గంగాతటంబున శరీరంబు విడిచి నిర్గతభయశోకంబైన లోకంబు ప్రవేశించునని జాతకఫలంబు సెప్పి లబ్ధకాములయి భూసురులు సని రంత. ౨౯౩

క. తనతల్లి కడుపులోపల, మును సూచినవిభుఁడు విశ్వమున నెల్లఁ గలం
డనుచుఁ బరీక్షింపఁగ జను,లనఘుఁ బరీక్షిన్నరేంద్రుఁ డండ్రు మునీంద్రా.

ఆ. కళలచేత † రాజు క్రమమునఁ బరిపూర్ణుఁ
డయినభంగిఁ దాత లనుదినంబు
పోషణంబు సేయఁ బూర్ణుఁడయ్యెను ధర్మ
పటలపాలకుండు బాలకుండు. ౨౯౫

వ. మఱియు ధర్మనందనుండు బంధుసంహారదోషంబు వాయుటకు నశ్వమేధయాగంబు సేయందలంచి ప్రజలవలనం గరదండంబుల నుపార్జితంబయిన విత్తంబుచాలక చిత్తంబునఁ జింతించు నెడ నచ్యుతప్రేరితులై భీమార్జునాదులు తొల్లి మరుత్తుం డనురాజు మఖంబు చేసి పరిత్యజించి నిక్షేపించిన సువర్ణ పాత్రాదికంబైన విత్తం బుత్తరదిగ్భాగంబు వలన బలవంతులై తెచ్చిన నారాజసత్తముండు సమాయత్తయజ్ఞోప

‡ ఖలులన్ = దుర్మార్గులను. † రాజు = చంద్రుఁడు.

కరణుండై సకలబంధుసమేతంబుగఁ గృష్ణునినాహ్వానంబుచేసి పురుషోత్తము నుద్దేశించి మూఁడు *జన్నంబులు గావించెఁ దదనంతరంబ కృష్ణుండు బంధుప్రియంబుకొఱకుఁ గరినగరంబునఁ గొన్ని నెలలుండి ధర్మపుత్త్రాదులచే నామంత్రణంబు వడసి యాదవసమేతుండై ♦ధనంజయుఁడు తోడరా నిజనగరంబునకుం జనియె నంత విదురుండు తీర్థయాత్రసని మైత్రేయుముందటఁ గర్మయోగజ్ఞానాదివిషయంబులయిన ప్రశ్నంబులం గొన్నింటిం జేసి యతనివలన నాత్మగతిం దెలిసి కృతార్థుండై హస్తిపురంబునకు వచ్చిన. ౨౯౬

క. బంధుఁడు వచ్చెనటంచును, గాంధారీవిభుఁడు మొదలుగా నందఱు సం
బంధములు నెఱపి ప్రీతిన్, чబంధురగతిఁ జేసి రపుడు మన్నన లనఘా.

వ. అంత ధర్మనందనుండు విదురునికి ɰ మజ్జన భోజనాది సత్కారంబుల సేయించి సుఖాసీనుండై తనవార లందఱు విన నిట్లనియె ౨౯౮

సీ. ఏవర్తనంబున నింతకాలము మీరు
సంచరించితి రయ్య జగతి లోన
నేతీర్థములు గంటి రెక్కడ నుంటిరి
భావింప మీవంటి × భాగవతులు
తీర్థసంఘంబుల ధిక్కరింతురు గదా
మీయందు విష్ణుండు మెఱయుకతన
మీరతీర్థంబులు మీకంటె మిక్కిలి
తీర్థంబు లున్నవే తెలిసిచూడ

గీ. వేఱె తీర్థంబు లవనిపై వెదకనేల
మిమ్ము బొడఁగనిభాషించు మేలెచాలు
వార్త లేమందుర్ లోకులు వసుధలోన
మీకునర్వంబు నెఱిఁగెడు *మేరగలను. ౨౯౯

---

*జన్నంబులు = యజ్ఞములు. ♦ ధనంజయుండు = అర్జునుఁడు.
ч బంధురగతిఁ = ఒప్పునట్టివిధముగా. ɰ మజ్జనము = స్నానము.
× భాగవతులు = భగవద్భక్తులు. * మేర = మర్యాద.

మత్తకోకిలము. తండ్రిసచ్చినమీఁద మాపెదతండ్రిబిడ్డలు దొల్లి పె
క్కండ్రు సర్పవిషాగ్ని బాధల ♦గాసి బెట్టఁగ మమ్ము ని
ల్లాండ్రనంతముఁ బొందకుండఁగ ५లాలనంబున మీరు మా
తండ్రి భంగి సముద్ధరింతురు తద్విధంబుఁ దలంతురే.

క. పక్షులు తమరెక్కలలోఁ, బక్షంబులు రానిపిల్ల ×పదువుల మమతన్
రక్షించినక్రియ మీరలు, పక్షీకరణంబు సేయ బ్రతికితిమి గదే.

క. మన్నారా ద్వారకలో, నున్నారా యదువు లంబుజోదరుకరుణం
గన్నారా లోకులచే, విన్నారా మీరువారి విధమెట్టిదియో. ౩౦౨

చ. అనవిని ధర్మరాజునకు నావిదురుండు సమస్తలోకవ
ర్తనముఁ గ్రమంబుఁగోడ విశదంబుగఁ జెప్పి యదుక్షయంబు సె
ప్పిన నతఁడుగ్రశోకమున బెగ్గిలి కుందెడి నంచు నేమియున్
వినుమని చెప్పఁడయ్యె యదువీరులనాశము భార్గవోత్తమా. ౩౦౩

ఆ. మేలు సెప్పెనేని మేలందురిలోకులు
చెట్టయందురి కీడుచెప్పెనేని
నంతమీఁద శూద్రుఁడైనకతంబున
శిష్టమరణ మతఁడు సెప్పఁడయ్యె. ౩౦౪

వ. అది యెట్లనిన మాండవ్యమహాముని శాపంబునం దొల్లి యముండు శూద్రయోనియందు విదురుండై జన్మించియున్న నూఱువత్సరంబు *లర్యముండు యథాక్రమంబునం బాపకర్ముల దండించె నిట్లు యుధిష్ఠిరుండు రాజ్యంబు గైకొని ♦లోకపాలసంకాశు లయిన తమ్ములుం దానును గులదీపకుండైన మనుమని ముద్దుసేయుచుఁ బెద్దకాలంబు మహావైభవంబున సుఖమై యుండె నంత. ౩౦౫

క. బాలాజన శాలాధన, లీలావన ముఖ్యవిభవ §లీనమనీషా
లాలసు లగుమానవులను, గాలమువంచించు దురవగాహము సుమతీ.

---

♦ గాసి = శ్రమ. ५ లాలనంబు = బుజ్జగింపు.

× పదువులన్ = సమూహములను. * అర్యముండు = సూర్యుఁడు.

♦ లోకపాల సంకాశులు = లోకపాలురతో సమానులు.

§ లీనమనీషాలాలసులు = లయించిన మనసునం దాసక్తి చెందినవారు

—♦ గాంధారీ ధృతరాష్ట్రులు దేహత్యాగము చేయుట. ♦—

వ. అదినిమిత్తంబుగాఁ గాలగతి యెఱింగి విదురుండు ధృతరాష్ట్రున
కిట్లనియె. ౩౦౨

మ. కనకాగారకళత్రమిత్రసుతసంఘాతంబులన్ ముందటం
గని ప్రాణేచ్ఛల నుండుజంతువుల నే కాలంబు దుర్లంఘ్యమై
యనివార్యస్థితిఁ జంపు నట్టి నిరుపాయంబైన కాలంబు వ
చ్చె నుపాంతంబున మాఱు దీనికి మదిం జింతింపు ధాత్రీశ్వరా. ౩౦౩

శా. పుట్టంధుండవు పెద్దవాఁడవు మహా భోగంబులా లేవు నీ
పట్టెల్లం జెడిపోయె దుస్సహజరాభారంబు పైఁగప్పె నీ
చుట్టా లెల్లను బోయి రాలు మగఁడున్ శోకంబునన్ మ్రగ్గెలై
కట్టా దాయలపంచ నుండఁ దగవే కౌరవ్యవంశాగ్రణీ. ౩౦౪

క. పెట్టితిరి చిచ్చు గృహమునఁ, బట్టితిరి తదీయభార్యఁ బాడడవులకుం
గొట్టితిరివారుమనుపఁగ, ‡నెట్టనభరియింపవలెనె యీప్రాణములన్.

క. బిడ్డలకు బుద్ధి సెప్పని, గ్రుడ్డికిఁబిండంబు వండికొని పొండిదె పైఁ
బడ్డాఁడని భీముం *డోలి, గొడ్డెములాడంగఁ గూడుఁ గుడిచెదనధిపా.

క. కనియెదవో బిడ్డలనిఁక, మనియెదవోతొంటికంటె మనుమలమాటల్
వినియెదవో యిచ్చెద ర,మ్మనియెదవో దానములకు నవనీసురులన్.

క. దేహము నిత్యముగాదని, మోహముఁ దెగఁగోసి సిద్ధమునివరుఁడై
దేహము వెలువడునరుఁడు, త్సాహముతోఁ జెందుముక్తిసంపద ననఘా.

వ. అని విదురుండు ధృతరాష్ట్రునకు విరక్తిమార్గం బుపదేశించిన నతండు
♦ప్రజ్ఞాచక్షుండై సంసారంబు దిగనాడి మోహపాశంబువలన నూడి
విజ్ఞానమార్గంబునంగూడిదుర్గమంబగుహిమవన్నగంబునకునిర్గమించిన.

శా. అంధుండైన పతిన్ వరించి పతిభావాసక్తి నేత్రద్వయీ
బంధాచ్ఛాదనమున్ ధరించి నియమప్రఖ్యాతయై యున్నత

---

‡ నెట్టనన్ = అనివార్యముగ.

* ఓలిగొడ్డెములు = వంకరమాటలు

♦ ప్రజ్ఞాచక్షుండు = బుద్ధి బల నేత్రముగలవాఁడు.

ద్గాంధారక్షితినాథుకూఁతు రనుయోగప్రీతి చిత్తంబులో
సంధిల్లం బతివెంట నేఁగె నుదయత్సాధ్వీగుణారూఢయై. ౩౦౫

చ. వెనుకకు రాక చొచ్చు రణవీరుని కైవడి రాజదండనం
బునకు భయంబు లేక వడిఁబోయెడుధీరునిభంగి నవ్వధూ
వనిత దురంతమైన హిమవంతముపొంత వనాంతభూమికిం
బెనిమిటితోడ నించుకయు భీతివహింపక యేఁగెఁ బ్రీతితోన్. ౩౦౬

వ. ఇట్లు విదురసహితులై గాంధారీధృతరాష్ట్రులు వనంబునకుం జనిన మఱునాఁడు ధర్మనందనుఁడు ప్రభాతంబున సంధ్యావందనంబు చేసి నిత్యహోమంబు గావించి బ్రాహ్మణోత్తములకు గోహిరణ్యతిల వస్త్రాది దానంబులు సేసి నమస్కరించి గురువందనంబుకొఱకుఁ బూర్వప్రకారంబునం దండ్రి మందిరంబునకుఁ జని యందు విదుర సహితులయిన తల్లిదండ్రులం గానక మంజుపీఠంబునఁ గూర్చున్న సంజయున కిట్లనియె. ౩౦౭

సీ. మాతల్లిదండ్రులు మందిరంబున లేరు
సంజయ వా రెందుఁ జనిరి నేఁడు
ముందరఁ గానఁడు ముదుసలి మాతండ్రి
పుత్త్రశోకంబునఁ బొగులుఁ దల్లి
సౌజన్యనిధి ప్రాణసఖుఁడు మాపినతండ్రి,
మందబుద్ధులమైన మమ్ము విడచి
యెందుబోయిరొ మువ్వు రెఱిఁగింపు గంగలోఁ
దనయపరాధంబు దడవికొనుచు

ఆ. భార్యతోడఁ దండ్రి పరితాపమునుబొందుఁ
గపటమింతలేదు కరుణగలఁడు
పాండుభూవిభుండు పరలోకగతుఁడైన
మమ్ముఁ బిన్నవాండ్ర మనిచె నతఁడు. ౩౦౮

వ అనిన సంజయుండు దయాస్నేహంబుల నతి * కర్శితుండగుచుఁ దన

* కర్శితుండు = కృశింపఁజేయఁబడినవాఁడు.

ప్రభువుపోయిన తెఱంగెఱుంగక కొంతతడ వూరకుండి తద్వియోగ దుఃఖంబునఁ గన్నీరు దుడిచికొనుచు బుద్ధిబలంబునం జిత్తంబు స్థైర్యాయత్తంబు సేసి తన భర్తృపాదంబుల మనంబున నెన్నుచు ధర్మజున కిట్లనియె. ౩౦౯

తే. అఖిలవార్తలు మున్ను నన్నడుగుచుండు
నడుగఁ డీ రేయి మీతండ్రి యవననాథ
మందిరములోన విదురుతో ♦ మంతనంబు
నిన్న యాడుచునుండెడు నేఁడు లేఁడు ౩౧౦

వ. విదురగాంధారీ ధృతరాష్ట్రులు నన్ను వంచించి యెందుఁబోయిరో వారల నిశ్చయంబు లెట్టివో యెఱుంగ నని సంజయుండు దుఃఖించు సమయంబునఁ దుంబురు సహితుండై నారదుండు వచ్చిన లేచి నమస్కరించి తమ్ములుం దానును నారదుంబూజించి కౌంతేయాగ్రజుం డిట్లనియె. ౩౧౧

ఉ. అక్కట తల్లిదండ్రులు గృహంబున లేరు మహాత్మ! వారు నేఁ
డెక్కడ వోయిరో యెఱుఁగ నెప్పుడు బిడ్డలపేరు గ్రుచ్చి తాఁ
బొక్కుచు నుండుఁ దల్లి యెటువోయెనొకో విపదంబురాశికిన్
నిక్కము * కర్ణధారుఁడవు నీవు జగజ్జనపారదర్శనా! ౩౧౨

వ. అనిన విని సర్వజ్ఞుండైన నారదుండు ధర్మజున కిట్లనియె. ఈశ్వరవశంబు విశ్వం బీశ్వరుండ భూతంబుల నొకటితో నొకటిఁ జేర్చు నెడఁబాపు § సూచీభిన్ననాసికలందు ∴ రజ్జుప్రోతంబు లగుచుఁ గంఠరజ్జువులఁ గట్టంబడిన △ బలీవర్దంబులం బోలెఁ గర్తవ్యాకర్తవ్య వేదలక్షణ యగు వాక్తంత్రియందు వర్ణాశ్రమలక్షణంబులుగల నామంబులచే బద్ధులై లోకపాల సహితంబైన లోకం బీశ్వరాదేశంబు వహించుఁ గ్రీడాసాధనంబులగు నక్షకంతుకాదుల కెట్లు సంయోగవియోగంబు

---

♦ మంతనంబు = ఆలోచన. * కర్ణధారుఁడు = నావికుఁడు. § సూచీభిన్న నాసికలు = సూదితో భేదింపఁబడిన ముక్కులు. ∴ రజ్జుప్రోతంబులు = దారముచే గ్రుచ్చఁబడినవి. △ బలీవర్దంబులు = ఎద్దులు.

29300
11-9-87
UNIVERSITY OF HYDERABAD LIBRARY

లగుచుండు నటుల నిచ్ఛాప్రకారంబునం గ్రీడించు నీశ్వరునికిం గ్రీడా సాధనంబులైన జంతువులకు సంయోగ వియోగంబు లగుచుండు. సమస్త జగంబును జీవరూపంబున ధ్రువంబును దేహరూపంబున నధ్రువంబునై యుండు. మఱియొక్క పక్షంబున ధ్రువంబున ధ్రువంబునుం గాక యుండు. శుద్ధబ్రహ్మ స్వరూపంబున ననిర్వాచనీయంబై రెండునై యుండు § నజగరంబుచేత మ్రింగంబడిన పురుషుండన్యుల రక్షింపలేని తెఱంగునం బంచభూతమయంబై కాలకర్మగుణాధీనంబైన దేహంబు పరుల రక్షింప సమర్థంబుగాదు. కరంబులుగల జంతువులకుం గరంబులు లేనిచతుష్పదంబు లాహారంబు లగు. చరణంబులుగల ప్రాణులకుం జరణంబులులేని తృణాదులు భక్షణీయంబు లగు. అధికజన్మంబులుగల వ్యాఘ్రాదులకు నల్పజన్మంబులుగల మృగాదులు భోజ్యంబులగు. సకలదేహి దేహంబులందు జీవుండు గలుగుటంజేసి జీవునికి జీవుండ జీవిక యగు. సహస్తాసహస్తాది రూపంబైన విశ్వమంతయు నీశ్వరుండుగాం దెలియు మతనికవేఱు లేదు. నిజమాయావిశేషంబున మాయావియై జాతిభేదరహితుండై నయీశ్వరుండు బహుప్రకారంబుల భోగిభోగ్యరూపంబుల నంతరంగ బహిరంగంబుల దీపించుం గాన ననాథులు దీనులునగు నాతలిదండ్రులు ననుంబాసి యేమయ్యెదరో యెట్లువర్తించెదరో యని వగవం బని లేదు.. అజ్ఞానమూలంబగు స్నేహంబున నైన మనోవ్యాకులత్వంబు పరిహరింపుమని మఱియు నిట్లనియె. ౩_౧౩

ఆ. అట్టికాలరూపుం డఖిలాత్ముం డగువిష్ణుం
డసురనాశమునకు నవతరించి
దేవకృత్యమెల్లం దీర్చి చిక్కినపని
కెదురుసూచుచుండు నిప్పు డధిప. ౩_౧౪

మత్తకోకిలము. ఎంతకాలము కృష్ణుం డీశ్వరుం డిద్ధరిత్రిం జరించు మీ
రంతకాలము నుండుం డందఱు నవ్వలం బని లేదు వి

---

§ అజగరంబు = సర్పము.

భ్రాంతి మానుము కాలముం గడవంగ నెవ్వరు నోప రీ
చింత యేల నరేంద్రసత్తమ చెప్పెదన్ విను మంతయున్. ౩౨౫

వ. ధృతరాష్ట్రుండు గాంధారీవిదురసహితుండై హిమవత్పర్వత దక్షిణ భాగంబున నొక్క మునివనంబునకుం జని తొల్లి సప్తర్షులకు సంతోషంబు సేయుకొఱకు నాకాశగంగ యేడు ప్రవాహంబులయి పాఱిన పుణ్యతీర్థంబునం గృతస్నానుండై యథావిధహోమం బొనరించి జలభక్షణంబుగావించి సకలకర్మంబులు విసర్జించి విఘ్నంబులం జెందక నిరాహారుండయి యుపశాంతాత్ముండై పుత్త్రార్థదారైషణంబులు వర్జించి *విన్యస్తాసనుండై ప్రాణంబుల నియమించి మనస్సహితంబులైన చక్షురాదీంద్రియంబుల నాఱింటిని విషయంబులం బ్రవర్తింపనీక నివర్తించి హరిభావనచే ధారణాయోగంబు వహించి రజస్సత్త్వతమో రూపంబులగు మలంబులమూఁటిని హరించి మనంబు నహంకారాస్పదంబైన స్థూలదేహంబువలనం బాపి బుద్ధియందు నేకకరణంబుసేసి యట్టి విజ్ఞానాత్మను దృశ్యాంశంబువలన వియోగించి క్షేత్రజ్ఞునియందుఁ బొందించి దృష్టంబై యీశ్వరునివలన ♦క్షేత్రజ్ఞునిం బాపి మహాకాశంబుతోడ ఘటాకాశముం గలుపుకైవడి నాధారభూతంబైన బ్రహ్మమందుఁ గలిపి లోపలి గుణక్షోభంబును వెలుపలి యింద్రియ విక్షేపంబును లేక నిర్మూలిత మాయాగుణవాసనుండగుచు నిరుద్ధంబులగు మనశ్చక్షురాదీంద్రియంబులు గలిగి యఖిలాహారంబుల వర్జించి † కొఱడుచందంబున. ౩౨౬

మ. ‡ ఉటజాంతస్థలవేదికన్ నియతుఁడై యున్నాఁడు నేఁడాదిగా
నిటపై నేనవనాఁడు మేన్ విడువఁగా § నిజ్యాగ్ని యోగాగ్ని త
త్పటుదేహంబు దహింపఁజూచి నియమప్రఖ్యాత గాంధారి యి
ట్టటువో నొల్లక ప్రాణవల్లభునితో సగ్నింబడున్ భూవరా. ౩౨౭

---

* విన్యస్తాసనుండు = ఉంచఁబడిన యాసనముగలవాఁడు.

♦ క్షేత్రజ్ఞునిన్ = జీవుని.

† కొఱడు = మ్రానిమోడు.

‡ ఉటజము = పొదరిల్లు.

§ ఇజ్యాగ్ని = యజ్ఞమందలియగ్ని.

క. అంతటవారలమరణము, వింతయగుచుఁజూడఁబడిన విదురుఁడు చింతా
సంతాప మొదవఁ బ్రీత, స్వాంతుండై తీర్థములకుఁ జనియెడు నధిపా.

— ధర్మరాజు దుర్నిమిత్తంబులం గని చింతించుట —

వ. అని విదురాదుల వృత్తాంతంబంతయు ధర్మనందనున కెఱిఁగించి తుంబురుసహితుండయిన నారదుండు స్వర్గంబునకు నిర్గమించినవెనుక ధర్మజుండు భీమునింజూచి యిట్లనియె. ౩౨౯

సీ. ఒకకాలమునఁబండు నోషధిచయము వే
రొకకాలమునఁ బండకుండు నండ్రు
క్రోధంబు లోభంబు క్రూరత బొంకును
దీపింప నరులు వర్తింతు రండ్రు
వ్యవహారములు మహా *వ్యాజయుక్తము లండ్రు
సఖ్యంబు వంచనాసహిత మండ్రు
మగలతో నిల్లాండ్రు ♦ మచ్చరించెద రండ్రు
సుతులు దండ్రులఁ బగ జూతు రండ్రు
గీ. గురులశిష్యులుదూషించి కూడ రండ్రు
శాస్త్రమార్గములెవ్వియు సాగ వండ్రు
న్యాయపద్ధతి బుధులైన నడవ రండ్రు
కాలగతి వింతయై వచ్చెఁ గంటె నేఁడు ౩౩౦

మ. హరిఁ జూడఁగ నరుఁ డేఁగినాఁడు నెల లేదయ్యెం గదా కారు † కా
లరు లెవ్వారును యాదవుల్ సమదలోల స్వాంతు లేవేళ సు
స్థిరులై యుండుదు రా మురారి సుఖియై సేమంబుతో నుండు నా
‡ యెరవై యున్నది చిత్తమీశ్వరకృతం బెట్లో కదే మారుతీ. ౩౩౧

క. మానసము గలఁగుచున్నది,మానవు బహుదుర్నిమిత్తమర్యాదలు స
న్మానవదేహక్రీడలు,మాన విచారింప నోపు మాధవుఁ డకటా. ౩౩౨

---

* వ్యాజము = కపటము. ♦ మచ్చరిందరు = ద్వేషించెదరు.
† కాలరులు = దూతలు. ‡ ఎరవు = భేదము.

తే. నందమే మన ∴ సత్యకనందనునకు
భద్రమే △ శంబరాసుర భంజనునకుఁ
గుశలమే ‡ బాణదనుజేంద్రు కూఁతుపతికి
హర్షమే పార్థ ముసలికి హలికి బలికి. ౩౮౫

వ. మఱియు నందక యదుభోజదశార్హ వృష్ణిసాత్వతులు మొదలయిన యదువంశవీరులును, హరికుమారులైన సాంబసుషేణ ప్రముఖులును, నారాయణానుచరులైన యుద్ధవాదులును, కృష్ణసహచరులైన సునంద నందాదులును, సుఖానందులే యని యందఱ నడిగి ధర్మజుండు క్రమ్మఱ నిట్లనియె. ౩౮౬

సీ. వైకుంఠవాసుల వడువున నెవ్వని
బలమున నానంద భరితులగుచు
వెఱవక యాదవవీరులు వర్తింతు
రమరులు గొలువుండు నట్టి * కొలువు
జవికె నాకర్షించి చరణసేవకులైన
బంధుమిత్రాదుల పదయుగముల
నెవ్వఁడుద్రొక్కించె నింద్రపీఠముమీఁద
వజ్రంబు జళిపించి వ్రేలువాని

తే. ప్రాణవల్లభ కెంగేలఁ బాదుసేసి
యమృతజలములఁ బోషింప నలరుపారి
జాత మెవ్వఁడు గొనివచ్చి సత్యభామ
కిచ్చె నట్టిమహాత్మున కిపుడు శుభమె. ౩౮౭

శా. అన్నా ఫల్గున భక్తవత్సలుఁడు బ్రహ్మణ్యుండు గోవిందుఁ డా
పన్నానీకశరణ్యుఁ డీశుఁడు జగద్భద్రానుసంధాయి శ్రీ
మన్నవ్యాంబుజపత్రనేత్రుఁడు సుధర్మామధ్యపీఠంబునం
దున్నాఁడా బలభద్రుఁ గూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్.

---

∴ సత్యకనందనునకున్ = సాత్యకికి. △ శంబరాసుర భంజనునకున్ = మన్మథునకు
‡ బాణదనుజేంద్రు కూఁతుపతికి = అనిరుద్ధునకు * కొలువుచవికె = సభామంటపము.

కం. ఆరామకేశవులకును, సారామలభక్తి నీవు సలుపుదువు గదా
గారాములు సేయుదురా, *పోరాముల బంధు లెల్లప్రోద్దుజితారీ. ౩౫౧

శా. మున్ను గ్రాటవిలో వరాహమునకై ముక్కంటితోఁ బోరుచోఁ
సన్నాహంబునఁ గాలకేయుల ననిం జక్కాడుచోఁ బ్రాభవ
స్కన్నుండై చను కౌరవేంద్రు పనికై గంధర్వులం దోలుచోఁ
గన్నీ రెన్నఁడుఁ దేవు తండ్రి చెపుమా కల్యాణమే చక్రికిన్. ౩౫౨

వ. అదియునుంగాక. ౩౫౩

కం. ఓడితివో శత్రువులకు, నాడితివో సాధుదూష ణాలాపములం
గూడితివో పరసతులను, వీడితివో మానధనము వీరులనడుమన్. ౩౫౪

కం. తప్పితివో యిచ్చెద నని, చెప్పితివో కపటసాక్షి చేసినమేలుం
దప్పితివో శరణార్థుల, ♦రొప్పితివో ద్విజులఁ బసుల రోగుల సతులన్. ౩౫౫

కం. అడిచితివో భూసురులను, గుడిచితివో బాలవృద్ధ గురువులు వెలిగా
విడిచితివో యాశ్రితులను, §ముడిచితివో పరులవిత్తములు లోభమునన్

వ. అనిపలికినం గన్నీరు కరతలంబునం దుడిచికొనుచు †గద్గదస్వరంబున మహానిధిం గోలుపోయిన పేదచందంబున నిట్టూర్పులు నిగిడించుచు నర్జునుం డన్న కిట్లనియె. ౩౫౭

కం. మనసారథి మనసచివుఁడు, మనవియ్యము మనసఖుండు మన బాంధవుఁడున్
మనవిభుఁడు గురుఁడు దేవర, మనలను దిగనాడి చనియె మనుజాధీశా

కం॥ కంటకపున్నృపులు సూడఁగ, మింటం గంపించుయంత్రమీనము గోలన్
గెంటించి మనము ∴వాలుం, గంటిం జేకొంటి మతనికరుణంగాదే. ౩౫౯

కం. △దండి నసేకులతో నా, ఖండలుఁ డెదురయిన గెలిచి ఖాండవవనముం
జండార్చికి నర్పించిన, గాండీవము నిచ్చెఁ జక్రి గలుగుట నధిపా. ౩౬౦

* పోరాములన్ = కష్టములయందు. ♦ రొప్పితివో = వెంటఁబడి తఱిమితివా! § ముడిచితివో = మూటకట్టితివా! † గద్గదస్వరము = డగ్గుత్తికయొలుఁగు. ∴ వాలుఁగంటిన్ = స్త్రీని [= ద్రౌపదిని] △ దండిన్ = పరాక్రమముతో.

కం. దిక్కులరాజులనెల్లను, మ్రిక్కించిధనంబుగొనుట మయకృతసభ ము
న్నొక్కటజన్నము సేయుట,నిక్కముహరిమనకు§దండనిలుచుటఁగాదే

మ. †ఇభజిద్వీర్య మఖాభిషిక్తమగు నీయిల్లాలి ‡ధమ్మిల్లముల్
సభలో శాత్రవు లీడ్చి తెచ్చినపు డా చంద్రాస్య దుఃఖింపఁగా
నభయం బిచ్చి ప్రతిజ్ఞఁజేసి భవదీ యారాతి కాంతాశిరో
జభరశ్రీల హరింపఁడే విధవలై సౌభాగ్యముల్ వీడఁగన్. ౩౬౨

శా. వైరుల్ గట్టినపుట్టముల్ విడువఁగా వారింప నావల్లభుల్
రా రీవేళ నుపేక్ష సేయఁ దగవే రావే నివారింపవే
లేరే △త్రాతలు కృష్ణయంచు సభలో ∴లీనాంగియై కుయ్యిడం
గారుణ్యంబున భూరివస్త్రకలితంగాఁ జేయఁడే ద్రౌపదిన్. ౩౬౩

సీ. దుర్వాసుఁ డొకనాఁడు దుర్యోధనుఁడు పంపఁ
బదివేలశిష్యులు భక్తిఁగొలువఁ
జనుదెంచి మనముఁ బాంచాలియుఁ గుడిచిన
వెనుక నాహారంబు వేఁడికొనినఁ
బెట్టెద ననవుడుఁ బెట్టకున్న శపింతు
ననుచుఁ *దోయావగాహమున కేగఁ
గడవల నన్న ♦శాకములు దీఱుటఁజూచి
పాంచాలపుత్రిక పర్ణశాల

తే. లోనఁ దలఁచిన విచ్చేసి †లోవిలోని
శిష్టశాకాన్నలవముఁ ‡బ్రాశించి తపసి
కోప ముడిగించి పరిపూర్ణకుక్షిఁ జేసి
నిట్టి త్రైలోక్య సంతర్పి యెందుఁగలఁడు. ౩౬౪

సీ. పందికై పోరాడ ఫాలాక్షుఁ డెవ్వాని
బలమున నాకిచ్చెఁ బాశుపతము

---

§ దండ = సమీపమున. † ఇభజిద్వీర్యుఁడు=గజాసురభంజకుఁడగు శివునియొక్క పరాక్రమమువంటి పరాక్రమముకలవాఁడు. ‡ ధమ్మిల్లముల్ = కొప్పులు. ∴ లీనాంగి= ఒదిగిన శరీరముకలది. △ త్రాత = రక్షకుఁడు. * తోయావగాహము=జలస్నానము. ♦ శాకములు = కూరలు. † లోవి=వంటపాత్ర. ‡ ప్రాశించి=భుజించి.

నెవ్వనిలావున నీమేన దేవేంద్రు
పీఠార్థమున నుండు పెంపుఁగంటిఁ
గాలకేయనివాత కవచాదిదైత్యులఁ
జంపితి నెవ్వని సంస్మరించి
గోగ్రహణమునాఁడు కురుకులాంభోనిధిఁ
గడచితి నెవ్వని కరుణఁజేసి

ఆ. కర్ణ సింధురాజ కౌరవేంద్రాదుల
తలలపాగ లెల్లఁ దడవి తెచ్చి
యేమహాత్ము బలిమి నిచ్చితి విరటుని
పుత్రి యడుగ బొమ్మపొత్తికలకు. ౩౭౬

మ. గురుభీష్మాదులు గూడి పన్నినకురుక్షోణీశచక్రంబులో
గురుశక్తిన్ §రథయంతయై నొగలపైఁ గూర్చుండి యామేటి నా
శరముల్ వాఱకమున్న వారలబలోత్సాహాయురుద్యోగత
త్వరతల్ చూడ్కుల సంహరించు నమితోత్సాహంబు నాకిచ్చుచున్.

మ. అసురేంద్రుండొనరించుకృత్యములు ప్రహ్లాదుం బ్రవేశించి గా
ల్వ సమర్థంబులు గానికైవడిఁ గృపాశ్వత్థామగాంగేయసూ
ర్యసుతద్రోణధనుర్విముక్తబహు దివ్యాస్త్రప్రపంచంబు నా
దెసకున్ రాక తొలంగు మాధవుదయాదృష్టిన్ నరేంద్రోత్తమా.

చ. *వసుమతి దివ్యబాణముల వ్రక్కలు వాపి కొలంకు సేసి నా
రసములు మాటుగాఁ బఱపి ♦రథ్యములన్ రిపు లెల్లఁ జూడ సా
హసమున నీటఁ బెట్టితి రణావని సైంధవుఁ జంపునాఁడు నా
కసురవిరోధి భద్రగతి నండయి వచ్చినఁ గాదె భూవరా. ౩౭౯

సీ. చెలికాఁడ రమ్మని చీరు నొక్కొకవేళ
మన్నించు నొకవేళ మఱఁది యనుచు
బంధుభావంబునఁ బాటించు నొకవేళ
దాతయై యొకవేళ ధనము లిచ్చు

---

§రథయంత=రథము నడపువాఁడు. * వసుమతిన్ = భూమియందు.
♦ రథ్యములు = రథాశ్వములు.

మంత్రినై యొకవేళ మంత్ర మాదేశించు
బోధినై యొకవేళ బుద్ధిసెప్పు
సారథ్యమొనరించుఁ జనవిచ్చి యొకవేళఁ
గ్రీడించు నొకవేళ † గేలిసేయు

తే. నొక్కశయ్యాసనంబున నుండుఁ గన్న
తండ్రికైవడిఁ జేసినతప్పుఁ గాచు
హస్తములు వట్టి పొత్తున నారగించు
మనుజవల్లభ మాధవు మఱపురాదు. 319

క. విజయధనంజయ హనుమద్ధ్వజ ఫల్గునపార్థ పాండుతనయ నరమహేం
ద్రజ మిత్రార్జునయంచును, భుజములు ‡ తలకడవగాకపోకలఁజీరున్.

క. వారిజనేత్రలు దమలో, వారింపఁగ రానిప్రేమ వాదముసేయన్
వారిజనేత్రుఁడు నసుఁదగ, వారిండ్లకుఁ బనుపు నలుక వారింప నృపా.

కం. నిచ్చలు లోపలి కాంతలు, మచ్చికఁదనతోడనాడుమాటలునాకున్
ముచ్చటలు సెప్పు మెల్లన, విచ్చలవిడిఁ దొడలమీఁద విచ్చేసినృపా.

చ. † అటమట మయ్యె నాభజన మంతయు భూవర నేఁడు నూడుమా
యిటువలె గారవించుజగదీశుఁడు కృష్ణుఁడు లేనిపిమ్మటం
బటుతర దేహలోభమునఁ బ్రాణము లున్నవి వెంటఁ బోక నేఁ
గటకట పూర్వజన్మమునఁ గర్మము లెట్టివి చేసినాఁడనో? 323

శా. కాంతారంబున నొంటిఁ దోడుకొని రాఁగాఁజూచి గోవిందు శు
ద్ధాంతస్త్రీలఁ బదాఱువేల మదరాగాయత్తులై తాఁకి నా
చెంతన్ బోయలు మూఁగి పట్టికొన నా § సీమంతినీసంఘమున్
భ్రాంతిన్ భామినిభంగినుంటి విడిపింపన్ లేక ధాత్రీశ్వరా. 324

శా. ఆతే రారథికుండు నాహయము లాయస్త్రాసనం బాశర
వ్రాతం బన్యులఁ దొల్లి చంపును దుదిన్ వ్యర్థంబులై పోయె మ

† గేలి = పరిహాసము. ‡ తలకడవన్ = తలమీఱఁగా = అతిశయింపఁగా.
† అటమటము = వ్యర్థము. § సీమంతినీసంఘము = స్త్రీలసమూహము.

చ్చేతోధీశుఁడు చక్రి లేమి * భసిత క్షిప్తాజ్యమాయావిమా
యాతంత్రోషరభూమిబీజముల మర్యాదన్ నిమేషంబునన్. ౩౨౭

మ. యదువీరుల్ మునినాథుశాపమునఁ గాలాధీనులై యందఱున్
♦ మదిరాపానవివర్ధమానమద సమ్మర్దోగ్రరోషాంధులై
కదనంబుల్ దమలోన ముష్టిహతులం గావించి నీఱైరి న
ష్టదశం జిక్కిరి నల్వురేవు రచటన్ సర్వంసహావల్లభా. ౩౨౮

కం. భూతములవలన నెప్పుడు, భూతములకు జన్మమరణపోషణములుని
ర్ణీతములు సేయుచుండును, భూతమయుం డీశ్వరుండు భూతశరణ్యా.

కం. బలములుగలమీనంబులు,బలవిరహితమీనములనుభక్షించుక్రియన్
బలవంతు లయినయదువులు,బలరహితులఁజంపిరహితభావములన్నృపా

మ. బలహీనాంగులకున్ బలాధికులకుం బ్రత్యర్థిభావోద్యమం
బులు గల్పించి వినాశమున్ దెలిపి యీభూభారముం బాపి ని
శ్చలబుద్ధిన్ గృతకార్యుఁడై చనియె నా సర్వేశ్వరుం డచ్యుతుం
డలఘుం డేమనిచెప్పుదున్ భగవదాయత్తంబు పృథ్వీశ్వరా. ౩౨౯

వ. మఱియు దేశకాలార్థయుక్తంబులు నంతఃకరణసంతాపశమనంబులు
నయిన హరివచనంబులం దలంచి చిత్తంబు పరాయత్తంబై యున్న
దని యన్నకుంజెప్పి నిరుత్తరుండై నిరంతరహరిచరణారవింద చింతా
మలబుద్ధియై శోకంబువర్జించి సదాధ్యానభక్తివిశేషంబులఁ గామ
క్రోధాదుల జయించి తొల్లి తన కుభయసేనా మధ్యంబున § ననంతుం
డానతిచ్చిన *గీతలు దలంచి కాలకర్మ భోగాభినివేశంబులచేత నావృ
తంబయిన విజ్ఞానంబుఁ గ్రమ్మఱ నధిగమించి ♦ హేతుమద్భావంబున
శోకహేతు వహంకారమమకారాత్మకంబయిన † ద్వైతభ్రమంబని

---

* భసిత + క్షిప్త + ఆజ్య + మాయావి + మాయాతంత్ర + ఊషర + భూమి + బీజ
ముల + మర్యాదన్ = బూడిదలోఁబోసిన నేయివలెను, మాయికుని మాయాకార్య
మువలెను, చవిటినేలయందలి విత్తనమువలెను. ♦ మదిర = కల్లు.
§ అనంతుండు = విష్ణుమూర్తియగు కృష్ణుఁడు. * గీతలు = భగవద్గీతలు.
♦ హేతుమద్భావంబునన్ = ఒక కార్యమునకు గారణమైయుండుట.
† ద్వైతభ్రమ = రెండనెడి భ్రాంతి.

యును ద్వైతభ్రమంబునకుఁ గారణంబు దేహంబనియును దేహంబునకు బజంబు ‡లింగంబనియును లింగంబునకు మూలంబు గుణంబు లనియును గుణంబులకు నిదానంబు ప్రకృతియనియును బ్రహ్మహమనియెడు జ్ఞానంబున లీనమై ప్రకృతిలేకుండుననియుఁ బ్రకృతియడంగుటయు నైర్గుణ్యంబనియును నైర్గుణ్యంబువలనఁ △ గార్యలింగనాశనం బగుననియును గార్యలింగనాశనంబున ∴ నసంభవం బగుననియును బ్రకృతిం బాసి క్రమ్మఱ స్థూలశరీరప్రాప్తుండు గాక పురుషుండు సమ్యగ్భోగంబున నుండుననియును నిశ్చయించి యర్జునుండు విరక్తుండై యూరకుండె. ధర్మజుండు భగవదీయమార్గంబు దెలిసి యాదవులనాశంబువిని నారదువచనంబులఁ దలంచి నిశ్చలచిత్తుండై స్వర్గగమనంబునకు యత్నంబు సేయుచుండె నాసమయంబున. ౩౮౦

కం. యదువులనాశము మాధవు, పదవియు విని కుంతి విమలభక్తిఁ భగవ
త్పదచింతా తత్పరయై, ముదమున సంసారమార్గమునకుం బాసెఁ.

వ. ఇట్లు *కంటకంబునం గంటకోన్మూలనంబు సేసి కంటకంబులు రెంటిని బరిహరించు విన్నాణి తెఱంగున యాదవరూప శరీరంబునం జేసి యీశ్వరుండు లోకకంటక శరీరంబులు సంహరించి నిజశరీరంబువిడిచె. సంహారంబునకు నిజశరీరపరశరీరంబులు రెండు నీశ్వరునకు సమంబులు. నిజరూపంబున నుండుచు రూపాంతరంబులు ధరియించి క్రమ్మఱనంతర్ధానంబునొందు నటునికై వడి లీలాపరాయణుండైన నారాయణుండు మీనకూర్మాదిరూపంబులు ధరియించుఁ బరిహరించు నని చెప్పి మఱియు నిట్లనియె. ౩౮౧

క. ఏదినమున వైకుంఠుఁడు, మేదినిపైఁ దాల్చినట్టి మేను విడిచినాఁ
డాదినమున నశుభప్రతి, పాదకమగుకలియుగంబు ప్రాప్తంబయ్యెఁ.

—◆ ధర్మరాజు పరీక్షిన్మహారాజునకుఁ బట్టముగట్టి మహాప్రస్థానంబున కరుగుట. ◆—

సీ. కలివర్తనంబునఁ గ్రౌర్యహింసాసత్య
◆ దంభకౌటిల్యాద్యధర్మచయము

---

‡ లింగంబు = గుర్తు. △ కార్యలింగనాశనంబు = నామరూపవినాశనము.
∴ అసంభవము=సృష్టిలేకుండుట. * కంటకంబు = ముల్లు. ◆ దంభము=గర్వము.

పురముల గృహముల భూములఁ దమలోనఁ
　　　　గలుగుట దలపోసి కరిపురమున
మనుమని రాజువై మనుమని దీవించి
　　　　సింధుతోయకణాభిషిక్తుఁ జేసి
యనిరుద్ధనందనుం డైన వజ్రినిఁదెచ్చి
　　　　మధురఁ బట్టముఁ గట్టి మమతఁబాసి
ఆ. కరుల †హారుల భటులఁ గంకణాదికముల
మంత్రిజనుల బుధుల మానవతుల
నఖిల మయినధనము నభిమన్యుసుతునకు
నప్పగించి బుద్ధినాశ్రయించి. ౩౮౪

వ. విరక్తుండైన ధర్మనందనుండు ప్రాజాపత్య మనియెడియిష్టిఁ గావించి యగ్నుల నాత్మారోపణంబుసేసి నిరహంకారుండును నిర్దళితాశేష బంధనుండునునై సకలేంద్రియంబుల మానసంబున నడంచి ప్రాణాధీన వృత్తియగు మానసంబుం బ్రాణమందును బ్రాణము నపానమందును *నుత్సర్గసహితంబయిన యపానము మృత్యువందును మృత్యువును బంచభూతంబుల నైక్యంబయిన దేహంబునందును దేహమును గుణత్రయంబునందును గుణత్రయంబు ♦నవిద్యయందును సర్వారోపహేతు వగు నవిద్యను జీవునియందును జీవుండయిన తన్ను నవ్యయంబయిన బ్రహ్మమందును లయింపంజేసి బహిరంగవ్యాపారంబులు విడచి నారచీరలు ధరించి మౌనియు నిరాహారుండును §ముక్తకేశుండునై యున్మత్త పిశాచబధిరజడుల చందంబున నిరపేక్షత్వంబున. ౩౮౫

క. చిత్తంబున బ్రహ్మము నా, వృత్తము గావించుకొనుచు విజ్ఞానధనా
యత్తులు దొల్లి వెలింగెడి, యుత్తరదిశ కేఁగె నిర్మలోద్యోగమునన్.

సీ. అంత నాతనితమ్ము లనిలపుత్రాదులు
　　　　కలిరాకచేఁ బాప కర్ములగుచుఁ

---

† హారులు = గుఱ్ఱములు. * ఉత్సర్గ = ఉత్సర్జనము = విసర్జనము.
♦ అవిద్య = అజ్ఞానము. § ముక్తకేశుండు = విచ్చిన వెండ్రుకలు గలవాఁడు.

జరియించు ప్రజల సంచారంబు లీక్షించి
యఖిలధర్మంబుల నాచరించి
వైకుంఠచరణాబ్జ వర్తితహృదయులై
తద్భక్తినిర్మలత్వమును జెంది
విషయయుక్తులకుఁ బ్రవేశింపఁగా రాక
నిర్ధూత కల్మష నిపుణ మతులు
తే. బహుళవిజ్ఞానదావాగ్ని భసితకర్ము
లైనయేకాంతులకు లక్ష్యమై వెలుంగు
ముఖ్యనారాయణ స్థానమునకుఁ జనిరి
△ విగతరజమైన యాత్మల విప్రముఖ్య. ౩౮౭

వ. అంత విదురుండు ప్రభాసతీర్థంబున హరియందుఁ జిత్తంబు సేర్చి శరీరంబు విడిచి పితృవర్గంబుతోడ దండధరుం డగుటం జేసి నిజాధికారస్థానంబునకుం జనియె. ద్రుపదరాజపుత్రియుఁ బతులవలన నుపేక్షితయై జగత్పతియైన వాసుదేవునందుఁ జిత్తంబు సేర్చి తత్పదంబు సేరె నిట్లు. ౩౮౮

కం. పాండవకృష్ణులయానము, *పాండురమతి నెవ్వఁడైనఁ బలికిన విన్నన్
ఖండితభవుఁడై హరిదాసుండై కైవల్యపదము సొచ్చు నరేంద్రా.

వ. అంతటం బరీక్షిత్కుమారుండు జాతకర్మవిదులైన కోవిదులు చెప్పిన చందంబున భూసురోత్తమశిక్షావశంబున మహాభాగవతశేఖరుండై ధరణీపాలనంబు సేయుచు నుత్తరునిపుత్రిక నిరావతియను ♦మత్తకాశినిం బెండ్లియయి జనమేజయప్రముఖులైన నలువురుకొడుకుల నుత్పాదించి గంగా†పులినతలంబునఁ గృపాచార్యుండు గురుత్వంబు సేయ యాగభాగంబులకు వచ్చిన దేవతల నీక్షించుచు భూరిదక్షిణంబుగా మూఁ డశ్వమేధంబు లాచరించి దిగ్విజయకాలంబున గోమిథునంబుఁ దన్నుచున్న శూద్రుండును రాజచిహ్నముద్రితుండునగు కలిం బట్టి నిగ్రహించెనని చెప్పిన శౌనకుండు పౌరాణికునకిట్లనియె. ౩౯౦

△ విగతరజము = పోఁగొట్టఁబడిన రజోగుణముగలది. * పాండురమతిన్ = స్వచ్ఛమైనబుద్ధితో. ♦ మత్తకాశిని = స్త్రీ. † పులినతలము = ఇసుకతిన్నె.

—• పరీక్షిన్మహారాజు దిగ్విజయంబున భూధర్మదేవతల సంవాదం బాలించుట •—

కం. భూవరరూపపుశూద్రుఁడు, గోవుం దానేలఁ దన్నఁ గోరిపరీక్షి
ద్భూవరుఁడుదిశలగెలుచుచు, నేవిధిఁగలి నిగ్రహించె నెఱిఁగింపఁగదే

మ. అరవిందాక్షపదారవిందమకరందాసక్తులై యున్న స
త్పురుషశ్రేష్ఠుల వృత్తముల్ వినక దుర్బుద్ధిన్ *విలంఘించి దు
ర్నరవార్తాకథనప్రపంచములు కర్ణప్రాప్తముల్ సేసి వా
సరముల్ వ్యర్థతఁ ద్రోచుచుండఁ జన దీసంసారమోహంబునన్. ౩౯ ౨

సీ. మనుట నిత్యము గాదు మరణంబు నిజమని
యెఱిఁగి మోక్షస్థితి నిచ్చగించు
నల్పాయువులగు మా కన్యదుర్జనచరి
త్రము లోలిఁ గర్ణరంధ్రములఁ బెట్టి
బంగారువంటి యీ బ్రదికెడుకాలంబుఁ
•బోనాడఁగానేల పుణ్యచరిత
మాధవపదపద్మ మకరందపానంబు
సేయింపవే మేము సేయునట్టి

ఆ. సత్రయాగమునకుఁ జనుమునీంద్రులఁ జీర
వాఁడె దండధరుఁడు వచ్చెఁ జూడు
చంపఁ డొకనినైన ‡జన్నమయ్యెడుదాఁక
వినుచునుండుఁ దగిలి విష్ణుకథలు. ౩౯-౩

కం. మందునకు మందబుద్ధికి, మందాయువునకును వ్యర్థమార్గములను గో
విందచరణారవింద మ,రందము గొనఁ దెఱపిలేదు రాత్రిందివముల్.

వ. అని శౌనకుండు పలికిన సూతుం డిట్లనియె. పరీక్షిన్నరేంద్రుండు నిజ
†వాహినీ సందోహసంరక్షితంబగు కురుజాంగల దేశంబునం గలిప్రవే
శంబు నాకర్ణించి యుద్ధకుతూహలత నంగీకరించి యొక్కనాఁడు సము
ల్లాసంబున బాణాసనంబుఁ గైకొని నీలనీరదనిభతురంగనివహయోజి

* విలంఘించి = దాఁటి = అతిక్రమించి. • పోనాడఁగాన్ = పోఁగొట్టు
కొనఁగ. ‡ జన్నము = యజ్ఞము. † వాహిని = సేన.

తంబును ఫలితమనోరథంబునైన రథంబు నారోహణంబుసేసి మృగేంద్రధ్వజంబు వెలుంగ రథతురంగమసుభట•కరటిఘటాసంఘటితంబగు వాహినీచక్రంబు నిర్వక్రంబుగం గొలువ దిగ్విజయార్థంబు వెడలి పూర్వదక్షిణ పశ్చిమోత్తర సముద్ర లగ్నంబు లయిన యిలావృత రమ్యకహిరణ్మయ హరి వర్ష కింపురుష భద్రాశ్వ కేతుమాలా భారతవర్షంబులును నుత్తరకురుదేశంబులును జయించి తత్తద్దేశవాసు లొసంగు పుష్కలధనప్రధాన పూర్వికలగు*సపర్యలం గైకొనుచు మంగళ పాఠక సంఘాత జేగీయమాన పూర్వరాజవృత్తాంతంబు లాకర్ణించుచుం బాఠకపఠితపద్యంబులవలనం బాండవులకు భక్తవత్సలుండైన పుండరీకాక్షుం డాచరించిన సారథ్యసభాపతిత్వ సఖ్య § సాచివ్యదౌత్య వీరాసనత్వాది కర్మంబులు నశ్వత్థామాస్త్ర తేజంబువలనం దనురక్షించుటయు యాదవపాండవులందలి స్నేహానుబంధంబును వారలకుం గలిగిన భగవద్భక్తివిశేషంబును విని విశ్వంభరుని భక్తవాత్సల్యంబునకు నాశ్చర్యంబు నొందుచు వందిబృందంబులకు మహార్ఘంబులగు నంబరాభరణ సందోహంబుల నొసంగుచుం బద్మనాభ పాదపద్మభజన పరతంత్రపవిత్రమానసుండై యుండె, నయ్యెడ వృషభరూపంబున నేకపాదంబున సంచరించు ధర్మదేవుండు దనసమీపంబున లేఁగలేని లేఁగటి†కుట్టిచందంబున హతప్రభయై నేత్రంబుల సలిలంబులు గురియుచు గోరూపమై యున్నధాత్రి కిట్లనియె. ౩౯౫

మ. నయనాంభఃకణజాల మేల విడువన్ నాతల్లి నీమేను సా
మయమై యుండదు మోము వాడినది నీ మన్నించు చుట్టాలకున్
భయదుఃఖంబులు నేఁడు వొందవు గదా బంధించి శూద్రుల్ పద
త్రయహీనున్ ననుఁ బట్ట వత్తు రనియో తాపంబు నీ కేటికిన్.

సీ. మఖములు లేమి నమర్త్యుల కిటమీఁద
మఖభాగములు లేక మాను ననియొ

---

• కరటిఘట = ఏనుఁగుల సమూహము. * సపర్యలు = పరిచర్యలు.
§ సాచివ్యము = మంత్రిత్వము. † కుట్టి=ఆవు.

రమణులు రమణులరక్షింప రనియొ త
త్పుత్రులఁదండ్రులు పోవ రనియొ
* భారతి కుజనులఁబ్రాపించు ననియొ స
ద్విప్రులు నృపుల సేవింతు రనియొ
కులిశహస్తుఁడు వాన గురియింపకుండఁగఁ
బ్రజలు దుఃఖంబులఁ బడుదు రనియొ
ఆ. హీనవంశ జాతు లేలెద రనియొ రా
జ్యములు పాడి గలిగి జరుగ వనియొ
మనుజు లన్నపానమైథునశయనాస
నాది కర్మసక్తులగుదు రనియొ. ౩౯౮

మ. జననీ నీభరమెల్ల డించుటకునై చక్రాయుధుం డిన్ని ♦హా
యనముల్ దాను నరాకృతిన్ మెలఁగి నిత్యానందముం జేసి పో
యిన నేనింక ననాథ నైతిఁ గుజనుం డెవ్వాఁడు శాసించునో
పెనుదుఃఖంబులఁబొందఁ గంటి ననియో భీతిల్లి చింతించుటల్. ౩౯౯

కం. దెప్పర మగుకాలముచే, నెప్పుడు దేవతలకైన నిష్టం బగు నీ
యొప్పిదము కృష్ణుఁ డరిగినఁ, దప్పెఁగదా తల్లి నీవు తల్లడపడఁగన్.

వ. అనిన భూదేవి యిట్లనియె. ౪౦౦

కం. ఈలోకంబునఁ బూర్వము, నాలుగుపాదముల నీవు నడతువు నేఁడా
శ్రీలలనేశుఁడు లేమినిఁ, గాలముచే నీకు నొంటికాలయ్యెఁ గదే. ౪౦౧

వ. మఱియు సత్య శౌచ దయా క్షాంతులును ద్యాగ సంతోషార్జవం
బులును శమ దమ తపంబులును సమత్వంబును బరాపరాధసహనంబును
లాభంబుగలయెడ నుదాసీనుండై యుండుటయును శాస్త్రవిచారం
బును విజ్ఞాన విరక్తులును నైశ్వర్య శౌర్య ప్రభా దక్షత్వంబులును
స్మృతియును స్వాతంత్ర్యంబును గౌశల కాంతి ధైర్య మార్దవ ప్రతి
భాతిశయ †ప్రశ్రయ శీలంబులును జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనో

* భారతి = సరస్వతి.
♦ హాయనములు = సంవత్సరములు.
§ ఆర్జవము = ఋజుత్వము.
† ప్రశ్రయము = శాంతి.

బలంబులును సౌభాగ్య గాంభీర్య స్థైర్యంబులును శ్రద్ధా కీర్తి మాన గర్వాభావంబులును ననియెడి ముప్పదితొమ్మిది గుణంబులు నవి యునుంగాక ♦ బ్రహ్మణ్యతా శరణ్యాది మహాగుణ సమూహంబును శ్రీకృష్ణదేవునియందు వర్తిల్లుం గావున. ౪౦౨

క. గణనాతీతము లగు, సద్గుణములు గలచక్రి ననిన ఘోరకలి ప్రే
రణమునఁ బాపసమూహా, వ్రణయుతులగుజనులఁజూచి వగ చెదఁ దండ్రీ.

క. దేవతలకు ఋషులకుఁ బితృ, దేవతలకు నాకు నీకు ధీరులకును నా
నావర్ణాశ్రమములకును, గోవులకును బాధయనుచుఁ గుందెద ననఘా.

సీ. బ్రహ్మాదు లెవ్వని భద్రకటాక్షవీ
క్షణము వాంఛింతురు సత్తపములఁ
గమలాలయమువాని కమల యెవ్వనిపాద
కమలంబు సేవించుఁ గౌతుకమునఁ
బరమయోగీంద్రులు భవ్యచిత్తములందు
నిలుపుదు రెవ్వాని నియతితోడ
వేదంబు లెవ్వని విమలచారిత్రముల్
వినుతింపఁగా లేక † వెగడుపడియె

ఆ. నట్టివాసుదేవు నబ్జవజ్రాంకుశ
చక్రమీనశంఖ చాప ‡ కేతు
చిహ్నితంబు లైన శ్రీచరణము లింక
సోఁకవనుచు వగపు సోఁకెనయ్య. ౪౦౫

క. హరిపాదంబులు సోఁకెడి, సిరికతమున నఖిలభువన సేవ్యత్వముతో
స్థిర నైతి నిన్నిదినములు, హరి నాగర్వంబు మాన్పి యరిగె మహాత్మా.

క. లీలాకారముఁ దాల్చెను, * శ్రీలలనేశుండు ఖలులశిక్షించి భవో
న్మూలనము సేయుకొఱకును, నాలుగుపాదములనన్ను నడపించుటకున్.

---

♦ బ్రహ్మణ్యత=వేదము ప్రధాన ప్రమాణముగా భావించి యాచరించుట.
† వెగడుపడియె=తల్లడపడియె. ‡ కేతువు=టెక్కెము. * శ్రీలలనేశుఁడు=విష్ణువు.

ఉ. ఆ మధురోక్తు లా♦ నయము లా †దరహాసము లా దయారసం
బా మురిపెంబు లా ∴ తగవు లా గమనక్రియ లా మనోహర
ప్రేమ కరావలోకనము ప్రీతిఁ గనుంగొనలేమి మాధవుం
గామినులేల నిర్దళితకర్ములు యోగులుఁ బాయ నేర్తురే. ౪౦౯

క. మెల్లన నాపై యాదవ, వల్లభుఁ డడుగిడఁగ మోహవశనై నేరం
ల్లఁగ§రోమాంచముఁ గయి‡ మొల్లములై మొలచుసస్యములుమార్గములన్

వ. అని యిట్లు పూర్వవాహినియైన సరస్వతీతీరంబున ధర్మదేవుండును భూమియు వృషభధేనురూపంబుల భాషింప రాజర్షియైన పరీక్షిద్భూవరుఁడు డగ్గఱియె నాసమయంబున. ౪౧౦

— ♦ కలిపురుషుఁడు ధర్మదేవతను దన్నుట ♦ —

శా. కైలాసాచలసన్నిభం బగుమహాగంభీరగోరాజముం
గాలక్రోధుఁడు దండహస్తుఁడు నృపాకారుండు క్రూరుండు △ జం
ఘాలుం డొక్కఁడు శూద్రుఁ డాసురగతిం గారుణ్యనిర్ముక్తుఁడై
నేలం గూలఁగఁ దన్నెఁ బంచితిలఁగా *నిర్ఘాతపాదాహతిన్. ౪౧౧

వ. మఱియును. ౪౧౨

శా. ఆ*లోలాంగక సశ్రుతోయకణ లీనాక్షిన్ మహాంభారవన్
♦బాలారూఢతృణావళీకబళలోభవ్యాప్తజిహ్వాగ్రనాం
దోళస్వాంత ‡నజీవవత్స నుదయద్దుఃఖాన్వితన్ †ఘర్మకీ
లాలాపూర్ణశరీర నా□ మొదవు నుల్లంఘించి తన్నెన్ వడిన్. ౪౧౩

వ. ఇట్లు ధేను వృషభంబుల రెంటినిం గంటకుఁడై తన్నుచున్న రాజలక్షణముద్రితుండైన శూద్రునిం జూచి సువర్ణపరికరస్యందనారూ

---

♦ నయములు=నీతులు. † దరహాసము—చిఱునవ్వు. ∴ తగవు=ధర్మము.
§ రోమాంచము=గగుర్పాటు. ‡ మొల్లము=మొత్తము △ జంఘాలుఁడు=పిక్కబలము గలవాఁడు. *నిర్ఘాతపాదాహతి=వజ్రము చేతనైన దెబ్బ. * లోలాంగకన్ = వణఁకెడి శరీరముగలదానిని. ♦ బాలారూఢ తృణావళీకబళలోభవ్యాప్త జిహ్వాగ్రన్ = లేఁతగడ్డిని ముదురుగడ్డిని దినుటయందాసక్తి గలిగిచాఁచిన నాలుకకొనగలదానిని ‡ అజీవవత్సన్ = నిర్జీవమైన దూడగలదానిని. † ఘర్మకీలాలము = చెమటనీరు. □ మొదవున్ = పాఁడియావును.

ధుండగు నభిమన్యు నందనుండు △కోదండంబు సగుణంబుసేసి మేఘ
గంభీరరవంబు లగువచనంబుల నిట్లనియె. ౪౧౪

శా. నిన్నుం గొమ్ములఁ జిమ్మెనో కదిసెనో నిర్భీతిమై గోవులం
దన్నం గారణమేమి ∴ మద్భుజసనాథక్షోణి నేవేళలం
దు న్నేరంబులు సేయరా దెఱుఁగవా ధూర్తత్వముఁ §భూమిభృ
త్సన్నాహంబు నొనర్చెదెవ్వఁడవు నిన్ శాసించెదన్ దుర్మతీ. ౪౧౫

క. గాండీవియుఁ జక్రియు భూమండలిఁ బెడబాసి చనిన మదమత్తుఁడవై
దండింపఁ దగనివారల, దండించెదు నీవ తగుదు దండనముకున్.

వ. అని వృషభంబు నుద్దేశించి యిట్లనియె. ౪౧౭

మ. కురుధాత్రీశ్వరబాహు వప్రయుగళీ గుప్తక్షమామండలిన్
బరికింపన్ భవదీయనేత్రజనితాంభశ్శ్రేణి దక్కం జనుల్
దొరఁగంజేయ రధర్మ సంజనితజంతుశ్రేణిబాష్పంబులన్
గురుశక్తిన్ విదళింతుఁ జూడు మితనిన్ గోమూర్తిదేవోత్తమా.

క. జాలిఁ బడ నేల నాశర, జాలంబులపాలు సేసి చంపెద వీనిన్
భూలోకంబున నిపుడే, నాలుగుపాదముల నిన్ను నడపింతుఁజుమీ.

ఉ. వాచవి యైనగడ్డిఁదిని వాహినులందు జలంబుఁ ద్రావఁగా
నీచరణంబు లెవ్వఁ డిటు నిర్దళితంబుగఁ జేసె వాఁడు దా
ఖేచరుఁడైన వాని మణికీలితభూషణయుక్తబాహులన్
వే చని త్రుంచివైతు విను వీథికి నేఁగిన నేల డాఁగినన్. ౪౨౦

వ. అని మఱియు గోమూర్తియయిన భూదేవితో నిట్లనియె. ౪౨౧

చ. అగణితవైభవుం డగు మురాంతకుఁ డక్కట పోయె నంచు నె
వ్వగలఁ గృశించి నేత్రముల వారికణంబులు దేకు మమ్మ లో
బెగడకుమమ్మ మద్విశిఖ బృందములన్ *వృషలున్ వధింతు నా
మగఁటిమిఁ జూడవమ్మ ♦వెఱమానఁగదమ్మ శుభప్రదాయినీ. ౪౨౨

△ కోదండంబు=విల్లు. ∴ మద్భుజ సనాథక్షోణిన్ = నా భుజముచే భరింపఁబడినభూమిని § భూమిభృత్సన్నాహంబు. = రాజయత్నము. * వృషలున్ — శూద్రుని. ♦ వెఱ = భయము.

క. సాధువు లగుజంతువులకు, బాధలుగావించుఖలుల భంజింపని రా
జాధము నాయుస్స్వర్గ, శ్రీధనములు †పీటిఁబోవు సిద్ధము తల్లీ.

క. దుష్టజననిగ్రహంబును, శిష్టజనానుగ్రహంబుఁ జేయఁగ నృపులక్
సృష్టి విధించెఁ బురాణ, ద్రష్టలు సెప్పుదురు పరమధర్మము సాధ్వీ.

వ. అనిన ధర్మనందనపౌత్రునకు వృషభమూర్తి నున్న ధర్మదేవుం
డిట్లనియె. ౮-౨౫

ఉ. క్రూరులఁ జంపి సాధువులకుక్ విజయం బొనరించునట్టి యా
పౌరవవంశజాతుఁడవు భాగ్యసమేతుఁడవౌదు తొల్లి మీ
వా రిటువంటివా రగుట వారిజనేత్రుఁడు మెచ్చి ‡దౌత్యసం
చారము చేసెఁ గాదె నృపసత్తమ భక్తిలతానిబద్ధుఁడై. ౮-౨౬

వ. నరేంద్రా! యేముప్రాణులకు దుఃఖహేతువులముగాము. మావలన దుఃఖంబునొందెడు పురుషుండు లేఁడు. ♦ వాది వాక్యభేదంబులఁ గొందఱు [యోగీశ్వరులు] మోహితులై భేదంబు నాచ్ఛాదించి తమకు నాత్మసుఖదుఃఖంబుల నిచ్చుప్రభువని చెప్పుదురు. కొందఱు [దైవజ్ఞులు] గ్రహదేవతాదులకుఁ బ్రభుత్వంబు సంపాదింతురు. కొందఱు [మీమాంసకులు] గర్మంబునకుం బ్రాభవంబుం బ్రక టింతురు. కొందఱు [లోకాయతికులు] స్వభావంబు ప్రభువని పలుకుదురు. ఇందెవ్వరికిని సుఖప్రదానంబుసేయఁ బ్రభుత్వంబులేదు. పరులవలన దుఃఖంబువచ్చిన ధర్మపరు లధర్మంబు చేసిరని విచారింపవలదు. తర్కింపను నిర్దేశింపను రాని పరమేశ్వరుని వలన సర్వంబు నగుచుండు. అనిన ధర్మదేవునికి ధర్మనందన పౌత్రుం డిట్లనియె. ౮-౨౭

ఆ. ధర్మమూర్తివయ్య ధర్మజవృషరూప
పరమధర్మమీవు పలుకుతోవ
పాపకర్మచేయు పాపంబునూచింపఁ
బాపకర్మఁడేఁగు పథమువచ్చు. ౮-౨౮

† పీటిఁబోవు=నష్టమగును. ‡ దౌత్యసంచారము = దూతకార్యము. ♦వాదివాక్యభేదంబులక్=వాదము చేయువారియొక్కయు వాక్యములయొక్కయు భేదములచే.

వ. మఱియు దేవమాయవలన భూతంబుల వాఙ్మానసంబులకు వధ్యఘాతుకలక్షణా వృత్తి సులభంబుగం దెలియరాదు. నీవు ధర్మదేవతవు. కృతయుగంబునం దప శ్శౌచదయాసత్యంబు లను నాలుగు నీకుం బాదంబులని చెప్పుదురు. త్రేతాయుగంబునం బూర్వోక్త పాదచతుష్కంబునం దొక్క పాదంబు క్షీణంబయ్యె. ద్వాపరంబునం బాదద్వయంబు నశించె. కలియుగంబందు నివ్వాడువున నిప్పుడు నీకుఁ బాదత్రయంబు భగ్నంబయ్యె. నవశిష్టంబగు భవదీయచతుర్థపాదంబున ధర్మంబు నిగ్రహింప గమకించుచున్న యది. విను మది యునుం గాక. ౪౨౯

— పరీక్షిన్మహారాజు గలిని నిగ్రహించి ధర్మపరిపాలనము చేయుట —

మ. భరముం బాపి రమావిభుండు కరుణం * బాదంబులం ద్రొక్కఁగా
స్థిరయై వేడుక నింత కాలము సుఖశ్రీ నొందె భూదేవి త
చ్చరణస్పర్శము లేమి శూద్రకులజుల్ ♦ శాసింతు రంచుం నిరం
తరశోకంబున నీరు గన్నుల నిడెం ధర్మజ్ఞ వీక్షించితే. ౪౩౦

వ. అని యిట్లు ధరణీధర్మదేవతల బుజ్జగించి † మహారథుండయిన విజయపౌత్రుండు § క్రొక్కారు మెఱుంగు తెఱంగు ధిక్కరించుచు దిక్కులకు వెక్కసం బయిన యడిదంబు బెడిదంబుగ జడిపించి పాపహేతు వయిన కలి రూపుమాప నుద్యోగించినవాఁడు రాజరూపంబు విడనాడి వాడిన మొగంబుతోడ భయవిహ్వలుండయి హస్తంబులు సాఁచి తత్పాదమూల విన్యస్తమస్తకుండయి ప్రణామంబు సేసి. ౪౩౧

క. కంపించె దేహ మెల్లం, జంపకు మోరాజతిలక శరణాగతు ర
క్షింపుమని తనకు మ్రొక్కినఁ, జంపక కలిరాజుఁ జూచి జనపతి పలికెన్.

క. అర్జున కీర్తిసమేతుం, డర్జునపౌత్రుండు భయరసావృతజనులన్
నిర్జితులఁ జంపనొల్లఁడు, దుర్జనభావంబు విడిచి తొలఁగు దురాత్మా.

---

* పాదంబులం ద్రొక్కఁగాన్ = సంచరింపఁగా = జీవించియుండఁగా.

♦ శాసింతురు = శిక్షింతురు. † మహారథుండు = పదునొకండువేల విలుకాండ్రతోఁ బోరాడఁగల యోధుఁడు. (తన్నును సారథిని గుఱ్ఱములను గాపాడుకొనఁగల యోధుఁడు.) § క్రొక్కారు మెఱుంగు = తొలకరి మెఱుపు.

వ. నీవు పాపబంధుండవు మదీయబాహుపాలితంబయిన మహీమండలంబున నిలువవలవదు. రాజదేహంబునందు వర్తించు నిన్ను నసత్యలోభచౌర్యదౌర్జన్య దురాచార మాయాకలహ కపటకలుషాలక్ష్మ్యాది ధర్మేతరసమూహంబు లాశ్రయించు సత్యధర్మంబులకు నివాసంబగు బ్రహ్మావర్త దేశంబున యజ్ఞవిస్తార నిపుణులయినవారు యజ్ఞేశ్వరుండైన హరిం గూర్చి యాగంబు సేయుచున్నవారు. వారలకు సుఖప్రదానంబు సేయుచు సకలభూతాంతర్యామియై భగవంతుండయిన హరి * జంగమస్థావరంబులకు నంతరంగబహిరంగంబుల నంచరించు వాయువుచందంబున నాత్మరూపంబున మనోరథంబుల నిచ్చుం గావున నీ విందుండవలవదనుచు దండహస్తుండయిన జమునికైవడి మండలాగ్రంబుసాఁచిన రాజవర్యునకుం గలి యిట్లనియె.

కం. జగదీశ్వర నీ ♦ యడిదము, ధగధగిత ప్రభలతోడఁ దఱచుగ మెఱువన్
బెగడొంజిత్తము గుండెలు, పగిలెడి నిఁక నెందుఁజొత్తు భావింపఁగదే.

వ. నరేంద్రా! నిన్ను నారోపితశరశరాసను సర్వప్రదేశంబులందును విలోకించుచున్నవాఁడ. నే నెక్కడ నుండుదు నానతిమ్మనిన రాజన్యశేఖరుండు ప్రాణివధ స్త్రీద్యూతపానంబు లనియెడు నాలుగు స్థానంబులనిచ్చి, మఱియు నడిగిన సువర్ణమూలంబగు నసత్యమదకామహింసావైరంబు లనియెడు పంచప్రదేశంబుల నొసంగి, యితరస్థలంబుల స్పృశియింపకుండ నియమించె, నిట్లు కలి నిగ్రహంబు సేసి † హీనంబులయిన తపశ్శౌచ దయ లనియెడి మూఁడుపాదంబులు వృషభమూర్తియయిన ధర్మదేవత కిచ్చి § రత్నగర్భకు నిర్భరంబయిన సంతోషంబు సంపాదించి. ౪౩౬

క. గజనామధేయపురమున, ∴ గజరిపుపీఠమునఘనుఁడు గలిదముఁడుమహా
గజవైరిపరాక్రముఁడే, △ గజిబిజిలేకుండఁదాల్చెఁగౌరవలక్ష్మిన్. ౪౩౭

వ. ఇట్లు కృష్ణుని యనుగ్రహంబున నశ్వత్థామబాణ పావకంబువలన

* జంగమస్థావరంబులకున్ = చరాచరములకు. ♦ అడిదము = కత్తి.
† హీనంబులు = లోపించినవి. § రత్నగర్భ = భూమి. ∴ గజరిపుపీఠము = సింహాసనము. △ గజిబిజి = సంక్షోభము.

బ్రదికి వృషభమూర్తియయిన ధర్మదేవతకు నభయంబిచ్చిన పరీక్షిన్నరేంద్రుండు బ్రాహ్మణశాపప్రేరితతక్షకాహిభయంబువలనఁ బ్రాణంబులు వోవుననియెఱింగి సర్వసంగంబులు వర్జించి శుకునకు శిష్యుండై విజ్ఞానంబుగలిగి గంగా*తరంగిణీ తీరంబునం ♦కళేబరంబు విడిచె వినుఁడు. ౪౩౮

క. హరివార్త లెఱుఁగువారికి, హరిపదములుదలఁచువారి కనవరతంబుం
హరికథలు వినెడివారికి, మరణాగతమోహసంభ్రమము లే దనఘా.

క. శుభచరితుఁడుహరియరిగినఁ,బ్రభవించిధరిత్రినెల్లఁ ‡బ్రబ్బియుఁగలిదా
నభిమన్యుసుతునిచేతను, బ్రభవింపక యడఁగియుండె భార్గవముఖ్యా.

వ. ఇవ్విధంబునఁ జతుస్సముద్ర ముద్రితాఖిలమహీమండల ప్రాజ్య సామ్రాజ్యంబు పూజ్యంబుగాఁ జేయుచు నాయభిమన్యు పుత్త్రుండు.

ఉ. చేసినఁ గాని పాపములు † సెందవు చేయఁ దలంచినంతటం
జేసెద నన్నమాత్రమునఁ జెందుఁ గదా కలివేళఁ బుణ్యముల్
మోసము లేదటంచు నృపముఖ్యుఁడు గాచెఁ గలిం మరంద ము
ల్లాసముతోడఁ గ్రోలి § విరులం దెగఁజూడని తేఁటికై వడిం. ౪౪౨

వ. మఱియుం బ్రమత్తులై యధీరు లగు నరులయందు ∴ వృకంబు చందంబున నొదిగి △ లాఁచుకొని యుండి చేష్టించుంగాని ధీరులైన వారికిం గలివలని భయంబు లేదని కలి నంతంబు నొందింపఁడయ్యె ననిన విని ఋషులు సూతున కిట్లనిరి. ౪౪౩

సీ. పౌరాణికోత్తమ బ్రతుకుము పెక్కేండ్లు
తామరసాక్షుని ధవళయశము
మరణశీలుర మైన మాకెఱింగించితి
కల్పితంబగు క్రతుకర్మమందుఁ

---

* తరంగిణి = నది. ♦ కళేబరంబు = శరీరము. ‡ ప్రబ్బియుం = అతిశయించియును. † చెందవు = అనుభవమునకు రావు. § విరులం దెగఁజూడని తేఁటి = పుష్పములను నశింపఁజేయని తుమ్మెద. ∴ వృకము = తోడేలు.
△ లాఁచుకొనియుండి = పొంచుండి.

బోఁగలచేఁ బోఁగిలి * యబుద్ధవిశ్వాసుల
మము హరిపదపద్మ మధురరసము
ద్రావించితివి నీవు ధన్యులమైతిమి
జన్మాంతరములేని స్వర్గమైన

తే. విష్ణుభక్తుల సంగంబు వెలకురాదు
ప్రకృతి గుణహీనుఁడగుచక్రి భద్రగుణము
లీశకమలాసనాదులు నెఱుఁగలేరు
వినికివినఁజాల మనియెడి వెఱ్ఱిగలఁడె. ౪౪౪

క. § శ్రీపంబులు ఖండితసం, తాపంబులు కల్మషాంధ తమసమహోద్య
ద్దీపంబులు † పాషండ దు, రాపంబులు విష్ణువంద నాలాపంబుల్.

క. పావనములు ♦ దురితలతా, లావనములు నిత్యమంగళ ప్రాభవసం
జీవనములు లక్ష్మీమనసం, భావనములు వాసుదేవపద సేవనముల్.

ఆ. పరమభాగవతుఁడు పాండవపౌత్రుండు
శుకునిభాషణముల శుద్ధబుద్ధి
యై విరాజమానుఁడై ముక్తియగు విష్ణు
పాదమూల మెట్లు వడసె ననఘ. ౪౪౭

వ. మహాత్మా విచిత్రయోగ నిష్ఠాకలితంబును విష్ణుచరితలలితంబును బరమపుణ్యంబును సకలకల్యాణగుణగణ్యంబును భాగవతజనాపేక్షితంబునునైన ‡ పారీక్షితభాగవతాఖ్యానంబు వినిపింపు మనిన సూతుం డిట్లనియె. ౪౪౮

క. మిముబోఁటిపెద్దవారలు, కమలాక్షుని చరితమడుగఁగాఁ జెప్పెడి భా
గ్యముగలిగె నేఁడు నాజ,న్మముసఫలంబయ్యె వృద్ధమాన్యుఁడనగుటన్.

క. కులహీనుఁడు నారాయణ, విలసత్కథనములు గడఁక వినిపించినఁ ద
త్కులహీనతఁ బాసిమహో,జ్జ్వలకులజత్వమును బొందుసన్మునులారా!.

---

* అబుద్ధవిశ్వాసులు=తెలియనినమ్మకముగలవారు § శ్రీపంబులు=సంపత్ప్రదంబులు. † పాషండదురాపంబులు = వేదబాహ్యుచేఁ బొందుటకుఁ దగనివి. ♦ దురితలతాలావనములు = పాపములనెడి తీఁగెలనుగోసివేయునవి. ‡ పారీక్షిత భాగవతాఖ్యానంబు = పరీక్షిత్తునకు భాగవతము చెప్పుట.

సీ. ఎవ్వనిగుణజాల మెన్న జిహ్వాలుఁలేక
నలినగర్భాదు లనంతుఁ డంద్రు
కోరెడు విబుధేంద్రకోటి నొల్లక లక్ష్మి
ప్రార్థించె నెవ్వని పాదరజము
బ్రహ్మ యెవ్వని పాదపద్మంబు గడిగిన
జలము ధన్యతనిచ్చె జనులకెల్ల
భగవంతుఁడనియెడి భద్రశబ్దమునకు
నెవ్వఁ డర్థాకృతి నేపుమిగులు

ఆ. నేమహాత్ము నాశ్రయించి శరీరాది
సంగకోటినెల్ల సంహరించి
ప్రాభవమున మునులు * పారమహంస్యంబు
నొంది తిరిగి రాక యుందు రెలమి. ౪౫౧

చ. క్రమమున మింటికై యెగయుఁ గాక ♦విహంగము మింటిదైనపా
రముగన నేర్చునే హరిపరాక్రమ మోపిన యంతగాక స
ర్వము వివరింప నెవ్వఁడు ప్రవర్తకుఁడో మునులార నాదు చి
త్తమునకు నెంత గానఁబడెఁ దప్పక చెప్పెద మీకు నంతయున్.

క. † వేదండపురాధీశుఁడు, ‡ కోదండము చేతఁబట్టికొని § గహనములో
∴ వేదండాదుల నొకనాఁ, △ డేదండలఁ బోవనీక యెగిచెన్ బలిమిన్.

క. *ఒగ్గములుద్రవ్విపడుమని, యొగ్గెడు పెనుఁదెరలవలలనురులుమృగములన్
డగ్గఱిచంపెడువేడుక, వెగ్గలమై చిత్తమందు వెంటాడింపన్. ౪౫౪

క. ♦కోలముల†గవయవృకశా, ర్దూలములఁ‡దరక్షుఖడ్గ§రోహిత ‡ హరిశుం
డాలముల శరభచమర, వ్యాలముల వధించె విభుఁడువడి *నోలములన్.

---

* పారమహంస్యంబు = పరమహంసభావము. ♦విహంగము = పక్షి
† వేదండపురాధీశుఁడు = హస్తినాపురరాజు. ‡ కోదండము = విల్లు. § గహనము = అరణ్యము. ∴ వేదండాదులన్ = ఏనుఁగులు మొదలగువానిని. △ ఏదండలన్ = ఏదిక్కులకును. * ఒగ్గములు = లోపల బోలుగానుండునట్లు పైనమాత్రము నేల మటుగాఁ గప్పినపలములు. ♦కోలములు=పందులు. †గవయము = గురుపోతు. ‡ తరక్షువు = సివంగి. §రోహితము= కేసరిమృగము. ‡హరి=గుఱ్ఱము. *ఓలములన్ = వృక్షాదులచే మఱుఁగైనచోట్లయందు.

—♦ పరీక్షిన్మహారాజు వేఁటాడి శమీకమహామునిపై మృతసర్పము వైచుట. ♦—

క. మృగయులు మెచ్చ నరేంద్రుఁడు
మృగరాజపరాక్రమమున మెఱసి హరించెన్
మృగధరమండలమునఁగల
మృగ మొక్కటి దక్క సర్వమృగముల నెల్లన్. ౪౫౬

వ. ఇట్లు వాటంబయిన వేఁటతమకంబున మృగంబుల వెంటం దగిలి (యొగుచుచుం దిఱుగుటం జేసి) బుభుక్షాపిపాసలవలన మిగులఁ బరిశ్రాంతుండయి ధరణీకాంతుండు చల్లనినీటి కొలంకుం గానక కలంగెడు చిత్తంబుతోఁ జనిచని యొక్క తపోవనంబుఁ గని యందు. ౪౫౭

సీ. మెలఁగుట చాలించి మీలితనేత్రుఁడై
శాంతుఁడై కూర్చుండి జడత లేక
ప్రాణమనోబుద్ధి పంచేంద్రియంబుల
బహిరంగవీథులఁ బాఱనీక
జాగరణాదిక స్థానత్రయము దాఁటి
పరమమై యుండెడి పదముఁ దెలిసి
బ్రహ్మభూతత్వసంప్రాప్తి వికారుండై
యతిదీర్ఘజటలు దన్నావరింప

తే. నలఘు * రురుచర్మధారియై యలరుచున్న
తపసిఁ బొడఁగని ♦ శోషితతాలుఁడగుచు
నెండి తడిలేక కుత్తుక నెలుగుఁడింద
మందభాషల నిట్లను మనుజవిభుఁడు. ౪౫౮

క. †తోయములు దెమ్ము మాకీ, §తోయము వేఁటాఁడు వేళఁ దొల్లిపాడమ ‡దీతోయము క్రియ జలదాహము, ∴తోయము వారలును లేరు దుస్సహమనఘా.

వ. అని భూవరుండు శమీకమహాముని సమాధినిష్ఠా నిమీలితనేత్రుం

* రురువు = నల్లచాఱలదుప్పి. ♦ శోషితతాలుఁడు = శుష్కించిన దవడలు కలవాఁడు. † తోయములు = జలములు. § తోయము = సమయము ‡ ఈతోయము క్రియ = ఈవిధముగా. ∴ తోయము వారలు = పరివారజనము.

డును విస్మృతబాహ్యాంతరింద్రియ కృతసంచారుండును హరిచింతా
పరుండునునై యుండుటం దెలియలేక. ౪౬౦

ఉ. కన్నులు మూసి బ్రాహ్మణుఁడు గర్వముతోడుత నున్నవాఁడు చే
సన్నల నైన రమ్మనఁడు సారజలంబులు దెచ్చి పోయఁ డే
మన్నన లైనఁ జేయఁడు సమగ్రఫలంబులు వెట్టఁ డింత సం
పన్నత నొందెనే తనతపశ్చరణాప్రతిమప్రభావముల్. ౪౬౧

ఆ. వారిఁ గోరుచున్న వారికి ∴ శీతల
వారి యిడుట మెట్టి వారికయిన
△ వారితంబు గాని వలసినధర్మంబు
వారియిడఁడు * దాహవారిగాఁడు. ౪౬౨

చ. అని మనుజేశ్వరుండు మృగయావసరాగతతోయదాహ సం
జనితదురంతరోషమున సంయమి దన్నుఁ దిరస్కరించి పూ
జనములు సేయఁ డంచు మృతసర్పము నొక్కటి వింటికొప్పునం
బనివడి తెచ్చివై చెనటు బ్రహ్మమునీంద్రుని యంసవేదికన్. ౪౬౩

వ. ఇట్లు తండు ప్రత్యాహృత బాహ్యాంతరింద్రియుం డగుట నిమీలిత
లోచనుండు గానోపునో యట్లుగాక గతాగతులగు క్షత్రబంధులచే
నేమి యని మృషాసమాధి నిష్ఠుండు గానోపునో యని వితర్కిం
చుచు, వృథారోష దర్పంబున మునిమూఁపున ♦ గతాసు వయిన
సర్పంబు నిడి నరేశ్వరుండు తన పురంబునకుం జనియె. అంత సమీప
వర్తులైన మునికుమారు లంతయుం దెలియంజూచి శమీక నందనుం
డైన శృంగికడకుం జని. ౪౬౪

—♦ శమీక మహామునిపుత్త్రుం డగు శృంగిముని పరీక్షితుని శపించుట. ♦—

కం. నర*గంధగజ♦స్యందన, తురగంబుల నేలురాజు † తోయాతురుఁడై
పరఁగెఁ నీజనకునిమెడ, నురగముఁ దగిలించిపోయె నోడక తండ్రీ.

∴ శీతలవారిన్ = చల్లనినీటిని. △ వారితంబు గాని = వారింపఁబడఁదగని.
*దాహవారి=దప్పిబోఁగొట్టువాఁడు. ♦ గతాసువు=పోయిన ప్రాణములుగలవాఁడు=
మృతినొందినవాడు. * గంధగజము = మదపుటేనుఁగు. ♦ స్యందనము = రథము.
† తోయాతురుఁడు = నీటికై తొట్రుపడువాఁడు= దప్పిబాధచెందినవాఁడు.

వ. అని పలికిన సమానవయోరూప మునికుమారలీలాసంగి యయిన శృంగి § శృంగంబులతోడి మూర్తి ధరియించినట్లు విజృంభించి రోష సంరంభంబున నుదరిపడి బల్యన్నంబుల భుజించి పుష్టంబులగు ‡పర పుష్టంబులం బోలె బలిసియు ద్వారంబులం గాచికొని యుండు ∴సారమేయంబుల పగిది దాసభూతులగు క్షత్రియాభాసు లెట్లు బ్రాహ్మణోత్తములచే స్వరక్షకులుగ నిరూపితు లయిరి. అట్టివార లెట్లు తద్గృహంబుల భాండసంగతం బగు నన్నంబు భుజింప నర్హు లగుదురు, తత్కృతంబు లయినద్రోహంబు లెట్లు నిజస్వామిం జెందు నని మఱియు నిట్లనియె. ౪౬౬

ఉ. ఆడఁడు తన్ను దూషణము లాశ్రమవాసులఁ గాని వైరులం
గూడఁడు కందమూలములు గూడుగఁ దించు సమాధినిష్ఠుఁడై
వీడఁడు లోనిచూడ్కులను విష్ణునిఁ దక్కఁ బరప్రపంచముం
జూడఁడు △మద్గురుండు ఘనుఁ జుట్టఁగ నేటికి రాచవానికిన్. ౪౬౭

ఉ. హోము హిరణ్యదానములఁ బుచ్చుకొనంగ ధనంబు లేమియుం
దేము సవంచనంబులుగ దీవన లిచ్చుచు * వేసరింపఁగా
రాము వనంబులన్ గృహవిరాముల మై నివసింపఁ జెల్లరే
పామును వైవఁగాఁ దగునె బ్రహ్మమునీంద్రు భుజార్గళంబులన్.

క. పుడమిఁగలజనులువోగడఁగఁ,గుడుతురుగట్టుదురుగాక కువలయపతులై
యడవులనిడుమలఁబడియెడి,బడుగుల మెడనిడగఁదగునెపన్నగశవమున్.

కం. భగవంతుఁడు గోవిందుఁడు, జగతిం బెడబాసి చనిన శాసింపంగాఁ
దగువారు లేమి దుర్జను, లెగసి మహాసాధుజనుల ♦నేఁచెద రకటా.

కం. బాలకులార ధరిత్రీ, పాలకు శపియింతు ననుచు బలువడిని విలో
లాలకుఁడగుమునికుంజర, బాలకుఁ డరిగెం ద్రిలోకపాలకు లదరన్.

---

§ శృంగంబులతోడి మూర్తిధరించినట్లు = కొమ్ములతోఁగూడిన రూపము తాల్చినట్టి. ‡ పరపుష్టంబులు=కోకిల= ఇతరపక్షులైన కోకిలలచేఁబోషించునవి = కాకులు. ∴ సారమేయము = కుక్క. △ మద్గురుండు = నాతండ్రి. * వేసరింపఁగాన్ = శ్రమపెట్టుటకు. ♦ ఏఁచెదరు = బాధించెదరు.

వ. ఇట్లు రోషించి కౌశికీనదికిఁ జని జలోపస్పర్శంబుచేసి ౪౭౨

ఉ. ఓడక వింటికోపున * మృతోరగముం గొనివచ్చి మాటుమా
టాడక యున్న మజ్జనకు ♦ నంసతలంబునఁ బెట్టె దుర్మద
క్రీడఁ జరించురాజు హర కేశవు లాఁగినఁ జచ్చు నేఁటితో
నేడవనాఁడు తక్షకఫణీంద్రవిషానల హేతిసంహతిన్. ౪౭౩

వ. అని శమీకమహాముని కుమారుండయిన శృంగి పరీక్షిన్నరేంద్రుని శపియించి నిజాశ్రమంబునకుం జనుదెంచి కంఠలగ్న † కాకోదరకళేబరుం డయిన తండ్రిం జూచి. ౪౭౪

క. ఇయ్యెడ నీకంఠమునకు, నియ్యురగ శవంబుఁ దెచ్చి యిటుచేర్చిన యా
దయ్యమిఁక నేమి సేయదు, ‡ నెయ్యంబులులేవుసుమ్మనృపులకుఁ దండ్రీ.

శా. § ప్రారంభంబున వేఁట వచ్చి ధరణీపాలుండు మాతండ్రిపై
నేరంబేమియు లేక సర్పశవమున్ నేఁ డుగ్రుఁడై వైచినాఁ
డీరీతిన్ △ ఫణి క్రమ్మఱన్ బ్రతుకునో హింసించునో కోఱలన్
రారే తాపసులార దీనిఁ దివరే రక్షింపరే మ్రొక్కెదన్. ౪౭౬

వ. అని వెఱపున సర్పంబుఁ దిగుచు నేర్పులేక యెలుంగెత్తి విలపించుచున్న కుమారకు రోదనధ్వనివిని ∴ యాంగిరసుండయిన శమీకుండు సమాధిసాలించి మెల్లనఁ గన్నులుదెఱచి మూఁపున వ్రేలుచున్న మృతోరగంబు నీక్షించి తీసి పాఱవైచి కుమారకుం జూచి. ౪౭౭

క. ఏకీడు నాచరింపము, లోకులకున్ మనము సర్వలోకసములమున్
శోకింప నేల పుత్త్రక, కాకోదర మేలవచ్చెఁ గంఠంబునకున్. ౪౭౮

వ. అని యడిగినఁ దండ్రికిఁ గొడుకు రాజువచ్చి సర్పంబు వైచుటయుం దాను శపించుటయును వినిపించిన నమ్ముని తన దివ్యజ్ఞానంబున నమ్మానవేంద్రుండు పరీక్షిన్నరేంద్రుం డని యెఱింగి కొడుకు వలన సంతసింపక యిట్లనియె. ౪౭౯

---

* మృత. ఉరగము = చచ్చినపాము. ♦ అంసతలంబునన్ = మూఁపు మీఁద. † కాకోదరకళేబరము = సర్పశరీరము. ‡ నెయ్యంబులు = స్నేహభావములు. § ప్రారంభంబునన్ = అధికసన్నాహముతో. △ ఫణి = సర్పము. ∴ అంగిరసుఁడు = అంగిరసుని వంశీయుండు.

క. పెట్టిద మగుశాపమునకు, దట్టపుద్రోహంబు - గాదు ధరణీకాంతుం
గట్టా యేల శపించితి, పట్టీ తక్షకవిషాగ్ని పాలగు మనుచున్. ౪౮౦

ఆ. తల్లి కడుపులోన దగ్ధుఁడై క్రిమ్మఱఁ
గమలనాభుకరుణఁ గలిగినాఁడు
బలిమి గలిగి ప్రజలఁ బాలించుచున్నాఁడు
* దిట్టపడుచ రాజుఁ దిట్టఁ దగునె. ౪౮౧

ఉ. కాపరి లేనిగొఱ్ఱియలకైవడిఁ గంటకచోరకోటిచే
♦ నేపరి యున్న దీభువన మీశుఁడు కృష్ణుఁడు లేమి నిట్టిచో
భూపరిపాలనంబు సమబుద్ధి నితం డొనరింపఁ § జెల్లరే
∴ యీపరిపాటిద్రోహమున కిట్లు శపింపఁగ నేల బాలకా. ౪౮౨

సీ. పాపంబు నీచేతఁ బ్రాపించె మన కింక
రాజు నశించిన రాజ్యమందు
బలవంతుఁ డగువాఁడు బలహీనుపశుదార
హయసువర్ణాదుల నపహరించు
జారచోరాదులు సంచరింతురు ప్రజ
కన్యోన్యకలహంబు లతిశయిల్లు
వైదికంబై యున్న వర్ణాశ్రమాచార
ధర్మమించుకలేక తప్పిపోవు

ఆ. నంతమీఁద లోకు లర్థకామంబులఁ
దగిలి సంచరింప ధరణి నెల్ల
వర్ణసంకరములు వచ్చు △ మర్కటసార
మేయములకువచ్చు మేరఁ బుత్ర. ౪౮౩

ఉ. భారత వంశజుం బరమ భాగవతున్ హయమేధయాజి నా
చారపరున్ మహానయవిశారదు రాజకులైక భూషణున్

---

* దిట్టపడుచ = సాహసముగల చిన్నవాఁడా ♦ ఏపరి = పెంపు తగ్గి. § చెల్లరే = అయ్యో! ∴ ఈ పరిపాటిద్రోహమునకున్ = ఈ పాటికీడునకు. △ మర్కటసారమేయములకు వచ్చుమేర = కోఁతులకును కుక్కలకును గలుగు మర్యాద.

నీరముఁ గోరి నేఁడు మన నేలకు వచ్చిన యర్థి భక్తి స
త్కారము సేసి పంపఁ జనుఁ గాక శపింపఁగ నీకు ధర్మమే. ౪౮౪

క. భూపతికి నిరపరాధమ, శాపము దానిచ్చి బుద్ధి చాపలమున మా
పాపఁడు వీఁడొనరించిన, పాపముఁ దొలఁగింపు కృష్ణ పరమేశహరీ.

క. పాడిచినఁ దిట్టినఁ గొట్టినఁ, బడుచుందురు గాని పరమ భాగవతులు దా
రొడఁబడరు మాఱు సేయఁగఁ, గొడుకా విభు* డెగ్గు సేయఁగోరఁడు నీకున్.

క. అలుగరు గలఁగరు సాధులు, మిళితములయి పరులవలన మేలుం గీడున్
నెలకొనిననైన నాత్మకు, ♦నొలయవు సుఖదుఃఖచయము§ యుగ్మములగుచున్.

వ. అని యిట్లు శమీకమహామునీంద్రుండు క్షమ్మ్యటింపు శక్తి లేని కొడుకు సేసిన పాపంబునకు సంతాపంబు నొంది తన శిష్యు నొక్క మునికుమారునిం బిలిచి యేతద్వృత్తాంతం బంతయు రాజున కెఱింగించి రమ్మని పంచె. అంత నా యభిమన్యుపుత్రుండు శమీక ముని శిష్యునివలన శాపవృత్తాంతంబు విని కామ క్రోధాదివిషయాసక్తుండగు తనకుం దక్షకవిషాగ్ని విరక్తిబీజం బగుననుచుఁ గరినగరంబునకుం జని యేకాంతంబున. ౪౮౮

—♦ పరీక్షిత్తుఁడు విప్రశాపం బెఱింగి ప్రాయోపవిష్టుండగుట ♦—

ఉ. ఏటికి వేఁటబోయితి మునీంద్రుఁడు గాఢసమాధి నుండఁగా
నేటికిఁ దద్భుజాగ్రమున నేసితి సర్పశవంబుఁ దెచ్చి నే
నేటికిఁ బాపసాహసము లీక్రియఁ జేసితి దైవయోగమున్
దాఁటఁగ రాదు వేగిరమ తథ్యము గీడు జనించు ఘోరమై. ౪౮౯

ఉ. పాము విషాగ్ని △ కీలములఁ బ్రాణము లేఁగిన నేఁగుఁ గాక యీ
భూమియు రాజ్యభోగములు వోయిన నిప్పుడ పోవుఁగాక ∵ సౌ
దామినిఁ బోలు జీవనముఁ దథ్యముగాఁ దలపోసి యింక నే
నేమని మాఱు దిట్టుదు మునీంద్రకుమారకు దుర్నివారకున్. ౪౯౦

---

* ఎగ్గు = కీడు. ♦ ఒలయవు = చెందవు. § యుగ్మములు = ద్వంద్వములు. △ కీలములు = జ్వాలలు. ∵ సౌదామిని = మెఱుపు.

ఆ. రాజ ననుచుఁ బోయి రాజ్యగర్వంబున
*వనముకొఱకు వారి వనము సొచ్చి
దండశూకశవముఁ దండ్రిపై వైచినఁ
బాలియుఁ దిట్ట కేలపోవు సుతుఁడు. ౪౯౧

క. గోవులకును బ్రాహ్మణులకు, దేవతలకు నెల్ల ప్రొద్దుఁ దెంపునఁబీడల్
గావించుపాపమానస, మేవిధమునఁ బుట్టకుండ నేవారింతున్. ౪౯౨

వ. అని వితర్కించి. ౪౯౩

క. దామోదర పదభక్తిం, గామాదుల గెల్చినాఁడు గావున గరుణన్
భూమీశుఁ డలుగఁడయ్యెను, సామర్థ్యముగలిగి దోషసంగిన్ శృంగిన్.

వ. అంత మునికుమారుండు శపించిన వృత్తాంతంబు తక్షకుండు విని యెడరు వేచియుండె. ఇటఁ *దక్షకవ్యాళవిషానల జ్వాలాజాలంబునం దనకు సప్తమదినంబున మరణంబని యెఱింగినవాఁడు గావున భూపాలుండు భూలోక స్వర్గలోక భోగంబులు ♦ హేయంబు లని తలంచి రాజ్యంబు విసర్జించి†నిరశనత్వ దీక్షాచరణంబు సంకల్పించుకొని. ౪౯౫

మ. తులసీసంయుత దైత్యజిత్పదరజ స్తోమంబుకంటెన్ మహో
జ్జ్వలమై దిక్పతిసంఘసంయుతజగత్సౌభాగ్యసంపాదియై
కలిదోషావలి నెల్లఁ బాపెడి వియద్గంగా ప్రవాహంబులో
పలికిం బోయి *మరిష్యమాణుఁ డగుచుం బ్రాయోపవేశంబునన్.

క. చిత్తము గోవిందపదా, యత్తముఁ గావించి మౌనియై తనలో నే
తత్తఱము లేక భూవర, సత్తముఁడు వసించె ముక్తసంగత్వమునన్.

వ. ఇట్లు పాండవ పౌత్రుండు ముకుంద, చరణారవింద వందనానంద కందాయమానమానసుండై §విష్ణుపదీతీరంబునం బ్రాయోపవేశంబున నుండుట విని సకలలోకపావనమూర్తులు మహానుభావులునగుచుఁ దీర్థంబులకుం దీర్థత్వంబు లొసంగ సమర్థులైన యత్రి విశ్వామిత్ర

---

*వనము=ఉదకము. తక్షకవ్యాళము = తక్షకుఁడనెడి సర్పము. ♦ హేయంబులు= నీచంబులు: † నిరశనత్వదీక్ష = నిరాహారవ్రతము. * మరిష్యమాణుఁడు = చావనిశ్చయించినవాఁడు. § విష్ణుపదీతీరంబునన్=గంగయొడ్డున.

మైత్రేయ భృగు వసిష్ఠ పరాశర చ్యవన భరద్వాజ పరశురామ దేవల గౌతమ కశ్యపకపిల కణ్వ కలశసంభవ వ్యాసపర్వత నారద ప్రముఖులైన బ్రహ్మర్షి దేవర్షి రాజర్షి పుంగవులును గాండర్షులయిన యరుణాదులును మఱియు నానాగోత్రసంజాతులైన మునులును శిష్య *ప్రశిష్య సమేతులై చనుదెంచిన వారలకుఁ ♦ప్రత్యుత్థానంబు చేసి పూజించి దండప్రణామంబు నాచరించి కూర్చుండ నియోగించి;

క. క్రమ్మఱ నమ్మునివిభులకు, నమ్మనుజేంద్రుండు మ్రొక్కి †హర్షాశ్రుతతుల్
గ్రమ్మఁగ ముకుళితకరుఁడై, సమ్మతముగఁ జెప్పె నాత్మసంచారంబుల్.

ఉ. ఓపిక లేక చచ్చిన మహోరగముం గొని వచ్చి కోపినై
తాపసుమూఁపుపై నిడిన దారుణచిత్తుఁడ మత్తుఁడన్ మహా
పాపుఁడ మీరు పాపతృణపావకు లుత్తము లయ్యలార నా
పాపము వాయుమార్గము కృపాపరులార విధించి చెప్పరే. ౧౦౦

ఉ. భూసురపాద రేణువులు పుణ్యులజేయున రేందురిలన్ ధరి
త్రీసురులార మీచరణ రేణుకణంబులు మేను సోఁకి నా
చేసినపాప మంతయు నశించె గృతార్థుఁడ నైతి నెద్దియేఁ
జేసిన ముక్తిపద్ధతికిఁ జెచ్చెరఁ బోవఁగ వచ్చుఁ జెప్పరే. ౧౦౧

క. భీకరతరసంసార, వ్యాకులతన్ విసిగి దేహ వర్జన గతి నా
లోకించు నాకుఁ దక్షక, కాకోదరవిషము ముక్తి కారణ మయ్యెన్.

క. ఏపారునహంకార, వ్యాపారములందు మునిఁగి వర్తింపంగా
నాపాలిటిహరి భూసుర, శాపవ్యాజమున ముక్త సంగుంజేసెన్.

మ. ఉరగాధీశవిషానలంబునకు నే నొప్పింతు శంకింప నీ
శ్వరసంకల్పము నేఁడు మానదు భవిష్యజ్జన్మ జన్మంబులన్.
హరిచింతారతియున్ హరిప్రణుతి భాషా కర్ణనాసక్తియున్
హరిపాదాంబుజసేవగల్గుటకు మీ రర్థిం బ్రసాదింపరే. ౧౦౪

* ప్రశిష్యులు = శిష్యశిష్యులు. ♦ ప్రత్యుత్థానము = ఎదుర్కొనుట.
† హర్షాశ్రుతతుల్ = ఆనంద బాష్ప సమూహములు.

క. చూడుఁడు నాకల్యాణము, పాడుఁడుగోవిందుమీఁది పాటలుదయతో
నాడుఁడు హరిభక్తులకథ, లేడహములలోన ముక్తికేఁగెద నిచటన్.

క. అమ్మా నిన్నుఁ జూచిన నరుఁ, బొమ్మా యని ముక్తికడకుఁ బుత్తువట కృపన్
లెమ్మా నీరూపముతో, రమ్మా నాకెదుర గంగ రమ్యతరంగా.

వ. అని తనకు మీఁద నయ్యెడి జన్మాంతరంబులందును హరిపాదభక్తి సౌజన్యంబులు సంధిల్లుంగాత మని * గంగాతరంగిణీ దక్షిణ ♦ కూలంబునం బూర్వాగ్ర దర్భాసనంబున నుత్తరాభిముఖుండై యుపవేశించి జనమేజయు రప్పించి రాజ్య భారంబు సమర్పించి యత్నంబు సంసార బంధంబునకుం దప్పించి చిత్తంబు హరికి నొప్పించి పరమ భాగవతుండైన పాండవపౌత్రుండు ప్రాయోపవిష్టుండై యున్న సమయంబున.

క. †ఒత్తిలిపొగడుచుసురలు వి,యత్తలముననుండి మెచ్చి యలరులవానల్
మొత్తములై కురిసిరి నృప,సత్తముపై భూరిభేరి శబ్దంబులతోన్.

వ. ఆసమయంబున సభాసీను లయిన సంయమీంద్రు లిట్లనిరి.

మ. క్షితినాథోత్తమ నీచరిత్రము మహాచిత్రంబు మీ తాత లు
గ్రతపోధన్యులు విష్ణుపార్శ్వ పదవిం గామించి రాజన్య శో
భిత కోటీర మణిప్రభాన్విత మహాపీఠంబు వర్జింతు రు
న్నతులై నీవు మహోన్నతుండవు గదా నారాయణ ధ్యాయివై.

మ. వసుధాధీశ్వర నీవు మర్త్యతనువున్ వర్జించి నిశ్శోకమై
వ్యసనచ్ఛేదకమై రజోరహితమై వర్తించు లోకంబు స
ర్వసమత్వంబునఁ జేరునంతకు భవద్వాక్యంబులన్ వించు నే
డెనకుం బోవక చూచుచుండెదము నీ దివ్యప్రభావంబులన్. ౫౧౧

వ. అని యిట్లు పక్షపాతశూన్యంబులును మహనీయ మాధుర్య గాంభీర్య సౌజన్య ధుర్యంబులునైన భాషణంబు లాడుచు మూఁడులోకంబులకు నవ్వలిదైన సత్యలోకంబునందు మూర్తిమంతంబులై నిగ

---

* గంగాతరంగిణి = గంగానది. ♦ కూలంబు = తీరము. † ఒత్తిలి = గట్టిగా.
ఫ. వియత్తలము = ఆకాశప్రదేశము.

డుచున్న నిగమంబుల చందంబునం దేజరిల్లుచున్న ఋషులం జూచి
భూవరుండు నారాయణ కథాశ్రవణ కుతూహలుండై నమస్కరించి
యిట్లనియె. ౫౧౨

క. ఏడుదినంబుల ముక్తిం, గూడంగ నేరీతివచ్చు గురుసంసార
క్రీడనమే క్రియ నెడ తెగుఁ, జూడుఁడు మాతండ్రులార శ్రుతివచనములన్

శా. ప్రాప్తానందులు బ్రహ్మబోధనకళా § పారీణు లాత్మప్రభా
లుప్తాజ్ఞాన మహాంధకారులు దయాళుత్వాభిరాముల్ మనో
* గుప్తంబుల్ సకలార్థజాలములు మీకుం గానవచ్చుం గదా
♦ సప్తాహంబుల ముక్తి కేఁగెడు గతిం జర్చించి భాషింపరే.

వ. అని యుత్తరానందనుం డాడిన వచనంబులకు మును లందఱుఁ బ్రత్యుత్తరంబు విమర్శించు నెడ దైవయోగంబున. ౫౧౩

—♦ శుకమహర్షి పరీక్షిన్మహారాజు నొద్ద కేతెంచుట ♦—

సీ. ప్రతిని మేషముఁ బరబ్రహ్మంబు నీక్షించి
మదిఁ జొక్కి వెలుపల మఱచువాఁడు
కమలంబు మీఁది † భృంగముల కైవడి మోము
పై నెఱసిన కేశపటలివాఁడు
‡ గెఱ వ్రాసి మాయ నంగీరించిన భంగి
§ వసనంబుఁ గట్టక వచ్చువాఁడు
సంగిగాఁడని వెంటఁ జాటు భూతములు నా
బాలురహాసశబ్దముల వాఁడు

తే. మహితపదజానుజంఘోరు మధ్యహస్త
బాహువక్షోగళానన ఫాలకర్ణ
నాసికాగండమస్తక నయనయుగళుఁ
డైన ∴ యవధూతమూర్తి వాఁ డరుగుదెంచె. ౫౧౪

---

§ ఆత్మప్రభాలుప్తాజ్ఞానము = ఆత్మప్రకాశము చేత నశించిన యజ్ఞానము.
* గుప్తంబులు = రహస్యములు. ♦ సప్తాహంబులన్ = ఏడుదినములలో.
† భృంగంబులకైవడిన్ = తుమ్మెదలవలె. ‡ గెఱ = రేఖ.
§ వసనంబు = వస్త్రము. ∴ అవధూతమూర్తి = దిగంబరసన్న్యాసి స్వరూపము.

ఉ. △ ఊరని లోకులం గినిసి యొగ్గులు వల్కనివాఁడు కోరికల్
గోరనివాఁడు † కూటువలఁ గూడనివాఁడు వృథాప్రపంచముం
జేరనివాఁడు దైవగతిఁ జేగినలాభముఁ జూచి తుష్టుఁడై
నేరనివాని చందమున నేర్పులు సూపనివాఁడు వెండియున్. ౧౧౭

ఆ. అమ్మహాత్ము షోడశాబ్దవయోరూప
గమనగుణవిలాస కౌశలములు
ముక్తి కాంత సూచి మోహిత యగునఁట
నితర కాంతలెల్ల నేమి సెప్ప. ౧౧౮

ఆ. వెఱ్ఱితనము మాని విజ్ఞానమూర్తియై
బ్రహ్మభావమునను * బర్యటింప
వెఱ్ఱియంచు శుకుని వెంట నేతెంతురు
◆ వెలఁదు లర్భకులును వెఱ్ఱులగుచు. ౧౧౯

వ. ఇట్లు వ్యాసనందనుండైన శుకుం డరుదెంచిన నందలి మునీంద్రు లమ్మహానుభావుని ప్రభావంబు తెఱంగెఱుంగుదురు గావున నిజాసనంబులు డిగ్గి * ప్రత్యుత్థానంబు సేసిరి, పాండవపౌత్రుండు నాయోగిజనశిఖామణికి నతిథిసత్కారంబులుగావించి దండప్రణామంబు సేసి పూజించె మఱియు గ్రహనక్షత్రతారకా మధ్యంబునం దేజరిల్లు రాకాసుధాకరుండునుంబోలె బ్రహ్మర్షి దేవర్షి రాజర్షి మధ్యంబు నంగూర్చుండి విరాజమానుం డైనశుకయోగీంద్రుం గనుంగొని.

ఉ. ◆ ఫాలము నేల మోపి భయ భక్తులతోడ నమస్కరించి భూ
పాలకులోత్తముండు కరపద్మములన్ ముకుళించి నేఁడు నా
పాలిటి భాగ్యమెట్టిదియొ పావనమూర్తివి పుణ్యకీర్తి యీ
వేళకు నీవు వచ్చితి వివేకవిభూషణ దివ్యభాషణా. ౧౨౦

మ. అవధూతోత్తమ మంటి నేఁడు నినుడాయం గంటి నీవంటివి
ప్రవరుం జేరఁగనుంనంతటన్ ‡ భసితమాఁ బాపంబు నాబోఁటికిన్

△ ఊరు + అని = ఇయ్యరని. † కూటువల = గుంపుతో
* పర్యటింపఁగా = తిరుగఁగా. ◆ వెలఁదులు = స్త్రీలు. * ప్రత్యుత్థానంబు = ఎదురు లేచుట. ◆ ఫాలంబు = నుదురు. ‡ భసితము = బూడిద.

భవదాలోకనభాషణార్చనపద ప్రక్షాళనస్పర్శనా
దివిధానంబుల ముక్తి చేపడుట చింతింపంగ నాశ్చర్యమే. ౫౧౧

క. హరిచేతను దనుజేంద్రులు, ధరఁద్రుంగెడుభంగి నీపదస్పర్శముచే
గురుపాతక సంఘంబులు, *పొరిమాలుఁగదయ్య యోగి భూషణవింటే.

మ. ఎలమిన్ మేనమఱందియై సచివుఁడై యేమేటి మాతాతలన్
బలిమిం గాచి † సముద్రముద్రితధరం బట్టంబుఁ గట్టించె న
య్యలఘుం డీశుఁడు చక్రి రక్షకుఁడు గా కన్యుల్ విపద్రక్షకుల్
గలరే వేఁడెద భక్తి నాగుణనిధిం గారుణ్య వారాన్నిధిన్. ౫౧౩

సీ. § అవ్యక్తమార్గుండ వైననీదర్శన
మాఱడివోనేర ∴ దభిమతార్థ
సిద్ధిగావించుట సిద్ధంబు నే △ డెల్లి
దేహంబు వర్జించు దేహధారి
కేమి చింతించిన నేమిజపించిన
నేమిగావించిన నేమివినిన
నేమి సేవించిన నెన్నఁడు సంసార
పద్ధతిఁ బాసిన పదవి గలుగు

తే. నుండు మనరాదుగురుఁడవు యోగివిభుఁడ
వావుఁ బిలికినతడ వెంత యంత సేపు
గాని యొకదెస నుండవు కరుణతోడఁ
జెప్పవే తండ్రి ముక్తికిం జేరు తెరువు. ౫౧౫

వ. అని పరీక్షిన్నరేంద్రుఁడు * బాదరాయణి నడిగె నని చెప్పి.

క. రాజీవపత్రలోచన, రాజేంద్రకిరీటఘటిత రత్న ♦ మరీచి
భ్రాజితపాదాంభోరుహ భూజనమందార నిత్య పుణ్యవిచారా.

---

* పొరిమాలుఁగ = నశించును. † సముద్రముచేఁ జుట్టఁబడిన నేలయందు.
§ అవ్యక్తమార్గుండవు = వ్యక్తముకాని దగుమోక్ష మార్గము నెఱిఁగినవాఁడవు.
∴ అభిమతార్థసిద్ధి=కోరిన కార్యములుఫలించుట. △ ఎల్లి=రేపు. * బాదరాయణుఁడు= వ్యాసుఁడు; బాదరాయణి బాదరాయణపుత్త్రుఁడైన శుకుఁడు. ♦ మరీచి = కాంతి.

మాలిని. అనుపమ గుణహారా హన్యమానారి వీరా
జన వినుత విహారా జానకీ చిత్తచోరా
దనుజ ఘన సమీరా దానవశ్రీ విదారా
ఘన కలుష కఠోరా కంధి గర్వాపహారా.

గద్యము. ఇది శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రి పుత్త్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన శ్రీ మహాభాగవతం బను మహాపురాణంబునందు నైమిశారణ్యవర్ణనంబును, శౌనకాదుల ప్రశ్నంబును, సూతుండు నారాయణ కథా సూచనంబు సేయుటయు, వ్యాసచింతయు, నారదాగమనంబును, నారదుని పూర్వజన్మవృత్తాంతంబునుఁ, బుత్త్రశోకాతురయైన ద్రుపదరాజనందన కర్జునుం డశ్వత్థామం దెచ్చి యొప్పగించి గర్వపరిహారంబు సేయించి విడిపించుటయు, భీష్మ నిర్యాణంబును, ధర్మనందను రాజ్యాభిషేకంబును, గోవిందుని ద్వారకాగమనంబును, విరాటకన్యకా § గర్భవిద్యమానుండైన యర్భకు నశ్వత్థామ బాణానలంబు వలనం బాపి విష్ణుండు రక్షించుటయు, బరీక్షిజ్జన్మంబును, గాంధారీ ధృతరాష్ట్రవిదురులనిర్గమంబును, నారదుండు ధర్మజునకుఁ గాలసూచనంబు సేయుటయుఁ, గృష్ణనిర్యాణంబు విని పాండవులు మహాపథంబునం జనుటయు నభిమన్యుపుత్త్రుండు దిగ్విజయంబు సేయుచు శూద్రరాజలక్షణలక్షితుండగుఁ గలి గర్వంబు సర్వంబు మాపి △ గోవృషాకారంబుల నున్న ధరణీ ధర్మదేవతల నుద్ధరించుటయు, శృంగి శాపభీతుండై యుత్తరానందనుండు గంగాతీరంబునం బ్రాయోపవేశంబున నుండి శుక సందర్శనంబు సేసి మోక్షోపాయం బడుగుటయు నను కథలంగల ప్రథమస్కంధము. ౫౨౯

సంపూర్ణము.

హరిః, ఓమ్. తత్సత్. శ్రీ కృష్ణార్పణమస్తు.

---

§ గర్భవిద్యమానుండైన యర్భకుఁ=కడుపులో నున్న బాలుని.
△ గోవృషాకారంబులఁ = గోరూప వృషభరూపములను.

శ్రీరస్తు

శ్రీకృష్ణాయ నమః

# శ్రీమదాంధ్రభాగవతము

## ద్వితీయస్కంధము

శ్రీమద్భక్తచకోరక
సోమ! వివేకాభిరామ! సురవినుతగుణ
స్తోమ! నిరలంకృతాసుర
రామాసీమంతసీమ! రాఘవరామా!

వ. మహనీయ గుణగరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులకు నిఖిల పురాణవ్యాఖ్యాన వైఖరీ సమేతుండైన సూతుండిట్లనియె. అట్లు పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డిట్లనియె:— ౧

సీ. "క్షితిప! నీప్రశ్నంబు శ్రేష్ఠతమం బగు,
నాత్మవేదులు మెత్తు, రఖిలశుభద,
*మా కర్ణనీయంబు ∴ లయుత సంఖ్యలు గల,
వందు ముఖ్యం బిది, యధిక తరము,
గృహముల లోపల § గృహమేధు లగు నరు
లాత్మతత్త్వము లేశమైన నెఱుఁగ,
† నంగనారతుల నిద్రాసక్తిఁ జను రాత్రి,
పోవుఁ గుటుంబార్థ బుద్ధి ♦ నహము.

ఆ. పశుకళత్ర పుత్త్ర బాంధవ దేహాది
సంఘ మెల్లఁ దమకుఁ సత్యమనుచుఁ

---

*ఆకర్ణనీయంబులు = వినఁదగినవి. ∴ అయుతసంఖ్యలు = వేలసంఖ్యలు = వేలకొలఁది. § గృహమేధులు = గృహస్థులు. † అంగనారతులన్ = స్త్రీలయందలి యాసక్తులచే ♦ అహము = పగలు.

గాఁపురములు సేసి కడపటఁ జత్తురు,
కనియుఁ గాన రంతకాల సరణి. 3

క. కావున సర్వాత్ముండగు మాహావిభవుఁడు విష్ణుఁ డీశుఁ డాకర్ణింపఁగ
సేవింపను వర్ణింపను భావింపను భావ్యుఁ ‡డభవభాజికి, నధిపా! ౪

ఆ. జనుల కెల్ల శుభము సాంఖ్యయోగము, దాని
వలన ధర్మనిష్ఠవలన నయిన
నంత్యకాల మందు హరిచింత సేయుట
పుట్టువునకు ఫలము, భూవరేంద్ర!

తే. అరసి నిర్గుణ బ్రహ్మంబు నాశ్రయించి
విధినిషేధ నివృత్త సద్విమలమతులు
సేయు చుందురు హరిగుణ చింతనములు
మానసంబుల నెప్పుడు, మానవేంద్ర!

సీ. ద్వైపాయనుఁడు నాదు తండ్రి ద్వాపరవేళ
•బ్రహ్మసమ్మితమైన భాగవతముఁ
బఠనంబుచేయించె, బ్రహ్మతత్పరుఁడనై
*యుత్తమశ్లోకలీలోత్సవమున
నాకృష్టచిత్తుండనై పఠించితి, నీవు
హరిపాదభక్తుండ వగుటఁ జేసి
యెఱిఁగింతు వినవయ్య, యీ భాగవతమున
విష్ణుసేవాబుద్ధి విస్తరిల్లు;

ఆ. మోక్షకామునకును మోక్షంబుసిద్ధించు;
†భవభయంబులెల్లఁ బాసిపోవు;
యోగి సంఘమునకు నుత్తమవ్రతములు
వాసుదేవ నామవర్ణనములు. ౬

---

‡ అభవభాజి = సంసారరాహిత్యము నొందినవాఁడు. •బ్రహ్మసమ్మితము — బ్రహ్మసూత్రలకు సమ్మితమైనది. *ఉత్తమశ్లోక లీలోత్సవమున = ఉత్తమచరిత్రుఁడైన భగవంతుఁడగు వానివిలాసమునందు † భవభయంబు=సంసారభీతి.

తరలము. హరినెఱుంగక యింటిలో బహుహాయనంబులు మత్తుఁడై
పొరలుచుండెడివెఱ్ఱి ముక్తికిఁబోవనేర్చునె? వాఁడు ∴సం
సరణముం బెడఁబాయఁ డెన్నఁడు, సత్య మాహరినామసం
స్మరణ మొక్క *ముహూర్తమాత్రము చాలు, ముక్తిదమౌ, నృపా.

సీ. ఖేచరేశ్వర! తొల్లి ఖట్వాంగుఁడనువిభుం
డిల నేడుదీవుల నేలుచుండి
†శక్రాదిదివిజులు సంగ్రామభూముల
నుగ్రదానవులకు నోడివచ్చి
తమకుఁదోడడిగిన, ధరనుండి దివి కేఁగి
దానవవిభుల నందఱ వధింప,
'వరమిత్తు'మనుచు దేవతలు సంభాషింప,
'జీవితకాలంబు సెప్పుఁ డిదియ
వరము నాకు నొండు వరమొల్ల' ననవుడు,
౯ 'నాయు వొక్కముహూర్త మంతదడవు
గల'దటంచుఁ బలుక △గగనయానమున న
మ్మానవేశ్వరుండు మహికివచ్చి

౧౦ ఆ. ◆గిరులఁబోలెడి §కరులును ‡హరులం దన ÷ప్రాణదయితలై మనియెడు సుం
దరుల నుహితవరులను బుధవరులను వర్జించి గాఢవైరాగ్యమునన్;

క. గోవింద నామకీర్తనఁ గావించి భయంబుఁదక్కి ఖట్వాంగధరి
త్రీవిభుఁడు సూఱఁగొనియెను, గైవల్యముఁ దొల్లి రెండుగడియలలోనన్.

వ. వినుము నీకు నేడు దివసంబులకుంగాని జీవితాంతంబు గాదు;
తావత్కాలంబునం × పారలౌకిక సాధనభూతంబగు పరమ

---

∴ సంసరణంబు=సంసారము. * ముహూర్తము = రెండుగడియలకాలము.
† శక్రాదిదివిజులు=ఇంద్రుఁడు మొదలైన దేవతలు.
△ గగనయానమునన్ = ఆకాశ (విమాన) మార్గమున. ◆ గిరులన్=పర్వతములను.
§ కరులన్=ఏనుఁగులను ‡ హరులన్ = గుఱ్ఱములను. ÷ ప్రాణదయితలు = ప్రాణప్రియలు. × పారలౌకికము=పరలోకసంబంధమైనది.

కళ్యాణంబు సంపాదింప వచ్చు. అంత్యకాలంబు డగ్గరిన బెగ్గడిలక దేహి దేహ పుత్త్ర కళత్రాది సందోహంబు వలని మోహ పాశంబు నిష్కామకరవాలంబున నిర్మూలనంబుఁ జేసి గేహంబు వెడలి పుణ్యతీర్థ జలావగాహంబు సేయుచు నేకాంత శుచి ప్రదేశంబున విధివత్ప్రకారంబునం గుశాజిన చేలంబులతోడం గల్పితాసనుండై మానసంబున నిఖిల జగత్పవిత్రీకరణ సమర్థంబయి * యకారాది త్రివర్ణ కలితంబయి బ్రహ్మబీజంబైన ♦ ప్రణవంబు సంస్మరించుచు వాయువుల జయించి విషయంబుల వెంటనంటి పాఱెడి యింద్రియంబుల బుద్ధిసారథినై మనోనామకంబు లైన పగ్గంబుల బిగ్గఁబట్టి మొగ్గిం దిగిచి దట్టంబు లైన కర్మ ఘట్టంబుల నిట్టట్టు మెట్టెడుమనంబును † శేముషీబలంబున నిరోధించి భగవదాకారంబుతోడ బంధించి నిర్విషయం బయిన మనంబును భగవత్పాదాద్యవయవంబులం గ్రమంబున ధ్యానంబు సేయుచు రజస్తమో గుణంబులచేత నాక్షిప్తంబగు చిత్తంబు విమూఢంబైన ధారణావశంబునం దద్గుణంబులవలన నయ్యెడి మలంబులం బోనడిచి నిర్మల చిత్తంబునం బరమంబైన విష్ణుపదంబునకుం జను ధారణా నియమంబుగలుగ సుఖాత్మకంబగు విషయంబు నవలోకించు యోగికి భక్తిలక్షణంబైన యోగాశ్రయంబున వేగంబ మోక్షంబు సిద్ధించు" ననిన యోగీంద్రునకు నరేంద్రుం డిట్లనియె:— ౧౨

క. "ధారణ యేక్రియనిలుచును? ధారణ కేరూప, మెద్దిధారణయనఁగా?
ధారణ పురుషు మనోమల। మేరీతి హరించు? నాకు నెఱిఁగింపఁగదే."

వ. అనిన విని రాజునకు నవధూతవిభుం డిట్లనియె ౧౪

---

* అకారాది త్రివర్ణకలితము = 'అ' కారము మొదలైన మూఁడువర్ణములచే నొప్పునది = 'అ'కారము, 'ఉ'కారము, 'మ'కారము నను మూఁడక్షరములచే నేర్పడినది. ♦ ప్రణవము = ఓంకారము. † శేముషీ = బుద్ధి.

౭. "పవనము నియమించి పరివ్రాతరంగుఁడై
యింద్రియములవర్గ మెల్లమాపి
హరి విశాలరూప మందుఁ జిత్తముఁజేర్చి
నిలుపవలయు బుద్ధి నెఱపి బుధుఁడు. ౧౫

— శుకుండు పరీక్షిత్తునకు విరాట్స్వరూపంబు దెలుపుట. —

౮. వినుము, భగవంతుం డైన హరివిరాడ్విగ్రహంబు నందు భూత భవిష్యద్వర్తమానం బైన విశ్వంబు విలోక్యమానంబగు. ధరణీసలిల తేజస్సమీరణ గగనాహంకార మహత్తత్త్వంబు లనియెడి సప్తావరణంబులచేత నావృతంబగు మహాండకోశంబైన శరీరంబునందు ధారణాశ్రయంబయిన *వైరాజపురుషుండు దేజరిల్లు. అమ్మహాత్మునికిఁ, బాదమూలంబు పాతాళంబు; పార్ష్ణిభాగపాదాగ్రభాగంబులు రసాతలంబు; † గుల్ఫంబులు మహాతలంబు; జంఘలు తలాతలంబు; జానుద్వయంబు సుతలంబు; నూరువులు వితలాతలంబు; జఘనంబులు మహీతలంబు; నాభీవివరంబు నభస్స్థలంబు; వక్షంబు గ్రహతారకాముఖజ్యోతిస్సమూహసమేతంబగు నక్షత్రలోకంబు; ♦ గ్రీవంబు మహర్లోకంబు; ముఖంబు జనలోకంబు; లలాటంబు దపోలోకంబు; శీర్షంబు సత్యలోకంబు; బాహుదండంబు లింద్రాదులు; కర్ణంబులు దిశలు; శ్రవణేంద్రియంబు శబ్దంబు; నాసాపుటంబు లశ్వినీదేవతలు; ఘ్రాణేంద్రియంబు గంధంబు; వదనంబు వహ్ని; నేత్రంబు లంతరిక్షంబు; చక్షురింద్రియంబు సూర్యుండు; రేయుంబగళ్లు ఱెప్పలు; భ్రూయుగ్మవిజృంభణంబు బ్రహ్మపదంబు; ‡ తాలువులు జలంబులు; జిహ్వేంద్రియంబు రసంబు; వేదంబులు బ్రహ్మరంధ్రంబులు; దంష్ట్రలు దండధరుండు; దంతంబులు పుత్త్రాదిస్నేహకళలు; నగవులు జగన్మోదకరంబులైనమాయావిశేషంబులు; కటాక్షంబు లనంతసర్గంబులు; పెదవులు వ్రీడాలోభంబులు; స్తనంబులు ధర్మమార్గంబులు; వెన్నధర్మమా

* వైరాజ పురుషుండు = విరాట్పురుషుఁడు. † గుల్ఫంబులు = చీలమండలు.
♦ గ్రీవంబు = కంఠము. ‡ తాలువులు = దవడలు.

ర్గంబు; మేఢ్రంబు ప్రజాపతి; వృషణంబులు మిత్రావరణులు; జఠరంబు సముద్రంబులు; శల్యసంఘంబులు గిరులు; నాడీనివహంబుఁ నదులు; ♦తనూరుహంబులు తరువులు; నిశ్వసనంబులు వాయువ్రప్రాయంబు నిరవధికం బయినకాలంబు; కర్మంబులు నానావిధజంతునివహాసంవృతసంసరణంబులు; శిరోజంబులు మేఘంబులు; కట్టుపుట్టబులు సంధ్యలు; హృదయంబు ప్రధానంబు; సర్వ వికారంబులకు నాశ్రయంబయినమనంబు చంద్రుండు; చిత్తంబు మహత్తత్త్వంబు అహంకారంబు రుద్రుండు; అశ్వాశ్వతర్యుష్ట్రగజంబులు నఖంబులు కటిప్రదేశంబు పశుమృగాదులు; విచిత్రంబులైన యాలాపనైపుణబులు పక్షులు; బుద్ధి మనువు; నివాసంబు పురుషుండు; షడ్జాదులై సర్వవిశేషంబులు గంధర్వవిద్యాధర చారణాప్సరస్సమూహంబులు స్మృతి ప్రహ్లాదుండు; వీర్యంబు దైత్యదానవాసీకం బయి యుండు మఱియు నమ్మహావిభునకు ముఖంబు బ్రాహ్మణులును, భుజంబుఁ క్షత్రియులును, నూరులు వైశ్యులును, చరణంబులు శూద్రులును నామంబులు నానావిధంబులైన వసురుద్రాదిదేవతాభిధానంబులును ద్రవ్యంబులు హవిర్భాగంబులును; కర్మంబులు యజ్ఞప్రయోగంబులును నగు. ఇట్టి సర్వమయుండైన పరమేశ్వరుని విగ్రహంబు బు మంతుఁడై ముముక్షు వైనవాఁడు మనంబున ననుసంధానంబు సేయవలయు"నని వక్కాణించి వెండియు నిట్లనియె ౧౬

క. హరిమయము విశ్వమంత। యు హరి*విశ్వమయుండు సంశయము పనిలే ద
హరిమయము గా నిద్రవ్యము। పరమాణువు లేదు వంశపావన వింటే

సీ. కలలోన జీవుండు గౌతూహలంబునఁ
బెక్కు దేహంబులఁ బేరువడసి
యింద్రియంబుల వెంట నెల్లవృత్తంబులు
నీక్షించి మఱి తన్నుఁ నెఱుఁగు కరణి
నఖిలాంతరాత్మకుఁ డగు పరమేశ్వరుఁ
డఖిలజీవుల హృదయములనుండి

---

♦ తనూరుహంబులు = రోమములు.

* విశ్వమయుఁడు = ప్రపంచస్వరూపుఁడు.

బుద్ధివృత్తుల నెల్ల ♦బోధియై వీక్షించు,
బద్ధుఁడు గాఁడు § ప్రాభవమువలన,
తే. సత్యుఁ డానంద బహుళ విజ్ఞానమూర్తి,
యతని సేవింప నగుఁగాక యన్యసేవఁ
గలుగ నేరవు కైవల్య గౌరవములు,
పాయ దెన్నఁడు సంసారబంధ, మధిప! ౧౮

మ. బహువర్షంబులు బ్రహ్మ దొల్లి జగముత్పాదింప *విన్నాణిగా
క హరిప్రార్థన ధారణా వశమునం గాదే యమోఘోల్లస
న్మహనీ యోజ్జ్వల బుద్ధియై భువన నిర్మాణ ప్రభావంబుతో
విహరించెఁ? నరనాథ! జంతునివహావిర్భావ నిర్ణేతయై. ౧౯

వ. విను, మూఢుండు శబ్దమయ వేదమార్గంబైన కర్మఫలబోధన ప్రకారంబున వ్యర్థంబులైన స్వర్గాది నామలోక సుఖంబుల నిచ్ఛగించుచు మాయామయ మార్గంబున వాసనామూలంబున నిద్రించువాఁడు గలలు గను తెఱంగునం బరిభ్రమించుచు నిరవద్య సుఖలాభంబుఁ జెందఁడు; తన్నిమిత్తంబున విద్వాంసుండు నామమాత్రసారంబు లగుభోగ్యంబులలోన నెంతటి దేహనిర్వాహణంబు సిద్ధించు నంతియ కైకొనుచు నప్రమత్తుఁడై సంసారంబు సుఖంబని నిశ్చయింపక యొండుమార్గంబున సిద్ధిగలదని చూచి పరిభ్రమణంబు సేయుచుండు. ౨౦

సీ. కమనీయభూమిభాగములు లేకున్నవే?
పడియుండుటకు దూదిపఱుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే?
†భోజన భాజనపుంజ మేల?
‡వల్కలాజినకుశావళులు లేకున్నవే?
కట్ట ¶దుకూల సంఘంబు లేల?

---

♦ బోధి = తెలిసినవాఁడు. § ప్రాభవము = అధికారము.

* విన్నాణి = నేర్పరి. † భోజనభాజనపుంజము = భోజనపాత్రల సముదాయము. ‡ వల్కలాజిన కుశావళులు = నారబట్టలయొక్కయు జింకచర్మముల యొక్కయు దర్భలయొక్కయు సముదాయములు.

¶ దుకూలసంఘంబులు = సన్నని వస్త్రముల సమూహము

¶ కానఁగాని వసియింప గుహలు లేకున్న వే?
ప్రాసాదసౌధాది పటల మేల?

తే. ఫలరసాదులు గురియవే పాదపములు?
స్వాదుజలముల నుండవే సకలనదులు?
పొసఁగ భిక్షము వెట్టరే పుణ్యసతులు?
ధనమదాంధుల కొలువేల తాపసులకు? ౨౧

క. రక్షకులు లేనివారల।రక్షించెద ననుచుఁ జక్రి రాజై యుండన్
రక్షింపుమనుచు నొకనరు।నక్షముఁ బ్రార్థింపనేల యాత్మజ్ఞులకున్.

వ. అని యిట్లు స్వతస్సిద్ధుండును నాత్మయుఁ బ్రియుండును నిత్యుండును సత్యుండును భగవంతుండునునైన వాసుదేవుని భజియించి తదీయ సేవానుభవానందంబున సంసారహేతువగు నవిద్యవలన బుద్ధిమంతుండు విడువంబడుం గావున- ౨౩

మ. హరిఁ జింతింపక మత్తుఁడై విషయ చింతాయత్తుఁడై చిక్కి వా
సరముల్ ద్రోసెడువాఁడు కింకరగదా సంతాడితోరస్కుఁడై
ధరణీశోత్తమ! ♦ దండభృన్నివసన ద్వారోపకంఠాగ్ర△వై
తరణీవహ్ని శిఖాపరంపరలచే దగ్ధుండు గాకుండునే? ౨౪

క. మొత్తుదురు గదల, మంటల।కొత్తుము రడ్డంబు, దేహ మింతింతలుగా
నొత్తుదు*రసిపత్రికలను,హత్తుదురుకృతాంత భటులుహరివిరహితులన్

వ. మఱియు హరిచరణకమల గంధరసాస్వాదనం బెఱుంగనివారలు నిజకర్మబంధంబుల దండధరమందిర ద్వారదేహళీసమీప జాజ్వల్యమాన వైతరణీతరంగిణీ దహన దారుణజ్వాలాజాల దందహ్యమాన దేహులంగూడి శిఖిశిఖావగాహంబుల నొందుచుందురు. మఱియు విజ్ఞానసంపన్నులై మన్నప్రపన్నులు మాయాపన్నులు గాక † విన్నాణంబునఁ దమతమ హృదయాంతరాళంబులం

---

¶ కానఁగాని = యత్నించి. ♦ దండభృత్తు — యముఁడు.

△ వైతరణీవహ్నిశిఖాపరంపరలు — వైతరణీనదియొక్క యగ్నిజ్వాలల సమూహములు. * అసిపత్రికలు — కత్తిరేకులు. † విన్నాణంబు = నేర్పు.

△ బ్రాదేశమాత్ర దివ్యదేహుండును, దిగిభరాజ శుండా దండ సంకాశ దీర్ఘచతుర్బాహుండును, గందర్పకోటిసమానసుందరుండును, ధృతమందరుండును, † రాకావిరాజమానరాజమండల సన్నిభ వదనుండును, సౌభాగ్యసదనుండును, బ్రిభాతకాలభాసమాన భాస్కరబింబ ప్రతిమాన విరాజిత పద్మరాగరత్న రాజీవిరాజమాన కిరీటకుండలుండును. శ్రీవత్స లక్షణాలక్షిత వక్షోమండలుండును, రమణీయ కౌస్తుభరత్నఖచిత కంఠికాలంకృతకంధరుండును, నిరంతరపరిమళమిళిత వనమాలికా బంధురుండును, నానావిధగంభీర హార కేయూరకటక కంకణమేఖలాంగుళీయక విభూషణవ్రాత సముజ్జ్వలుండును, నిటలతటవిలంబమాన విమలస్నిగ్ధ నీలకుంచిత కుంతలుండును, దరుణచంద్ర చంద్రికాధవళ మందహాసుండును, బరిపూర్ణకరుణావలోకన *భ్రూభంగ సంసూచితసుభగ సంతతానుగ్రహ లీలావిలాసుండును, మహాయోగిరాజ విలసితహృదయ కమలకర్ణికా మధ్య సంస్థాపిత విలసిత ♦ చరణకిసలయుండును సంతతానంద మయుండును, సహస్రకోటిసూర్య సంఘాత సన్నిభుండును, విభుండునునైన పరమేశ్వరుని మనోధారణావశంబున నిలిపికొని, తదీయ గుల్ఫచరణ § జానుజంఘాద్యవయవంబులం గ్రమంబున నొక్కొకటిని. బ్రతిక్షణంబును ధ్యానంబు సేయుచు నంతకాలంబునకుఁ బరిపూర్ణ నిశ్చలభక్తియోగంబు సిద్ధించు నంతకాలంబునుం, దదీయ చింతాతత్పరులై యుందురని మఱియు నిట్లనియె. ౨౬.

"ఆసన్నమరణార్థి యైనయతీశుండు
గాలదేశములను గాచికొనఁడు;
తనువు విసర్జించు తలఁపు జనించిన
భద్రాసనస్థుఁడై ప్రాణపవను

△ ప్రాదేశమాత్రము=చూపుడువ్రేలును బొటనవ్రేలును జాపఁగా నేర్పడినంతటి పరిమాణము. † రాక =పూర్ణిమ. * భ్రూభంగము=బొమ్మముడి. ♦ చరణకిసలయుండు = చిగురుటాకులవంటి పాదములుగలవాఁడు. § జానువు=మోకాలు. ంఘ=చిఱుదొడ,

మనసుచేత జయించి మానసవేగంబు
బుద్ధిచే బంధించి బుద్ధిఁ దెచ్చి
‡ క్షేత్రజ్ఞులోఁ గూర్చి క్షేత్రజ్ఞు నాత్మలోఁ
పలఁ జేర్చి యాత్మను బ్రహ్మమందుఁ

తే. గలిపి యొక్కటిగావించి గారవమున
శాంతితోడ నిరూఢుఁడై సకలకార్య
నివహమెల్లను దిగనాడి 'నిత్యసుఖము
వలయు'ననిచూచు నటమీఁద, వసుమతీశ ! ౨౭

వ. విను మప్పరమాత్మమైన బ్రహ్మంబునకుఁ దక్కఁ గాలదేశ సత్త్వ రజస్తమో గుణాహంకార మహత్తత్త్వ ప్రధానంబులకుఁ బ్రభుత్వంబు లేదు. కావునఁ బరమాత్మ వ్యతిరిక్తంబు లేదు లేదు లేదని సకలంబు * నుత్సర్జనంబు సేసి దేహాదులయం దాత్మత్వంబు విసర్జించి యన్య ♦ సౌహృదంబు మాని పూజ్యంబయిన హరిపదంబునఁ బ్రతిపదంబును హృదయంబున నాలింగనంబు సేసి 'వైష్ణవంబయిన పరమపదంబు సర్వోత్తమం'బని సత్పురుషులు దెలియుదురు. ఇవ్విధంబున విజ్ఞాన జ్ఞానబలంబున నిర్దగ్ధవిషయవాసనుండై క్రమంబున నిరపేక్షత్వంబున-

సీ. † అంఘ్రిమూలమున మూలాధార చక్రంబుఁ
బడించి ప్రాణంబు బిగియఁబట్టి
నాభితలముఁ జేర్చి నయముతో మెల్లన
హృత్సరోజము మీఁది కెగయఁబట్టి
యటమీఁద నురమందు హత్తించి క్రమ్మఱఁ
దాలు మూలమునకుఁ దరిమి నిలిపి
మతముతో § భ్రూయుగమధ్యంబు సేర్చి దృ
క్కర్ణ నాసాస్య మార్గములుమూసి

---

‡ క్షేత్రజ్ఞుఁడు=జీవుఁడు *ఉత్సర్జనంబు = విడుచుట. ♦ సౌహృదంబు = స్నేహము.
† అంఘ్రి మూలమున = పాదముయొక్క యాధారము = మడిమ.
§ భ్రూయుగమధ్యంబు = కనుబొమల నడిమిప్రదేశము.

ఆ. యొంటి నున్న యోగి యొక్కముహూర్తార్ధ
మింద్రియానుషంగ మింత లేక
ప్రాణముల లయించి బ్రహ్మ రంధ్రము చించి
బ్రహ్మమందుఁ గలియుఁ బౌరవేంద్ర. ౨౯

వ. మఱియు దేహత్యాగ కాలంబున నింద్రియంబులతోడి సంగమంబు విడువనివాఁడు వానితోడను గుణసముదాయ రూపంబగు బ్రహ్మాండంబునందు ఖేచర సిద్ధవిహార యోగ్యంబును నణిమాదిక సకలైశ్వర్య సమేతంబును నైన పరమేష్ఠి పదంబుఁ జేరు; విద్యాతపో యోగ సమాధి. జపంబు సేయుచుఁ *బవనాంతర్గత లింగశరీరులైన యోగీశ్వరులకు బ్రహ్మాండ బహిరంత రాళంబులు గతి యని చెప్పుదురు. ఏరికిం గర్మంబుల నట్టిగతిఁ బొంద శక్యంబుగాదు. యోగి యగువాఁడు బ్రహ్మలోకంబునకు నాకాశపథంబునం బోవుచు ♦సుషుమ్నా నాడివెంట నగ్ని నధిదేవతం జేసి జ్యోతిర్మయంబైన తేజంబున నిర్మలుండై యెందునుం దగులువడక తారా మండలంబుమీఁద సూర్యాది ధ్రువాంత పదంబులఁ గ్రమక్రమంబున నతిక్రమించి హరిసంబంధంబయిన §శింశుమార చక్రంబుఁ జేరి యొంటరి యగుచుఁ బరమాణు భూతంబయిన లింగశరీరంబుతో బ్రహ్మవిదులకు నెలవైన మహర్లోకంబుసొచ్చి మహాకల్పకాలంబు క్రీడించుచుఁ గల్పాంతంబున ననంత ముఖానలజ్వాలాజాలదందహ్యమానంబగు లోకత్రయంబు నీక్షించుచుఁ దన్నిమిత్త సంజాతానలదాహంబు సహింపంజాలక- 30

సీ. ఇలమీఁద మనువు ‡లీరేడ్గురు జనువేళ
దివసమై యెచ్చోటఁ దిరుగుచుండు
మహనీయసిద్ధ విమానసంఘము లెందు
†దినకర ప్రభములై తేజరిల్లు

---

* పవనాంతర్గత లింగశరీరము = వాయువులోపలి సూక్ష్మశరీరము.
♦ సుషుమ్నా నాడి = ఇడాపింగళలకు మధ్యమునునుండు నాళము.
§ శింశుమారచక్రము = గ్రహాదుల సంచారచక్రము.
‡ ఈరేడ్గురు = పదునల్వురు † దినకరప్రభములు = సూర్యకాంతిగలవి.

శోకజరామృత్యు శోషణభయదుఃఖ
నివహంబు లెందు జనింపకుండు
విష్ణుపద ధ్యాన విజ్ఞానరహితుల
శోకంబు లెందుండి చూడవచ్చుఁ

ఆ. బరమసిద్ధయోగి భాషణామృత మెందు
శ్రవణపర్వ మగుచు జరగుచుండు
నట్టి బ్రహ్మలోకమందు వసించును;
రావజర్య! మఱల రాఁడు వాఁడు. ౩౧

వ. మఱియు నొక్క విశేషంబుగలదు. పుణ్యాతిరేకంబున బ్రహ్మలోకగతులైనవారు కల్పాంతరంబునం బుణ్యతారతమ్యంబుల నధికారవిశేషంబు నొందువార లగుదురు. బ్రహ్మాది దేవతా భజనంబునం జనువారు బ్రహ్మజీవిత కాలంబుదనుక బ్రహ్మలోకంబున వసియించి ముక్తులగుదురు. నారాయణ చరణకమలభక్తి పరాయణత్వంబునం జనినవారు నిజేచ్ఛా వశంబున ♦ నిరర్గళగమనులై బ్రహ్మాండంబు భేదించి మహోన్నతంబగు వైష్ణవపదారూఢులై తేజరిల్లుదురు. ఈశ్వరాధిష్ఠితంబైన ప్రకృతియంశంబున మహత్తత్త్వంబగు; మహత్తత్త్వాంశంబుననహంకారంబగు; అహంకారాంశంబున శబ్దతన్మాత్రంబగు; శబ్దతన్మాత్రాంశంబున గగనంబగు;గగనాంశంబున స్పర్శతన్మాత్రంబగు; స్పర్శతన్మాత్రాంశంబున † సమీరణంబగు; సమీరణాంశంబున రూపతన్మాత్రంబగు;రూపతన్మాత్రాంశంబు వలనఁ దేజంబగు; తేజోంశంబున రసతన్మాత్రంబగు; రసతన్మాత్రాంశంబువలన జలంబగు; జలాంశంబున గంధ తన్మాత్రంబగు;గంధతన్మాత్రాంశంబునఁ బృధివియగు; వానిమేళనం జతుర్దశ భువనాత్మకంబైన విరాడ్రూపంబగు; నారూపంబునకుఁ గోటియోజన విశాలంబైన ‡ యండకటాహంబు ప్రథమావరణంబైన పృథ్వియగు. దీనిఁ బంచాశత్కోటి విశాలంబని కొందఱు పలుకుదు రయ్యావరణంబు మీఁద సలిలతేజస్సమీర

♦ నిరర్గళగమనులు=అడ్డులేని సంచారముగలవారు. †సమీరణంబు=వాయువు.
‡ అండకటాహము = బ్రహ్మాండమనెడి కప్పెర

గగనాహంకార మహత్తత్త్వంబు లనియెడి యావరణంబులు క్రమంబున నొండొకటి దశగుణోత్తరాధికంబులై యుండు. అట్టి యేడింటి మీఁదఁ బ్రకృత్యావరణంబున మహావ్యాపకంబగు బ్రహ్మాండంబు భేదించి వైష్ణవపదారోహణంబు నేయువాఁడు నిర్భయుండై మెల్లన లింగదేహంబునఁ బృథివ్యాత్మకత్వంబు నొంది యట్టి పృథివ్యాత్మకత్వంబున ఘ్రాణంబున గంధంబును, జలాత్మకత్వంబున రసనేంద్రియంబున రసంబును, దేజోరూపకత్వంబున దర్శనంబున రూపంబును, సమీరణాత్మకత్వంబున దేహంబున స్పర్శంబును, గగనాత్మకత్వంబున శ్రవణంబున శబ్దంబును, నతిక్రమించి, భూత సూక్ష్మేంద్రియ లయస్థానంబైన యహంకారావరణంబున నుపాశ్రితుండై, యందు మనోమయంబును దేవమయంబునైన సాత్త్వికాహంకార గమనంబున మహత్తత్త్వంబుసొచ్చి, గుణత్రయంబున లయించి *ప్రధానంబు నొంది, ప్రధానాత్మకత్వంబున దేహంబు నుపాధిపరంపరావసానంబునం బ్రకృతింబాసి యానందమయుండై, యానందంబునం బరమాత్మరూపంబైన వాసుదేవ బ్రహ్మంబునందుఁ గలియు నని చెప్పి వెండియు నిట్లనియె. ౩౨

ఆ. పరమ భాగవతులు పాటించు పథమిది,
యీపథమున యోగి యేఁగెనేని
మగిడి రాఁడు వాఁడు, మఱి సంశయము లేదు
కల్పశతములైనఁ, గారవేంద్ర! ౩౩

వ. వినుము, నీవడిగిన ♦ సద్యోముక్తియుఁ గ్రమముక్తియు ననియెడు నీరెండుమార్గంబులు వేదగీతలందు వివరింపబడియె; వీనిం దొల్లి భగవంతుండైన వాసుదేవుండు బ్రహ్మచేత నారాధితుండై చెప్పె. సంసార ప్రవిష్టుండైనవానికిఁ దపోయోగాదు లయిన మోక్షమార్గంబులు పెక్కులుగలవు. అందు భక్తిమార్గంబుకంటె సులభంబు లేదు. ౩౪

---

* ప్రధానంబు = ప్రకృతి. ♦ సద్యోముక్తి = తత్క్షణమే కలుగు మోక్షము.

— ♦ శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు భక్తిమార్గంబే ముఖ్యంబని తెలుపుట ♦ —

మ. విను, మంభోజభవుండు మున్ను మదిలో వేదంబు ముమ్మాఱు నె
మ్మనమందుం దలఁపోసి యెంతయు పరామర్శించి 'మోక్షంబు ద
క్కినమార్గంబున లేదు లేద'నుచు భక్తిం జింత సేసెఁ జనా
ర్దను నాత్మాకృతి నిర్వికారుఁ డగుచున్ దన్మార్గ నిర్ణేతయై. ౩౫

సీ. అఖిల భూతములందు నాత్మరూపంబున
నీశుండు హరి యుండు నెల్లప్రొద్దు
బుద్ధ్యాది లక్షణంబులఁగానఁబడును మ
హాసేవనీయుఁ * డహర్నిశంబు
వందనీయుఁడు భక్తవత్సలుం డత్యంత
నియతుఁడై సతతంబు నియతబుద్ధి
నాత్మరూపకుఁడగు హరికథామృతమును
గర్ణపుటంబులఁ గాంక్ష దీరఁ

తే. గ్రోలుచుండెడు ధన్యులు కుటిల బహుళ
విషయమలినీకృతాంగముల్ వేగవిడిచి
విష్ణుదేవుని చరణారవిందయుగము
కడకుఁ జనుదురు, సిద్ధంబు, కౌరవేంద్ర! ౩౬

క. మానుషజన్మము నొందిన । మానవులకు లభ్యమాన మరణులకు మహా
జ్ఞానులకుఁ జేయవలయు వి।ధానము ♦ నిగదింపఁబడియె, ధరణీనాథా!

వ. వినుము, ‡ బ్రహ్మవర్చస కాముండైనవానికి వేదవిభుండగు చతుర్ముఖుండును, నింద్రియపాటవకామునకు నింద్రుండును, బ్రజాకామునికి దక్షాది ప్రజాపతులును, భోజనకామునకు నదితియు, స్వర్గకామునకు నాదిత్యులును, రాజకామునకు విశ్వేదేవతలును, దేశప్రజాసాధన కామునకు సాధ్యులును, శ్రీకామునకు దుర్గయుఁ, దేజస్కామునకు నగ్నియు, వసుకామునకు వసువులును, వీర్యకాము

* అహర్నిశంబు = పగలును రాత్రియు. ♦ నిగదింపఁబడియె = స్పష్టముగాఁ జెప్పఁబడెను. ‡ బ్రహ్మవర్చసకాముండు = బ్రహ్మతేజస్సు కోరువాఁడు.

నకు వీర్యప్రదులగు రుద్రులును, ఆయుష్కామునకు నశ్వినీదేవతలును బుష్టికామునకు భూమియుఁ, బ్రతిష్ఠాకామునకు లోకమాతలైన గగన భూదేవతలును, సౌందర్యకామునకు గంధర్వులును, గామినీకామునకు నప్సరసయగు నూర్వశియు, సర్వాధిపత్యకామునకు బ్రహ్మయుఁ, గీర్తికామునకు యజ్ఞోపాధికుండగు విష్ణువును, విత్తసంచయ కామునకుం బ్రచేతసుండును, విద్యాకామునకు * నుమావల్లభుండును, దాంపత్య ప్రీతికామునకు నుమాదేవియు, ధర్మార్థకామునకు నుత్తమశ్లోకుండగు విష్ణువును, సంతానకామునకుఁ బితృదేవతలును, రక్షాకామునకు యక్షులును, బలకామునకు మరుద్గణంబులును, రాజ్యకామునకు మనురూపదేవతలును, శత్రుమరణకామునకుఁ ♦ గోణపాలకుండైన రాక్షసుండును, భోగకామునకుం జంద్రుండును, భజనీయులగుదురు. మఱియును. ౩౮

క. కామింపకయును సర్వముఁ। గామించియు నైన, ముక్తిఁ గామించితఁగన్
లోమించి పరమపురుషుని, † నేమించిభజించుఁ దత్త్వనిపుణుండధిపా.

మ. అమరేంద్రాదులఁ గొల్చుభంగి జనుఁ డా యజ్ఞాత్ము సేవింపఁగా
విమలజ్ఞాన విరక్తిముక్తులొనవున్; వేయేల? భూనాథ! త
త్కమలాధీశ కథాసుధారసనదీ కల్లోల మాలా పరి
భ్రమ మెవ్వారికి నైనఁ గర్ణయుగళీపర్వంబు గాకుండునే! ౪౦

వ. అనియిట్లు రాజునకు శుకుండు సెప్పెననిన విని శౌనకుండు సూతున కిట్లనియె ౪౧

క. వరతాత్పర్యముతోనిటు। § భరతాన్వయవిభుఁడుశుకునిపలుకులువిని స
త్వరతాయుతుఁడై శ్రేయ। స్కరతామతి నేమియడిగె? గణుతింపఁగదే.

క. ఒప్పెడిహరికథలెయ్యవి। సెప్పెడినో? యనుచుమాకుఁ ‡ జిత్తోత్కంఠల్
గుప్పలుగొనుచున్నవి రుచు। లుప్పతిలన్ నీమనోహరోక్తులువినఁగన్.

---

* ఉమావల్లభుఁడు = పార్వతీపతి - శివుఁడు.
♦ కోణపాలకుఁడు = (నైరృతి) మూలకధిపతి. † నేమించి = నియమముకలిగి.
§ భరతాన్వయవిభుఁడు = భరతవంశప్రభువు = పరీక్షిత్తు.
‡ చిత్తోత్కంఠల్ = మనస్సుయొక్క తొట్రుపాటులు.

వ. అనిన విని సూతుం డిట్లనియె ౪౪

క. తూలెడి * కూఁకటితోడను। బాలురతో నాడుచుండి బాల్యమున మహీ
పాలుఁడు హరిచరణార్చన। హేలాలసుఁడగుచునుండె నెంతయు నియతిన్.

వ. అట్టి పరమభాగవతుండైన పాండవేయునకు వాసుదేవ పరాయణుం
డైన శుకుం డిట్లనియె ౪౫

సీ. 'వాసుదేవ శ్లోకవార్త లాలించుచుఁ
గాల మేపుణ్యుఁడు గడపుచుండు
నతనియాయువుఁదక్క నన్యులయాయువు
లుదయాస్తమయముల ♦ నుగ్రకరుఁడు
వంచించి కొనిపోవు; వాఁడది యెఱుఁగక
'జీవింతుఁ బెక్కేండ్లు సిద్ధ'మనుచు
నంగనాపుత్త్రి గేహారామవిత్తాది
సంసారహేతుక సంగసుఖముఁ

తే. దగిలి వర్తింపఁగాలంబు ‡ తటివోటింగి
†దండధర కింకరులువచ్చి § తాడనములు
సేసికొనిపోవఁ 'బుణ్యంబు సేయనైతిఁ
బాపరతినైతి'నని బిట్టు పలవరించు. ౪౬

వ. అదిగావున— ౪౭

సీ. ∴ అలరుజొంపములతో △ నభ్రంకషంబులై
బ్రతుకవే వనములఁ √ బాదపములు?
¶ ఖాదనమేహనాకాంక్షలఁ బశువులు
జీవింపవే గ్రామ సీమలందు ?

---

* కూఁకటి = (పిల్ల) జుట్టు. ♦ ఉగ్రకరుఁడు = వేఁడి కిరణములు కల వాఁడు=సూర్యుఁడు. ‡ తటి = సమయము. † దండధరకింకరులు= యమభటులు. § తాడనములు = దెబ్బలు. ∴ అలరు జొంపములతోన్ = పుష్పసమూహములతో. △ అభ్రంకషములు — ఆకాశము నొరయునవి. √ పాదపములు = చెట్లు. ¶ ఖాదనమేహనాకాంక్షలన్ = (గడ్డి) తినుటయు మూత్రము విడుచుటయు

నియతిమై నుచ్ఛ్వాస నిశ్శ్వాస [1] పవనముల్
[2] ప్రాపింపవే [3] చర్మభస్త్రి కలును?
గ్రామసూకరశునకశ్రేణు లింటింటఁ
దిరుగవే దుర్భోగ దీనవృత్తి?
తే. [4] నుష్ట్రఖరములు మోవవే యురుభరములఁ?
బుండరీకాక్షు నెఱుఁగని పురుషపశువు
లడవులందునివాసము లందఁబ్రాణ
విషయభరయుక్తితోనుంట విఫల మధిప! ౪౯

విష్ణుకీర్తనముల వినని కర్ణంబులు
కొండలబిలములు కువలయేశ!
చక్రిపద్యంబులఁ జదువనిజిహ్వలు
కప్పలజిహ్వలు కారవేంద్ర!
శ్రీమనోనాథు నీక్షింపని కన్నులు
[5] కేకిపింఛాక్షులు కీర్తిదయిత!
కమలాక్షు పూజకుఁ గానిహస్తంబులు
శవముహస్తంబులు సత్యవచన!
ఆ. హరిపదతులసీద ళామోదరతి లేని
ముక్కు పందిముక్కు మునిచరిత్ర!
గరుడగమనుభజన గతిలేనిపదములు
పాదపములపాదపటల మనఘ! ౫౦

సీ. నారాయణునిదివ్య నామాక్షరములపైఁ
గరఁగనిమనములు కఠినశిలలు
మురవైరికథలకు ముదితాశ్రురోమాంచ
మిళితమైయుండని మేను మొద్దు

---

1 పవనముల్ = వాయువులు. 2 ప్రాపింపవే? = పొందవా?
3 చర్మభస్త్రికలు = తోలుతిత్తులు_కొలిమితిత్తులు. 4 ఉష్ట్రఖరములు = ఒంటెలును గాడిదలును. 5 కేకిపింఛాక్షులు=నెమలిపింఛమందలి (ఉంగె) కన్నులు

చక్రికి మ్రొక్కని [1] జడునియౌఁదల నున్న
కనకకిరీటంబు గట్టుమోపు
మాధవార్పితముగా మననిమానవుసిరి
వనదుర్గచంద్రికా వైభవంబు

ఆ. కైటభారిభజన గలిగియుండనివాఁడు
గాలిలోననుండి కదలుశవము
కమలనాభుపదముఁ గననివానిబ్రతుకు
[2] పసిఁడికాయలోని ప్రాణిబ్రతుకు. ౫౧

వ. అనియిట్లు పలికిన [3] వైయాసివచనంబుల [4] కౌత్తరేయుం డానంద
కందళిత హృదయుండై నిర్మలమతి విశేషంబున ౫౨

ఆ. సుతుల హితుల విడిచి చుట్టాలవిడిచి యి
ల్లాలి విడిచి బహు బలాళి విడిచి
రాజు హృదయమిడియె రాజీవనయనుపై
ధనమువిడిచి [5] జడ్డుఁదనమువిడిచి. ౫౩

వ. ఇట్లు మృత్యుభయంబు నిరసించి ధర్మార్థకామంబులు సన్న్యసించి
పురుషోత్తమునందుఁ జిత్తంబు [6] విన్యసించి హరిలీలాలక్షణంబు
లుపన్యసించి మనుతలఁపున నరేంద్రుం డిట్లనియె. ౫౪

క. సర్వాత్ము వాసుదేవుని।సర్వజ్ఞుఁడవైన నీవు సంస్తుతి సేయన్
సర్వభ్రాంతులు వదలె మ।హోర్వీసురవర్య! మానసోత్సవమగుచున్.

సీ. ఈశుండు హరి విష్ణుఁ డీవిశ్వమేరీతిఁ
బుట్టించు రక్షించుఁ బొలియఁజూచు?
బహుశక్తియుతుఁడగు భగవంతుఁడవ్యయుఁ
డాది నేశక్తుల నాశ్రయించి

---

1 జడునియౌఁదలన్ = అవివేకితలయందు. 2 పసిఁడికాయ = పట్టుపూలుకాయ.
3 వైయాసి = వ్యాసపుత్రుఁడైన శుకుఁడు. 4 ఔత్తరేయుఁడు = ఉత్తరాపుత్రుఁడైన
పరీక్షిత్తు. 5 జడ్డుదనము = విషయాసక్తి. 6 విన్యసించి = నిలిపి.

బ్రహ్మశక్రాది రూపములవినోదించెఁ
గ్రమముననో యేకకాలముననొ
ప్రకృతిగుణంబులఁ బట్టిగ్రహించుట
నేకత్వముననుండు నీశ్వరుండు
ఆ. భిన్నమూర్తియగుచుఁ బెక్కువిధంబుల
నేలయుండు నతని కేమిచిక్కొ
నుండకున్నఁ దాపసోత్తమ తెలుపవే
వేడ్క నాకు సర్వవేది వీవు. ౫౬

వ. అనిన నుత్తరానందను వచనంబులకు నిరుత్తరుండుగాక సదుత్తర ప్రధానకుతూహలుండై లోకోత్తర గుణోత్తరుండయిన తాపసోత్తముండు తన చిత్తంబున- ౫౭

మ. [1]పరుఁడై యీశ్వరుఁడై మహామహిముఁడై [2]ప్రాదుర్భవస్థాన సం
హారణ క్రీడనుఁడై త్రిశక్తియుతుఁడై యంతర్గత జ్యోతియై
[3]పరమేష్ఠి ప్రముఖామరాధిపులకుం బ్రాపింప రాకుండుదు
స్తరమార్గంబునఁ దేజరిల్లు హరికిం దత్త్వార్థినై మ్రొక్కెదన్. ౫౮

వ. మఱియు సజ్జనదురిత సంహారకుండును, దుర్జననివారకుండును, సర్వసత్త్వరూపకుండును, బరమహంసాశ్రమ ప్రవర్తమాన మునిజన హృదయకమల కర్ణికామధ్య ప్రదీపకుండును, సాత్వత శ్రేష్ఠుండును, నిఖిలకల్యాణగుణ గరిష్ఠుండును, బరమభక్తియుక్త సులభుండును, భక్తిహీనజన దుర్లభుండును, నిరతిశయ నిరుపమ నిరవధిక ప్రకారుండును, నిజస్వరూపబ్రహ్మవిహారుండునైన యప్పరమేశ్వరునకు నమస్కరించెద. ౫౯

ఉ. ఏవిభువందనార్చనము లేవిభుచింతయు నామకీర్తనం
బేవిభులీల లద్భుతము లెప్పుడు సంశ్రవణంబు సేయు, దో

---

1 పరుఁడు=సర్వోత్తముఁడు. 2 ప్రాదుర్భవస్థాన సంహారణ క్రీడనుఁడు = సృష్టిస్థితిలయముల నెడి యాటలుగలవాఁడు 3 పరమేష్ఠిప్రముఖామరాధిపులకున్ = బ్రహ్మ మొదలగు దేవతాశ్రేష్ఠులకు.

పావళిఁ బాసి లోకము శుభాయతవృత్తిఁ జెలంగునందు? నే
నావిభునాశ్రయించెద [1] నఘౌఘనివర్తను భద్రకీర్తనన్. ౬౦

ఉ. ఏపరమేశుపాదయుగ మెప్పుడుఁ గోరి భజించు నేర్పరుల్
లోపలిబుద్ధితో నుభయ లోకములందుల [2] జడ్డుఁ బాసి యే
తాపము లేక బ్రహ్మగతిఁ [3] దారు గతశ్రములై చరింతు రే
నాపరమేశు మ్రొక్కెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్. ౬౧

చ. తపములు సేసినైన మఱి దానము లెన్నియొ చేసినైన నే
జపములు సేసినైన ఫల సంచయ మెవ్వనిఁ జేర్పకున్న [4] హే
యపదములై [5] దురంతవిపదంచితరీతిగ నొప్పుచుండు న
య్యపరిమితున్ భజించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్. ౬౨

మ. యవన వ్యాధ పుళింద హూణ శక కంకాభీరచండాల సం
భవులుం దక్కిన పాపవర్తనులు నే భద్రాత్ము సేవించి భా
గవత శ్రేష్ఠులఁ బాసి శుద్ధతనులై కల్యాణులై యుందు రా
యవికారుం బ్రభవిష్ణు నాదుమదిలో నశ్రాంతమున్ మ్రొక్కెదన్.

మ. తపముల్ సేసిననో మనోనియతినో దానవ్రతావృత్తినో
జపమంత్రంబులనో శ్రుతిస్మృతులనో సద్భక్తినో యెట్లు ల
బ్ధపదుం డౌనని బ్రహ్మరుద్రముఖరుల్ భావింతు రెవ్వాని న
[6]య్యపవర్గాధిపుఁ డాత్మమూర్తి సులభుం డౌఁగాక నాకెప్పుడున్.

క. శ్రీపతియు యజ్ఞపతియుఁ బ్రజాపతియున్ బుద్ధిపతియు జగదధిపతియున్
భూపతియు యాదవశ్రేణీపతియున్ గతియునైన నిపుణు భజింతున్.

మ. [7]అణుఁడో కాక కడు న్మహావిభవుఁడో [8]యచ్ఛిన్నుఁడో ఛిన్నుఁడో
గుణుఁడో నిర్గుణుఁడో యటంచు విబుధుల్ [9] కుంఠీభవత్తత్త్వమా

---

1 అఘౌఘనివర్తనున్ = పాపసమూహములను పోఁగొట్టువానిని. 2 జడ్డు = విషయాసక్తి. 3 తారు = తాము. 4 హేయపదములు = నీచస్థానములుగలవి. 5 దురంత విపదంచితరీతిన్ = అంతములేని యాపదలచే నొప్పుచున్న విధముగా. 6 అపవర్గాధిపుఁడు = మోక్షాధిపతి. 7 అణుఁడు = అణుస్వరూపుఁడు (సూక్ష్మరూపుఁడు) 8 అచ్ఛిన్నుఁడు=అఖండమూర్తి. 9 కుంఠీభవత్తత్త్వమార్గణులు = మొక్కవోయిన తత్త్వాన్వేషణముగలవారు (అనఁగా, సంపూర్ణతత్త్వవేత్తలు)

ర్గణులై యేవిభుపాదపద్మభజనో త్కర్షంబులన్ దత్త్వవి
క్షణముం జేసెద రట్టివిష్ణుఁ బరమున్ సర్వాత్ము సేవించెదన్. ౬౬

మ. జగదుత్పాదనబుద్ధి బ్రహ్మకు మదిన్ సంధింప నూహించి యే
భగవంతుండు సరస్వతిం బనుప నా పద్మాస్యదా నవ్విభున్
మగనింగా వరియించి తద్భువన సామ్రాజ్యస్థితిన్ సృష్టిపా
రగుఁ జేసెన్ మును బ్రహ్మ నట్టి [1]గుణి నారంభింతు సేవింపఁగన్.

సీ. పూర్ణుఁడయ్యును మహా భూతపంచకయోగ
మున మేను లను పురములుసృజించి
పురములలోనుండి పురుషభావంబున
దీపించు నెప్పుడు ధీరవృత్తిఁ
బంచభూతములను బదునొకండింద్రియ
ములఁ బ్రకాశింపించి భూరిమహిమ
[2]షోడశాత్మకుఁడన శోభిల్లి జీవత్వ
నృత్తవినోదంబు నెఱపుచుండు
తే. నట్టిభగవంతుఁ డవ్యయుం డచ్యుతుండు
మానసోదిత వాక్పుష్ప మాలికలను
మంజునవరసమకరంద మహిమపుట్ట
[3]శిష్టహృద్భావలీలలఁ జేయుఁగాత. ౬౮

ఉ. మానధనుల్ మహాత్ములు సమాధినిరూఢులు తన్ముఖాంబుజ
ధ్యానమరంద పానమున నాత్మభయంబులఁ బాసి ముక్తులై
[4]లూనతనొంద రట్టిమునిలోకశిఖామణికిన్ [5]విశంకటా
జ్ఞానతమోనభోమణికి సాధుజనాగ్రణి కేను మ్రొక్కెదన్. ౬౯

---

1 గుణిన్ = (కల్యాణ) గుణములుగలవానిని. 2 షోడశాత్మకుఁడు = పంచభూతములు నేకాదశేంద్రియములును ననెడి పదునాఱింటిచే నొప్పెడివాఁడు. 3 శిష్టహృద్భావలీలలన్ = నిర్దుష్టమగు భావవిలాసములతో. 4 లూనతన్ = విడిచి వచ్చుటను. 5 విశంకటాజ్ఞాన తమోనభోమణికిన్ = అధికమైన యజ్ఞానమనెడి చీఁకటికి సూర్యుఁడైనవానిని.

వ. అని యిట్లు గురువందనంబు సేసి శుకయోగీంద్రుండు రాజేంద్రున కిట్లనియె:— ౨౦

మ. "అవిరోధంబున నీవు నన్నడుగు నీ యర్థంబు మున్ బ్రహ్మమా
ధవుచేతన్ విని నారదుం డడిగినన్ దథ్యంబుగాఁ జెప్పె మా
నవలోకేశ్వర నారదుండు వెనుకన్ నాకుం బ్రసాదించె [1]సం
శ్రవణీయంబు మహాద్భుతంబు వినుమా సందేహవిచ్ఛేదియై. ౨౧

—♦నారదుండు బ్రహ్మను బ్రపంచప్రకారముఁ దెలుపుమని యడుగుట.♦—

వ. నారదుండు బ్రహ్మ కిట్లనియె- ౨౨

మ. 'చతురాస్యుండవు వేల్పుఁబెద్దవు జగత్స్రష్టాను సంధాయి నీ
[2]శ్రుతిసంఘాతము నీ ముఖాంబుజములన్ శోభిల్లు శబ్దార్థ సం
యుతమై సర్వము నీకు [3]కరామలకమై యుండుంగదా [4]భారతీ
సతియిల్లాలఁట నీకు నో జనక! నా సందేహముం బాపవే. ౨౩

శా. ప్రారంభాదివివేక మెవ్వఁడొసఁగుం [5]బ్రారంభసంపత్తికా
ధారం బెయ్యది యేమి హేతువు యదర్థంబే స్వరూపంబు సం
సారానుక్రమ [6]మూర్ణనాభిపగిదిన్ సాఁగించె దొక్కప్పుడుం
బారం బెన్నఁడు లేదు నీ మనువు దుష్ప్రాపంబు వాణీశ్వరా! ౨౪

శా. నాకుం జూడఁగ నీవు రాజ వనుచున్నాఁడన్ యథార్థస్థితిన్
నీకంటెన్ ఘనుఁడొక్క రాజు గలఁడో నీవంత కున్ రాజవో
నీ కేలాధము రాఁదలంచి జగముల్ నిర్మించె దీచేతనా
నీకం బెందు జనించు నుండు నడఁగున్? నిక్కంబు భాషింపుమా. ౨౫

మ. సదసత్సంగతి నామరూపగుణ దృశ్యంబైన విశ్వంబు నీ
వ్వాదధీనంబుగదా ఘనుల్ సములు నీ కెవ్వారలున్ లేరు నీ

1 సంశ్రవణీయంబులు = మిక్కిలి గా వినదగినవి. 2 శ్రుతిసంఘాతము = వేదరాశి. 3 కరామలకము = చేతిలోని యుసిరికాయ (అనఁగా, స్పష్టముగా గోచరించునది.) 4 భారతీసతి = సరస్వతీదేవి. 5 ప్రారంభసంపత్తి = సృష్టిసంపద. 6 ఊర్ణనాభి పగిదిన్ = సాలెపురుగు విధముగా (అనఁగా, సాలెపురుగు దారమును దనగర్భము నుండియే వెడలించి యా గర్భములోనికే మరలఁ గైకొనునట్లు.)

పదమత్యున్నత మిట్టినీవు తపముం బ్రాపించ్యాయు క్తుండవై
మది నేయీశ్వరుఁగోరి చేసితివి తన్మార్గంబు సూచింపవే. ౨౬

శా. అంభోజాసన ! నీకు నీశుఁడుగలండంటేని దత్పక్షమం
దంభోజాతభవాండ మేవిభునిలీలాపాంగ సంభ్రాంతిచే
[1]సంభూతంబగు [2]వర్తమానమగు సం[3]ఛన్నంబగుం దద్విభుఁ
సంభాషింపఁగవచ్చునే? తలఁప నే చందంబువాఁ డాకృతిన్ ? ౨౭

క. [4]తోయజసంభవ నాకీ, [5]తోయము వివరింపుచాలఁ దోఁచిన నేనా
[6]తోయమువారికినన్యుల,[7]తోయములం జెందకుండ ధ్రువమెఱిఁగింతుఁ.

వ. దేవా ! భూతభవిష్య ద్వర్తమానంబు లగువ్యవహారంబులకు నీవ
వల్లభుండవు. నీ వెఱుంగనియర్థం బొండెద్దియులేదు విశ్వప్రకారంబు
వినిపింపు మనిన విని వికసితముఖుండై [8]విరించి యిట్లనియె ౨౮

క. రారా బుధులు! విరక్తులు। గారా! యీరీతినడుగఁగా నేరరు [9]వి
స్మేరావహము భవన్మతి, మారా ! నాకోడిమర్మ మడిగితి వత్సా !

శా. నానాస్థావర జంగమప్రకరముల్ నాయంతనిర్మింప వి
న్నాణంబేమియులేక తొట్రుపడఁగా నాకుఁ సమస్తానుసం
ధానారంభవిచక్షణత్వము మహోదారంబుగానిచ్చెము
న్నేనాయీశ్వరునాజ్ఞఁగాక జగముల్ నిర్మింప శక్తుండనే! ౩౧

మ. అనఘా! విశ్వము నెల్ల దీప్తముగఁ జేయఁ నే సమర్థుండనే?
యినచంద్రానల తారకాగ్రహగణం బేరీతి నారీతి నే
వ్వనిదీప్తిం బ్రతిదీప్తమయ్యె? భువన వ్రాతంబు తద్దీప్తిచే
ననుదీప్తం బగు? నట్టి యీశ్వరునకే నశ్రాంతముఁ మ్రొక్కెదఁ.

---

1 సంభూతంబు = పుట్టినది. 2 వర్తమానము = ప్రకృతస్థితి యందుండునది. 3 సంఛన్నంబు=కప్పఁబడునది = అదృశ్యమైనది = లయముపొందినది. 4 తోయజ సంభవ = పద్మభవుఁడవైన బ్రహ్మదేవుఁడా. 5 (ఈ) తోయము = ఈ విధము. 6 తోయమువారికిఁ = తోడివారికి. 7 అన్యులతోయములు = ఇతరులవిధములు. 8 విరించి = బ్రహ్మ. 9 విస్మేరావహము = చిఱునవ్వుకలిగించునది. (ఆశ్చర్యకరము)

మ. విను మే మీశ్వరుదృష్టి మార్గమున నావేశింప శంకించి సి
గ్గున [1]సంకోచము నొందు మాయవలనం [2]గుంఠీభవత్ప్రజ్ఞ చే
ననులోకేశ్వరుఁ డంచు మ్రొక్కు మతిహీనవ్రాతముం జూచి నే
ననిశంబున్ నగి ధిక్కరింతు హరిమాయాకృత్య మంచున్, సుతా !

వ. మఱియు దేహంబునకు ద్రవ్యంబు లైన మహాభూతంబులును, జన్మనిమిత్తంబు లైన కర్మంబులును, గర్మక్షోభకరంబైన కాలంబును, గాలపరిమాణహేతువైన స్వభావంబును, [3]భోక్తయైన జీవుండును, 'వాసుదేవుండ'గా నెఱుంగుము. వాసుదేవ వ్యతిరిక్తంబు లేదు. సిద్ధంబు. నారాయణ నియమ్యంబులు లోకంబులు. దేవతలు నారాయణ శరీర సంభూతులు. వేదయాగతపో యోగజ్ఞానంబులు నారాయణ పరంబులు. జ్ఞానసాధ్యంబగు ఫలంబు నారాయణాధీనంబు. [4]కూటస్థుండు సర్వాత్మకుండు సర్వద్రష్టయు నయిన యీశ్వరుని కటాక్షవిశేషంబున సృజియింపంబడి ప్రేరితుండనై సృజ్యంబైన ప్రపంచంబు సృజించుచుండుదు. నిర్గుణుండైన యీశ్వరునివలన రజస్సత్త్వతమోగుణంబులు ప్రభూతంబులై యుత్పత్తి స్థితిలయంబులకుఁ బాలువడి కార్యకారణ కర్తృత్వ భావంబులందు ద్రవ్యంబులైన మహాభూతంబులును, జ్ఞానమూర్తులయిన దేవతలును, క్రియారూపంబులయిన యింద్రియంబులు, నాశ్రయంబులుగా నిత్యముక్తుండయ్యును మాయాసమన్వితుండైన జీవుని బంధించు; జీవునకు నావరణంబు లయి[5]యుపాధిభూతంబులయిన మూఁడు [6]లింగంబులు నేసి పరులకు [7]లక్షితంబుగాక తనకు లక్షితంబైన తత్త్వంబు గల యీశ్వరుం డివ్విధంబునం గ్రీడించుచుండు. ౮౪

క. ఆయీశుఁ డనంతుఁడు హరి। నాయకుఁ డీభువనమునకు నాకున్ నీకున్
మాయకు బ్రాణిచయంబున। కేయెడలన్ లేదయీశ్వరేతరము సుతా !

---

1 సంకోచము = వికాసవిహీనత. 2 కుంఠీభవత్ప్రజ్ఞ = మొక్కవోయిన బుద్ధి. 3 భోక్త = (కర్మ) అనుభవించువాఁడు. 4 కూటస్థుఁడు = 'అక్షర' స్వరూపుఁడైన భగవంతుఁడు. 5 ఉపాధిభూతంబులు = ఉనికిపట్టుగా చేర్పడినట్టివి.
6 లింగంబులు = గురుతులు. 7 లక్షితంబు = గోచరమైనది.

వ. వినుము, మాయావిభుండైన యీశ్వరుండు తనమాయం జేసి దైవ
యోగంబునం బ్రాప్తంబులయిన కాలజీవాదృష్ట స్వభావంబులు
వివిధంబులు సేయ నిశ్చయించి. కైకొనియె. ఈశ్వరాధిష్ఠితంబైన
[1]మహత్తత్త్వంబు వలననగు కాలంబున గుణవ్యతికరంబును, స్వభా
వంబునం బరిణామంబును, జీవాదృష్ట భూతంబయిన కర్మంబున
జన్మంబును నయ్యె. రజస్సత్త్వంబులచే [2]నుపబృంహితంబై వికారంబు
నొందిన మహత్తత్త్వంబు వలనం దమఃప్రభావంబై ద్రవ్యజ్ఞాన
క్రియాత్మకంబగు నహంకారంబు గలిగె. అదియు రూపాంతరంబు
నొందుచు ద్రవ్యశక్తియైన రాజసంబును, గ్రియాశక్తియైన తామ
సంబును, జ్ఞానశక్తియైన సాత్త్వికంబు నన మూఁడువిధంబు లయ్యె.
అందు భూతాదియైన తామసాహంకారంబువలన [3]నభంబుగలిగె.
నభంబునకు సూక్ష్మరూపంబు భూతదృశ్యంబునకు బోధకంబైన
శబ్దంబు గుణంబగు. నభంబువలన వాయువు గలిగె. వాయువునకుం
బరాన్వయంబున శబ్దంబు స్పర్శంబు నను రెండు గుణంబులు గలిగి
యుండు. అది దేహంబులం దుండుటం జేసి ప్రాణరూపంబై యింద్రియ
మనశ్శరీర పాటవంబైన యోజస్సహో బలంబులకు హేతువై
వర్తించు వాయువువలన రూపస్పర్శ శబ్దంబు లనియెడు గుణంబులు
మూఁటితోడఁ దేజంబు గలిగె. తేజంబువలన రసరూపస్పర్శశబ్దంబు
లనియెడు నాలుగుగుణంబులతోడ జలంబుగలిగె. జలంబువలన
గంధరసరూప స్పర్శశబ్దంబు లనియెడు గుణంబు లయిదింటితోడం
బృథివి గలిగె. వైకారికంబైన సాత్త్వికాహంకారంబు వలనఁ జంద్ర
దైవతం బయిన మనంబు గలిగె. మఱియు దిక్కులును వాయువు
నర్కుండును [4]బ్రచేతసుండు నాశ్వినులు వహ్నియు నింద్రుండు నుపేం
ద్రుండును మిత్రుండును బ్రజాపతియు ననియెడి దశదేవతలు గలి
గిరి. [5]తైజసం బయిన రాజసాహంకారంబు వలన దిగ్దైవతంబైన శ్రవ

---

1 మహత్తత్త్వము — సమష్టిబుద్ధి. 2 ఉపబృంహితంబు — చక్కఁగాఁ జెప్పఁబడినది. 3 నభంబు = ఆకాశము. 4 ప్రచేతసుండు — వరుణుఁడు. 5 తైజసంబు — తేజస్సంబంధమైనది.

ణేంద్రియంబును, వాయుదైవతంబైన త్వగింద్రియంబును, సూర్య దైవతంబైన నయనేంద్రియంబును, బ్రచేతోదైవతంబైన [3]రస నేంద్రియంబును, అశ్వినీదైవతంబైన ఘ్రాణేంద్రియంబును, వహ్ని దైవతంబైన వాగింద్రియంబును, ఇంద్రదైవతంబైన హస్తేంద్రి యంబును, ఉపేంద్ర దైవతంబైన పాదేంద్రియంబును, మిత్రదైవతం బైన గుదేంద్రియంబును, ప్రజాపతిదైవతంబైన గుహ్యేంద్రియం బును, ననియెడి దశేంద్రియంబులును, బోధజనకాంతఃకరణైక భాగంబయిన బుద్ధియుఁ, గ్రియాజనకాంతఃకరణంబయిన ప్రాణం బునుం గలిగె. ఇట్టి శ్రోత్రాదులగు దశేంద్రియంబులతోఁ గూడిన భూతేంద్రియ మనోగుణంబులు వేర్వేఱుగ బ్రహ్మాండశరీర నిర్మా ణంబునం దసమర్థంబు లగునపుడు గృహనిర్మాణంబునకుం బెక్కు పదార్థంబులు సంపాదించినం గాని చాలని చందంబున భూతేంద్రియ మనోగుణంబుల వలన గృహంబు కైవడి భగవచ్ఛక్తి ప్రేరితంబు లగుచు నేకీభవించి [1]సమష్టివ్యష్ట్యాత్మకత్వంబు నంగీకరించి చేతనా చేతనంబులుగల బ్రహ్మాండంబు కల్పితంబయ్యె. అట్టి యండంబు [2]వర్షాయుత సహస్రాంతంబు దనుక జలంబునం దుండె. కాలకర్మ స్వభావంబులం దగులువడక సమస్తంబును జీవయుక్తంబుగఁ జేయు నీశ్వరుం డచేతనంబును సచేతనంబుగ నొనర్చె. అంతఁ గాలకర్మ స్వభావ ప్రేరకుండయిన పరమేశ్వరుండు జీవరూపంబున మహావరణ జల మధ్యస్థితంబయిన బ్రహ్మాండంబులోను సొచ్చి సవిస్తారంబు గావించి యట్టి యండంబు భేదించి నిర్గమించె నెట్లంటేని— ౭౬

క. భువనాత్మకుఁ డాయీశుఁడు। భువనాకృతితోడనుండు బ్రహ్మాండంబున్
వివరముతోఁ బదునాలుగు। వివరంబులుగా నొనర్చె విశదంబులుగన్.

మ. బహుపాదోరు భుజాననేక్షణశిరఃఫాలశ్రవోయుక్తుఁడై
విహరించున్ బహుదేహిదేహగతుఁడై విద్వాంసు లూహించి త
ద్బహురూపావయవంబులన్ భువనసంపత్తిన్ విచారింతు రా
మహనీయాద్భుతమూర్తి యోగిజనహృన్మాన్యుండు మేధానిధీ.

---

1 సమష్ట్యాత్మకము = మొత్తముగానుండుట; వ్యష్ట్యాత్మకము = వేఱు వేఱుగానుండుట. 2 వర్షాయుతము = పదివేల సంవత్సరములు.

వ. వినుము, చతుర్దశ లోకంబులందు మీఁదటియేడులోకంబులు శ్రీమహా విష్ణువునకుం [1]కటి ప్రదేశంబున నుండి యూర్ధ్వదేహ మనియును, క్రిందటియేడులోకంబులు [2]జఘనంబుననుండియధోదేహ మనియును బలుకుదురు. ప్రపంచ శరీరుండగు భగవంతుని ముఖంబువలన బ్రహ్మకులంబును, బాహువులవలన క్షత్రియకులంబును, [3] నూరువులవలన వైశ్యకులంబును, బాదంబువలన శూద్రకులంబును జనియించెనని చెప్పుదురు. భూలోకంబు కటిపర్యంతప్రదేశంబు, భువర్లోకంబు నాభి, సువర్లోకంబు హృదయంబు, మహర్లోకంబు వక్షంబు, జనలోకంబు గ్రీవంబు, తపోలోకంబు స్తనద్వయంబు, సనాతనంబును బ్రహ్మనివాసంబును నైనసత్యలోకంబు శిరంబు, కటిప్రదేశంబతలంబు, తొడలు వితలంబు, జానువులు సుతలంబు, జంఘలు తలాతలంబు, గుల్ఫంబులు మహాతలంబు, పాదాగ్రంబులు రసాతలంబు, పాదతలంబు పాతాళంబు నని లోకమయుంగా భావింతురు. కొందఱు మఱియుం బాదతలంబు వలన భూలోకంబును, నాభివలన భువర్లోకంబును, శిరంబువలన స్వర్లోకంబును గలిగెనని లోకకల్పనంబు సెప్పుదురు. పురుషోత్తమునిముఖంబువలన సర్వజంతు [4]వాచాజాలంబుం దదధిష్ఠాతయగు వహ్నియు నుదయించె. చర్మర క్తమాంస మేదశ్శల్య [5]మజ్జాశుక్లంబులు సప్తధాతువు లందురు. పక్షాంతరంబున రోమ త్వఙ్మాంసాస్థిస్నాయు మజ్జాప్రాణంబులు సప్తధాతువు లని యందురు. అందు రోమంబు లుష్ణిక్ఛందం బనియు, త్వక్కు త్రిష్టుప్ఛందంబనియు, మాంసంబు త్రిష్టుప్ఛందం బనియు, స్నాయు వనుష్టుప్ఛందం బనియు, అస్థి జగతీఛందంబనియు, మజ్జ పంక్తిచ్ఛందంబనియు, ప్రాణంబు బృహతీఛందంబనియు నాదేశింతురు. [5]హవ్యకవ్యా మృతాన్నంబులకు మధురాది షడ్రసంబులకు (రసనేంద్రియంబునకు) రసాధీశ్వరుం డైన వరుణునికి హరి రసనేంద్రియంబు జన్మస్థానంబు. సర్వ

---

1 కటి = మొల. 2 జఘనంబు = మొల. 3 ఊరువులు=తొడలు. 4 వాచాజాలంబులు = వాక్సమూహములు. 5 హవ్య కవ్యములు = దేవతలకిచ్చెడి యన్నములును, పితృదేవతలకిచ్చెడి యన్నములును.

ప్రాణాదులకు వాయువునకు విష్ణునాసికావివరంబు నివాసంబు. సమీపదూర వ్యాపి గంధంబులకు నోషధులకు నశ్వినీదేవతలకు దిశాంబరుని ఘ్రాణేంద్రియంబు నివాసంబు. దేవలోక సత్యలోకములకుఁ దేజంబునకు సూర్యునకు సకలచక్షువులకు [1] లోకలోచనుని చక్షురింద్రియంబు స్థానంబు. దిశలకు నాకాశంబునకు శ్రుతిభూతంబులైన యంశంబులకు శబ్దంబునకు సర్వేశ్వరుని కర్ణేంద్రియంబు జన్మస్థానంబు. వస్తుసారంబులకు వర్ణనీయ సౌభాగ్యంబులకుఁ బరమపురుషుని [2] గాత్రంబు [3] భాజనంబు. స్పర్శంబునకు వాయువునకు సకల [4] స్నిగ్ధత్వంబులకు దివ్యదేహుని దేహేంద్రియంబు దేహంబు. యూపప్రముఖ యజ్ఞోపకరణంబులకుఁ దరుగుల్మలతాదులకుం బురుషోత్తముని రోమంబులు మూలంబులు. శిలాలోహంబులు సర్వమయునినఖంబులు. మేఘజాలంబులు హృషీకేశుని కేశంబులు. మెఱుంగులు విశ్వేశ్వరుని శ్మశ్రువులు. భూర్భువస్స్వర్లోక రక్షకులైన లోకపాలకుల పరాక్రమంబులకు భూరాదిలోకంబుల క్షేమంబునకు శరణంబునకు నారాయణుని విక్రమంబు నికేతనంబు. సర్వకామంబులకు నుత్తమంబులైన వరంబులకుఁ [5] దీర్ఘపాదుని పాదారవిందంబు లాస్పదంబులు. జలంబులకు శుక్లంబునకుఁ బర్జన్యునకుఁ బ్రజాపతి సర్గంబునకు సర్వేశ్వరుని మేఢ్రంబు సంభవనిలయంబు. సంతానంబునకుఁ గామాది పురుషార్థంబులకుఁ జిత్తసౌఖ్యరూపంబులగు నానందంబులకు శరీర సౌఖ్యంబునకు నచ్యుతుని యుపస్థేంద్రియంబు స్థానంబు. యమునికి మిత్రునకు మలవిసర్గంబునకు భగవంతుని [6] పాయ్వింద్రియంబు భవనంబు. హింసకు నిరృతికి మృత్యువునకు నిరయంబునకు నిఖిలరూపకునిగుదంబు నివాసంబు. పరాభవంబునకు నధర్మంబునకు నంధకారంబునకు ననంతుని పశ్చిమభాగంబు సదనంబు. [7] నదనదీనివహంబునకు నీశ్వరుని నాడీసందో

---

1 లోకలోచనుఁడు=సూర్యుఁడు. 2 గాత్రంబు = శరీరము. 3 భాజనంబు= ఆశ్రయస్థానము. 4 స్నిగ్ధత్వంబులు=నునుపుగల వస్తువులు. 5 దీర్ఘపాదుఁడు = మహావిష్ణువు. 6 పాయ్వింద్రియంబు = గుదేంద్రియము. 7 నదనదీనివహంబు = పడమరగాఁ బాఱెడి యేఱులును దూర్పుగాఁ బ్రవహించెడియేఱులును.

హంబు జన్మమందిరంబు. పర్వతంబులకు నధోక్షజుని శల్యంబులు జనకస్థలంబులు. ప్రధానంబునకు నన్నరసంబునకు సముద్రంబులకు భూతలయంబునకు బ్రహ్మాండగర్భుని యుదరంబు నివేశంబు. మనో వ్యాపారరూపంబగు లింగశరీరంబునకు మహామహిమునిహృదయంబు సద్మభూమియగు, మఱియును- ౮౯

ఆ. [1]నీలకంధరునకు నీకు నాకు సనత్కుమారముఖ్యసుత సమాజమునకు
ధర్మసత్త్వబుద్ధి తత్త్వములకు నీశ్వ రాత్మ వినుము పరమమైననెలవు.

సీ. నరసురాసురపితృ [2]నాగ[3]కుంజరమృగ
గంధర్వ యక్ష రాక్షస మహీజ
సిద్ధ విద్యాధర జీమూత చారణ
గ్రహ తారకాప్సరోగణ విహంగ
భూత[4]తటిద్వసు పుంజంబులును నీవు
ముక్కంటియును మహామునులు నేను
సలిలనభస్స్థల చరములు మొదలైన
వివిధజీవులతోడి విశ్వమెల్ల

ఆ. విష్ణుమయము, పుత్ర! వేయేల? బ్రహ్మాండ
మతని జేనలోని నడఁగి యుండు;
బుద్ధి నెఱుఁగరాదు; భూతభవద్భవ్య
లోకమెల్ల విష్ణు లోన నుండు. ౯౦

క. మండలములోన భాస్కరుఁడుండి జగంబులకుదీప్తినొసఁగెడిక్రియఁ బ్రహ్మాండములోపలనచ్యుతుఁడుండుచుబహిరంతరములనొగి వెలిఁగించున్

—• కలికాదుల సారయ కవిత్వ ప్రారంభము •—

ఉ. అట్టి యనంతశక్తి జగదాత్ముని నాభిసరోజమందు నేఁ
బుట్టి [5]యజింపఁగా మనసు పుట్టిన యజ్ఞపదార్థజాతముల్
[6]నెట్టనఁ గానరామికి వినిర్మలమైన తదీయరూపముఁ
గట్టిగ బుద్ధిలో నిలిపి కంటి నుపాయము నామనంబునన్. ౯౧

---

1 నీలకంధరునకున్ = శివునికి. 2 నాగములు = సర్పములు. 3 కుంజరములు = ఏనుంగులు. 4 తటిద్వసుపుంజములు = మెఱుపు బంగారుసమూహములు. 5 యజింపఁగాన్ = అర్చించుటకై. 6 నెట్టనన్ = అనివార్యముగ.

సీ. పశుయజ్ఞవాటయూపస్తంభపాత్రమృ
[1]ద్ఘటకళశరావవసంతకాలములును
స్నేహహోమధీబహు లోహచాతుర్హోత్ర
మతనామధేయ సన్మంత్రములును
సంకల్పఋగ్యజు స్సామనియుక్త[2]వ
షట్కారమంత్రానుచరణములును
దక్షిణల్ దేవతాధ్యానతదనుగత
తంత్రవ్రతోద్దేశ ధరణిసురులు
తే. నర్పణంబులు బోధాయనాదికర్మ
సరణి మొదలగు యజ్ఞోపకరణసమితి
యంతయును నమ్మహాత్ముని యవయవములు
గాఁగఁ గల్పించె విధివత్ప్రకారమునను. ౯౪

క. యజ్ఞాంగియజ్ఞఫలదుఁడు । యజ్ఞేశుఁడు యజ్ఞకర్త యగుభగవంతున్
యజ్ఞపురుషుఁగా మానస । యజ్ఞముఁ గావించితిం దదర్పణబుద్ధిన్.

క. అప్పుడు బ్రహ్మలుదమలోఁ।దప్పకననుఁజూచిసముచితక్రియులగుచో
నప్పరమేశున కభిమత। మొప్పఁగ నా[3]సప్తతంతు వొగిఁగావింపన్

చ. మనువులు దేవదానవులు మానవనాథులు మర్త్యకోటి దా
రనయము వారివారికిఁ బ్రియంబగు దేవతలన్ భజించుచున్
ఘనతరనిష్ఠ యజ్ఞములఁ గైకొని చేసిరి, తత్ఫలంబు ల
య్యనుపమమూర్తి యజ్ఞమయుఁడైన రమావరునందుఁ జెందఁగన్.

క. సువ్యక్తతంత్రరూపకుఁ। డవ్యక్తుఁ డనంతుఁడభవుఁ డచ్యుతుఁ డీశుం
డవ్యయుఁడగుహరిసురగణ।సేవ్యుఁడుక్రతుఫలదుఁడగుటఁ జేసిరి[4]మఖముల్.

క. అగుణుండగుపరమేశుఁడు। జగములఁగల్పించుకొఱకుఁ జతురతమాయా
సగుణుండగుఁగావునహరి । భగవంతుఁడనంగఁబరఁగె, భవ్యచరిత్రా!

---

1 ఘటశరావములు=కుండలును మూకుళ్ళును.

2 వషట్కారమంత్రములు=అగ్నియందు వేల్చునప్పుడు చెప్పెడి మంత్రములు.

3 సప్తతంతువు=యజ్ఞము. 4 మఖముల్=యజ్ఞములు.

క. విశ్వాత్ముఁడు విశ్వేశుఁడు । విశ్వమయుం[1]డఖిలనేత విష్ణుం డజుఁ డీ
విశ్వములోఁ దానుండును। విశ్వము దనలోనఁ జాల వెలుఁగుచునుండన్.

చ. అతని నియుక్తిఁ జేరి సచరాచర భూతసమేత సృష్టి నే
వితతముగా సృజింతుఁ, బ్రభవిష్ణుఁడు విష్ణుఁడు ప్రోచుఁ, బార్వతీ
పతి లయమొందఁ జేయు, హరి పంకరుహోదరుఁ డాదిమూర్తి య
చ్యుతుఁడు త్రిశక్తియుక్తుఁ డగుచుండును నింతకుఁ దా నమూలమై. ౧౦౧

క. విను, వత్స ! నీవు నన్నడి। గిన ప్రశ్నకు నుత్తరంబు కేవలపరమం
బును బ్రహ్మంబీయఖిలం। బున కగు నాధార హేతు భూతము సుమ్మీ.

క. హరిభగవంతుఁ డనంతుఁడు। కరుణాంబుధి సృష్టికార్య కారణ హేతు
స్ఫురణుం డవ్విభు కంటెం। బరుఁ డన్యుఁడు లేఁడు, తండ్రి! పరికింపంగన్.

సీ. ఇదియంతయును నిక్క మే బొంక [2]నుత్కంఠ
మతిఁ దద్గుణధ్యాన మహిమఁ జేసి
పరికింప నేనేమి పలికిన నదియెల్ల
సత్యంబయగు, బుధ స్తుత్య ! వినుము;
ధీయుక్త మామకేంద్రియములు మఱచియుఁ
బొరయ వసత్పద స్ఫురణ లెందు;
నదిగాక [3]మత్తను వామ్నాయతుల్యంబు
నమరేంద్రవంద నీయంబు నయ్యెఁ;

తే. దవిలి యే దేవదేవుని [4]భవమహాబ్ధి
తారణంబును మంగళకారణంబు
నఖిలసంపత్కరంబునై యలరు పాద
వనజమున కే నొనర్చెద వందనములు. ౧౦౪

ఉ. ఆనలినాక్షునందనుఁడ నయ్యుఁ బ్రజాపతి నయ్యు యోగవి
ద్యానిపుణుండ నయ్యును బదంపడి మజ్జనన ప్రకారమే

---

1 అఖిలనేత=సర్వేశ్వరుఁడు. 2 ఉత్కంఠమతిన్=అసక్తి వేగముతోఁ గూడిన మనస్సుతో. 3 మత్తను వామ్నాయతుల్యంబు=నా శరీరము వేదముతో సమానమైనది. 4 భవమహాబ్ధితారణంబు=సంసారమహాసముద్రమును దాఁటించునది.

యేను నెఱుంగ, నవ్విభుని యుద్ధమహత్త్వ మెఱుంగ నేర్తురే?
కానఁబడుఁ రమేశపరికల్పిత విశ్వము గొంతకొంతయుఁ. ౧౦౫

మ॥ విను, వేయేటికిఁ? దాపసప్రవర! యవ్విశ్వాత్ముఁ డీశుండు దాఁ
దనమాయా మహిమాంతముం దెలియఁగాఁ దథ్యంబుగాఁ జాలఁ డ
న్నను, నేనైనను మీర లైన సురలైనన్ వామదేవుండు నై
నను నిక్కం బెఱుఁగంగఁ జాలుదుమె? జ్ఞానప్రక్రియాయుక్తులన్.

వ. అమ్మహాత్ముం డైన పుండరీకాక్షుండు సర్వజ్ఞుండం కేని. ౧౦౭

క. గగనము దన[1]కడపలఁ దా।దగ నెఱుఁగ నికరణి విభుఁడు దా నెఱుఁగఁడనన్
[2]గగనప్రసవము లేదన। నగునే? సర్వజ్ఞమునకు హాని తలంపన్.

చ. [3]తలకొని యమ్మహాత్మకుఁడు దాల్చినయయ్యవతారకర్మముల్
వెలయఁగ నస్మదాదులము వేయివిధంబుల సన్నుతింతు మ
య్యలఘు ననంతునిం జిదచిదాత్మకు నాద్యు ననీశు నీశ్వరున్
దెలియఁగ నేర్తుమే? [4]తవిలి దివ్యచరిత్రున కేను మ్రొక్కెదన్. ౧౦౯

మ. పరమాత్ముం డజుఁ డీజగంబుఁ బ్రతికల్పంబందుఁ గల్పించుఁ గాఁ
బరిరక్షించును ద్రుంచు, నట్టియనఘున్ బ్రహ్మాత్ము నిత్యున్ జగ
ద్భరితున్ గేవలు నద్వితీయుని విశుద్ధజ్ఞాను సర్వాత్ము నీ
శ్వరు నాద్యంతవిహీను నిర్గుణుని [5]శశ్వన్మూర్తిఁ జింతించెదన్. ౧౧౦

చ. సరసగతిన్ మునీంద్రులు ప్రసన్న శరీరహృషీకమానస
స్ఫురణ గలప్పు డివ్విభుని భూరికళాకలితస్వరూపముం
దరమిడి చూతు రెప్పుడుఁ, గుతర్కహతమై మోహాతిచేత [6]నజ్ఞతన్
బొరసినయప్పు డవ్విభుని మూర్తిఁ గనుంగొన లేరు, నారదా.

వ. అని వెండియు నిట్లను ననఘా! యమ్మహనీయ తేజోనిధి మొదలి
యవతారంబు సహస్రశీర్షాదియుక్తంబై ప్రకృతి ప్రవర్తకంబగు
నాదిపురుషరూపంబగు. అందుఁ గాలస్వభావంబు లనుశక్తు లుదయించె.
అందుఁ గార్యకారణరూపంబయిన ప్రకృతి జనించె. ప్రకృతివలన

---

1 కడపల = అంతము. 2 గగనప్రసవము = ఆకాశపుష్పము. 3 తలకొని = పూని. 4 తవిలి = ఆసక్తిచెంది. 5 శశ్వన్మూర్తి = శాశ్వతస్వరూపుఁడు.
6 అజ్ఞతన్ = అజ్ఞానముచే.

మహత్తత్త్వంబును దానివలన నహంకారత్రయంబునుబుట్టె. అందు రాజసాహంకారంబువలన నింద్రియంబులును, సాత్త్వికాహంకారంబువలన నింద్రియగుణప్రధానంబులైన యధిదేవతలును, తామసాహంకారంబువలన భూతకారణంబులైన శబ్దస్పర్శ రూపరసగంధతన్మాత్రంబులునుం బొడమె. [1]పంచతన్మాత్రంబులవలన గగనానిల వహ్ని సలిలధరాదికంబైన భూతపంచకంబుగలిగె. అందు జ్ఞానేంద్రియంబులయిన త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులును గర్మేంద్రియంబులైన వాక్పాణిపాదపాయూపస్థంబులును మనంబును జనించె. అన్నింటి సంఘాతంబున విశ్వరూపుండైన విరాట్పురుషుండుపుట్టె. అతనివలన స్వయంప్రకాశుండైన 'స్వరాట్టు' సంభవించె. అందుఁ జరాచర రూపంబుల స్థావరజంగమాత్మకంబయిన జగత్తు గలిగె. అందు సత్త్వరజస్తమోగుణాత్మకుల మయిన విష్ణుండును హిరణ్యగర్భుండునయిన యేనును రుద్రుండునుం గలిగితిమి. అందు సృష్టి జననకారణుండయిన చతుర్ముఖుండు పుట్టె. వానివలన దక్షాదులగు ప్రజాపతులు దొమ్మండ్రు గలిగిరి. అందు భవత్ప్రముఖులైన సనకసనందనాది యోగీంద్రులును, [2]నాకలోక నివాసులయిన [3]వాసవాదులును, [4]ఖగలోకపాలకులగు గరుడాదులును, నృలోకపాలకులగు మనుమాంధాతృప్రముఖులును, దలలోకపాలకులగు ననంతవాసుకిప్రభృతులును, గంధర్వసిద్ధ విద్యాధరచారణ సాధ్యయక్షరక్షోరగాదులును, మఱియు లోకపాలురును, ఋషులును, పితృదేవతలును, దైత్య దానవ భూత ప్రేతపిశాచకూశ్మాండ పశుమృగాదులు నుద్భవించె. ఇట్టి జగత్ప్రథమోద్భవంబు మహత్తత్త్వసృష్టియనంబడు. ద్వితీయంబఖండసంస్థితంబును దృతీయంబు సర్వభూతజననంబును గలిగియుండు. అందు మహదైశ్వర్య తేజోబల సంపన్నులైన పురుషులు సర్వాత్మకుండైన నారాయణుని కళాంశసంభవులుగా నెఱుంగుము. అప్పుండరీ

1 పంచతన్మాత్రలు = శబ్దస్పర్శ రూపరసగంధములు.

2 నాకలోకము=స్వర్గలోకము. 3 వాసవాదులు=ఇంద్రుడు మొదలగువారు. 4 ఖగలోకపాలకులు=పక్షిగణప్రభువులు.

కాక్షుని లీలావతారంబు లనంతంబులు. తత్కర్మంబులు లెక్కపెట్ట నెవ్వరికిని నలవిగాదు. అయినను నాకుం దోఁచినంత నీ కెఱింగించెద వినుము. ౧౧౨

— శ్రీమన్నారాయణుని లీలావతారంబుల యభివర్ణనము —

ఉ. అన్యకథానులాపము లహర్నిశముం వినునట్టి సత్క్రియా
శూన్యము లైనకర్ణముల సూరిజనస్తుత సర్వలోక స
మ్మాన్యము నై తనర్చుహరి మంగళదివ్య కథామృతంబు సౌ
జన్యతఁ గ్రోలవయ్య బుధసత్తమ యే వివరించి చెప్పెదన్. ౧౧౩

వ. అని పలికి మఱియు నిట్లనియె. ౧౧౪

మ. [1]కనకాక్షుండు భుజావిజృంభణమునన్ [2]క్ష్మాచక్రమున్ జాఁపఁజు
ట్టినమాడ్కిం గొనిపోవ యజ్ఞమయ[3]దంష్ట్రిస్వాకృతిం దాల్చి య
ద్దనుజాధీశ్వరుఁ దాఁకి యబ్ధినడుమన్ [4]దంష్ట్రాహతిం ద్రుంప ధా
త్రిని గూలెం [5]గులిశాహతిం బడు మహాద్రింబోలి యత్యుగ్రతన్.

వ. మఱియు సుయజ్ఞావతారంబు వినుమని యిట్లనియె. ౧౧౬

సీ. ప్రకటరుచిన్ బ్రజాపతికిని స్వాయంభు
వునికూఁతు రాకూతి యనులతాంగి
కర్థి జన్మించి సుయజ్ఞుండు నా నొప్పు
నతఁడు దక్షిణయను నతివయందు
సుయమనామామర స్తోమంబుఁ బుట్టించి
యింద్రుఁడై వెలసి [6]యుపేంద్రలీల
నఖిల లోకంబుల [7]యార్తి హరించిన
నతని [8]మాతామహుం డైనమనువు
తే. దనమనంబునఁ దచ్చరిత్రమున కలరి
పరమపుణ్యుండు హరియని పలికెఁ గాన

1 కనకాక్షుఁడు=హిరణ్యాక్షుఁడు. 2 క్ష్మాచక్రము=భూమండలము 3 దంష్ట్రి=పంది. 4 దంష్ట్రాహతిన్=కోఱలదెబ్బచే. 5 కులిశాహతిన్ = వజ్రాయుధపుదెబ్బ. 6 ఉపేంద్రలీలన్ = విష్ణునివిధమున. 7 ఆర్తి=బాధ. 8 మాతామహుండు = తల్లి యొక్కతండ్రి.

యంచితజ్ఞాననిధియై సుయజ్ఞుఁ డెలమిఁ
దాపసోత్తమ హరియవతారమయ్యె. ౧౧౭

వ. అని చెప్పి "సాంఖ్యయోగప్రవర్తకాచార్యవర్యుండగు, కపిలుని యవతారంబు వినుమ" ని యిట్లనియె. ౧౧౮

చ. ధృతమతి దేవహూతికిని దివ్యవిభుం డగుకర్దమప్రజా
పతికిఁ బ్రమోద మొప్ప నవభామలతోఁ గపిలాఖ్యఁబుట్టి యే
గతి హరి పొందు నట్టి [1]సుభగం బగుసాంఖ్యముఁ దల్లి కిచ్చి దు
ష్కృతములు వాపి చూపె మునిసేవితమై తనరారుమోక్షమున్.

వ- మఱియు దత్తాత్రేయావతారంబు వినుము. ౧౨౦

సీ. తాపసోత్తముఁ డత్రి దనయునిఁ గోరి ర
మేశు వేఁడిన హరి యేను నీకు
ననఘ! దత్తుఁడ నైతనని పల్కుకతమున
నతఁడు దత్తాత్రేయుఁడై జనించె
నమ్మహాత్ముని చరణాబ్జపరాగ సం
దోహంబుచేఁ [2]బూతదేహు లగుచు
హైహయయదువంశ్యులైహికాముష్మిక
ఫలరూపమగు యోగబలమువడసి

తే. సంచితజ్ఞానఫలసుఖైశ్వర్యశక్తి
శౌర్యములఁబొంది తమ కీర్తి [3]సదల వెలుఁగ
నిందు నందును వాసికి నెక్కరట్టి
దివ్యతరమూర్తి విష్ణు నుతింపఁదరమె. ౧౨౧

వ. వెండియు సనకాద్యవతారంబు వినుము. ౧౨౨

సీ. అనఘాత్మ! యేను గల్పాదిని విశ్వంబు
సృజియింపఁ దలఁచి యంచితతపంబు
[4]నర్థిఁ జేయుచు 'సన' యని పల్కుటయు నది
కారణంబుగ సనాఖ్యలను గల స

---

1 సుభగంబు = మనోహరము. 2 పూతదేహులు = పవిత్రముగాఁ జేయఁబడిన శరీరములు గలవారు. 3 సదలు = ఆకాశము 4 అర్థిఁ = ప్రీతితో.

ఉ. 'వేనుఁడు' [1]విప్రభాషణ పవిప్రహారచ్యుత భాగ్యపౌరుషుం
డై [2]నిరయంబునం బడిన నాత్మతనూభవుఁడై పృథుండు నాఁ
బూని జనించి తజ్జనకుఁ [3]బున్నరకంబును బాపి మేదినిన్
ధేనువుఁ జేసి వస్తువితతిం బిదికెన్ హరి సత్కళాంశుఁడై. ౧౩౮

వ. అని మఱియు వృషభావతారంబు నెఱింగింతు వినుము. ఆగ్నీధ్రుం
డను వానికి సుదేవివలన నాభి యనువాఁ డుదయించె. అతనికి మేరు
దేవియందు హరి వృషభావతారంబు నొంది జడస్వభావంబైన
యోగంబు దాల్చి ప్రశాంతాంతఃకరణుండు బరిముక్తసంగుండు
నునై [4]పరమహంసాభిగమ్యంబయిన పదంబు బిది యని మహర్షులు
వలుకుచుండం జరించె. మఱియు హయగ్రీవావతారంబు సెప్పెద
వినుము. ౧౩౯

చ. అనఘచరిత్ర! మన్మఖమునందు జనించె [5]హయాననాఖ్యతన్
వినుతసువర్ణవర్ణుఁడును వేదమయుం డఖిలాంతరాత్మకుం
డనుపమయజ్ఞపూరుషుఁడునై భగవంతుఁడు దత్సమస్తపా
వన మగు [6]నాసికాశ్వసన వర్గములం దుదయించె వేదముల్. ౧౪౦

వ. మఱియు మత్స్యావతారంబు వినుము ౧౪౧

సీ. ఘనుఁడు వైవస్వత మనువుకు దృష్టమై
యరుదెంచినట్టియుగాంతసమయ
మందు విచిత్రమత్స్యావతారము దాల్చి,
యఖిలావనీమయం బగుచుఁ జాల
సర్వజీవులకు నాశ్రయభూతుఁడగుచు [7]నే
కార్ణవంబైన తోయమునడుమ

---

1 విప్రభాషణ పవిప్రహారచ్యుత భాగ్య పౌరుషుండు = బ్రాహ్మణ (శాప) వాక్కు లనెడి వజ్రాయుధపు దెబ్బచే జాఱిపోయిన సంపదయుఁ బరాక్రమమును గలవాఁడు. 2 నిరయము = నరకము 3 పున్నరకంబు = పున్నామ నరకము. 4 పరమహంసాభిగమ్యంబు = ఉత్తమజ్ఞానులు పొందఁదగినది. 5 హయాననాఖ్యతన్ = హయగ్రీవుఁడను పేర. 6 నాసికాశ్వసనము = ముక్కులోనిగాలి. 7 ఏకార్ణవంబు = ఒకేసముద్రము.

మన్మఖ [1]శ్లథ వేద మార్గంబులను జిక్కు-
వడకుండ శాఖ లేర్పడఁగఁ జేసి,
తే. దివ్యు లర్థింప నాకర్థిఁ దెచ్చియిచ్చి,
మనువునెక్కిన [2]పెన్నావ [3]వనధినడుమ
మునుఁగ కుండంగనరసిన [4]యనిమిషావ
తార మేరికి నుతియింపఁ దరమె? వత్స! ౧౪౨

వ. మఱియుఁ గూర్మావతారంబు వినుము. ౧౪౩

మ. అమృతోత్పాదన యత్నులై విబుధ దైత్యానీకముల్ మందరా
గముఁ గవ్వంబుగఁ జేసి యబ్ధిఁదరువంగాఁ గవ్వపుంగొండ వా
ర్ధి మునుంగన్ హరి కూర్మరూపమున నద్రిందాల్చెఁ దత్పర్వత
భ్రమణవ్యాజత వీఁపుదీఁట శమియింపం జేయఁగా, నారదా!

వ. వెండియు నృసింహావతారంబు వినుము. ౧౪౫

మ. సురలోకంబుఁ [5]గలంచి దేవసమితిన్ సుక్కించి యుద్యద్గదా
ధరుఁడై వచ్చునిశాచరుంగని [6]కసద్దంష్ట్రా కరాళాస్య వి
స్ఫురితభ్రూకుటితో నృసింహగతి రక్షోరాజవక్షంబు [7]భీ
కరభాస్వన్నఖరాజిఁ దుంచెఁ ద్రిజగత్కల్యాణసంధాయియై. ౧౪౬

వ. ఇంక నాదిమూలావతారంబు సెప్పెదవినుము ౧౪౭

మ. కరినాథుండు జలగ్రహగ్రహణ దుఃఖాక్రాంతుఁడై వేయివ
త్సరముల్ గుయ్యిడుచుండ వేల్పులకు విశ్వవ్యాప్తి లేకుండుటన్
హరినీవే శరణంబునాకనినఁ గుయ్యాలించి వేవేగ [8]వా
శ్చరముం ద్రుంచి కరీంద్రుఁగాచె మహితోత్సాహంబునందాపసా.

వ. మఱియును వామనావతారంబు వినుము. ౧౪౯

---

1 శ్లథ = కష్టము. 2 పెన్నావ = పెద్దయోడ. 3 వనధి = సముద్రము. 4 అనిమిషావతారము = మత్స్యావతారము. 5 కలంచి=చీకాకుపరచి. 6 కసద్దంష్ట్రా కరాళాస్యవిస్ఫురిత భ్రూకుటితోన్ = ప్రకాశించుచున్న కోరలచే భయంకరమైన మొగమునందు ఒప్పుచున్న బొమముడితో. 7 భీకరభాస్వన్నఖరాజిన్ = భయంకరములై ప్రకాశించెడి గోళ్ళసమూహముతో. 8 వాశ్చరమున్ = మొసలిని.

సీ. యజ్ఞేశ్వరుండగు హరివిష్ణుఁ డదితిసం
తానంబునకు నెల్లఁ దమ్ముఁ డయ్యుఁ
బెంపారుగుణములఁ బెద్దయై వామన
మూర్తితో బలిచక్రవర్తిఁ జేరి
తద్భూమి మూఁడుపాదముల నడిగి ప
దత్రయంబునకు జగత్త్రయంబు
వంచించికొనియును వాసవునకు రాజ్య
మందింప నీశ్వరుం డయ్యు మొఱఁగి

తే. [1]యర్థిరూపంబుగైకొని యడుగవలసె
ధార్మికులసొమ్ము వినయోచితములఁగాని
వెడఁగుఁదనమున నూరక విగ్రహించి
చలనమందింపరాదు నిశ్చయముపుత్ర! ౧౫౦

చ. బలి [2]నిజమౌళి నవ్వటుని పాదసరోరుహభవ్యతీర్థము
త్కాలికన్ ధరించి తన్నును జగత్త్రయమున్ హరికిచ్చి కీర్తులన్
నిలిపె వసుంధరాస్థలిని [4]నిర్జరలోకవిభుత్వహానికిం
దలఁకక శుక్రమాటలకుఁ దారక భూరివదాన్యశీలుఁడై. ౧౫౧

వ. మఱియు నప్పరమేశ్వరుండు నారదా నీకు హంసావతారంబునొంది యతిశయ భక్తియోగంబున సంతుష్టాంతరంగుండగుచు నాత్మతత్త్వ ప్రదీపకంబగు భాగవతమహాపురాణం బుపదేశించె. మన్వవతారంబు నొంది స్వకీయ తేజః ప్రభావంబున నప్రతిహతంబైన చక్రంబు ధరియించి దుష్టవర్తనులైన రాజుల దండించుచు శిష్టప్రతిపాలనంబు సేయుచు నాత్మీయ కీర్తిచంద్రికలు సత్యలోకంబున వెలిఁగించె. మఱియు ధన్వంతరి యన నవతరించి తన నామస్మరణంబు భూజనంబులకు సకలరోగనివారణంబు సేయుచు నాయుర్వేదంబుఁ గల్పించె. ఇంకఁ బరశురామావతారంబు వినుము. ౧౫౨

---

1 అర్థిరూపంబు = యాచకస్వరూపము. 2 నిజమౌళిన్ = తన శిరస్సునందు. 3 తత్కాలికన్ = అధికానందంబుతో. 4 నిర్జరలోకవిభుత్వహాని = దేవలోక ప్రభుత్వనాశము.

మ. [1]ధరణీకంటకులైన హైహయ నరేంద్రవ్రాతముం భూరివి
స్ఫురితోదార [2]కుఠారధారఁ గలనన్ [3]ముయ్యేడుమాఱుల్ [4]పాఱిం
బారి మర్దించి సమస్తభూతలము విప్రుల్ వేఁడఁగా నిచ్చి భా
సురకీర్తిన్ జమదగ్నిరాముఁ డన మించున్ దాపసేంద్రోత్తమా!

వ. మఱియు శ్రీరామావతారంబు సెప్పెద వినుము. ౧౫౪

సీ. [5]తోయజహితవంశ దుగ్ధపారావార
రాకావిహారకైరవహితుండుఁ
[6]కమనీయకోసల క్ష్మాభృత్సుతాగర్భ
శుక్తిసంపుటలసన్మౌక్తికంబు
[7]నిజపాదసేవక వ్రజదుఃఖనిబిడాంధ
కారవిస్ఫురితపంకరుహసఖుఁడు
[8]దశరథేశ్వరకృతాధ్వరవాటికాప్రాంగ
ణాకర దేవతానోకహంబుఁ

తే. [9]జటులదానవగహనవైశ్వానరుండు
[10]రావణాటోపశైలపురందరుండు
నగుచు లోకోపకారార్థ మవతరించె
రాముఁ డైఁ జక్రి లోకాభిరాముఁ డగుచు. ౧౫౫

---

1 ధరణీకంటకులు = లోకబాధకులు. 2 కుఠారధారన్ = కత్తి అంచుతో. 3 ముయ్యేడు = ఇరువదియొకటి. 4 పాఱింబారిన్ = మాటిమాటికి. 5 తోయజహితవంశ............కైరవహితుండు = సూర్యవంశమనెడి పాల సముద్రమునకుఁ బూర్ణిమయందుండు చంద్రుఁడు. 6 కమనీయకోసల......మౌక్తికంబు = మనోహరమగు కోసలరాజపుత్త్రికా గర్భమనెడి బరణివంటి ముత్యపుఁ జిప్పయందలి ముత్యము. 7 నిజపాదసేవక......పంకరుహసఖుఁడు = తనపాదసేవకా సమూహముయొక్క దుఃఖమనెడి గాఢాంధకారమునకుఁ బ్రకాశితుఁడగు సూర్యుఁడు. 8 దశరథేశ్వర......దేవతానోకహంబు = దశరథరాజాచేఁ జేయఁబడిన యజ్ఞమునకు ముంగిటి ప్రదేశపుఁ గల్పవృక్షము. 9 చటుల......వైశ్వానరుండు = ఘోర రాక్షసులనెడి యరణ్యమున నగ్నిహోత్రుఁడు. 10 రావణాటోప.........పురందరుండు=రావణుఁడనెడి విజృంభణముగల పర్వతమునకు దేవేంద్రుఁడు.

క. చిత్రముగ భరతలక్ష్మణ, శత్రుఘ్నుల కర్థి నగ్రజన్ముండగుచున్
ధాత్రిన్ రాముఁడు వెలసెఁబ, విత్రుఁడు [1]దుర్భవలతాలవిత్రుండగుచున్

వ. అంత. ౧౫౭

సీ. [2]కిసలయ ఖండేందు బిస కుంద పద్మాబ్జ
పద ఫాల భుజ రద పాణి నేత్రఁ
[3]గాహాళి కరభ చక్ర వియ త్పులిన శంఖ
జం ఘోరు కుచ మధ్య జఘన కంఠ
[4]ముకుర చందన బింబ శుక గజ శ్రీకార
గండ గం ధోష్ఠ వా గ్గమన కర్ణఁ
[5]జంప కేందు స్వర్ణ శఫర ధను ర్నీల
నా సాన నాంగ దృ గ్భ్రూ శిరోజ

తే. [6]నలి సు ధావ ర్త కుంతల హాస నాభి
కలిత జనకావనీపాల కన్యకాల
లామఁ బరిణయ మయ్యె [7]లలాటనేత్ర
కార్ముకధ్వంస [8]ముంకువ గాఁగ నతఁడు. ౧౫౮

---

1 దుర్భవలతాలవిత్రుఁడు = దుష్టమైన సంసారమనెడి తీఁగకుఁ గొడవలి. 2. కిసలయ.........పాణినేత్రన్ = (వరుసగా) చిగురుటాకులవంటియు, చంద్రకళవంటియు, తామరతూఁడులవంటియు, మొల్లపువ్వులవంటియు, తామర తీఁగలవంటియు, కమలములవంటియు, పాదములను నుదురును భుజములును దంతములును హస్తములును నేత్రములును గలదానిని. 3 కాహాళ......కంఠ = (వరుసగా సన్నాయి కళ్ళవంటియు; ఏనుఁగుతొండములవంటియు; చక్రవాకములవంటియు; ఆకాశమువంటియు; ఇసుక తిన్నెలవంటియు; శంఖమువంటియు; పిక్కలును; తొడలును; స్తనములును; నడుమును; పిఱుదులును; మెడయునుగలదానిని. 4 ముకుర చందన......కర్ణన్ = అద్దమువంటియు; మంచిగంథమువంటియు; దొండపండువంటియు; చిలుకవంటియు; ఏనుఁగునడకవంటియు; 'శ్రీ' కారమువంటియు; చెక్కిళ్లును; వాసనయు; పెదవులును; మాటలును; నడకయు; చెవులునుగలదానిని. 5 చంప కేందు......శిరోజన్ = సంపెంగవంటియు; చంద్రునివంటియు; బంగారువంటియు; చేఁపలవంటియు; విండ్లవంటియు; నల్లనైనట్టియు; ముక్కును; ముఖమును; శరీరమును; చూపులును; కనుబొమలును; కెండ్రికలును; కలదానిని. 6 అలిసుధ......... కన్యకాలలామన్ = తేటివంటియు; అమృతమువంటియు; సుడివంటియు; కెండ్రికల తోడను; నవ్వుతోడను; బొడ్డుతోడను; ఒప్పుచున్న జనకరాజ పుత్రికాశ్రేష్ఠమును. 7 లలాట...ధ్వంసము=శివధనుర్భంగము. 8 ఉంకువ=(కన్యకొఱకిచ్చెడి) శుల్కము.

వ. అంత. ౧౫౯

క. రామున్ 1మేచకజలద, శ్యామున్ సుగుణాభిరాము 2సద్వైభవసు
త్రామున్ 3దుష్టనిశాటవి, రాముంబొమ్మనియెఁ బంక్తిరథుఁ డడవులకున్

వ. ఇట్లు పంచిన. ౧౬౧

చ. అరుదుగ లక్ష్మణుండు జనకాత్మజయుం దనతోడ నేఁగుదే
నరిగి రఘూత్తముండు ముదమారఁగఁ జొచ్చెఁ దరక్షు సింహ సూ
కర కరి పుండరీక కపిఖడ్గ కురంగ వృకాహి భల్ల కా
సరముఖవన్యసత్త్వచయ చండతరాటవి దండకాటవిన్. ౧౬౨

క. ఆవనమున వసియించి4నృ, పావననయశాలి యిచ్చె నభయములు జగ
త్పావనమునిసంతతికిఁ 5కృ,పావననిధి యైనరామభద్రుం డెలమిన్.

క. 6ఖరకరకుల జలనిధిహిమ,కరుఁడగురఘురామవిభుఁడు 7గలకటిఁ గోడన్
ఖరుని వధించెను ఘన భీ,కరశరముల నఖిలజనులు గరమరుదందన్.

క. 8హరిసుతుఁబరిచరుఁగాఁగొని
9హరిసుతుఁడునుమాడిపనిచె10హరిపురమునకున్
11హరివిభునకు12హరిమధ్యను
హరి రాజ్యపదంబునిచ్చె 13హరివిక్రముఁడై. ౧౬౫

---

1 మేచకజలదశ్యామున్ = నీలమేఘమువలె నల్లనైనవానిని. 2 సద్వైభవసుత్రామున్=మంచి యైశ్వర్యమునందు దేవేంద్రుని వంటివానిని. 3 దుష్టనిశాటవిరాముఁ = క్రూరరాక్షసుల సంహరించువానిని. 4 నృపావననయశాలి = రాజుల రక్షించుటయందలి నీతిగలవాఁడు. 5 కృపావననిధి = దయాసముద్రుఁడు. 6 ఖరకరకుల జలనిధి హిమకరుఁడు = సూర్యవంశమను సముద్రమునకు చంద్రుఁడు. 7 గలకటి = ఒలిమి. 8 హరిసుతుఁ + పరిచరుగాఁ = వాయుపుత్రుఁడైన హనుమంతునిం బరిచారకునిఁగా. 9 హరిసుతుఁ = ఇంద్రునిపుత్రుడైన వాలిని. 10 హరిపురమునకున్=యమునిపట్టణమునకు. 11 హరివిభునకుఁ = కోతులరాజునకు. 12 హరిమధ్యను = సింగమువంటి నడుముగలదానిని. 13 హరివిక్రముఁడు = సింహమువంటి పరాక్రమముకలవాడు.

వ. అంత సీతానిమిత్తంబునం ద్రిలోకకంటకుండగు దశకంఠుం దును
మాడుటకునై కపిసేనాసమేతుండై చని ముందట నతిదుర్గమంబయిన
సముద్రంబు పేర్చి తెరువుసూపకున్న నలిగి. ౧౬౬

మ. [1]వికటభ్రూకుటిఫాలభాగుఁ డగుచున్ వీరుండు [2]క్రోధారుణాం
బకుఁడై చూచినయంతమాత్రమున న[3]ప్పాథోధి [4]సంతప్తతో
యకణ గ్రాహ తిమింగిల ప్లవ ధులీ వ్యాళ ప్రవాళోర్మి భృ
ద్భక కారండవ చక్రముఖ్యజలసత్త్వశ్రేణితో నింకినన్. ౧౬౭

వ. అయ్యవసరంబున సముద్రుండు కరణాసముద్రుండగు శ్రీరామ
భద్రుని శరణంబు సొచ్చినం గరుణించి యెప్పటియట్ల నిలిపి నలునిచే
సేతువు బంధించి తన్మార్గంబునం జని. ౧౬౮

మ. పురముల్ మూఁడును నొక్కబాణమున నిర్మూలంబుగావించు శం
కరుచందంబున [5]నేర్చి రాఘవుఁడు లంకాపట్టణం [6]బిద్ధగో
పురశాలాంగణహర్మ్య రాజభవన ప్రోద్యత్ప్రతోళీకపా
టరథాశ్వద్విప శస్త్రమందిర నిశాట శ్రేణితో వ్రేల్మిడిన్. ౧౬౯

క. రావణు [7]నఖిలజగద్వి,ద్రావణుఁ బరిమార్చి నిలిపె రక్షోవిభుఁగా
రావణు ననుజన్ముని నై, రావణసితకీర్తి మెఱసి రాఘవుఁ డెలమిన్.

---

1 వికటభ్రూకుటి ఫాలభాగుఁడు = వంకరగా జేయబడిన బొమ్మముడిగల నుదుటిప్రదేశము గలవాఁడు = మొగము చిట్లించినవాఁడు. 2 క్రోధారుణాంబకుఁడు = కోపముచే నెఱ్ఱనయిన నేత్రములు గలవాఁడు. 3 పాథోధి = సముద్రము 4 సంతప్త......శ్రేణితోన్ = మిక్కిలి తపింపఁజేయఁబడిన జలబిందులు, మొసళ్ళు, తిమింగిలములు, ఓడలు, తాఁబేళ్ళు, సర్పములు, పగడపురాసులు కప్పలు, కన్నెలేళ్ళు, చక్రవాకములు, మొదలైన జలజంతుసమూహములతో. 5 ఏర్చెన్ = కాల్చెను. 6 ఇద్ధగోపుర......శ్రేణితోన్ = ప్రకాశితములైన గోపురముల చేతను గృహముల చేతను, ముంగిళ్ళ చేతను, మిద్దెల చేతను, రాజమందిరముల చేతను, నొప్పుచున్న రథవీథుల యొక్కయు, రథములయొక్కయు, గుఱ్ఱములయొక్కయు, ఏనుగులయొక్కయు, నాయుధశాలలయొక్కయు, రాక్షసులయొక్కయు, సమూహములతో, 7 అఖిలజగద్విద్రావణుఁడు = సకలలోకములను నాశనముఁజేయువాఁడు.

సీ. [1]ధర్మసంరక్షకత్వప్రభావుం డయ్యు
[2]ధర్మవిధ్వంసకత్వమునఁ బొదలి
[3]ఖరదండనాభిముఖ్యతఁ బొందకుండియు
[4]ఖరదండనాభిముఖ్యతను మెఱసి
[5]పుణ్యజనావన స్ఫూర్తిఁ బెంపొందియుఁ
[6]బుణ్యజనాంతక స్ఫురణఁ దనరి
[7]సంతతాశ్రిత విభీషణుఁడు గా కుండియు
[8]సంతతాశ్రిత విభీషణత నొప్పి
తే. మించె తనకీర్తిచేత వాసించె దిశలు
దరమె నుతియింప జగతి నెవ్వరికినైనఁ ?
చారుతరమూర్తి నవనీశ చక్రవర్తిఁ
బ్రకటగుణసాంద్రు దశరథ రామచంద్రు. ౧౭౧

వ. అట్టి శ్రీరామావతారంబు జగత్పావనంబును [9]నస్మత్ప్రసాదకారణంబునునై నుతికెక్కె నింకఁ గృష్ణావతారంబు వివరించెద వినుము.

సీ. తాపసోత్తమ ! విను దైత్యాంశములఁ బుట్టి
నరనాథు లతుల సేనాసమేతు
లగుచు ధర్మేతరులై ధాత్రిఁ బెక్కుబా
ధల నలయించుట ధరణి[10]వగలఁ

---

1 ధర్మసంరక్షకప్రభావుండయ్యున్ = న్యాయపరిపాలన శక్తిగలవాఁడయినను 2 ధర్మవిధ్వంసకత్వమునన్ = (శివ) ధనుర్భంగమునందు. 3 ఖర + దండన + అభిముఖ్యతన్ = కఠినశిక్ష (చేయుట) యందలి ప్రాధాన్యమును (పొందకుండియు) 4 ఖర + దండన + అభిముఖ్యతన్ = ఖరాసురుని దండించుటయందలి ప్రాధాన్యముచే (ప్రకాశించి) 5 పుణ్యజన + అవన + స్ఫూర్తిన్ = పవిత్రులగు జనులనురక్షించు స్ఫురణయందు. 6 పుణ్యజన + అంతక + స్ఫురణన్ = రాక్షసవినాశకత్వ స్ఫూర్తియందు. 7 సంతత + ఆశ్రిత + విభీషణుఁడు = ఎల్లప్పుడు నాశ్రితులకు భయంకరుఁడు. (కాకుండియు) 8 సంతత + ఆశ్రిత + విభీషణన్ = ఎల్లప్పుడు నాశ్రయించువాఁడగు విభీషణుఁడనువానిని గలిగియుండుటచే (ఒప్పు). 9 అస్మత్ప్రసాదకారణంబు = మనకనుగ్రహహేతువు 10 వగలన్ = విచారములను.

బొందుచు వాపోవ భూభారముడుపఁట
కై హరి పరుఁడు నారాయణుండు
చెచ్చెరఁ దన [1]సితాసితకేశయుగమున
బలరామకృష్ణరూపములఁ దనరి

తే. యదుకులంబున లీలమై నుదయమగును
భవ్యయశుఁడగు వసుదేవు భార్యలైన
రోహిణియు దేవకియు ననురూపవతుల
యందు [2]నున్మత్తదైత్యసంహారియగుచు. ౧౭౩

వ. ఇట్లు పుండరీకాక్షుం డగు నారాయణుండు సమస్తభూభారనివార ణంబు సేయందనమేని కేశద్వయంబ చాలునని యాత్మపరిభావంబుఁ దెలుపుకొఱకు నిజకళాంశసంభవులైన రామకృష్ణుల దేహవర్ణం బులు శ్వేతకృష్ణంబులని నిర్దేశించుకొఱకు సితాసితకేశద్వయ వ్యాజంబున రామకృష్ణాఖ్యల నలరి యవతరించు. అందు భగ వంతుండును సాక్షాద్విష్ణుండును నైనకృష్ణుండు జనమార్గవర్తి యయ్యు [3]నతిమానుషకర్మంబుల నాచరించుటంజేసి కేవల పర మేశ్వరుండయ్యె. అమ్మహాత్ముం డాచరించు కార్యంబులు లెక్క వెట్ట నెవ్వరికి నలవిగానిదయినను నాకు గోచరించినయంత యెఱిం గించెద వినుము. ౧౭౪

క. నూతనగరళస్తనియగు, పూతనఁ బురిటింటిలోనఁ బొత్తులశిశువై
[4]చేతనమునుహరియించి[5]ప, రేతనగరమునకుననుచుఁగృష్ణుఁడు వెలుచన్.

క. వికటముగ[6]నిజపదాహతిఁ, బ్రకటముగా మూఁడునెలలబాలకుఁడై యా
[7]శకటనిశాటుని[8]నంతక, నికటస్థునిఁ జేయు భక్తనికరావనుఁడై. ౧౭౬

---

1 సితాసితకేశయుగమునన్ = తెల్లవెండ్రుకయు నల్లవెండ్రుకయు ననెడి రెండు వెండ్రుకలచే. 2 ఉన్మత్తదైత్యసంహారి = మదించిన రాక్షసులను సంహరించువాడు. 3 అతిమానుషకర్మంబులు = అమానుషచర్యలు. 4 చేతనము=జీవము. 5 పరేతనగరమునకున్=యమపురికి. 6 నిజపదాహతిన్=తనకాలిదెబ్బచే. 7 శకటనిశాటున్=శకటాసురుని. 8 అంతకనికటస్థుని = యమునిదగ్గర నుండువానిని.

క. ముద్దులకొమరుని [1]వ్రేతల,రద్దులకై తల్లి ఱోల[2]రజ్జువఁ గట్టన్
బద్దులకు మిన్నుముట్టిన, మద్దులవడిఁ గూల్చెజనసమాజమువొగడన్.

మ. మదిఁ గృష్ణుండు యశోదబిడ్డఁడని నమ్మంజాల యోగీంద్ర ! త
ద్వదనాంభోజములోఁ జరాచరసమస్త ప్రాణిజాతాటవీ
సదనద్యాద్రి పయోధియుక్తమగు నానాలోకజాలంబు [3]భా
స్వదనూనక్రియఁ జూపుఁదల్లికి మహాశ్చర్యంబు వాటిల్లఁగన్.

చ. వరయమునానదీహ్రదనివాసకుఁడై [4]నిజవక్త్ర నిర్గత స్ఫురిత
విషాంబుపానమున భూజనులన్ మృతిఁ బొందఁజేయు భీ
కరగరళద్విజిహ్వుఁ డగు కాళియపన్నగు నాహ్రదంబుఁ జె
చ్చెర వెడలించి కాచు యదుసింహుఁడు గోపక గోగణంబులన్.

మ. తనయా ! గోపకు లొక్కరేయి నటవి నిద్రల్ వోవఁ గార్చిచ్చు వ
చ్చినఁ 'గృష్ణా ! మము నగ్నిపీడితుల రక్షింపం దగుం గావవే'
యనినం 'గన్నులు మీరు [5]మోడ్వుఁడిదె దావాగ్నిన్ వెసన్నార్తునే'
యన వారట్ల యొనర్ప మ్రింగు [6]శిఖిఁ బద్మాక్షుండు లీలాగతిన్.

క. మందునిగతి యమునాంబువు, లందునిసిం గ్రుంకి బద్ధుఁడై చిక్కినయా
నందుని వరుణునిబంధన,మందునివృత్తినిఁగఁ జేయుహరి సదయుండై.

మ. హయసూనుం డగుదానవుండు నిజమాయన్ [7]గోపరాజిన్ గుహా
శ్రయ యానమ్మొనరించి తత్పథము [8]నీరంధ్రంబు గావించినన్
రయమొప్పన్ గుటిలాసురాధమునిఁ బోరన్ ద్రుంచి గోపావళిన్
దయతోఁ గాచెడికృష్ణు సన్మహిమ [9]మేతన్మాత్రమే తాపసా !

---

1 వ్రేతలరద్దులకై = గోపికల యల్లరకు. 2 రజ్జువన్ = త్రాటితో. 3 భాస్వదనూనక్రియన్ = ప్రకాశించుచున్న గొప్ప చర్యతో. 4 నిజవక్త్ర నిర్గతస్ఫురిత విషాంబు పానమునన్ = తన నోటినుండి బయలువెడలి ప్రకాశించినవిషమును త్రాగుటచే. 5 మోడ్వుఁడు = మూసికొనుఁడు. 6 శిఖిన్ = (విషరూపమైన) అగ్నిని. 7 గోపరాజిన్ = గొల్లల సమూహమును. 8 నీరంధ్రము = చీకటి 9 ఏతన్మాత్రమే ! = సామాన్యమా !

క. దివిజేంద్రప్రీతిగ [1]వ, ల్లవజను లేఁటేఁటఁ జేయు లాలిత [2]సవనో
త్సవమును హరి మాన్పిన గో, పవరులు గావింపకున్న [3]బలరిపుఁ డలుకన్.

తే. మంద [4]గొందలమంద [5]నమందవృష్టి
గ్రిందుకొనుఁడంచు నింద్రుండు మందలింపఁ
[6]జండపవనసముద్ధూత చటులవిలయ
సమయసంవర్తకాభీల జలధరములు. ౧౮౪

శా. సప్తస్కంధశిఖాకలాపరుచిమ త్సౌదామినీవల్లికా
దీప్తోదగ్రముహుర్ముహు స్స్తనితధాత్రీభాగ నీరంధ్రమై
సప్తాశ్వస్ఫురదిందుమండలనభ స్సంఛాదతాశాంతర
వ్యాప్తాంభోదనిరర్గళస్ఫుటశిలా వాఃపూరధారాళమై. ౧౮౫

వ. అట్లు కురియు వాన జల్లుపెల్లున జిమ్ములుగొని సొమ్ములువోయి గోకులం బాకులంబు నొంది కృష్ణ కృష్ణ రక్షింపు రక్షింపుమని యార్తింజెంది కుయ్యిడ నయ్యఖండకరుణా సముద్రుండు నిజభక్తజన సురద్రుముండునగు పుండరీకాక్షుండు. ౧౮౬

శా. సప్తాబ్దంబులబాలుఁడై నిజభుజాస్తంభంబునన్ లీలతో
సప్తాహంబులు శైలరాజము లసచ్ఛత్రంబుగాఁ దాల్చి సం
గుప్తప్రాణులఁ జేయు మాధవుఁడు గో గోపాలక వ్రాతమున్
సప్తాంభోధిపరీత భూధరున కాశ్చర్యంబె? చింతింపఁగన్. ౧౮౭

సీ. సాంద్రశరచ్చంద్ర చంద్రికాధవళిత
విమలబృందావన వీథియందు
[7] రాసకేళీమహోల్లాసుఁడై యుత్ఫుల్ల
జలజాక్షుఁ డొకనిశాసమయమునను

---

1 వల్లవులు = గొల్లలు. 2 సవనము = యజ్ఞము. 3 బలరిపుఁడు = ఇంద్రుఁడు 4 గొందలము = సంక్షోభము. 5 అమందవృష్టి=పెద్దవాన. 6 చండపవన...... జలధరములు = తీవ్రములగు వాయువులచే నెగురఁగొట్టఁబడిన ఘోర ప్రళయకాల సంవర్తనామక భయంకరమేఘములు. 7 రాసకేళి = రాసక్రీడ-గోపకుల క్రీడా విశేషము.

దనరారు[1]మంద్ర మధ్యమ తారములనింపు
దళుకొత్త రాగభేదములఁ జెలఁగి,
ధైవతఋషభగాంధారనిషాదపం
చమ షడ్జ మధ్యమ స్వరము లొలిఁ
తే. గళలుజాతులు మూర్ఛనల్ గలుగ[2]వేణు
నాళవివరాంగుళిన్యాస లాలనమున
మహితగతిఁ బాడు సవ్యక్త మధురముగను,
బంకజాక్షుండు[3]దారువు లంకురింప. ౧౫౮

మ. హరి వేణూద్గత మంజులస్వననినాదాహూతలై గోపసుం
దరు లేతేర[4] ధనాధిపానుచరగంధర్వుండు గొంపోవఁద
త్తరుణుల్ [5]గుయ్యిడ [6]శంఖచూడునిభుజా దర్పంబుమాయించి తాఁ
బరిరక్షించినయట్టి కృష్ణుని నుతింపన్ శక్యమే యేరికిన్? ౧౫౯

చ. నరక ముర ప్రలంబ యవన ద్వీప ముష్టిక మల్ల కంస శం
బర శిశుపాల పంచజన పౌండ్రక పల్వల దంతవక్త్ర వా
నర ఖర సాల్వ వత్స బక నాగ విదూరథ రుక్మి కేశి ద
ర్దుర వృష ధేనుక ప్రముఖ దుష్టనిశాటులఁ ద్రుంచువేల్పుల్మిడిన్. ౧౬౦

వ. మరియును ౧౬౧

మ. [7]బలభీమార్జున ముఖ్య చాపధరరూపవ్యాజతం సూరులన్
ఖలులన్ దుష్టధరాతలేశ్వరుల సంగ్రామైకపారీణదో
ర్బలకేళిన్ దునుమాడి సర్వధరణీ భారంబు మాయించి సా
ధుల రక్షించినయట్టికృష్ణుని ననంతుం గొల్తు నెల్లప్పుడున్. ౧౬౨

వ. అట్టి లోకోత్కృష్టుండైన కృష్ణుని యవతారమాహాత్మ్యంబెఱింగించితి. ఇంక వ్యాసావతారంబు వినుము ౧౬౩

---

1 మంద్రమధ్యమతారములన్ = స్వరములు - 'సరిగమపధని' యను సప్తస్వరములు. 2 వేణునాళము= పిల్లనగ్రోవి, 3 దారువు = కొయ్య. 4 ధనాధిపుఁడు - కుబేరుఁడు. 5 కుయ్యిడ=అఱచుట 6 శంఖచూడుఁడు - ఒకగంధర్వుఁడు 7 బలభీమార్జున ముఖ్యచాపధర రూపవ్యాజతన్ = బలదేవుఁడు భీముఁడు అర్జునుఁడు మొదలైన విలుకాండ్రమిషతో.

చ. ప్రతియుగమందు సంకుచిత భావులు నల్పతరాయువుల్ [1]సుదు
ర్గతికులు నైన మర్త్యుల[2] కగమ్యములుఁ స్వకృతంబులుఁ సుశా
శ్వతములు నైన వేదతరుశాఖలు దా విభజించి నట్టి స
న్నుతుఁడు పరాశరప్రియతనూజుఁడు నా హరి పుట్టెనర్మిలిన్. ౧౯౪

వ. మఱియు బుద్ధావతారంబు వినుము- ౧౯౫

మ. అతిలోభాత్ములు సూనృతేతరులు భేదాచార సంశీలు రు
ద్ధత[3]పాషండమతోపధర్మ్యులు జగత్సంహారులై నట్టి యా
[4]దితిసంజాతు లధర్మవాసనల వర్తింపందదాచారసం
హతి మాయించి హరించు దానవులఁ బద్మాక్షుండు బుద్ధాకృతిన్.

వ. మఱియుఁ గల్క్యవతారంబు వినుము. ౧౯౬

మ. వనజాక్షు న్తవశూన్యులై మఱి వషట్స్వాహాస్వధావాక్యశో
భనరాహిత్యులు సూనృతేతరులునుం బాషండులు నైనన వి
ప్రనికాయంబును శూద్రభూపులుఁ గలిన్ భాసిల్లినం గల్కియై
జననం బంది యధర్మమున్నడఁచు సంస్థాపించు ధర్మంబిలన్. ౧౯౭

వ. అని మఱియుఁ బితామహుండు నారదున కిట్లనియె. "మునీంద్రా! పుండరీకాక్షుం డంగీకరించిన లీలావతార కథావృత్తాంతంబు నే నీకు నెఱింగించు నింతకుమున్న హరి వరాహాద్యవతారంబు లంగీకరించి తత్ప్రయోజనంబులు దీర్చె. మన్వంతరావతారంబు లంగీకరించిన వియు, నంగీకరింపంగలవియునై యున్న యవి. వర్తమానంబున ధన్వంతరి పరశురామావతారంబులు దాల్చి యున్నవాఁడు. భావికాలంబున శ్రీరామాద్యవతారంబుల నంగీకరింపంగలవాఁడు. అమ్మహాత్ముండు సృష్ట్యాది కార్యభేదంబులకొఱకు మాయాగుణావతారంబు లందుబహుశక్తిధారణుండైన భగవంతుండు [5]సర్గాదినిఁ దపస్వ్యాళులును, నేను, ఋషిగణంబులును నవప్రజాపతులు నై యవతరించి [6]విశ్వో

1 సుదుర్గతికుల్ = మిక్కిలి దుష్టమైన గతిగలవారు. 2 అగమ్యములు = పొందఁదగనివి. 3 పాషండ మతోపధర్మ్యులు = వేద బాహ్యమతాచారులు. 4 దితిసంజాతులు = రాక్షసులు. 5 సర్గాదిన్ = సృష్ట్యాదియందు. 6 విశ్వోత్పాదనంబు = లోకసృష్టి.

త్పాదనంబు గావించుచుండు. ధర్మంబును విష్ణుండును యజ్ఞంబులును మనువులును నింద్రాదిదేవగణంబులును ధాత్రీపతులును నయి యవతరించి జగంబుల రక్షించుచుండు. అధర్మంబును రుద్రుండును మహోరగంబులును రాక్షసానీకంబులును నై యవతరించి విలయంబు నొందించుచుండు. ఇత్తెఱంగునం బరమేశ్వరుండును సర్వాత్మకుండును నైన హరి విశ్వోత్పత్తి స్థితి లయ హేతుభూతుండై విలసిల్లు. ధరణీరేణువులనయిన గణుతింప నలవియగుంగాని యమ్మహాత్ముని లీలావతారాద్భుత కర్మంబులు లెక్కపెట్ట నెవ్వరికి నశక్యంబై యుండు? నీకు సంక్షేపరూపంబున నుపన్యసించితి. సవిస్తరంబుగా నెఱింగింప నాకుం దరంబుగాదనిన నన్నూలం జెప్పనేల వినుము. ౧౯౯

చ. అమరఁ [1]త్రివిక్రమస్ఫురణ నందిన యమ్మహితాత్మపాద వే
గమున హతంబులైన త్రిజగంబుల కావలవెల్గు సత్యలో
కము చలియించినం గరుణఁ గైకొని కాచి ధరించెఁ బాదప
ద్మమునను నట్టి [2]యప్రతిహతంబగు శక్తి గణింపశక్యమే? ౨౦౦

మ. హరిమాయాబల మేనెఱుంగ నఁట శక్యంబే సనందాది స
త్పురుషవ్రాతముకైన బుద్ధి నితరంబుల్ మాని సేవాధిక
స్ఫురణం దచ్చరితానురాగ గుణ విస్ఫూర్తిన్ సహస్రాస్య సుం
దరతన్ బొల్పగు శేషుఁడున్ దెలియఁడన్నన్ జెప్పనేలా యొరుల్?

చ. ఇతరముమాని తన్ను మది నెంతయునమ్మి భజించువారి నా
శ్రితజనసేవి[3]తాంఘ్రి సరసీరుహుఁడైన సరోజనాభుఁ డం
చితదయతోడ నిష్కపట చిత్తమునం గరుణించునట్టి వా
రతులదురంతమై తనరు నవ్విభుమాయఁదరింతు రెప్పుడున్. ౨౦౨

వ. మఱియును సంసారమగ్నులయి దివసంబులు ద్రోచియు నంతంబున శునక[4]సృగాలభక్ష్యంబులయిన కాయంబులందు [5]మమత్వంబు సేయక భగవదర్పణంబు సేసినపుణ్యాత్ములుం గొందఱుఁగల రెఱింగింతు

---

1 త్రివిక్రమస్ఫురణ = వామనావతారమునంబ్రకాశించుట. 2 అప్రతిహతము = అనివార్యము. 3 అంఘ్రి = పాదము. 4 సృగాలము=నక్క. 5 మమత్వము—ఆసక్తి.

వినుము. ఏను నీబ్రహ్మత్వంబునం జెందు ¹రాజసంబువిడిచి యమ్మహాత్ముని పాదారవిందంబుల భక్తినిష్ఠుండనై శరణాగతత్వంబున భజియించునప్పుడు దెలియుదు. రాజసగుణుండనై యున్న వేళఁ దెలియంజాల. గావున శాస్త్రంబులు ప్రపంచింపక కేవల భక్తిజ్ఞాన యోగంబున సేవింతు. మఱియు ²సనకాదులగు మీరును భగవంతుండైన రుద్రుండును దైత్యపతియైన ప్రహ్లాదుండును స్వాయంభువ మనువును నతనిపత్ని (యగు శతరూపయుఁ) (దత్పుత్త్రులగు ప్రియవ్రతోత్తానపాదులును) దత్పుత్త్రికలును ప్రాచీనబర్హియు ఋభువును వేనజనకుండగు నంగుండును ధ్రువుండును నెండియు. ౨౦౩

సీ. గాధి గయాసు రేక్ష్వాకు దిలీప మాం
ధాతలు భీష్మ యయాతి సగర
రఘు ముచికుం దైళ రంతిదే వోద్ధవ
సారస్వ దోదంక భూరిషేణ
శ్రుతదేవ మారుతి శతధన్వ పిప్పల
బలి విభీషణ శిబి పార్థ విదురు
లంబరీష పరాశ రాలర్క సౌభరి
దేవల మిథిలేశ్వ రేంద్రదత్తు

తే. లార్ష్టిషేణాదులైన మహాత్ములెలమిఁ
దవిలి యద్దేవుభక్తిఁ జిత్తములనిలిపి
తత్పరాయణులౌట ³దుర్దాంతమయిన
విష్ణుమాయఁ దరింతురు విమలచరిత. ౨౦౪

మ. అనఘా వీరల నెన్న నేమిటికిఁ ⁴దిర్యగ్జంతుసంతాన ప
క్షి⁵నిశాటాటవికాఘ జీవనివహ స్త్రీ శూద్ర హూణాదులై
నను నారాయణభక్తియోగమహితానందాత్ములై రేని వా
రనయంబుం దరియింతు రవ్విభుని ⁶మాయావైభవాంభోనిధిన్.

---

1 రాజసము=రజోగుణధర్మము. 2 సనకాదులు=సనక, సనందన, సనత్కుమార సనత్సుజాతులు. 3 దుర్దాంతము = బాహ్యేంద్రియాగోచరము. 4 తిర్యగ్జంతువు=పశువు. 5 నిశాటాటవికాఘజీవనివహము=పాపజీవనులగు రాక్షసారణ్యక సమూహము. 6 మాయావైభవాంభోనిధిన్=మాయావిభవమగు సంసారసాగరమునుండి.

వ. కావున. ౨౦౬

క. [1]శశ్వత్ప్రశాంతు నభయుని,
విశ్వాత్ముఁ బ్రబోధమాత్రు విభు సంశుద్ధున్
శాశ్వతు [2]సదసత్పూరుషు,
నీశ్వరుఁ జిత్తమున నిలుపు మెప్పుడు మునీంద్రా! ౨౦౭

వ. అట్లయిన నప్పుణ్యాత్ముల [3]ననవద్యశీలుర నవిద్య లజ్జావనత వదనయై పొందజాలక [4]వైముఖ్యంబునం [5]దవ్వుదవ్వులం దలంగి పోవు మఱియును. ౨౦౮

చ హరిఁ బరమాత్ము నచ్యుతు ననంతునిఁ జిత్తములోఁ దలంచి సు
స్థిరత విశోకసౌఖ్యములఁ జెందిన ధీ నిధులన్యకృత్యము
ల్మఱచియుఁ జేయనొల్లరు తలంచిన నట్టిదయౌ సురేంద్రుఁడున్
బరువడి నుయ్యి ద్రవ్వునె [6]పిపాసితుఁడై సలిలాభిలాషితన్. ౨౦౯

ఉ. సర్వఫలప్రదాతయును సర్వశరణ్యుఁడు సర్వశక్తుఁడున్
సర్వజగత్ప్రసిద్ధుఁడును సర్వగతుం డగుచక్రపాణి యీ
సర్వశరీరులున్ విగమ సంగతి జెంది [7]విశీర్యమాణులై
పర్విన చో నభంబు గతి బ్రహ్మము దాఁ జెడకుండు నెప్పుడున్.

ఉ. [8]కారణ కార్యహేతువగు కంజదళాక్షునికంటె నన్యు లె
వ్వారును లేరు తండ్రి భగవంతు ననంతుని విశ్వభావనో
దారుని సద్గుణావళు లుదాత్తమతిం గొనియాడకుండినం
జేరవు చిత్తముల్ ప్రకృతిఁ జెందని నిర్గుణమైనబ్రహ్మమున్. ౨౧౧

మ. [9]నిగమార్థప్రతిపాదక ప్రకటమై [10]నిర్వాణసంధాయిగా
భగవంతుండు రచింప[11]భాగవత కల్పక్ష్మాజమై శాస్త్రరా

---

1 శశ్వత్ప్రశాంతున్ = ఎల్లప్పుడు శాంతమగు చిత్తము గలవానిని. 2 సదసత్పూరుషుఁడు = చిద్బ్రహ్మాకారుఁడు. 3 అనవద్యశీలురు=అనింద్య స్వభావులు. 4 వైముఖ్యము=విముఖత. 5 దవ్వుదవ్వులన్ =దూరదూరమున. 6 పిపాసితుడై సలిలాభిలాషితన్ =దాహముగొన్నవాఁ డుదకముఁ గోరుచు, 7 విశీర్యమాణులై = క్షీణించినవారలై. 8 కారణకార్యహేతువగు = కార్యరూపమగు జగత్తునకు, కారణమగు మాయాశక్తికిని హేతువైన. 9 నిగమార్థప్రతిపాదకము = వేదార్థములచే నిరూపితము. 10 నిర్వాణసంధాయి= మోక్షప్రదాత. 11 భాగవత కల్పక్ష్మాజము= భాగవతమనెడి కల్పవృక్షము.

జగరిష్ఠం బగునీపురాణకథ సంక్షేపంబునం జెప్పితిన్
జగతిన్ నీవు రచింపు దీని నతివిస్తారంబుగాఁ బుత్త్రకా. ౨౧౨

చ. పురుష ¹భవంబు నొందుట యపూర్వము జన్మములందు నందు భూ
సురకులమందుఁ బుట్టు టతి చోద్యము నిట్లగుటన్ మనుష్యు ల
స్థిర మగుకార్యదుర్దశల చేత నశింపక విష్ణుసేవనా
పరతఁ దనర్చి నిత్య మగు ²భవ్యపథంబునఁ బొందు టొప్పదే. ౨౧౩

మ. ఉపవాసవ్రతశౌచశీల³మఖసంధ్యోపాసనాగ్నిక్రియా
జపదానాధ్యయనాదికర్మముల మోక్షప్రాప్తి సేకూర ద
చ్ఛుభభక్తిన్ హరిఁ బుండరీకనయనున్ సర్వాతిశాయిన్ రమా
ధిపుఁ బాపఘ్నుఁ బరేశు నచ్యుతుని సథింగొల్వలేకుండినన్. ౨౧౪

క. వనజాక్షుమహిమ నిత్యము,
వినుతించుచు నొరులు వొగడ వినుచున్ మదిలో
ననుమోదించుచు నుండెడు
జనములుఁ దన్మోహవశతఁ జనరు మునీంద్రా. ౨౧౫

క. అని వాణీశుఁడు నారద
మునివరునకుఁ జెప్పినట్టి ముఖ్యకథాసూ
చన మతిభక్తిఁ బరీక్షి
జ్జనపాలునితోడ యోగి చంద్రుఁడు నుడివెన్. ౨౧౬

—♦ పరీక్షిన్మహారాజు శుకయోగిం బ్రపంచోద్భవాదికంబు నడుగుట ♦—

సీ. విను శుకయోగికి మనుజేశుఁ డిట్లను,
మునినాథ దేవదర్శనము గలుగ
నారదమునికిఁ బంకేరుహభవుఁ డెఱిం,
గించిన తెలుఁగు సత్కృపఁ దలిర్ప
గణుతింప⁴సత్త్వాది ♦ గుణశూన్యుఁడగుహరి,
కమలాక్షు లోకమంగళములైన

---

1 భవంబు = జన్మము. 2 భవ్యపథంబు=శుభమార్గము. (మోక్షము) 3 మఖము=యజ్ఞము. 4 సత్త్వాదిగుణశూన్యుఁడు = సత్వ, రజ, స్తమోగుణరహితుడు.

కథలు నాకెఱింగింపఁ గైకొని నిస్సంగ,
మైననాహృదయాబ్జ మందుఁ గృష్ణు
తే. [1]భవ్యచరితుని నాద్యంత భావశూన్యుఁ,
జిన్మయాకారు ననఘు లక్ష్మీసమేతు
నిలిపి యస్థిరవిభవంబు నిఖిల [2]హేయ
భాజనంబైన యీ కళేబరము విడుతు. ౨౦౭

వ. అదియునుంగాక యెవ్వండేని శ్రద్ధాభక్తియుక్తుండై కృష్ణ గుణకీర్త నంబులు వినుచుం బలుకుచుండు నట్టివాని హృదయపద్మంబునందుఁ గర్ణరంధ్రమార్గంబులం బ్రవేశించి కృష్ణుండు విశ్రమించి [3]సలిలగతంబైన కలుషంబును శరత్కాలంబు నివారించు చందంబున నాత్మ గతంబైన మాలిన్యంబు [4]నపకర్షించుఁ గావున. ౨౦౮

మ. [5]భరితోదగ్రనిదాఘతప్తుఁడగు నప్పాంథుండరణ్యావిసం
చరణక్లేశసముద్భవం బగుపిపాసం జెంది యాత్మీయమం
దిరముం జేరి గతశ్రముం డగుచు నెందేనిన్ జనన్ బోని భం
గి రమాధీశుపదారవిందయుగ సంగీభూతుఁడై మానునే. ౨౦౯

వ. అదియునుంగాక [6]సకలభూత సంసర్గశూన్యంబైన యాత్మకు భూత సంసర్గం బేప్రకారంబునం గలిగె నది నిర్నిమిత్తత్వంబునం జేసియో కర్మమూలంబునం జేసియో యాక్రమమంబు నాకెఱింగింపుము. ౨౧౦

సీ. ఎవ్వని నాభియందెల్ల లోకాంగ సం
స్థానకారణ పంకజంబు వొడమె
నం దుదయించి సర్వావయవ స్ఫూర్తిఁ
దనరారు నట్టి పితామహుండు

1 భవ్యచరితుని=మంగళమగు చరిత్రముగల వానిని.

2 హేయభాజనము=నిందాపాత్రము. 3 సలిలగతంబైన కలుషంబు =బురద తోఁగూడిన నీరు (అనగా వర్షాకాలమందలి నదీజలము) 4 అపకర్షించు=పోఁగొట్టు. 5 భరితోదగ్ర......పిపాసంజెంది=మిక్కిలి భరింపరాని యెండవేడిమిచే శోషిలిన మార్గస్థుఁ డరణ్య సంచారముచే కాళ్లతిప్పలతోనుండి దాహమును గోరి. 6 సకలభూత సంసర్గంబైన=చరాచర భూతజాలముతోఁ గలయికయైన.

గడఁగి యెవ్వని యనుగ్రహమున నిఖిల భూ
తముల సృజించె నుత్కంఠతోడ
నట్టివిధాత యే యనువున సర్వేశు
రూపంబు గనుఁగొనె రుచిరభంగి

తే. నాఁపరంజ్యోతి యైన పద్మాక్షునకును,
నలినజునకుఁ [1]ప్రతీకవిన్యాసభావ
గతులవలనను భేదంబుగలదె చెపుమ,
యతిదయా సాంద్రయోగి కులాబ్ధిచంద్ర! ౨ ౨౧

వ. మఱియును భూతేశ్వరుండైన సర్వేశ్వరుం డుత్పత్తి స్థితి లయ కారణంబైన తనమాయనువిడిచి రమానాయకుండై యేయేప్రదేశంబుల శయనంబుసేసె. అదియునుంగాక పురుషావయవంబులచేఁ బూర్వకాలంబున లోకపాలసమేతంబులైన లోకంబు లెత్తెరంగునం గల్పితంబులయ్యె. అదియునుం గాక మహాకల్పంబులును నవాంతరకల్పంబులును [భూతభవిష్యద్వర్తమానకాలంబులును] దేహాభిమానులై జనియించిన దేవపితృమనుష్యాదులకుం గలుగునాయుఃప్రమాణంబులును [2][బృహత్సూక్ష్మ] కాలానువర్తనంబును [నేయేకర్మంబులం జేసి] జీవు లేయేలోకంబుల నొందుదురు. మఱియు నేయేకర్మంబులం జేసి దేవాది శరీరంబులం బ్రాపింతురు. అట్టి కర్మమార్గ ప్రకారంబును, సత్త్వాదిగుణంబుల పరిణామంబులగు దేవాదిరూపంబులం గోరు జీవులకు నేయేకర్మ సముదాయం బెట్టు సేయం దగు, నెవ్వనికి నర్పింపందగు, నవి యెవ్వనిచేత గ్రహింపంబడు. భూపాతాళ[3]కకుబ్వ్యోమగ్రహ నక్షత్రపర్వతంబులును, [4]సరిత్సముద్రంబులును ద్వీపంబులును నే ప్రకారంబున సంభవించె. నాయాస్థానంబులంగలవారి సంభవంబు లేలాగు. [5][వియద్బాహ్యాభ్యంతరంబులం] గలుగు బ్రహ్మాండప్రమాణంబెంత. మహాత్ములచరిత్రంబు

1 ప్రతీకవిన్యాస భావము=అంగాంగిభావము. 2 బృహత్సూక్ష్మము = స్థూలసూక్ష్మము. 3 కకుబ్వ్యోమములు=దిగాకాశములు. 4 సరిత్తులు (గోదావర్యాదినదులు) 5 వియత్ = ఆకాశము.

లెట్టివి. [1]వర్ణాశ్రమవినిశ్చయంబులును, ననుగతంబులై యాశ్చర్యావహంబులగు హరి యవతార చరిత్రంబులును, యుగంబులును, యుగప్రమాణంబులును యుగధర్మంబులును, ప్రతియుగంబునందును మనుష్యుల కేయేధర్మంబు లాచరణీయంబు లట్టి [సాధారణధర్మంబులును, విశేషధర్మంబులును, జాతివిశేషధర్మంబులును, రాజర్షిధర్మంబులును, నాపత్కాలజీవన సాధనభూతంబులగు ధర్మంబులును] మహదాదితత్త్వంబులసంఖ్యయు, సంఖ్యాలక్షణంబును, నా తత్త్వంబులకు హేతుభూతలక్షణంబులును భగవ[2]త్సమారాధన విధంబును [3]అష్టాంగయోగక్రమంబును, యోగీశ్వరులయణిమాద్యైశ్వర్య ప్రకారంబును, వారల[4]యర్చిరాదిగతులును, లింగ శరీరభంగంబులును, ఋగ్యజుస్సామవేదంబులును, ఉపవేదంబులైన యాయుర్వేదాదులును, ధర్మశాస్త్రంబులును, ఇతిహాస పురాణంబుల సంభవంబును, సర్వభూతంబుల యవాంతరప్రళయంబును, మహాప్రళయంబును, నిష్టాపూర్తంబులును, [యాగాదివైదిక కర్మజాలంబులును], [5]వాపీ కూప తటాక దేవాలయాదినిర్మాణంబులును, నన్నదానం [6]బారామప్రతిష్ఠ మొదలగు స్మార్తకర్మంబులును, గ్రామ్యంబులైన యగ్నిహోత్రంబుల యనుష్ఠానప్రకారంబును, జీవసృష్టియు, ధర్మార్థకామంబు లనియెడుత్రివర్గాచరణ ప్రకారంబును, మలినోపాధిక [7]పాషండసంభవంబును, జీవాత్మబంధమోక్షప్రకారంబును, స్వరూపావస్థాన విధంబును, సర్వతంత్రుం డయిన యీశ్వరుం డాత్మమాయం జేసి సర్వకర్మసాక్షియయ్యు నమ్మాయ నెడఁబాసి [8]యుదాసీన గతిని [విభుండై] క్రీడించు తెఱంగును, గ్రమంబునఁ బ్రపన్నుండ

1 వర్ణాశ్రమములు = బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రవర్ణంబులు, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమములు. 2 సమారాధన = పూజ. 3 అష్టాంగయోగములు = యమ, నియమ ప్రాణాయామ ప్రత్యాహార, ధ్యాన, ధారణ, నిధ ధ్యాసలు 4 అర్చిరాదులు = (అనగా పుణ్యపాపాత్ములు మరణానంతరము పొందఁదగిన స్థానములకు పోవుమార్గములు. అర్చిరమార్గము= ధూమరమార్గము. వీనినే దేవ పితృయానము లందురు. 5 వాపీ + కూప = దిగుడు + చేదుడు బావులు. 6 ఆరామము=తోట. 7 పాషండసంభవము = దుర్మతజననము. 8 ఉదాసీనము=ఉపేక్ష.

నయిననాకు నెఱింగింపుము. బ్రాహ్మణశాపంబునం జేసి [1]శోకవ్యాకులిత చిత్తుండనై యనశనవ్రతుండ నైననీవు వినుట యెట్లని సందేహింపవలవదు. త్వదీయ ముఖారవింద [2]వినిస్సృత నారాయణ కథామృత పానకుతూహలి నైననాకు నింద్రియంబులు వశంబులై యుండును. అదిగావున నే నడిగిన ప్రశ్నంబులకు నుత్తరంబులు సవిస్తరంబులుగా నానతిచ్చి కృతార్థునిం జేయఁ బరమేష్ఠి తుల్యుండవగు నీవ పూర్వ సంప్రదా[3]యానురోధంబున నర్హుండ వగుదు వని విష్ణురాతుండయిన పరీక్షిన్నరేంద్రుండు బ్రహ్మరాతుండయిన శుకయోగి నడిగిన నతండు బ్రహ్మ నారద సంవాదంబును నేక సంప్రదాయానుగతంబును గతానుగతిక ప్రకారంబును నై తొల్లి సర్వేశ్వరుండు బ్రహ్మకల్పంబున బ్రహ్మకుపదేశించిన భాగవత పురాణంబు వేదతుల్యంబు నీ కెఱింగింతు వినుమని చెప్పెనని సూతుండు శౌనకాది మహామునులకుం జెప్పె నట్లు శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రున కిట్లనియె. ౨౨౨

సీ. భూపాలకోత్తమ భూతహితుండు సు
జ్ఞాన స్వరూపకుం డైనయట్టి
ప్రాణికి దేహసంబంధ మెట్లగు నన్న
మహినొప్పు నీశ్వర మాయలేక
కలుగదు నిద్రలోఁ గలలోనఁ దోఁచిన
దేహబంధంబుల [4]తెఱఁగువలెను
హరియోగమాయా మహత్త్వంబునం [5]బాంచ
భౌతిక దేహసంబంధుఁ డగుచు
తే. నట్టి మాయాగుణంబుల నాత్మయోలి
బాల్య[6]కౌమారయౌవన భావములను

---

1 శోకవ్యాకులిత = దుఃఖముచే కలతనొందిన. 2 వినిస్సృత = బయలుదేరిన. 3 అనురోధము=అనుకూలము. 4 తెఱఁగు=విధము. 5 పాంచభౌతికము=పృథివ్యప్తేజోవాయు రాకాశములను పంచభూత సంబంధము. 6 కౌమారము=చిన్నతనము.

నర[1]సుపర్వాదిమూర్తులఁ బొరసి యేను
నాయదిది యనుసంసార మాయదగిలి. ౨౨౩

వ. వర్తించుచు నిట్లున్న జీవునికి భగవద్భక్తి యోగంబున ముక్తిసంభ
వించుట యెట్లన్న, నెప్పుడేని జీవుండు ప్రకృతి పురుషాతీతం
బయిన బ్రహ్మస్వరూపంబునందు మహితధ్యాన నిష్ఠుం డగునప్పుడు
[2]విగత మోహుం డై యహంకార మమకారాత్మకం బయిన
[3]సంసరణంబు దొఱంగి ముక్తుండై యుండు. మఱియు జీవేశ్వరులకు
దేహసంబంధంబులు గానంబడు చుండునట్టి దేహధారియైన భగ
వంతు నందలి భక్తిం జేసి జీవునకు ముక్తి యెట్లఱంగునం గలుగు
నని యడిగితివి. జీవుం డవిద్యా మహిమం జేసి కర్మానుగతంబయిన
[4] మిథ్యారూప దేహసంబంధుండు భగవంతుండు నిజయోగ
మాయా మహిమంబునం జేసి [5] స్వేచ్ఛా పరికల్పిత చిద్ఘన లీలా
విగ్రహుండు గావున భగవంతుం డయిన యీశ్వరుండు స్వభజ
నంబు ముక్తిసాధనజ్ఞానార్థంబు కల్పితంబని చతుర్ముఖునకుఁ దదీయ
నిష్కపట తపశ్చర్యాది సేవితుండయి నిజజ్ఞానానంద ఘనంబయిన
స్వరూపంబు సూపుచు నానతిచ్చె నది గావున జీవునికి భగవద్భక్తి
మోక్షప్రదాయకం బగు. నిందులకు నొక్క యితిహాసంబు గల
దెఱింగింతు నాకర్ణింపుము. దాన భవదీయ సంశయ నివృత్తి
యయ్యెడు నని శుకయోగీంద్రుండు రాజేంద్రున కిట్లనియె. ౨౨౪

—♦ శ్రీమన్నారాయణుండు బ్రహ్మతపంబునకు మెచ్చి వరంబు లిచ్చుట ♦—

సీ. హరిపాదభక్తి [6]రహస్యోపదేష్టయు
నఖిల దేవతలకు నధివిభుండు
నైన[7]విధాత గల్పాదియందును నిజా
శ్రయపద్మమున కధిష్ఠాన మరయ

1 సుపర్వాదులు=దేవగంధర్వులు. 2 విగతమోహుండు = అజ్ఞానము పోయిన వాఁడు. 3 సంసరణము = సంసారము. 4 మిథ్యారూపము = అబద్ధస్వరూపము. 5 స్వేచ్ఛాపరికల్పిత...విగ్రహుండు = తన యిష్టముచేతనే కల్పించుకొన్న మాయా విలసిత శరీరుఁడు. 6 రహస్యోపదేష్ట = రహస్యము నుపదేశించువాఁడు. 7 విధాత = బ్రహ్మ.

నర్థించి జలముల [1]నన్వేషణము సేసి
నలినంబు మొదలు గానంగ లేక
విసివి క్రమ్మఱను ద[2]ద్బిసరుహాసీనుఁడై
[3]సృష్టినిర్మాణేచ్ఛఁ జిత్తమందుఁ

తే. జాల నూహించి తత్పర జ్ఞానమహిమ
సరణి మనమునఁదోఁపక [4]జడనుపడుచు
లోకజాలంబుఁబుట్టింప లేక మోహి
తాత్ముఁడై చింతనొందు నయ్యవసరమున. ౨౨౫

వ. జలమధ్యంబున నుండి [5]కాదిస్పర్శషోడశాక్షరంబును [6]నేకవింశాక్షరంబునుంగా నక్షరద్వయం [7]బినుమాటు మహామునిజనధనంబయిన "తపస్తపేతి" వాక్యంబు వినంబడిన నవ్వాక్యంబు వలికినయప్పురుషుని వీక్షింపం గోరి నలుదిక్కులకుం జని వెదకి యెందునుం గానక మరలి వచ్చి నిజస్థానంబైన పద్మంబునం దాసీనుండై యొక్కింత చింతించి యట్టివాక్యంబుఁ దన్నుఁ దపంబు సేయుమని నియమించుటగాఁ దలంచి ప్రాణాయామపరాయణుండై జ్ఞానేంద్రియ కర్మేంద్రియంబుల జయించి యేకాగ్రచిత్తుండై సకలలోక సంతాపహేతువగు తపంబు వేయిదివ్యవత్సరంబులు గావింప నీశ్వరుండు ప్రసన్నుండై పొడసూపిన నక్కమలసంభవుండు తత్క్షణంబ రాజసతామసమిశ్రసత్త్వగుణాతీతంబును శుద్ధసత్త్వగుణావాసంబును నకాలవిక్రమంబును సర్వలోకోన్నతంబును సకలసురగణస్తుత్యంబును లోభమోహభయవిరహితంబును [8]నపునరావృత్తిమార్గంబును ననంతతేజోవిరాజితంబును నైన వైకుంఠపురంబుం బొడఁగని యందు. ౨౨౬

---

1 అన్వేషణము=వెదకుట 2 బిసరుహము=పద్మము. 3 సృష్టి నిర్మాణేచ్ఛ=జగత్సృష్టియందలి కోరిక. 4 జడత = అజ్ఞానము 5 కాదిస్పర్శషోడశాక్షరము = (అనఁగా కవర్గు మొదలుమకారమువరకు స్పర్శలు) అందలి పదునాఱవయక్షరము 'త' అనునది. 6 ఏకవింశాక్షరము = ఇరువదియొక్కటవ యక్షరము 'ప' యనునది. 7 ఇనుమాటు = రెండుపర్యాయములు. 8 అపునరావృత్తి = తిరిగి సంసారమునకు రాకుండునది (మోక్షము)

సీ. సూర్యచంద్రానల స్ఫురణలఁ జొరనీక
[1]నిజదీధితిస్ఫూర్తి నివ్వటిల్ల
[2]దివ్యమణిప్రభా దీపితసౌధ వి
మానగోపురహర్మ్య మండపములుఁ
[3]బ్రసవగుచ్ఛస్వచ్ఛ భరితకామితఫల
సంతానపాదప సముదయములుఁ
[4]గాంచనదండ సంగతమారుతోద్ధూత,
తరళవిచిత్రకేతనచయములు
[5]తే॥ వికచకైరవదళదరవిందగతమరంద, రసపానమదవదిందిందిరప్ర
భూతమంజులనినద ప్రబుద్ధరాజ, హంసశోభితవరకమ లాకరములు.

సీ. వలనొప్పఁగా[6] నదైవం కేశవాత్పర,
మ్మనిపల్కు[7]రాజకీ రావళియును
మహిమ [8]సర్వంవిష్ణు మయమీ జగత్తని,
చదివెడు[9]శారికా సముదయంబు
నేపారఁగా [10]జితం తేపుండరీకాక్ష,
యని లీలఁబాడు[11]పికావళియును
లలిమీఱఁగా[12]మంగళం భగవాన్విష్ణు
వోయనిపల్కు[13]మ యూరములును

---

1 నిజదీధితులు = తనకాంతులు 2 దివ్యమణి.....మండపములు = స్వచ్ఛము లగు మణులచే ప్రకాశించు మేడల శిఖరోపరిభాగములందలి యరుఁగులు. 3 ప్రసవగుచ్ఛ......సముదయములు = పూలగుత్తులచే బాగుగా ప్రకాశించుచు కోరిక లను ఫలములుగల కల్పవృక్షసమూహములు. 4 కాంచనదండ.....కేతనచయములు=బంగారు కఱ్ఱలతోనుండి వాయువుచే కదల్పఁబడిన విచిత్రములగు టెక్కెముల సముదాయము. 5 వికచకైరవ...........కమలాకరములు=వికసించిన కలువల, పద్మములయందలి మకరందపానము చేసి మదించి బంభరధ్వనులు చేయుచు తుమ్మెదలరొదతో మేలుకొల్పబడిన రాజహంసలచేఁ బ్రకాశించు సరోవరములు. 6 నదైవంకేశవాత్పరం=కేశవునికన్న వేఱుదైవములేదు. 7 రాజకీరావళి = మంచిశుకసముదాయము. 8 సర్వంవిష్ణుమయం= సర్వము విష్ణుస్వరూపము. 9 శారిక = గోరువంక 10 జితం తేపుండరీకాక్ష! = పుండరీకాక్ష! నీకు జయమగును. 11 పికము = కోకిల. 12 మంగళం భగవాన్విష్ణో = విష్ణుమూర్తి! మంగళమగును. 13 మయూరము = నెమలి.

తే. దవిలివవడిలి స్వాహా స్వధానుశబ్ద,
కలితముగ మోగ్రియు[1]మధుప నికాయములునుఁ
గలిగియఖిలైకదివ్య మంగళవిలాస
మహిమఁజెన్నొందు వైకుంఠ మందిరంబు. ౧౨౮

వ. మఱియుం [2]బయోధరావళీవిభాసిత నభంబునుంబోలె వెలుంగు
చున్న యద్దివ్య[3]ధామంబునందు. ౧౨౯

సీ. [4]సలలితేందీవర శ్యామాయమానోజ్జ్వ
లాంగులు నవ్యపీతాంబరులును
ధవళారవింద సుందరపత్త్ర నేత్రులు
సుకుమారతనులు [5]భాసురవినూత్న
రత్నవిభూషణ గ్రైవేయకంకణ
హారకేయూర మంజీరధరులు
నిత్యయౌవనులు వినిర్మలచరితులు
[6]రోచిష్ణులంచితా రూఢయశులు
తే. నగు సునందనుండు నందుండు నర్హణుండుఁ
బ్రబలుఁడును నాదియగు నిజపార్శ్వచరులు
మఱియు [7]వైడూర్యవిద్రుమా మలమృణాళ
తుల్యగాత్రులు తను భక్తితో భజింప. ౧౩౦

సీ. [8]క్షాళితాఖిలకల్మ షవ్రజామరనదీ
జనకకోమలపదా బ్జములవాని

---

1 మధుపనికాయము = తుమ్మెదల సముదాయము.

2 పయోధరావళి=మేఘసముదాయము. 3 ధామము=స్థానము. 4 సలలిత... ...లాంగులు = వికసితములైన నల్లకలువలవలె ప్రకాశించెడియవయవములుగలవారు. 5 భాసుర......మంజీరధరులు = ప్రకాశించు నూతనరత్నభూషణములగు మెడహారములు, కంకణములు, భుజకీర్తులు, అందియలుఁగలవారు. 6 రోచిష్ణులు=ప్రకాశించువారలు. 7 వైడూర్య...గాత్రులు=వైడూర్యములు పగడముల వలె స్వచ్ఛమైన తామరతూండ్లవంటి శరీరులు. 8 క్షాళితాఖిల......బ్జములవాని=ప్రజల పాపసమూహమును పోగొట్టు గంగానదినిఁ బాదములందుఁగలుగువాని.

1 నఖిలసంపత్కారణా పాంగలక్ష్మీవి
లాసితవక్షస్స్థలంబు వానిఁ
2 బద్మమిత్త్రామిత్త్ర భాసితకరుణా త
రంగితచారు నేత్త్రములవాని
3 భువననిర్మాణ నైపుణ భవ్యనిజజన్మ
కారణనాభి పంకజమువాని
తే. 4 నహిహితాహితశయన వాహములవాని
5 సేవితామరతాపస శ్రేణివాని
నఖిలలోకంబులకు గురుఁ డయినవానిఁ
గాంచెఁబరమేష్ఠి కన్నుల కఱవుదీఱ. ౨౩౧

క. కమనీయరూపరేఖా, రమణీయతఁ జాలనొప్పురమణీమణి య
6క్కమలాలయతనమృదుకర,కమలంబులవిభునిపాదకమలములొత్తఁగ.

వ. వెండియు. ౨౩౩

శా. శ్రీకాంతాతిలకంబు 7 రత్నరుచిరాజి ప్రేంఖితస్వర్ణడో
లాకేళిఁ విలసింపఁ 8 దత్కచభరాలంకారసద్గంధలో
భాకీర్ణప్రచరన్మధువ్రతమనోజ్ఞాలోలనాదంబు ల
స్తోకానుస్వరలీల నొప్పఁగ నిజేశుఁ వేడ్కఁ జోఁ బాడఁగన్. ౨౩౪

వ. అట్టి నిత్యవిభూతియందు. ౨౩౫

---

1 అఖిలసంప......వక్షస్థలంబువాని= సర్వసంపదలకు కారణమగు క్రీఁగంటి ప్రసారములుగల లక్ష్మిని రొమ్మునగలవాఁడు. 2 పద్మమిత్త్ర.........నేత్రముల వాని = సూర్యచంద్రులను కరుణాకటాక్షములతో గూడిన నేత్రములుఁగలవాఁడు. 3 భువననిర్మాణ......పంకజమువాని = లోకములను సృష్టించుటకు నేర్పుగల దివ్యమంగళాకారమైన బ్రహ్మోత్పత్తికయగు నాభిపద్మముగలవానిని. 4 అహి హితా......వాహములవాని = అహిహితుడు + ఆదిశేషుడు. అహి + అహితుడు = పాములకువైరి. (గరుత్మంతుఁడు) ఆరెంటిని పక్క గను వాహనముగగలవానిని. 5 సేవితా...వాని = సేవించెడి దేవతా ఋషిగణములుగలవానిని. 6 కమలాలయ = లక్ష్మి. 7 రత్నరుచి...కేళిఁ = రత్నకాంతి పుంజములచే ప్రకాశించు డోలికా విహారమందు. 8 తత్కచభర......స్వరలీల = లక్ష్మిదేవికొప్పునకలంకారమగు పుష్పమాలికా సువాసనలకై వచ్చిన తుమ్మెదల ఝుంకారధ్వనులతో విలాసముగ కేళవించుచు.

మ. సతతజ్ఞానరమాయశోబలమహైశ్వర్యాదియుక్తుం జగ
త్పతి యజ్ఞేశు ననంతు నచ్యుతు దళత్పంకేరుహాక్షుం శ్రియః
పతి నాద్యంతవికారదూరుఁ గరుణాపాథోనిధిం [1]సాత్వతాం
పతి వర్ధిష్ణు సహిష్ణు విష్ణు గుణవిభ్రాజిష్ణు రోచిష్ణునిన్. ౨౩౬

మ. [2]దరహాసామృతపూరితాస్యు నిభజిద్వక్త్రైణపారాయణున్
అరుణాంభోరుహపత్రలోచనునిఁ బీతావాసుఁ డై త్రైలోక్య సుం
దరు మంజీరకిరీటకుండలముఖోద్యద్భూషు యోగీశ్వరే
శ్వరు లక్ష్మీయుతవక్షుఁ జిన్మయు దయాసాంద్రుం జతుర్బాహునిన్.

వ. మఱియు [3]ననర్ఘరత్నమయ సింహాసనాసీనుండును, సునంద నంద కుముదాది సేవితుండును, బ్రకృతి పురుషమహదహంకారంబులను చతుశ్శక్తులును [4]కర్మేంద్రియ జ్ఞానేంద్రియ మనో మహాభూతంబులను షోడశశక్తులునుఁ బంచతన్మాత్రంబులునుఁ బరివేష్టింపఁ గోటి కోట్యర్క ప్రభావిభాసితుండును, [5]స్వేతరాలభ్య స్వాభావికసమస్త భాగ్యోదయుండునునై స్వస్వరూపంబునఁ గ్రీడించు సర్వేశ్వరుం డైన పరమపురుషుం బురుషోత్తముం బుండరీకాక్షు నారాయణుం జూచి [6]సాంద్రానంద కందళితహృదయారవిందుండును [7]రోమాంచ కంచుకిత శరీరుండును నానందబాష్పధారాసిక్త కపోలుండును నగుచు. ౨౩౭

క. పర[8]మపరమహంసగమ్యు
స్ఫురణం దనరారు పరమ పురుషునిపద పం
కరుహము [9]లజుఁడాత్మ చతు
శ్శిరములు సోకంగ నతులుసేసిన హరియున్. ౨౩౮

చ. ప్రియుఁ డగుబొడ్డుఁ దమ్మితొలి బిడ్డఁడు వేలుపుఁబెద్ద భూతసం
చయములఁ జేయుకర్త నిజశాసనపాత్రుఁడు ధాత మ్రొక్కినన్

---

1 సాత్వతాంపతి = యాదవాధిపతి (శ్రీకృష్ణుడు) 2 దరహాసామృతపూరితాస్యున్ = చిరునవ్వుతో నిండిన ముఖము వానిని. 3 అనర్ఘము = వెలలేని 4 కర్మేంద్రియములు = వాక్పాణి పాదపాయూపస్థలు. జ్ఞానేంద్రియములు=త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణములు. 6 సాంద్రము = అధికము. 5 స్వేతరాలభ్యము = తన కంటె నితరునిచే పొందఁదగనిది. 7 రోమాంచము = గగుర్పాటు. 8 పరమహంస - సన్యాసాశ్రమములో నగ్రణి. 9 అజుఁడు - పుట్టుకలేనివాఁడు. (బ్రహ్మ)

దయఁ దళుకొత్తఁ బల్కెఁ బ్రమదస్మితచారుముఖారవిందుఁడై
[1]నయమునఁ బాణిపంకజమునన్ హరి యాతని దేహ మంటుచున్.

వ. ఇట్లనియె. ౨౪౧

ఆ. కపటమునుల కెంత కాలంబునకు నైన,
నంతసింప నేను జలజగర్భ
చిరతపస్సమాధిఁ జెంది విసర్గేచ్ఛ,
మెలఁగునిన్నుఁ బరిణ మింతుఁగాని. ౨౪౨

తే. భద్ర మగుఁగాక నీకు నోపద్మగర్భ!
వరము నిపుడిత్తు నెఱిఁగింపు వాంఛితంబు
దేవదేవుఁడ నగునస్మ దీయపాద
దర్శనావధి వో [2]విపద్దశల కనఘ! ౨౪౩

చ. సరసిజగర్భ! నీయెడఁ బ్రసన్నత నొంది మదీయలోక మే
నిరవుగఁ జూపు టెల్లను నహేతుకభూరిదయాకటాక్ష వి
స్ఫురణన కాని నీదగు తపోవిభవంబునఁ గాదు నీతప
శ్చరణము నాదువాక్యముల సంగతిఁ గాదె సరోజసంభవా! ౨౪౪

క. తప మనఁగ మత్స్వరూపము
తపమను తరువునకు ఫలవితానము నే నా
తపమునకే జననస్థి
త్యుపసంహరణము లొనర్చుచుండుదుఁ దనయా! ౨౪౫

క. కావున మద్భక్తికిఁ దప, మేవిధమును మూలధనము నిది నీమదిరా
జీవభవ యెఱిఁగి తపమిటుఁ,గావించుట విగత మోహాకర్ముఁడ వింకన్.

క. అనియానతిచ్చి కమలజ, యెనయఁగ భవదీయమానసేప్సిత మేమై
నను నిత్తు వేఁడుమనినను, వనరుహసంభవుఁడు వికచవదనుండగుచున్.

చ. హరివచనంబు లాత్మకుఁ బ్రియం బొనరింపఁబయోజగర్భుఁడో
[3]పరమపదేశ! యోగిజన భావన యానిఖిలోర్వియందు నీ

1 నయమున = ప్రేమతో. 2 విపద్దశలకు = ఆపదవస్థలకు.
3 పరమపదేశ! = పరమపదమగు మోక్షమునకు ప్రభువా!

యరయని యట్టియర్థ మొకఁడైనను గల్గునె యైన నామదిఁ
[1]బెరసినకోర్కి దేవ! వినిపింతు దయామతిఁ జిత్తగింపవే. ౨౮౮

వ. దేవా సర్వభూతాంతర్యామివై భగవంతుండవైన నీకు నమస్క
రించి మదీయ వాంఛితంబు విన్నవించెద నవధరింపుము. అవ్యక్త
రూపంబులై వెలుంగు భవదీయ స్థూలసూక్ష్మ రూపంబులును నానా
శ[2]క్త్యుపబృంహితంబులైన బ్రహ్మాది రూపంబులును నీయంత
నీవే ధరియించి జగదుత్పత్తిస్థితిలయంబులం [3]దంతుకీటంబునుం
బోలెఁ గావించుచు నమోఘ సంకల్పుండవై లీలావిభూతిం గ్రీడించు
మహిమంబుఁ దెలియునట్టి పరిజ్ఞానంబుఁ గృపసేయుము. భవదీయ
శాసనంబున జగన్నిర్మాణంబుఁ గావించినపుడు బ్రహ్మాభిమానం
బునం జేసి యవశ్యంబున మహదహంకారంబులు నామదిం బొడముం
గావునఁ దత్పరిహారార్థంబు వేఁడెద. నన్నుఁ గరుణార్ద్రదృష్టి విలో
కించి దయసేయుమని విన్నవించిన నాలించి పుండరీకాక్షుం డతని
కిట్లనియె. ౨౮౯

క. వారిజభవ [4]శాస్త్రార్థ వి, చారజ్ఞానమును భక్తి [5]సమధికసాక్షా
త్కారములను నీమూఁడు ను,దారత నీమనమునందు ధరియింపనగున్.

సీ. పరికింప మత్స్వరూప స్వభావములును
మహిమావతార కర్మములుఁ దెలియఁ
దత్త్వవిజ్ఞానంబుఁ దలకొని మత్ప్రసా
దమునఁ గల్గెడినీకుఁ గమలగర్భ
సృష్టిపూర్వమునఁ జర్చింప నేనొకరుండఁ
గలిగి యుండుదు పిత కర్మినగుచు
సమధికస్థూలసూక్ష్మ స్వరూపములుఁ ద
త్కారణప్రకృతియుఁ దగ మదంశ

ఆ. మందు లీనమైన నద్వితీయుండనై
యుందు నాకు నన్య మొకటి లేదు

---

1 బెరసిన = కలిసిన. 2 ఉపబృంహితము - ప్రేరణము. 3 తంతుకీటము = సాలెపురుగు. 4 శాస్త్రార్థ విచార జ్ఞానము=బ్రహ్మ సత్యరూపుఁడనియు, ననిత్య మీజగమనియుఁ దెలుసుకొనెడి చర్చ. 5 సమధికము = అధికము.

సృష్టికాలమందు సృజ్యమానంబగు
జగము మత్స్వరూప మగును వత్స! ౨౫౧

క. అరయఁగ గల్పప్రళయాం, తరమున నాద్యంతవిరహితక్రియతోడం
బరిపూర్ణనిత్యమహిమం, బరమాత్ముఁడనై సరోజభవ యేనుందున్.

వ. అదియునుంగాక నీవు నన్నడిగిన యీజగన్నిర్మాణమాయాప్రకారం
బెఱింగింతు. లేనియర్థంబు [1]శుక్తిరజతభ్రాంతియుంబోలె నేమిటి
మహిమం దోఁచి క్రమ్మఱఁ దోపక మాను నదియె నామాయా
విడంబనం బని యెఱుంగు మదియునుంగాక లేని నాయర్థంబు దృశ్య
మానంబగుటను, గలయర్థంబు దర్శనగోచరంబుఁ గాకుండుటను,
[2]ద్విచంద్రాదికంబును దమఃప్రభాసంబును దృష్టాంతరంబులుగాఁ
దెలియు మే ప్రకారంబున మహాభూతంబులు భౌతికంబు లయిన
ఘటపటాదులందుఁ బ్రవేశించియుండు నాప్రకారంబున నేను నీభూత
భౌతికంబులయిన సర్వకార్యంబులందు సత్త్వాదిరూపంబులం బ్రవే
శించియుండుదు. భౌతికంబులు భూతంబులందుఁ గారణావస్థం బొందు
చందంబున భూతభౌతికంబులుఁ గారణావస్థంబొంది నాయందు [3]నభి
వ్యక్తంబులై యుండవు. సర్వదేశంబులయందును సర్వకాలంబునం
దును నేదిచోదితంబై యుండు నట్టిదియ పరబ్రహ్మస్వరూపంబు. తత్త్వం
బెఱుంగ నిచ్ఛయించిన మిముబోటివారలకు నీచెప్పిన మదీయతత్త్వా
త్మకంబైన యర్థంబ [4]యర్థంబని యెఱుంగుము. ఈయర్థం బుత్కృష్టం
బయిన యది యేకాగ్రచిత్తుండవై యాకర్ణించి భయదీయ
చిత్తంబున ధరియించిన నీకు స్వర్గాదికర్మంబులందు మోహంబు
చెందకుండెడిని. అని భగవంతుండయిన పరమేశ్వరుండు చతుర్ముఖున
కానతిచ్చి నిజ[5]లోకంబుతో నంతర్ధానంబు నొందెనని చెప్పి శుకుండు
వెండియు విట్లనియె. ౨౫౩

---

1 శుక్తిరజతభ్రాంతి = ముత్యపుచిప్పను వెండియని భ్రమయుట. (ఇదియొక న్యాయము) 2 ద్విచంద్రాదికము = ఇద్దఱుచంద్రులు. (అసంభవము) 3 అభివ్యక్తము = ప్రకటన. 4 అర్థంబు = ప్రయోజనము. 5 లోకము = జనము, ప్రపంచము.

సీ. అవనీశ బ్రహ్మయు[1]ట్లంత ర్హితుండైనఁ
బుండరీకాక్షుని బుద్ధి నిలిపి
యానందమునుఁ బొంది యంజలిఁ గావించి
[2]తత్పరిగ్రహమునఁ దనదుబుద్ధిఁ
గైకొని పూర్వప్రకారంబునను సమ
స్త ప్రపంచంబును దగ సృజించి
మఱియొకనాఁడు ధర్మప్రవర్తకుఁడగు
నఖిల ప్రజాపతియైన కమల
తే. గర్భుఁ డాత్మహితార్థమె కాక సకల
భువనహితబుద్ధి నున్నత స్ఫురణ మెరసి
మానితంబైన యమ నియమముల రెంటి
నాచరించెను సమ్ముది తాత్ముఁడగుచు. ౨౫౪

వ. అయ్యవసరంబున. ౨౫౫

క. ఆ నలినాసననందనులైన సనందాదిమునుల కగ్రేసరుఁడున్
మానుగఁ బ్రియతముఁడునునగు, నా నారదుఁడేగుదెంచె[3]నబ్జజుకడకున్.

క. చనుదెంచి తండ్రికిం బ్రియ
మొనరఁగ[4]శుశ్రూషణంబు లొనరిచియతఁడున్
దనదెసఁ బ్రసన్నుఁడగుటయుఁ
గని భగవన్మాయఁ గా నుత్సుకుఁడై. ౨౫౬

సీ. అవనీశ నీవు నన్నడిగిన పగిది నా
తఁడుఁ దండ్రినడుగఁ బితామహుండు
భగవంతుఁ డాశ్రిత పారిజాతము హరి
కృపతోడఁ దన కెఱింగించినట్టి
లోకమంగళ[5] చతుశ్శ్లోకరూపంబున
దశలక్షణంబులఁ దనరు భాగ

---

1 అంతర్హితుఁడు = మరుఁగుపడినవాఁడు. 2 పరిగ్రహము = అనుగ్రహము. 3 అబ్జజుఁడు = పద్మమందుఁబుట్టినవాఁడు (బ్రహ్మ). 4 శుశ్రూషణము = సేవ. 5 చతుశ్శ్లోకరూపంబున= నాల్గుశ్లోకముల స్వరూపముగా.

వతము నారదున కున్నతిఁ జెప్పె నాతఁడు
చారు సరస్వతీ తీరమునను

తే. హరిపద ధ్యానపారీణుఁ డాత్మవేది
ప్రకట తేజస్వి యగు[1] బాదరాయణునకుఁ
గోరి యెఱిఁగించె నమ్మహో దారుఁ డెలమి
నాకు నెఱిఁగించె నెఱిఁగింతు నీకు నేను. ౨౫౮

వ. అదియునుగాక యిప్పుడు విరాట్పురుషునివలన నీజగంబు లేవిధంబున జనియించె నను నివి మొదలయిన ప్రశ్నంబులు గొన్ని నన్నడిగితివి. ఏనునన్నింటికి నుత్తరంబగునట్లుగా నమ్మహాభాగవతం బుపన్యసించెద నాకర్ణింపుము. అమ్మహాపురాణంబు చతుశ్శ్లోకరూపంబును దశలక్షణంబునునై [2]సంకుచితమార్గంబున నొప్పు. అందు దశలక్షణంబు లెవ్వి యనిన, సర్గంబును, విసర్గంబును, స్థానంబునుఁ, బోషణంబును, నూతులును, మన్వంతరంబులును, నీశానుచరితంబులును, నిరోధంబును, ముక్తియు, నాశ్రయంబును ననం బది తెఱంగులయ్యె [3]దశమాశ్రయ విశుద్ధ్యర్థంబుఁ దక్కిన తొమ్మిది లక్షణంబులు సెప్పంబడె నవి యెట్టి వనిన. ౨౫౯

తే. మహదహంకారపంచ తన్మాత్రగగన
పవన[4]శిఖితోయభూభూత పంచకేంద్రి
యప్రపంచంబు భగవంతు నందుఁ గనుట,
సర్గమందురు దీనిని జనవరేణ్య! ౨౬౦

క. సరసిజగర్భుండు విరా, ట్పురుషునివలనన్ జనించి భూరితరచరా
చరభూతసృష్టిఁ జేయుటఁ, బరువడిని విసర్గమండ్రు భరతకులేశా! ౨౬౧

క. లోకద్రోహినరేంద్రా, నీకము బరిమార్చి జగము నిల్పినహరి యా
వైకుంఠనాథువిజయం, [5] బాకల్పస్థానమయ్యె నవనీనాథా! ౨౬౨

---

1 బాదరాయణుఁడు = వ్యాసుఁడు. 2 సంకుచితము = ఇమిడియుండునది. 3 దశమాశ్రయము=పదియవ దానినాశ్రయించినది. (ముక్తి) 4 శిఖి=అగ్ని. 5 ఆకల్పస్థానము = ప్రళయాంతము నుండునది. (సంజ్ఞ)

కం. హరిసర్వేశుఁ డనంతుఁడు, నిరుపమ శుభమూర్తి సేయునిజభక్తజనో
ద్ధరణముపోషణమవనీ,వరయూతులనంగఁగర్మవాసనలరయన్! ౨౬3

తే. జలజనాభ దయాకటాక్షప్రసాద,
లబ్ధి నఖిలైక లోకపాలక[1]విభూతి
మహిమఁబొందినవారి ధర్మములు విస్త
రమునఁ బలుకుటమన్వంతరములు భూప! ౨౬౪

కం. వనజోదరునవతార క,థనముఁ దదీయానువృత్తిఁ దచ్చారిత్రం
బును విస్తరించి పలుకం,జను నవి యీశానుకథలు సౌజన్యనిధీ!

సీ. వసుమతీనాథ! సర్వస్వామి యైన గో
విందుండు [2]చిదచిదానందమూర్తి
[3]సలలితస్వోపాధి శక్తిసమేతుఁడై
తనరారునాత్మీయ [4]ధామమందు
[5]ఫణిరాజమృదులతల్పంబుపై సుఖలీల
యోగనిద్రారతి నున్నవేళ
నఖిలజీవులు నిజ వ్యాపారశూన్యులై
యున్నత తేజంబు [6]లురులుకొనఁగ

తే. జరుగునయ్యవస్థావిశేషంబులెల్ల
విదిత మగునట్లు వలుకుట యదినిరోధ
మన నిది యవాంతరప్రళయంబనంగఁ
బరఁగునీక ముక్తిగతివిను పార్థివేంద్ర! ౨౬౬

సీ. జీవుండు భగవత్కృపావశంబునఁ జేసి
దేహధర్మంబులై [7]ధృతిననేక
జన్మానుచరిత దృశ్యములైన యజ్జరా
మరణంబు లాత్మధర్మంబులయిన

---

1 విభూతి=ఐశ్వర్యము. 2 చిదచిదానందమూర్తి = సచ్చిదానందస్వరూపము. 3 సలలితస్వోపాధిశక్తిసమేతుఁడు = విలాసమగు నామరూపములుగల మాయా విశిష్టుఁడు. 4 ధామము=స్థానము. 5 ఫణిరాజమృదుల తల్పంబు = ఆదిశేషుఁడను మెత్తని పాన్పు. 6 ఉరులుకొనఁగ = వీఁడిపోవఁగ. 7 ధృతి = ధైర్యము.

[1]ఘనపుణ్యపాప నికాయనిర్మోచన
స్థితి నొప్పి పూర్వసంచితములైన
[2] యపహతపాప్మ వత్త్వాద్యష్టతద్గుణ
వంతుఁడై తగ భగవచ్ఛరీర
తే. భూతుఁడై పారతంత్ర్యాత్మ బుద్ధినొప్పి
దివ్యమాల్యానులేపన భవ్యగంధ
కలితమంగళదివ్య విగ్రహవిశిష్టుఁ
డగుచు హరిరూప మొందుటే యనఘ! ముక్తి. ౨౬౭

వ. మఱియు నుత్పత్తిస్థితిలయంబు లెందగు (చుఁబ్రకాశింపఁబడు) నది యాశ్రయంబనంబడు. అదియ పరమాత్మ బ్రహ్మశబ్ద [3]వాచ్యంబు. అదియ ప్రత్యక్షానుభవంబున విదితంబు సేయుకొఱకు నాత్మ కాధ్యాత్మికాది విభాగంబు సెప్పంబడియె. అది యెట్లనిన? ఆత్మ [4]యాధ్యాత్మి కాధిదైవికాధి భౌతికంబులం దిృవిధంబయ్యె. నందు నాధ్యాత్మికంబు [5]చక్షురాదిగోళకాంతర్వర్తియై యెఱుంగంబడుఁ, జక్షురాది కరణాభిమానియై [6]ద్రష్టయైన శరీరకుం డతండె. ఆధిదైవికుండనం దగుఁ జక్షురాద్యధిష్ఠానాభిమాని దేవతయై సూర్యాది తేజోవిగ్రహుండునగుచు నెవ్వనియందు నీయుభయ విభాగంబునుం గలుగు నతండె యాధిభౌతికుండును విరాడ్విగ్రహుండునగుం గావున, ద్రష్టయు దృక్కును దృశ్యంబు ననం దగు నీమూఁటియందు నొకటి లేకున్న నొకటిగానరా దీత్రితయంబు నెవ్వం డెఱుంగు నతండు సర్వలోకాశ్రయుండై యుండు. అతండె పరమాత్మయును నమ్మ

---

1 ఘనపుణ్య...నొప్పి=అధికమగు పుణ్యపాప సముదాయమును వదలిపెట్టుటచే బాగుగా ప్రకాశించి. 2 అపహత...తద్గుణవంతుడై= పాపము తొలగుటచే తత్స్వరూపమగు నాత్మనుఁ జూచుచున్నవాడై. 3 వాచ్యంబు = చెప్పఁబడునది. 4 ఆధ్యాత్మికము = ఆత్మవలనఁ గలుగునది. ఆధిదైవికము = దైవమువలన గలిగినది. ఆధిభౌతికము=పంచభూతముల చేఁ బ్రాప్తమైనది. 5 చక్షురాదిగోళకాంతర్వర్తి= చక్షురింద్రియము మొదలుగాగల పంచేంద్రియ గ్రాహ్యమై లోభాగమున నుండునది. 6 ద్రష్ట=చూచువాఁడు.

పరాత్పరుండు లీలార్థంబై [1]జగత్సర్జనంబు సేయుతలంపున బ్రహ్మాండంబు వినిర్భేదించి తనకు సుఖశయనంబు నపేక్షించి మొదల జలతత్త్వంబు సృజియించె. స్వతః పరిశుద్ధుండుఁ గావున స్వసృష్టంబై [2]యేకార్ణవాకారంబైన జలరాశియందు శయనంబు సేయుటంజేసి [3]"శ్లో. ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపోవై నరసూనవః, అయనం తస్యతాః పూర్వం తేన నారాయణః స్మృతః" యను (ప్రమాణము చొప్పున) నారాయణ శబ్దవాచ్యుండుఁ గావున నతని ప్రభావంబు వర్ణింప దుర్లభంబు. [4]ఉపాదాన భూతంబయిన ద్రవ్యంబునుఁ ద్రివిధంబయిన కర్మంబునుఁ [5]గలాకాష్ఠాద్యుపాధి భిన్నంబయిన కాలంబును జ్ఞానాధికంబగు జీవస్వభావంబును భోక్తయగు జీవుం డెవ్వని యనుగ్రహంబునంజేసి వర్తించుచుండు. నెవ్వని యుపేక్షంజేసి వర్తింపకుండునట్టి ప్రభావంబు గల సర్వేశ్వరుండుఁ దానేకమయ్యు ననేకంబుగాఁ దలంచి [6]యోగతల్పంబునం బ్రబుద్ధుండై యుండి యట మీఁద స్వసంకల్పంబునంజేసి హిరణ్మయంబైన తన విగ్రహంబు నధిదైవతంబును నధ్యాత్మికంబును నధిభూతంబును నను సంజ్ఞాయుతంబై త్రివిధంబుఁగా సృజియించె. ౨౬౮

సీ. అట్టి విరాడ్విగ్రహంబందు గగనతే
    జఃప్రాణములు సర్వజంతు రతుఁడు
నైనట్టి జీవుని ననుసరింపుచునుండుఁ
    బింబజీవుఁడు శరీరంబువలన
వెలువడి చనజీవి వెనుకొని ప్రాణముల్
    చనుచుండు నిజనాథు ననుసరించి
భటులచందంబునఁ బాటిల్లు క్షుత్తును
    భూరితృష్ణయు మఱి ముఖమువలనఁ

---

1 జగత్సర్జనంబు = జగత్సృష్టి. 2 ఏకార్ణవాకారము = ఒక్క-సముద్రాకారమై. 3 నరాః = ఉదకములు, తస్య = అవిష్ణువునకు, అయనం = స్థానము, అందుచే, నారాయణః, అను దానికర్థ మీ శ్లోకమున వచింపఁబడినది. 4 ఉపాదానము = కారణము. 5 కలాకాష్ఠములు = పదునెనిమిది నిమేషము లొక కాష్ఠము. అట్టివి ముప్పదియైన నొక కలయగును. 6 యోగతల్పము = సమాధి.

తే. దాలుజిహ్వాదికంబు లుద్భవమునొందె
నందు నుదయించె నానావిధైకరసము
లెనయ నవియెల్ల జిహ్వచే నెఱుఁగఁబడును
మొనసి పలుక నపేక్షించు ముఖమువలన. ౨౬౯

వ. మఱియు వాగింద్రియంబు పుట్టె. దానికి దేవత యగ్ని. ఆరెంటివలన భాషణంబు వొడమె. ఆయగ్నికి మహాజలవ్యాప్తంబగు జలంబున నిరోధంబు గలుగుటంజేసి యాజలంబె ప్రతిబంధకంబయ్యె. [1]దోధూయమానంబైన మహావాయువువలన [2]ఘ్రాణంబు పుట్టెం గావున వాయుదేవతాకంబైన ఘ్రాణేంద్రియంబు గంధగ్రహణ సమర్థంబయ్యె. నిరాలోకంబగు నాత్మ నాత్మయందుఁ జూడంగోరి తేజంబువలన నాదిత్యదేవతాకంబై రూపగ్రాహకంబైన [3]యక్షియుగళంబు పుట్టె. ఋషిగణంబులచేత బోధితుండగుచు భగవంతుండు దిగ్దేవతాకంబును శబ్దగ్రాహకంబునునైన [4]శ్రోత్రేంద్రియంబు పుట్టించె. సర్జనంబు సేయు పురుషునివలన మృదుత్వ కాఠిన్యంబులును లఘుత్వ గురుత్వంబులును నుష్ణత్వ శీతలత్వంబులునుం జేసెడు త్వగింద్రియాధిష్ఠానంబగు చర్మంబు పుట్టె. బహిర్గతంబయిన చర్మంబువలన [5]రోమంబు లుదయించె. వానికి [6]మహీరుహంబు లధిదేవతలయ్యె. అందు నధిగతస్పర్శగుణుండును నంతర్బహిఃప్రదేశంబుల [7]నావృతుండును నగు వాయువువలన బలవంతంబులును, నింద్రదేవతాకంబులును, [8]నాదాన సమర్థంబులును, నానాకర్మకరణదక్షంబులును నగు హస్తంబు లుదయించె. [9]స్వేచ్ఛావిషయగతి సమర్థుండగు నీశ్వరునివలన విష్ణుదేవతాకంబు లగు పాదంబు లుదయించె. ప్రజానందామృతార్థియగు భగవంతునివలనఁ బ్రజాపతి దేవతాకంబై స్త్రీసంభోగాది కామ్యసుఖం

---

1 దోధూయమానము = కదల్చుస్వభావము. 2 ఘ్రాణంబు = గంధము. 3 అక్షియుగళము — నేత్రద్వయము.

4 శ్రోత్రేంద్రియము = శ్రవణము. 5 రోమములు = వెండ్రుకలు. 6 మహీరుహములు = వృక్షములు. 7 ఆవృతుడు = కప్పబడినవాడు. 8 ఆదానము= గ్రహించుట. 9 స్వేచ్ఛావిషయగతి సమర్థుడు = తనకిష్టమువచ్చిన విషయముల రవపటిష్టుడు.

బులు కార్యంబులుగాఁ గల [1]శిశ్నోపస్థంబు లుదయించె. [2]మిత్త్రుం డధిదైవతంబుగాఁ గలిగి [3]భుక్తాన్నాద్యసారాంశత్యాగోపయోగం బగు పాయువనెడి గుదంబుద్భవించె. వాని కృత్యం బుభయ మల మోచనంబు. దేహంబున నుండి దేహాంతరంబుఁ జేరం గోరి పూర్వ కాయంబు విడుచుటకు సాధనంబగు నాభిద్వారంబు సంభవించె. అట్టి నాభియ ప్రాణాపానబంధస్థానం బనంబడు. తద్బంధ [4]విశ్లేషంబె మృత్యువగు నదియ యూర్ధ్వాధో దేహభేదకంబనియును జెప్పంబడు. అన్నపానాది ధారణార్థంబుగ నాంత్రకుక్షినాడీ [5]నిచయంబులు గల్పింపబడియె. వానికి నదులును సముద్రంబులును నధిదేవతలయ్యె.

వానివలనఁ [6]దుష్టి పుష్టులను నుదరభరణరసపరిణామంబులు గలిగియుండు. నాత్మీయ మాయాచింతనం బొనర్చునపుడు కామసంకల్పాది స్థానంబగు హృదయంబు కలిగె. దానివలన మనంబునుఁ జంద్రుండునుఁ గాముండును సంకల్పంబు నుదయించె. అంతమీఁద జగత్సర్జనంబు సేయు విరాడ్విగ్రహంబువలన సప్తధాతువులునుఁ, బృథివ్యప్తేజోమయంబులయిన సప్తప్రాణంబులును, వ్యోమాంబు వాయువులచే నుత్పన్నంబులై గుణాత్మకంబులైనయింద్రియంబులును, నహంకార ప్రభవంబులయిన గుణంబులును, సర్వవికార స్వరూపం బగు మనస్సును, విజ్ఞానరూపిణియగు బుద్ధియును, వివిధంబగు నిది యంతయు సర్వేశ్వరుని స్థూల [7]విగ్రహంబునం బుట్టు. మఱియును. ౨౭౦

క. వరుసఁ బృథివ్యాద్యష్టా,వరణావృతమై సమగ్ర వైభవములఁ [8]బం
కరుహభవాండాతీత, స్ఫురణం జెలువొందు నతి విభూతి దలిర్పన్.

క. పోలు పగుసకలవిలక్షణ,ములుగలయాద్యంతశూన్యమును నిత్యమునై
లలి సూక్ష్మమై మనో వా,క్కులకుందలపోయఁగానగోచరమగుచున్.

1 శిశ్నోపస్థలు= పురుష స్త్రీలయొక్క గుహ్యావయవములు. 2 మిత్త్రుడు=సూర్యుడు. 3 భుక్తాన్నా...............గుదంబు = అన్నము మొదలగు నాహారపదార్థమును తిన్నతరువాత నందలి యసారపదార్థమును వదలుటకుపయుక్తమగు నాసనము నెడి మర్మస్థానరంధ్రము. 4 విశ్లేషము = విడిపోవుట. 5 నిచయము = సమూహము. 6 తుష్టి=సంతోషము. 7 విగ్రహము=శరీరము. 8 పంకరుహభవాండము=బ్రహ్మాండము.

 29300 

సీ. [1]అలఘు తేజోరూపమైన రూపమునకు
క్షితినాథ నాచేతఁ జెప్పఁబడిన
[2]మానితస్థూల సూక్ష్మస్వరూపంబులు
[3]వలనొప్పఁగల భగవత్స్వరూప
మమ్మహాత్మకుని మాయాబలంబునఁజేసి
దివ్యమునీంద్రులుఁ దెలియలేరు
వసుధేశ [4]వాచ్యమై వాచకంబై నామ
రూపముల్ క్రియలును రూఢిఁదాల్చి

ఆ. యుండునట్టి యీశ్వరుండు నారాయణుం
డఖిలధృతి జగన్నియంతయైన
చిన్మయాత్మకుండు సృజియించు నీప్రజా
పతులఋషుల మునులఁ బితృవరులను. ౨౭౩

వ. మఱియును. ౨౭౪

సీ. సుర సిద్ధ సాధ్య కిన్నర వరచారణ
గరుడ గంధర్వ రాక్షస పిశాచ
భూత భేతాళ కింపురుష [5]కూశ్మాండ గు
హ్యక డాకినీ యక్ష [6]యాతుధాన
విద్యాధరాప్సరో [7]విషధర గ్రహ [8]మాతృ
గణ [9]వృక [10]హరి ఘృష్టి ఖగ మృగాళి
భల్లూక [11] రోహిత పశు వృక్షయోనుల
వివిధకర్మంబులు వెలయఁబుట్టి

తే. జల[12]నభోభూతలంబుల సంచరించు
జంతురాసుల సత్త్వ రజ స్తమోగు

---

1 అలఘు=గొప్పది. 2 మానిత=పూజింపబడిన. 3 వలనొప్పగల = సామర్థ్యముగల. 4 వాచ్యము=అర్థము. వాచకము=శబ్దము. 5 కూశ్మాండులు=పితృదేవగణములు 6 యాతుధానులు=రాక్షసులు. 7 విషధరము=సర్పము. 8 మాతృగణము=బ్రాహ్మ్యాది సప్తమాతృకాసమూహము. 9 వృకము=తోడేలు. 10 ఘృష్టి=అడవిపందుల నిలయము. 11 రోహితము=రేచు. 12 నభము=ఆకాశము.

ణములఁ [1]దిర్యక్సు రాసుర నరధరాది
భావముల భిన్నులగుదురు పారవేంద్ర! ౨౭౫

మ. [2]ఇరవొందన్ [3]ద్రుహిణాత్మకుం డయిరమాధీశుండు విశ్వంబు సు
స్థిరతన్ నిల్పి కృపాకటాక్షమున రక్షించున్ సమస్త[4]ప్రజో
త్కర సంహారము సేయునప్పుడు హరాంతర్యామియై యంతయున్
హరియించున్ [5]బవనుండు మేఘముల మాయంజేయు చందంబునన్.

క. ఈపగిదిని విశ్వము సం,స్థాపించును [6]మనుచు నడచుఁ ధర్మాత్మకుఁడై
దీపిత తిర్యఙ్నరసుర,రూపంబులు దాల్చి హరిపరుం డజుఁడెలమిన్.

సీ. హరియందు నాకాశ మాకాశమునవాయు
[7]వనిలంబువలన హుతాశనుండు
[8]హవ్యవాహనునందు నంబువు లుదకంబు
వలన వసుంధగర గలిగె [9]ధాత్రి
వలన బహుప్రజా వళి యుద్భవంబయ్యె
నింతకు మూలమై యెసఁగునట్టి
నారాయణుఁడు చిదానందస్వరూపకుం
డవ్యయుం [10]డజరుఁ డనంతుఁడాద్య

తే. డాదిమధ్యాంతశూన్యుఁ [11]డనాదినిధనుఁ
డతనివలనను సంభూతమైన యట్టి
సృష్టి హేతుప్రకార మీక్షించి తెలియఁ
జాలరెంతటి మునులైన జనవరేణ్య! ౨౭౬

వ. అదియునుంగాక. ౨౭౭

మ. ధరణీశోత్తమ భూతసృష్టి నిటు సంస్థాపించి రక్షించు నా
హరికర్తృత్వము నొల్లకాత్మగతమా యారోపితంజేసి తా

1 తిర్యక్తువులు=పశు పక్షి జాతులు 2 ఇరవొందు=అనువుపడు. 3 ద్రుహిణాత్మకుఁడు=దయాస్వభావుఁడు. 4 ప్రజోత్కరము=ప్రజాసమూహము. 5 పవనుడు=వాయుదేవుఁడు. 6 మనుచు = బ్రతికించు 7 అనిలము =వాయువు. 8 హవ్యవాహనుఁడు = అగ్నిహోత్రుఁడు. 9 ధాత్రి = భూమి. 10 అజరుఁడు=ముసలితనము లేనివాడు. (అనఁగా శిథిలతలేనివాడు) 11 అనాదినిధనుఁడు = జననమరణములు లేనివాఁడు.

[1]నిరవద్యుండు నిరంజనుండుఁ బరుఁడున్ [2]నిష్కించనుం [3]డాఢ్యుఁడున్
నిరపేక్షుండును నిష్కళంకుఁడగుచున్ నిత్యత్వముం బొందెడిన్. ౨౮౦

వ. బ్రహ్మ సంబంధియగు నీకల్పప్రకారం బవాంతర కల్పంబుతోడ సంకుచిత ప్రకారంబున నెఱింగించితి నిట్టి [4]ప్రాకృతవైకృతకల్ప ప్రకారంబులునుఁ, దత్పరిమాణంబులునుఁ, గాలకల్పలక్షణంబులును, [5]విగ్రహంబును, నవాంతర కల్పంబులు మన్వంతరాదిభేద విభాగ స్వరూపంబును నతివిస్తారంబుగ నెఱింగింతు వినుము. అదియునుం బద్మ కల్పం బనందగునని భగవంతుండైన శుకుండు పరీక్షిత్తునకుం జెప్పెనని సూతుండు మహర్షులకు నెఱింగించిన. ౨౮౧

క. విని శౌనకుండు సూతుం, గనుఁగొనియిట్లనియె సూత! కరుణోపేతా!
జననుతగుణసంఘాతా! ఘనపుణ్యసమేత! [6]విగత కలుషవ్రాతా!

వ. పరమభాగవతోత్తముండైన విదురుండు బంధుమిత్రజాతంబుల విడిచి సకలభువనపావనంబులును [7]కీర్తనీయంబులును నైన తీర్థంబులను [8]నగణ్యంబులైన పుణ్యక్షేత్రంబులను దర్శించి క్రమ్మఱ వచ్చి [9]కౌషారవియగు మైత్రేయుం గని యతనివలన నధ్యాత్మ బోధంబు వడసెనని వినంబడు, నదియంతయు నెఱింగింపు మనిన నతం డిట్లనియె. ౨౮౩

క. వినుఁ డిపుడు మీరు నన్నడి
గిన తెఱఁగున శుకమునీంద్ర [10]గేయుఁ బరీక్షి
జ్జనపతి యడిగిన నతఁ డా
తని కెఱిఁగించిన విధంబుఁ దగ నెఱిఁగింతున్. ౨౮౪

వ. సావధానులరై వినుఁడని. ౨౮౫

1 నిరవద్యుఁడు = అనింద్యుఁడు. 2 నిష్కించనుఁడు = తనకన్న వేఱొకటి లేనివాఁడు. 3 ఆఢ్యుఁడు=పరిపూర్ణుఁడు. 4 ప్రాకృతము = ప్రాచీనము. 5 విగ్రహము =శరీరము. 6 విగతకలుషవ్రాతా! = పోఁగొట్టఁబడిన సమస్తపాప సమూహముగలవాఁడా! 7 కీర్తనీయము = కొనియాడఁదగినది. 8 అగణ్యము = లెక్కపెట్టఁదగనిది. 9 కౌషారవి= అజ్ఞానాంధకారమునకు సూర్యుఁడు. 10 గేయు=కీర్తింపఁదగిన.

ఉ. రామ గుణాభిరామ దినరాజకులాంబుధిసోమ తోయద
శ్యామ [1]దశాననప్రబల సైన్యవిరామ సురారిగోత్రసు
త్రామ సుబాహుబాహుబలదర్పతమఃపటుతీవ్రధామ ని
ష్కామ [2]కుభృల్లలామ [3]కలకంఠసతీనుతనామ రాఘవా. ౨౮౬

క. అమరేంద్రసుతవిదారణ! [4]కమలాప్తతనూజరాజ్యకారణ! భవసం
తమసదినేశ్వర! రాజో త్తమ! దైవతసార్వభౌమ! దశరథరామా!

మాలిని. నిరుపమగుణజాలా నిర్మలానందలోలా
[5]దురితఘనసమీరా దుష్టదైత్యప్రహారా
[6]శరధిమదవిశోషా చారుసద్భక్తపోషా
సరసిజదళనేత్రా సజ్జనస్తోత్రపాత్రా. ౨౮౮

గద్యము. ఇది శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రి పుత్త్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన శ్రీమహాభాగవత పురాణంబునందుఁ బరీక్షిత్తుతోడ శుకయోగి భాషించుటయు, భాగవత పురాణ వైభవంబును, ఖట్వాంగు మోక్షప్రకారంబును, ధారణాయోగవిషయంబయిన శ్రీమహావిష్ణుని పాదాద్యవయవంబుల సర్వలోకంబులునున్న తెఱంగును, సత్పురుషవృత్తియు, [7]మోక్షవ్యతిరిక్త సర్వకామ్యఫలప్రద దేవతాభజనప్రకారంబును, మోక్షప్రదుండు శ్రీహరియనుటయు, హరిభజనవిరహితులైన జనులకు [8]హేయతాపాదనంబును, రాజప్రశ్నంబును, శుకయోగి శ్రీహరి స్తోత్రంబు సేయుటయు, వాసుదేవ ప్రసాదంబునం జతుర్ముఖుండు బ్రహ్మాధిపత్యంబు వడయుటయు, శ్రీహరివలన బ్రహ్మరుద్రాదిలోక

---

1 దశానన...విరామ = రావణుఁడు మొదలగు బలాధిక సైనికులఁ దున్మాడినవాఁడా! 2 కుభృల్లలామ=భూమి భార్యగా గలవాఁడా! 3 కలకంఠ......నామ= పార్వతీపరమేశ్వరులచే కొనియాడఁబడు పేరుఁగలవాఁడా! 4 భవసంతమసదినేశ్వర!= సంసారమను చీకటికి సూర్యుఁడా! 5 దురితఘనసమీరా! = పాపమేఘములకు వాయువా! 6 శరధిమదవిశోషా!= సముద్రుని గర్వమడఁచినవాఁడా! 7 మోక్షవ్యతిరిక్త........ప్రకారంబును = మోక్షమునకన్న వేఱగు కామోపభోగముల కొఱకు నితరదేవతల సేవనవిధమును. 8 హేయతాపాదనము = నిందాపాత్రము.

ప్రపంచంబు పుట్టుటయు, శ్రీమన్నారాయణదివ్యలీలావతార పరంపరావైభవవృత్తాంత సూచనంబును, భాగవతవైభవంబును, బరీక్షిత్తు శుకయోగినడిగిన ప్రపంచాదిప్రశ్నంబులును, నందు శ్రీహరి ప్రధానకర్తయని తద్వృత్తాంతంబు సెప్పుటయు, భగవద్భక్తివైభవంబును, బ్రహ్మతపశ్చరణంబునకుం బ్రసన్నుండై హరి వైకుంఠనగరంబుతోడఁ బ్రసన్నుండయిన స్తోత్రంబు సేసి తత్ప్రసాదంబునం దన్మహిమంబు వినుటయు, వాసుదేవుం డానతిచ్చిన ప్రకారంబున బ్రహ్మ నారదునికి భాగవతపురాణ ప్రధానదశలక్షణంబు లుపన్యసించుటయు, నారాయణవైభవంబును, జీవాదితత్త్వసృష్టియు, శ్రీహరి నిత్యవిభూత్యాదివర్ణనంబునుఁ, గల్పప్రకారాదిసూచనంబును, శౌనకుండు విదురమైత్రేయ సంవాదంబు సెప్పుమని సూతు నడుగుటయు, ననుకథలం గల ద్వితీయస్కంధము.

సంపూర్ణము.

హరిః ఓమ్ తత్సత్. శ్రీకృష్ణార్పణమస్తు.



UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. 294 5924 Acc. No. 29300
P845 DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 29300

Call No. 294 5924 P84S

Author [illegible]

Title [illegible]

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean